ఆంధ్రసచిత్రవార

పత్రిక

3-2-67



జగ్గయ్యపేటలో నాటిక, నాటికల పోటీలు

జగ్గయ్యపేటలో శ్రీ సరస్వతీ నాట్యకళామండలి ఆధ్వర్యమున తెలుగు సాంఘిక, చరిత్రాత్మక నాటక నాటికల పోటీలు జరుగుతాయి. ఆంధ్రదేశములోని అన్ని సమాజములవారు పాల్గొనవచ్చును. దరఖాస్తులకు గడువు జనవరి 31. ప్రాక్టీసు ఫిబ్రవరి, పోటీలు మార్చిలో, ఉత్తమ ప్రదర్శనలకు నగదు బహుమతి, రజిత పాత్రలు, ఉత్తమ నటీనటులకు ప్రథమ ద్వితీయ బహుమతులు, హాస్యనటులకు, దర్శకులకు రంగాలంకరణకు, సంగీతాదులకు రజిత పాత్రలుంటాయి. యివి గాక ప్రత్యేక బహుమతులు, యోగ్యతాపత్రములు వుంటాయి. విజయవాడ నుండి హైదరాబాదు బోవు ట్రంకురోడ్డులో జగ్గయ్యపేట గలదు.

దరఖాస్తు ఫారాలకు వివరాలకూ.. శెక్రటరీ శ్రీ సరస్వతీ నాట్యకళామండలి(రిజిష్టర్డు) జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా.

ఆంధ్రాఫిల్ము జర్నలిస్టు అసోసియేషన్ మద్రాసు

ఆంధ్రా ఫిల్ము జర్నలిస్టుల అసోసియేషన్ రజతోత్సవం భారీఎత్తున 1967 ఫిబ్రవరిలో మద్రాసులో జరగడానికి ఏర్పాట్లు కావింపబడుతున్నాయి. ఈ శుభసందర్భంలో తెలుగు ఫిల్ము జర్నలిజం చరిత్రను విశదపరిచే ఒక సంచిక ప్రచురింపబడుతుంది. రజతోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు చిత్రరంగంలో ఎన్నోయేళ్లనుంచి వివిధ శాఖలలో కృషి సలిపిన వందమంది మహామహులకు సన్మానం జరుగుతుంది.

ఇంటూరి వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి.

ఉత్తరాలు

మెదడుకి మేత

30—12—66 వ తేదీ పత్రికలో మెదడుకి మేత శీర్షికక్రింద "ఏడు జంటలు" అనే వ్యాసంలో "రమణమూర్తి, జలజ, చంపలతో డాన్సుచేశాడు" అనే వాక్యం ఏ కారణంచేతనో అచ్చుకాలేదు. ఆ వాక్యం లేకపోతే ఆ సమస్య అసాధ్యం. పాఠకులు ఈ పొరబాటును గమనించవలసిందిగా కోరుతున్నాను.

మహీధర నళినీమోహన్. (న్యూఢిల్లీ)

చిత్రలహరి

ఆంధ్ర సచిత్ర వారపత్రిక ది 16—12—66 లో ఎ. ఎం. రాజా గురించి వ్రాస్తూ, 54వ పేజీలో ఎందుకోయీ పయనము (దొంగల్లోదొర) పాటను శ్రీ రాజా పాడారని వ్రాశారు. ఈ పొరపాటు ఎలా దొర్లిందో తెలియుటలేదు. చాల చింతిస్తున్నాను. ఈ పాటను పాడినది శ్రీ ఘంటసాల. వచ్చే వారం పత్రికలో ఈ పొరపాటు సవరించ ప్రార్థన.

డి. ఎస్. రావు. (మద్రాస)

* పొరపాటు కాదు!—సం.

వ్యాసాలు

'రష్యాలో కామరాజు' పర్యటన వివరాలు చదివిన తర్వాత.....శ్రీ వెంకట్రామన్ ఎలా రాసారంటే చదివినవారుకూడ కామరాజువెంట ప్రయాణము చేసినదానికంటే ఎక్కువగా తెలుసుకొనుటకు వీలు కలిగేలావుంది...... కానీ, కామరాజు చేసిన ఉపన్యాసములు, కొద్దిగా అసహజంగా వున్నాయి. రష్యాలో వ్యవసాయము, గృహ పరిశ్రమలను గురించి ప్రశంసించారు. దీనిని ఆయన నిజంగా భావించాడా! లేక చమత్కారానికన్నాడా!! ఎందుచేతనంటే రష్యా ఆహార ధాన్యములను ఇతర దేశములనుంచి దిగుమతి చేసుకొనేందుకు తమ బంగారాన్ని అమ్ముతున్న విషయము అతనికి తెలియదా! తెలియనిదల్లా కామరాజుగారికేనా! మరియొకచోట.....'మీ అభివృద్ధిని చూచిన తరువాత, మీలాగానే, మీ విధానాలు అనుసరించి మేము కూడ అలాటి అభివృద్ధినే సాధించగలమని విశ్వసిస్తున్నాము. మీ ప్రణాళికా నిర్వహణే మా అభివృద్ధికి మార్గదర్శకం! అంతటితో ఆగకుండా ఇంకా ఇలా అనడం....(బుడాపెస్టులో) నిజంగా చాలా శోచనీయం....సోవియట్ తిరుగుబాటు భారతీయులను, తమ స్వాతంత్ర్య పోరాటకాలములో ఉత్తేజితులను చేసింది. (నిజంగా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించవలసిన మాటలే!! దురదృష్టవంతులైన మన స్వాతంత్ర్య నాయకులు రష్యా విప్లవమువలన...లెనిన్, స్టాలిన్‌లవలన ఉత్తేజితులైనారనేనా దీని భావం! కాంగ్రెస్ అధ్యక్షుడు అనవలసిన మాటలేనా!!

వీటివలన మన కర్తవ్యమయ్యేది ఏ (వి) నాయకులు కానీ, తమ ఇతర దేశ పర్యటన ప్రసంగములలో.. ఆ దేశము మార్గదర్శకమైందనీ, ఆదేశమువలననే మనదేశము అన్ని రంగములందు అభివృద్ధిపొందినదని.., అదేవిధముగా వెనుకపడిన దేశాలు అభివృద్ధిపరుచుకొనాలంటే ప్రసంగము చేయుట ఆచారమైపోయింది. దీనివలన ఎవరికి అనర్థదాయకమో ప్రసంగము చేసినవారు గ్రహింపలేకుండా ఉన్నారా? లేకపోతే అలా ప్రసంగించాలని నియమమా! ఇకమీదటనైనా కనీసము భారతదేశ గౌరవాన్ని నిలబెట్టేటట్లు ప్రసంగించాలని కోరుతూ,

సెట్టిపల్లి క్రిష్ణమూర్తి (అనంతపురం)

* * *

'ఈనాడు యింటి అధికారం స్త్రీలదా? పురుషులదా? అనే 'వనితాలోకం'లోని వ్యాసంలో 'పి. ఎస్.' గారు ఇచ్చితమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. వ్యాసాని హాతోపాటు అందరూ మెచ్చుకుంటారనే తలుస్తాను.

కుమారి ఎ. లక్ష్మిరాణి (బొంబాయి—16)

* * *


ఈ మధ్య మన వారపత్రికలో స్త్రీలకు సంబంధించిన వ్యాసాలు ఎక్కువగా వేస్తున్నారు. విజ్ఞానంతో పాటు, గృహిణి నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను కూడా చక్కగా విశదం చేసేలా వుంటున్న వనితాలోకం శీర్షిక క్రింద ప్రచురిస్తున్న వ్యాసాలు ఎంతో ఆకర్షణీయముగా వుంటూ పత్రిక కోసం ఎదురు చూసేట్లు చేసేవిగా వుంటున్నాయి.

కుమారి జి. పద్మావతి (గుంటూరు)

* * *

'నా విదేశయాత్ర' ఎంతో ఆకర్షణీయంగా ఉంటున్నది. శ్రీమతి జమున తాము చూచిన ప్రదేశాలను కళ్లకు కట్టినట్లు సులభమైన శైలిలో వర్ణించారు. వారికి నా కృతజ్ఞతలు.

కె. రాజ్యలక్ష్మి (హైదరాబాదు)



ఆంధ్రసచిత్ర వారపత్రిక

పాఠకులకు మనవి

రూపాయి విలువతగ్గింపు ఫలితంగా విదేశాలనుండి దిగుమతియగు న్యూస్ ప్రింటుతోపాటు ఇతర యంత్రసామగ్రిల వెలలు కూడా విపరీతముగా పెరిగాయి. ఈ కారణంగా భారతదేశంలోని వార్తా పత్రికలన్నీ అనేక సమస్యల నెదుర్కొంటూ పత్రికా ప్రచురణ సాగించ వలసి వస్తుందనే విషయం మా పాఠకు లందరకు తెలిసినదే.

"ఇండియన్ అండ్ ఈస్టరన్ న్యూస్‌పేపర్ సొసైటీ" వారి సలహా ననుసరించి ఆంధ్రసచిత్ర వారపత్రిక వెలను 10—2—67 తేదీ నుండి 35 పైసలనుండి 40 పైసలకు పెంచడమైనది.

పత్రికా సంస్థలయొక్క పరిస్థితు లను మా పాఠకులు, న్యూస్‌ఏజంట్లు గుర్తించి ఎప్పటివలె మాతో సహకరించ వలసిందిగా కోరుచున్నాము.

గమనిక : ప్రస్తుత చందా మొత్తములు కొత్త రేట్ల కను గుణంగా సవరించబడుతాయి.

చందా వివరాలు

	పోస్టు ద్వారా	ఏజంటుద్వారా
	రూ. పై.	రూ. పై.
సంవత్సర చందా	22-40	20-80
అర్ధ సంవత్సరం ,,	11-20	10-40
మూడు మాసములు	5-60	5-20

మేనేజరు
ఆంధ్రపత్రిక

ఉత్తరాలు

'విప్పుడూ అందంగా కనిపించాలి' శీర్షిక ప్రవేశ పెట్టినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాము. అందులో విషయాలు ఆసక్తి జనకంగాను, వనితలకు ఉపయుక్తంగాను వుంటున్నాయి.

కుమారి వి. రాధ (బుర్రాను)

* * *

'ఆర్కిటిక్‌లో నా అనుభవాలు' అనే వ్యాసం బాగు న్నది. ఇలాంటి 'ఇంఫర్‌మేటివ్'గా ఉండే వ్యాసాల్ని అందిస్తున్న మీకు కృతజ్ఞలము.

పి. జి. యస్. రావు (కలకత్తా)

లోకంపోకడ

నేను పత్రిక రాగానే "లోకంపోకడ" శీర్షిక చూస్తాను. ఇలాంటి శీర్షికను ప్రవేశపెట్టినందుకు ధన్యవాదములు.

ఆర్. సువర్చల (వ్యాఘ్రేశ్వరం)

సంక్రాంతి సంచిక

ది. 13—1—67 తేది సంక్రాంతి సంచికలోని అన్ని శీర్షికలు, కథలు చాల చక్కగా వున్నవి. కాని జేమ్స్ బాండ్ "గోల్డ్‌ఫింగర్" బొమ్మల సీరియల్ 11వ పేజీలోని 713వ నెంబరు సెట్‌లో ఇంగ్లీషులో మిలియను అని వుండగా దాని క్రింది అను వాదములో 10 వేల రూపాయలు అని వున్నది. మిలియన్ అంటే పదిలక్షలు. యిది అచ్చు లోపమా? లేక అనువాద లోపమా?

క్రొవ్విడి రాయుడు (ఏలూరు)

* అచ్చుపొరపాటు.

కథలు

వేమకోటి సీతారామశాస్త్రిగారి 'కిరణ్మయి' అద్భుతంగా ఉంది. రవి, శ్రీకాంత్, అమ్మాళ్, కిరణ్మయి పాత్రలు పాత్రల్లాగా కనిపించక మన మధ్య తిరిగే మనుష్యుల్లాగా కనిపిస్తారు. ఇల్లాంటి కథ వ్రాసిన రచయితగార్కి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

కొక్కుకోల యాదగిరిరావు (హైదరాబాదు)

* * *

20—1—67 ఆంధ్ర సచిత్రవారపత్రికలోని శ్రీ వేమకోటి సీతారామశాస్త్రిగారి 'కిరణ్మయి' కథ చాలా బాగున్నది. సున్నితమైన పదజాలంతో సాగి కరుణార్ద్ర పూరితమైన సంఘటనలతో మలచ బడిన ఆ కథానిక చదివేటపుడు నా ఒళ్లు పులకించి, కళ్లలో నీరు తిరిగింది. నిజానికి 'కిరణ్మయి' కథ యితర భాషల్లోకి అనువదించబడవలసిన ఒక మంచి కథ. ఉన్నత కథాశ్రేణికి చెందవలసిన యింత మంచి కథ రాసిన రచయితగార్కి నా ధన్యవాదములు.

కుమారి రాజరాజేశ్వరీ వెంకట్రామన్ (శ్రీకాకుళం)

* * *

20—1—67 ఆంధ్ర సచిత్రవారపత్రికలో ప్రచురించబడిన "కిరణ్మయి" కథ చాలా బాగున్నది. ఆ కథను గురించి ఏవిధంగా ఎట్లా వర్ణించాలో తోచకున్నది. కిరణ్మయి భర్త వంటి త్యాగబుద్ధి, కోర్కెగల స్నేహశీలురు దొరకటం లవి యొక్క అదృష్టమే. కాని మొత్తం మీద కథ విషాదాంతముతో ముగిసినది.

ఎం. రామకృష్ణ (గుగ్గిళ్లపల్లి)

* * *

"పిన్ని" కథానిక నిజంగా "ఆంధ్ర సచిత్ర వారపత్రిక" పాఠకుల హృదయాల్ని కదిలించివదమ టలో సందేహంలేదు. "పిన్ని"గా "జగతి"కి ధరింప చేసిన పాత్ర, రచయిత్రి పెళ్లకూరి జయప్రదగారు బాగా కల్పనా పటిమలో పాత్రను సృష్టించేరు. రచ యిత్రికి అభినందనలు.

జి. పట్టాభిరామయ్య (మాచాపురం)

* * *

"మానవత్వం—బిల్లు మొత్తం" అనే కథ చాలా బాగుంది.

"డ్యూటీ" అనే బురఖాని ఆసరాగా పెట్టుకొని నిత్యజీవితంలో అవసరమైన "మానవత్వాన్ని" అణగద్రొక్కి 'ఆత్మవంచన' చేసుకునే కొందరు ఆఫీసర్లకు ఈ కథ కనువిప్పు కలిగిస్తుందని ఆశి స్తున్నాను.

కామేశ్వరి (తెనాలి)

* * *

నేను వ్రాసిన "నప్పు" కథలో పొరపాటు చూపిస్తూ 22—1—67 సంచికలో శ్రీ డి. వి. ఆర్. (గుంటూరు) గారు వ్రాసిన విమర్శ చదివాను. వారికి కృతజ్ఞతలు. అయితే సైన్సు స్టూడెంట్సుకు జనరల్ ఎడ్యుకేషన్‌లో ఎకనామిక్స్ చెప్తారు. అది జనరల్ ఎడ్యుకేషన్ క్లాసని నేను చెప్పకపోవటం పొరపాటే. ఆవిధంగా చదువుకుంటే కథలో పొర పాటు కన్పించదని నా అభిప్రాయం.

కొడవంటి కాశీపతిరావు (విజయనగరం)

* * *

"విపర్యయాలు" కథ చాల బాగుంది. అహంకార మనే దానితో సహచరులను కించపరుచు వారికి గుణపాఠముగా వ్రాసినందుకు నా అభివందనాలు. ఇంకా మంచి కథలే వ్రాస్తారని ఆశిస్తాను.

పి. అరుణ (సికింద్రాబాదు)

సీరియల్

ఉన్నవ విజయలక్ష్మిగారు వ్రాసిన అంతస్తులు అభిమానాలు చాల బాగున్నది. మొదటి నుండి ఇందిర పాత్ర కన్నులకు కట్టినట్లు ఉన్నది. అది చదువుతూ ఉన్నంతసేపు నేను దానిలో మునిగి పోతాను. ఆంధ్రసచిత్రవారపత్రిక ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తూవుంటాను. నవల తొందరలో ముగించుతారేమోనని భయముగు న్నది. రామ శాస్త్రి చాల బాగుంది. ఇక రంగధామ వ్రాసిన సుప్రభాతం బాగుంది. ఈ మూడు సీరియల్స్ మంచిగా నచ్చినవి.

విజయశంకర్ (నల్గొండ)

* * *

'రామశాస్త్రి' సీరియల్ ఎంతో ఉత్సాహంగా వుంది. పిల్లలకు పెద్దలకు ఆనందాన్ని ఇస్తున్నది. సరళమైన రచనతో నడుస్తున్న కథ జరగబోయే దాన్ని గురించి ఎదురు చూడమంటోంది!

పి. యస్. పద్మిని (హైదరాబాద్)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 3—2—'67

పరాభవనామ సం॥ మాఘ మాసం॥ బహుళ నవమి

సంపుటము : 59 సంచిక : 21

స్థాపితము :
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

ఆంధ్రపత్రిక కార్యాలయము
7 తంబుచెట్టి వీథి, మద్రాసు-1

విషయానుక్రమణిక

ముఖచిత్రం : కొత్తనటి హేమమాలిని
(ఫొటో : ప్రభాకర్.)



వెల 35 పై.

ఆరోగ్యశాఖ పథకాలు-అమాత్యుల కథనాలు

ఇప్పుడు ఢిల్లీ ఎంతో చల్లబడిపోయింది. వాతావరణం దృష్ట్యానే కాకుండా, రాజకీయపరంగాను సాంఘిక, ఆర్థికపరంగా, అన్నివిధాలా చల్లబడిపోయింది. కాంగ్రెసు ఎన్నికల్లో నెగ్గగలందుకు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి దేశం మీదపడి పర్యటనలు సాగిస్తున్నారు. ప్రధానమంత్రి ఒక్కరే కాదు, తతిమా మంత్రులందరూ దేశం మీదే ఉన్నారు. ఆరోగ్యశాఖామంత్రి డా. సుశీలానయ్యర్, శ్రీమొరార్జీ దేశాయ్ అదేపనిలో నిర్విరామంగా ఉన్నారు.

పత్రికాముఖంగా వెలువడుతున్న వార్తల ననుసరించి డా. సుశీలానయ్యర్‌గారికి కేంద్ర ప్రభుత్వంలో ఎక్కువగా పలుకుబడి వుందనే విషయం తెల్లమవుతూ వుంది. ఆమె సాధించిన ఘనకార్యాల్ని కొలిచేందుకు రెండు కొలబద్దలున్నాయి. నాల్గవ ప్రణాళికలో ఆరోగ్య పథకాలను విస్తరించడానికి ఆమె మంత్రిత్వం ఒక 'బ్లూప్రింట్'ను తయారు చేసింది. దృష్టి గోచరమైన అసాధ్యాల్ని ఎండమావుల్నన్నిటినీ కూడగట్టి ఆకర్షణీయంగా తయారు చేయబడిన 'డాక్యుమెంటు' అది. దేశంలో, వారినంతమంది డాక్టర్లు ఉన్నారా లేదా అనే యోచన లేకుండా ఈ ప్లానును తయారు చేశారు.

కార్యవర్గం రిపోర్టులో వున్న విషయాలివి :—

1971 నాటికి దేశంలో జనసంఖ్య సుమారు 55 కోట్లు. 3,500 మందికి ఒక డాక్టరు కావాలంటే ఆనాటికి మొత్తం 158,571 మంది డాక్టర్లు కావాలి. ఆరోగ్యమంత్రిత్వశాఖవారి అంచనాల ప్రకారం 1,22,504 మంది డాక్టర్లు మాత్రమే వుంటారు!

మన వారి అంచనాలు ఎలా పడిపోయాయో ఈ క్రింది దానివల్ల తెలుస్తుంది.

కార్యవర్గం లెక్కలప్రకారం, 1962లో 71 మెడికల్ కాలేజీ లున్నాయి. అందులో ప్రవేశం కోరికిన విద్యార్థుల మొత్తం 7619. ఉత్తీర్ణత పొందినవారు 3946 మాత్రమే. 1963 లో ఈ కాలేజీల సంఖ్య 79కి పెరిగింది. 1963 లో ఎంతమంది విద్యార్థులకు ప్రవేశం దొరికిందో కార్యవర్గానికి ఖచ్చితంగా తెలియదు. అందుకనే సుమారు 10,000 మంది అన్నారు. 1963 లో డాక్టరు గిరీ పుచ్చుకొన్న వాళ్ళు 4289 మంది. మెడికల్ కోర్సు నిర్ణీత కాలం నాలుగు సంవత్సరాలు. 1963 లో పాసైన వాళ్ళు 4289 మంది కదా, ఈ సంఖ్యను 1960 నాటి సంఖ్యతో పోల్చి చూస్తే ఎంత వృధా అయిందో తెలుస్తుంది. అప్పుడు 60 మెడికల్ కాలేజీల్లోను 5874 మంది విద్యార్థులు చేర్చుకోబడ్డారు. 1585 మంది పరీక్ష తప్పారు. అలానే 1960 లో 5874 మంది విద్యార్థులకు ప్రవేశం దొరకగా, 1962 లో డెబ్బయ్ కాలేజీలుండి 7619 విద్యార్థులకు ప్రవేశం దొరికింది. మనం మామూలుగా ఆలోచిస్తే ఒకో కొత్త కాలేజీలోను కనీసం 150 మంది విద్యార్థులనన్నా అదనంగా చేర్చుకుని వుండాలి. కొత్తగా వెలిసిన కాలేజీల్లో ఎంతమందికి స్థానముందో మనకు తెలియకపోయినా, ప్రస్తుతం అంచనాల ప్రకారం ఒక్కో కాలేజీకి 150 మందయినా చేర్చుకొని వుండాలి కదా, అప్పుడు 1963 లో 8819 మంది విద్యార్థులు మాత్రమే వుంటారు. లెక్కల్ని ఎలా తిరగేసి మరగేసి చూసినా వెయ్యి కావే? కార్యవర్గం లెక్కలప్రకారం 1966 నాటికి 85 మెడికల్ కాలేజీలు వుండాలి. లేదా 1963 కంటె ఆరు కాలేజీలైనా కనీసం ఎక్కువయి వుండాలి. దీనివల్ల మనకు తెలుస్తున్న దేమిటంటే, 1966 లో 9749 మంది విద్యార్థులకు మాత్రమే మెడిసిన్ చదివే గీత వుంది, అంతేగాని కార్యవర్గం లెక్కలు తెలుపుతున్నట్టు 11,500 మందికి అవకాశం లేదూ అని.

1960—63 లో పరీక్ష తప్పినవారు 27 శాతమైనా వుండి వుంటారు. అప్పటినుంచి వాయువేగంలో స్థాయి పడిపోతూ వస్తోంది. ఒకటి మాత్రం యదార్థం. 1963 లో 10,000 మందికి మెడికల్ కాలేజీల్లో ప్రవేశం లభించినా 1967లో 93,476 ఎప్పుడూ కాదు. కొలబద్దల ప్రకారం లెక్కలు తయారుచేసినట్లుగా డాక్టర్లని పుట్టించలేము కదా! డా. సుశీలానయ్యర్‌గారి సునిశిత పరిశీలనా జ్ఞానానికి ఇదొక నిదర్శనం.

డా. సుశీలానయ్యర్ పరిపాలనా దక్షతను స్పష్టపరిచేందుకు రెండవ కొలబద్దగా, హాస్పిటల్లో శుచిశుభ్రతల్ని గురించి చెప్పవచ్చు. ఇందుకు హాస్పిటల్ లోపలా బయటా అన్నీ దృగ్గోచరాలే. అవన్నీ ఎందుకు, ఆమె ఒక్కసారి న్యూఢిల్లీలోని 'సఫ్దార్‌గంజ్ హాస్పిటల్'ను దర్శిస్తే చాలు. కట్టడపు పనితనంతో దిట్టంగా నిర్మించిన ఈ హాస్పిటల్ కావల్సిన పరికరాల్నిటితోను చక్కగా అమర్చబడి వుండేది. ఇప్పాటి చూస్తే అదొక గుడారంలాగా కనిపిస్తుంది.


మహాత్మాగాంధిగారి పేరు మీద 'పంజాబీయం' చేయడంలో ఆమె చాలవరకు కృతకృత్యురాలవగల్గిందనే చెప్పాలి. గాంధీ తత్వం గురించి నాకంటె తెలిసున్న వాళ్ళు మరెవ్వరూ లేరనడంలో ఆమె ఘటికురాలు. ఆమెకు అనుకూలమైన ప్రతి ఉద్యోగాన్ని పంజాబీయులతో నింపేశారు! కల్నల్ ఆర్.డి. అయ్యర్, డా. దొరస్వామి మాత్రం దయ చూపించబడ్డారు. ఇందులో రెండోవారు రిటయిర్‌మెంట్‌కు సమీపంలోనే వున్నారు.

కుటుంబ నియంత్రణ

గాంధీగారి మీద వున్న భక్తితాత్పర్యాలతోనే ప్రభుత్వాన్ని ఒప్పించి, ఎలాగైతేనేం ప్రభుత్వరంగంలో కుటుంబ నియంత్రణ సాధనోపకరణాల ఫ్యాక్టరీ నొకదాన్ని నెలకొల్పడంతో తమ పట్టుదల నెగ్గించుకున్నారు డా. సుశీలానయ్యర్. ఇక్కడ 1941 జనాభా లెక్కల ప్రసక్తి తీసుకొద్దాం. హిందువులు మహాత్మాగాంధీగారి పరమశిష్యులవడం వలన ఆయన ఆజ్ఞల్ని అక్షరాలా పాటించి జనాభా పెరుగుదలను అరికట్టడానికి ముందుకు వచ్చారు. ముసల్మానులు మాత్రం ససేమిరా కూడదన్నారు. 1941 జనాభా లెక్కలప్రకారమే భారతదేశం రెండుగా విభాజితమయింది. తత్ఫలితంగా హిందువులు నివసిస్తున్న అనేక ప్రదేశాలు పాకిస్తాన్‌లో లీనమైపోయాయి.

చరిత్ర దానికదే పునర్నిర్మించుకొంటూ వుంది. హిందువులు, జీవన వ్యాపారానికి సరితూగగలందులకు వారు కుటుంబ నియంత్రణాన్ని పాటిస్తున్నారు. జీవనాన్ని సుఖమయం చేసుకోవడం కంటే మతాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నారు ముసల్మానులు. విశ్వాసపాత్రమైన జనాన్ని బహుముఖంగా పెంచుకోడానికి ఇస్లాం మతం ప్రబోధిస్తూ వుంటుంది మరి!

'మీ వ్యక్తిగతమైన న్యాయధర్మాలు ఏవీ సవరించంలేండి' అంటూ ప్రధానమంత్రి ఇటీవల ముసల్మానులందరికీ హామీ యిచ్చారు. మీ మతం చెప్పినట్టుగానే నడుచుకోండి, ఏకపత్నీవ్రత మనేది మీకు చెందదు, కుటుంబ నియంత్రణం మహమ్మదీయేతరులకు మాత్రమే అనికదా ఈ హామీలోని అంతరార్థం!



గోవధ నిషేధం కోసం బృందావనంలో నిరాహారదీక్ష సాగిస్తున్న
శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి

కుటుంబనియంత్రణం ఇస్లాంమత విరుద్ధమైనది గనక, ఈ నిబంధన ముసల్మానులకు వర్తించదు! శ్రీమతి ఇందిరాగాంధి వాగ్దానం వలన, కుటుంబనియంత్రణం పాటించిన హిందువుల సంఖ్య నానాటికీ తగ్గిపోతుంది, ఆపైన ముసల్మానులు విపరీతంగా వృద్ధి అవుతారు! సంవత్సరాల తరబడీ హిందూ ముస్లిం మనస్తత్వం సాంఘిక పరంగానే కాకుండా జాతీయత దృష్ట్యా కూడా మార్పుల్ని సంతరించుకొంటూ వస్తూ వుంది. ఆతర్వాత ముసల్మానులు—మరోసారి భారతదేశాన్ని విభజించాలి, మాకు సర్వస్వతంత్రం కావాలి, అనడానికి అవకాశం వుంది!

కుటుంబ నియంత్రణాన్ని గట్టిగా పాటించండి, జనాల్ని తగ్గించండి, అంటూ వత్తిడి చేస్తున్న అమెరికా ప్రభుత్వాన్ని శిరసావహిస్తున్న భారతదేశం ఇలాంటి తీవ్ర పరిస్థితుల్ని గుర్తించుకోలేకుండా వుంది. పాటలు, నాటకాలు, హరికథలు, బుర్రకథలు, ఓపు వలన కుటుంబ నియంత్రణ ముమ్మర పథకమంటే అంతకన్నా కావలసింది మరొకటి లేదు.

తన తోటి మంత్రుల వలె డా. సుశీలానయ్యర్ కూడా ఎన్నికల ప్రచారం కోసం కేరళకు బయలుదేరుతున్నారు. మొరార్జీ దేశాయ్ గారిని అల్లరిపెట్టిన బీహారుకు ఆమె వెళ్ళి వుండవలసింది!

* * *

రాజకీయాలు - జర్నలిజం

భారతదేశంలో 'జర్నలిజం' పరిస్థితి తారుమారుగా వుంది. ప్రచారం కావలసినవారు జర్నలిస్టుల దగ్గరికి రావడం మానేసి, జర్నలిస్టులే రాజకీయవేత్తల వెనకాల తిరిగి వాళ్లకు ప్రచారం లభింపేట్టు చేస్తున్నారు.

దీని ప్రధాన బాధ్యత 'ప్రెస్ క్లబ్'ది. పెద్ద పెద్ద రాజకీయ నీతిజ్ఞులందర్నీ సమావేశం చేయించి అక్కడ వారికి భోజన సదుపాయాన్ని అమర్చి అప్పుడు వారు చెప్పించుకునే దేశవ్యవహారాలు, ప్రపంచ వ్యవహారాలు పత్రికల్లోకి ఎక్కించడం అలవాటైపోయింది. ఇదే పద్ధతి మరో వార్తాపత్రిక అవలంబించింది. ఢిల్లీకి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఒకరు ఇందులో వున్నారు. ఈ విధానానుసరణ వల్ల సొంత డబ్బా కొట్టుకోడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్న కాంగ్రెసు వారి 'ప్రత్యేకమైన ముఖాముఖి' ప్రస్తావన చీకట్లో కలిసిపోయింది—అని ఒక 'న్యూస్ ఏజెన్సీ' భావించింది. ఇది ఒకరకమైన ఎన్నికల వ్యూహం. వీటి పరిష్కారానికి వేరే మార్గం వెదకాలి. ఎన్నికల సమయం ఇది. ప్రతి రాజకీయ నాయకుడూ తన గురించి చెప్పుకుందామని, నాలుగు వోట్లు సంపాయించుకుందామని అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటాడు. అలాంటి రాజకీయ నాయకుల దగ్గరికి ఒక జర్నలిస్టు వెళ్ళి 'ఇంటర్వ్యూ' అడగవలసినంత అగత్యం ఏమొచ్చింది అని చాల మంది అంటున్నారు.

* * *

గోసంరక్షణోద్యమం

గోసంరక్షణమైన ఆందోళన ఇప్పుడొక సరికొత్త మలుపు తిరిగింది. గోవధ నిషేధాన్ని దేశవ్యాప్తంగా వెంటనే అమలు జరపకపోయినట్లయితే తాను రాజకీయాల్లో నుంచి తప్పుకుంటానని (అంటే వర్తకం మంచి అన్నమాట!) శ్రీయుత యస్కె. పాటిల్ మహాశయులు సెలవిచ్చారు. బాధ్యతగల ప్రధాని, దేశవ్యాప్తంగా గోవధను నిషేధించడానికి ఎలాంటి సమస్య నెదుర్కోవాలో ఎలాంటి కష్టనష్టాలున్నాయో వివరిస్తూ తమ అశక్తతను తెలియపరిచారు. సమస్యలోని పరమార్థాన్ని వెలికి తీస్తూ, 'ఎన్నికల సమయంలో ఇలాంటి ఆందోళన ఎందుకు లేచింది? గోవధ నిషేధం అమలులో వున్న రాష్ట్రాలు కూడా ఈ ఆందోళనలో ఎందుకు పాల్గొంటున్నాయి?' అని ఆమె వేలెత్తి చూపించారు. ఇది ఒక విధంగా చెప్పాలంటే రబ్బరు బుడగ లాంటి ఆందోళనను శ్రీమతి గాంధి ప్రేల్చేశారు. గోవధ నిషేధాందోళనను బలపరుస్తూ నిరశన వ్రతాలు చేసేవారిని వ్యతిరేకించే మరొక శంకరాచార్యుల వారిని కూడా శ్రీమతి గాంధి ప్రస్తావించారు. గోసంరక్షణోద్ధారకులుగా చెప్పబడుతున్న కొందరు అప్పుడే ఎన్నికలతో ముడి పెట్టేసుకున్నారు. సిండికేట్‌లో నేనూ మెంబర్నే, నేను మాత్రం ప్రధానమంత్రిగా ఎందుకు నిలబడకూడదు? అని యస్కె. పాటిల్‌గారు తమ యోగ్యతను తెలియపరచుకున్నారు!

స్వయంకృత గోసంరక్షకులు

జనవరి పంధొమ్మిదవ తేదీన జయపూర్‌లో శ్రీమతి ఇందిరాగాంధి చేసిన ఉపన్యాసం గమనార్హమై వుంది.

హిందీవాదులు, స్వయంకృత గోసంరక్షకులు 'మొదటి రకం శత్రువులు' అని ఆమె అన్నారు. భారతదేశానికి తలవంపులు వస్తున్నాయంటే, దానికి కారణం ఈ పరమశత్రువుల వల్లనే అని ఆమె అన్నారు. "జనసంఘం, మహారాజులు, కలిసి దేశాన్ని మళ్ళీ వెనకటి ఏడవ శతాబ్దంలోకి తీసుకువెళ్లడానికి చూస్తున్నారు. మీరంతా గోసంరక్షణ గోసంరక్షణ అంటూ గోవధ నిషేధం ఇప్పటికే అమలులో వున్న రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో మొత్తుకోకపోతే, మైసూరు, మద్రాసు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోకి వెళ్ళి గోవధను నిర్మూలించండి అని ఎందుకు చెప్పరు?" అని ఆమె నొక్కి చెప్పారు.

జనసంఘాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. "నిన్న మొన్న పుట్టిన జనసంఘంలోని నాయకులు, పూర్వం భారతదేశ ప్రజలందరూ స్వతంత్రం కోసం పోరాటం సాగిస్తూ వుంటే వీరందరూ బ్రిటిష్ వారితో కలిశారు. రెండువందల సంవత్సరాలు బ్రిటిష్‌వారు పాలించారు. అప్పుడు జనసంఘం నాయకులుగాని, హిందూ మహాసభగాని గోవుల్ని వధిస్తున్న వారిని వేలెత్తి కూడా చూపించలేదు. ఈ రోజున ఈ ఆందోళన పెద్ద ఎత్తుతో కొనసాగించేందుకు పేరుమోసిన వర్తకులు, పారిశ్రామికవేత్తలు సహాయం చేస్తున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌లలోని ఆవులు గ్రాసంలేక చచ్చిపోతున్నాయి. అయినా ఎవరూ ఒక్క పైసయినా విదిలించలేకపోయారు. 'వారి ఆసక్తి ఆవును ఉద్ధరించడానికి కాదు, వేరే వుంది. మరోసారి ఈ దేశాన్ని తునాతునకలు చేయాలని వారి ఆశయం.' దక్షిణాదిన హిందీని వ్యతిరేకిస్తూ తీవ్రమైన ఆందోళన లేవడానికి కారణం జనసంఘం" అని ఆమె అన్నారు. దీన్ని అరికట్టలేని జనసంఘం తమ మీద దాడి చేస్తున్నందుకు ఆమె తమ విచారాన్ని వ్యక్తం చేశారు.

లోకంపోకడ

రాజస్థాన్ ఎన్నికలలో తాము కాంగ్రెసుకి ఎదురుగా ఒక కోటి రూపాయలు ఖర్చు చెయ్యబోతున్నారన్నవార్తను గురించి ఒక పత్రికా విలేఖరి అడగగా శ్రీ బి. ఎం. బిర్లా అది సరికాదన్నారు. "అంత డబ్బు ఖర్చు పెట్టటానికి నేనేమీ బుద్ధిలేనివాడినికాను. అసలు నా దగ్గర అంత డబ్బు లేదు. ఉన్నా ఎందుకు ఖర్చుపెట్టాలి?" అన్నారు.

—యు. ఎన్. ఐ. వార్త

* * *

పూరీ శంకరాచార్యులవారు, స్వామికరపాత్రజీ ఎరెస్టువల్ల అధికారంలో ఉన్న పార్టీవారు 'గోసంరక్షణ ఉద్యమం ఎన్నికలకి సంబంధించిన ఉపాయం' అని తాము చేసే ప్రచారానికే అవరోధం కల్పించారన్నారు.

—వార్త (18—1—67)

* * *

శ్రీ మొరార్జీదేశాయ్ (కలకత్తాలోమాట్లాడుతూ) కాంగ్రెసులో 'సిండికేట్' ఉన్న సంగతి తమకి తెలియదన్నారు

—వార్త (16—1—67)

* * *

"సేనాధిపతిగా, రచయితగా కవుల్ విధానాన్నిపట్టి చూస్తే, ఆయనకి డా. తేజ—తమా సమానంగానే సందేహాస్పదమయిన విజాయితీకల వ్యక్తి—ఉద్యోగం ఇచ్చినప్పుడు ఇద్దరూ ఒకరి కొకరు తగిన సహాధ్యాయులు దొరికారని ఎందరో అంగీకరించవచ్చు"

—'మెయిన్‌స్ట్రీమ్'లో 'ఎన్. సి'

* * *

"ఎవరయినా కాంగ్రెసుని వదిలి వెళ్ళిపోయినంతమాత్రాన సోషలిస్టు అయిపోడని చెప్పాలనుకుంటున్నాను"


—శ్రీ కృష్ణమీనన్ (4—1—67 ఉపన్యాసం)

* * *

"ఇండియాలో మత సిద్ధాంతాల వధని గురించి చదివితే నాకు విచారంగా ఉంటున్నది. ప్రపంచంలోని దైవ చైతన్య నాశనానికి ఇది మరొక చిహ్నంగా నేను భావించవలసి వస్తున్నది. ఇండియాపట్ల, ఆమె ప్రభుత్వంపట్ల కృష్ణ భగవానుడు కోపగించగలడని భయపడుతున్నాను."

(న్యూయార్క్ నుంచి హావర్డ్ ఎం. వీలర్ 'హిందూ' పత్రికలో లేఖ 18—1—67)

జేమ్స్ బాండ్ బొమ్మల సీరియల్



పదిహేడుకి అవతలిపక్క గోల్డ్‌ఫింగర్ బంతి కన్పించలేదు. అయిదు నిమిషాల నియమాన్ని అమలు పరచడానికి బాండ్ సిద్ధమయ్యాడు. దాని ప్రకారం గోల్డ్‌ఫింగర్ హోల్ వప్పపోయినట్లే......

'టైమయిపోవస్తున్నదను కుంటాను......'

'ఇదిగో మీా నెంబర్ 1 డన్‌లప్ ఇక్కడుంది సార్..... ..'

'అదతనిది కాదు. అతని సహాయకుడు దాన్నక్కడ వదిలాడు. గోల్డ్‌ఫింగర్ 'అయిదునోటు'ని అతనికి అందించటం నే చూశాను......'

'హోర్నీ! అసాధ్యుడే......'

'వాడ్నెలాగైనా దారికి తేవాలి ఆలోచిద్దాం ఇది తీసుకో హాకర్!'



ఈ పదివేలడాలర్ల ఆటలో మోసం బయట పడింది. అయినా మించిపోయిందేమీా లేదనుకున్నాడు బాండ్ .....

'ఇప్పుడే పైకి తీశాను ఇది డన్‌లప్ 65 నెంబర్ 7, గోల్డ్‌ఫింగర్ నెంబర్ 1 లానే ఉంటుంది......'

'మనం ఈ హోల్ పూర్తి చేయగానే బంతుల్ని తీసి ఆ నెంబర్ 7 బంతిని గోల్డ్‌ఫింగర్‌కి యివ్వు. సరేనా!'

'సరేసార్!'

బాండ్‌కి పుట్స్ వేద్దామనే ఆసక్తిలేదు. హాకర్ బంతుల్ని మారుస్తున్నాడు.......

'సరే గోల్డ్‌ఫింగర్, దగ్గర పడిందనుకుంటా. ఆల్ స్క్వేర్, ఇంకొకటి వెళ్ళాలి.....'



గోల్డ్‌ఫింగర్ 18 వ దానికి సిద్ధమయ్యేసరికి బాండ్ అచేతను డయ్యాడు. అది తన బంతికాదని గోల్డ్‌ఫింగర్ గమనించాలి. కానీ అలాగే బాదే శాడు......

'దొరికిపోయావురా వెధవా! దొరి కొపోవ్.....'


'గోల్డ్‌ఫింగర్ ఆ హోల్ వేయడానికి, ఆట గెలవటానికీ అవకాశం యిచ్చాడు బాండ్. నిదా నంగా అతని పని పట్టిద్దామనుకున్నాడు.......

'అరె! తప్పిపోయింది.'

'ఆటకు థాంక్స్. నేను చాలా మంచివాడినని

'చాలా మంచి ఆటగాళ్ళే. హల్లో! మీారు నెంబర్ 1 డన్‌లప్‌తో ఆడారనుకున్నాను?'

'అవును. అయితే ఏమిటి విశేషం?!



సరిగ్గా దీన్నే బాండ్ ఎదురు చూచాడు. గోల్డ్ ఫింగర్ తనదనుకున్న విజయం అంతలోనే తల క్రిందులైంది..........

'మనం నియమాల ప్రకారం ఆడామనుకుంటాము. మీరు తప్పుడు బంతితో ఆడారు. కాబట్టి మీరు ఓడిపోయినట్లే.........'

తన హోటల్‌కి తిరిగి వెళ్తూ బాండ్ ఆలోచించాడు......

'ఇప్పటికి రెండుసార్లు వర్కికొట్టాడు. మరో పదివేల డాలర్లు ఉంచాను. గోల్డ్‌ఫింగర్! నీదే ఆలస్యం.......'

తర్వాత........

'గోల్డ్‌ఫింగర్ అనే అతనివద్దనుంచి టెలిఫోన్ మెసేజిసార్. రికల్వర్‌లో ఉన్న అతనింట్లో ఈ సాయంత్రం ఆరున్నరకి అతనితో డిన్నర్ తీసుకుంటారా.......'

'అలాగే. చాలా సంతోషం అని చెప్పు.......'



రెచ్చగొట్టే మనుషులతో మాట్లాడటం అన్నది మహాప్రమాదకరమైనది. బాండ్ సంశయంలో పడ్డాడు. గోల్డ్‌ఫింగర్ యిల్లు కూడా అతనికి ఉత్సాహాన్నిచ్చేలా కన్పించలేదు.......

'హరి భగవంతుడా! ఇది మనుషులుండే ప్రదేశమేనా.....'

ఎవడో తలుపు తీశాడు........

'ఏమిటిది. కన్ను పొడుచుకున్నా కన్పించటం లేదే. ఈ గోల్డ్‌ఫింగర్ ఎక్కడ తగలడ్డాడూ....



తనకోసం వో డ్రింక్ గ్లాసులో పోసుకుని విసుగుతోనే ఎదురుచూశాడు. గోల్డ్‌ఫింగర్ యింట్లో కటిక చీకటి అతనికి చికాకు కలిగించింది. అంతలోనే.......

'గుడ్‌ఈవెనింగ్ మిస్టర్ బాండ్. అంత తక్కువ వ్యవధిలో మిమ్మల్ని పిలిచినా నా ఆహ్వానాన్ని మన్నించారు........'

'మీ ఆహ్వానం నాకు సంతోషం కలిగించింది.'

'ఓ అరగంట మిమ్మల్నొదిలి వెళ్లాల్సివస్తున్నందుకు క్షమించాలి. మా కొరియన్ ఉద్యోగి ఒకడు కష్టంలో ఉన్నాడు. ముందర లైట్‌వేస్తాను.'

'ఇదేమిటి— ఇంత నిర్భయంగా నన్ను ఒంటరిగా యిక్కడొదిలి వెళ్లాడు. ఎందుకై ఉంటుంది? ఈ లైట్‌లు యివి చూస్తుంటే వో ఫిలిం స్టుడియోలా ఉందే.......'

(ఇంకా వుంది)

అవీ-ఇవీ...

'లవ్విజ్ నాట్ బ్లయిండ్' నాటిక ప్రదర్శన

◼ మురళీక్రిష్ణ కళాకేంద్రంవారు ఇటీవల స్థానిక వాణీమహల్‌లో 'లవ్విజ్ నాట్ బ్లయిండ్' అనే నాటకాన్ని ప్రదర్శించారు. సంస్కారం లేని సంభాషణలో మంగళసూత్రాన్ని కవచంగ(?) చేసుకున్న నాటకం ఇది. ఇటీనటులు:—బి. యస్. మనోహర్, కణ్వశ్రీ. యం. సుమయ్య, రాళ్లబండి నాగరాజశర్మ, శ్రీమతి స్వరూప, కె. భానుమతి, ఎ. కె. కనకదుర్గ. కనకదుర్గ నటన సహజంగా వుంది. రచన, నిర్వహణ: విద్వాన్ కణ్వశ్రీ. సంగీతం: ఇంద్రజాన్‌బాబు. నేపథ్యగానం: బి. బసవేశ్వర్, కుమారి బందరు సుశీల. —సీతరాజు.

చిత్ర ప్రదర్శన

భోపాల్‌లో ఇటీవల శ్రీ కౌలూరి రాధాకృష్ణగారి చిత్రప్రదర్శన జరిగింది. ఈ సందర్భంలో మ. ప్ర. గవర్నర్ శ్రీ కె. సి. రెడ్డి ఆయనకి శాలువ కప్పి సన్మానించారు. ప్రదర్శనకి వివిధ ప్రముఖులువచ్చారు.



విజయనగరంలో ఇటీవల ప్రఖ్యాత కూచిపూడి నర్తకులు శ్రీ వేదాంతం సత్యనారాయణశర్మగారు "ఉషాపరిణయం" నృత్యనాటిక ప్రదర్శించారు. ఆసందర్భంలో వారిని విజయనగరం కళాపోషకులు ఉచిత రీతిని సన్మానించారు. సన్మానానికి ప్రతివచనంపలుకుతున్న శ్రీ శర్మను చిత్రంలో చూడవచ్చును. ●



అపుత్రస్య

అండే మల్లిఖార్జునరావు

ఆకాశం మేఘావృతమ్మై వున్నది. సింహగర్జనల్లా భయంకరమ్మైన ఉరుములు; మెరుపులు. కన్ను పొడుచుకున్నా కనబడని చీకటి .చలిగాలి విదిలింపు. యింట్లో దీపం నిలవడంలేదు. కామయ్య ఇంకా ఇంటికి రాలేదు. చీకటింట్లో కూర్చోడానికి కనకానికి భయంగావుంది. ఒంటరితనం పిచ్చెక్కిస్తూ వుంది.

అల్లంతదూరంలో ఈ యింటికెదురుగానే య... గాడి గుడిసె వుంది. వాడిపెళ్ళాం సీతాలు కొడుకుని నిద్రపుచ్చడానికి శ్రమపడుతూ వుంది. 'ల్లి..ల్లో. హాయి' జోలపాట అస్పష్టంగా వినబడుతూవుంది గాలి హోరుకి. కుర్రాడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు 'యెధవపిలగాడు పీకినొక్కి అవతల పారేస్తాను. అంటూనే విసుగుతో రెండు వాయించింది. వాడ శ్రుతిపెంచాడు. యిప్పుడు సీతాలు గొంతుకూడ ధాటీగానే విన్పిస్తూవుంది.' దిక్కుమాలిన పిల్లలు మమ్మల్ని కాల్చుకు తింటానికి పుట్టారు. రాచ్చసి మూక. ఈల్లమ్మాకడుపుడక. సందకాణ్నుంచి జో కొడతుంటే మనుగుతాడా, సత్తాడా' కనకం మనసులో పిల్లవాడిమీద వాత్సల్యం కలిగింది. 'ఆయింటికి వెళదామా!' అనుకున్నది. కానీ చీకటికి, చలిగాలికి జడిసి 'అక్కడే కూర్చుండిపోయింది; యేమేమో యోచిస్తూ.

కాలక్షేపం కాక బాధ పడుతూ 'క్షణమొక యుగమాయె!' అన్నట్లు యిలాంటి మధురక్షణాల కోసమే యెదురు చూచిచూచి విసిగి పోతున్న కనకానికి యేదోపెద్ద పాటు పడుతున్నట్లు విసుగుతో పసివాడిమీద విరుచుకు పడుతున్న సీతాలు వరస చిరాకు పుట్టించింది. 'పసిపిల్లవాణ్ణి సముదాయించుకోవడానికి కూడా అంత విసుగైతే యెలా? కాపేప్పు భుజం మీద వేసుకొని జోకొడితే నిద్రపోడూ?.....భద్రకాళిలా విరుచుక పడుతూ వుంటే వాడింకేం నిద్రపోతాడు?..... అలాఅంటే అదొక తంటా!'...మాకేం తెలుసమ్మా!.....యేనాడైనా కన్నామా, పెంచామా?' అంటూ యెత్తి పొడుస్తారు. నేనేదో రికమండేషన్ తీసుకుపోయి దేవుని సహాయంతో యీ బాధంతా లేకుండా చేసుకున్నట్టే కనబడుతుంది వాళ్ల దృష్టికి...ప్చ.....యెవరి బాధ యెవరికి తెలుస్తుంది? వాళ్ళా మాటలంటుంటే నా హృదయంలో గునపం పోట్లు పొడుస్తున్నట్లేవుంటుంది. పెళ్ళైతే చాలు, సంవత్సరం తిరిగేసరికి దబ్బపండులాంటి పిల్లాణ్నెత్తుకుంటూ వుంటారు. మరి నా దురదృష్టమేమిటో!

అంతా దరిద్రులకు పిల్లలెక్కువంటారు. అది కూడా మా విషయంలో చెల్లకుండాపోయింది—కనకం రోచిస్తూనే వుంది తీవ్రంగా.

వాడకట్టులో పిల్లలు లేని యిల్లేలేదు; ఈ యిల్లు తప్ప. తనకు ఒక్క నలుసు కలిగితే యెంత బాగుండేది? కామయ్య బావ యెంత సంబరపడేవాడో!......ఈ యిల్లెంత కళకళలాడుతూవుండేదో!

కామయ్య విషయం గుర్తుకు రాగానే కనకం ఆలోచనలు నెమ్మదిగా తప్పుకున్నాయి.

గాలితగ్గింది. యింట్లో దీపం లేదని కేకవేస్తాడేమో నని దీపం ముట్టించింది. ఉరుములు,మెరుపులు కూడా క్రమంగా తగ్గిపోయాయి; చుక్క వర్షమైనా పడకుండానే! సీతాలు కొడుకు యేడుపు సద్దుమణిగింది. గోవిందయ్యగారి పిల్లలు పాఠాలు చదువుకుంటున్నారు. కనకం పరధ్యానంగా యేదో యేదో ఆలకిస్తూ కూర్చున్నది.

అడుగుల చప్పుడు కనకం యేకాగ్రతను భంగం చేసింది. కామయ్య వచ్చాడు. ఆరయన వైపే కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నది. చొక్కా యిడిసి వంకెకు తగిలించి 'నీళ్ళపెట్టావా?' అన్నాడు కామయ్య.

"ఆ!.....రండి త్వరగా స్నానం చేసేస్తే......" అంటూ లేచి నీళ్లకాగు బయట పెట్టింది కనకం. కామయ్య స్నానం చేస్తున్నాడు. గోవిందయ్యగారి పిల్లల మాటలు వినబడుతున్నాయి.

గోవిందయ్యకు నలుగురు పిల్లలు. యీరోజు బజారునుండి గోవిందయ్య తాను కలిసే వచ్చారు. గోవిందయ్య గుమ్మంలో అడుగు పెట్టటంతోనే 'నాన్నగారొచ్చారు, నాన్నగారొచ్చారు.' అంటూ పిల్లలు నలుగురూ చుట్టుముట్టారు.

"నలుగురూ సమానంగా తీసుకోవాలి....ఆ" తాను తెచ్చిన మిఠాయి పొట్లాలు రెండూ పిల్లలకు యిచ్చాడు. వాటాలు తెగక వాళ్లలో వాళ్లే నెమ్మదిగా తగవులు ప్రారంభించారు. ఒకళ్లిద్దరు రాగాలాపన. క్రమంగా స్థాయి పెరిగింది.

"యెందుకు యేడుస్తారు. సమానంగా తీసుకోని తినేదానికి. వెధవగోలా మీరూను. యిలా అయితే రేపటినుంచి అసలు తీసుకరాను" గోవిందయ్య సుందరింపు.

'వాడేమో కాయితంతో తీసుకుంటాడట....నాకొద్దు.........నాకొద్దు........నాకే.....' తేనెపలుకులతో చిన్నవాడు పేచీకి కారణాన్ని తన పట్టుదలను కూడా వివరించాడు.

"కాగితమేకదా!.....యిదిగో మువ్వెందుతో వేసుకోమాడు......యిది బాగావుందిరా...." అనునయించాడు గోవిందయ్య.

"నాకేం, నాకొద్దది." చిన్నాడి మొరాయింపు

"పోనీ నువ్వే కాగితంలో వేసుకోరా. వాడికా కాగితం యిచ్చేయ్."

పెద్దవాడు మాట్లాడలేదు.

"నాన్నాలు......అక్క నేను పంచుకున్నాం." ముద్దుగా అన్నది బేబి.

"భేష్...... అలా వుండాలి..... యివ్వరా పెద్దబ్బాయ్"

"ఉం....." పెద్దబ్బాయి మొరాయింపు.

"యెందుకీ తగవులు. యిలా అయితే రేపటినుండి అసలు తీసుకురాను" గోవిందయ్య హెచ్చరిక.

వళ్ళు తుడుచుకుంటూనే నవ్వుకుంటున్నాడు కామయ్య.

"యేమిటి నవ్వుతున్నారు."

"చిన్నాడు మహా ఘటికుడే........."

"అమ్మా! సిసింద్రీకదూ!...... ఔ బిమాత్రం?"

"అదీ అంతే...పెద్దాడు, పెద్దపిల్ల కాస్త మెతకే!"

"పెద్దపిల్ల మెతకేం కాదులెండి....పెద్ద కుర్రాడే కాస్త.........."

యిద్దరి హృదయాలు సన్నగ నవ్వుకున్నాయి.సంతోషంతో అంతలోనే యేదో మూగవేదనతో క్రమంగా బరువెక్కి పోయాయి.

యధాప్రకారమే యాంత్రికంగా భోజనాలు ముగిశాయి. అలవాటు ప్రకారమే కామయ్య సిగరెట్టు కాల్చుకుంటూ మంచం మీద కూర్చున్నాడు. వంటయింట్లో పని ముగించుకుని వచ్చి అతని కెదురుగా క్రిందనే కూర్చున్నది కనకం.

"పిల్లలతో యమ బాధగా వున్నదంటున్నాడు

అపుత్రస్య

గోవిందయ్యా" అన్నాడు కామయ్య యేదో ఆలో చిస్తూ. కనకం మాట్లాడలేదు.

"యిలా నిర్జనంగా, యాంత్రికంగా కాలం గడపడం యెంత బాధో ఆయనకేం తెలుసు....."

"ఎవరి బాధ వాళ్లదే..... ఉన్న బాధ పొమ్మంటే పోతుందా? లేని బాధ రమ్మంటే వస్తుందా?"

కనకం ముఖంలోనికి చూచి వూరుకున్నాడు కామయ్య.

"మనమేదో సుఖపడి పోతున్నామని వాళ్లనుకుం టున్నారు. వాళ్లకున్న ఆనందం మనకు లేదేమా అని మనమేడుస్తున్నాం." అన్నది కనకం కొంచం కటువుగా. కామయ్య మాట్లాడలేదు.

కాలం మవునం లోనే గడచి పోతూవుంది.

చుట్టుప్రక్కల యిళ్లలోనుండి పిల్లలయేడ్పు, తల్లుల సముదాయింపులు వినబడుతూనే వున్నాయి. బద్ధకంగా మంచంమీద ఒరిగి కళ్లుమూసుకున్నాడు కామయ్య. దీపం కొడి తగ్గించి ప్రక్క పరుచుకున్నది కనకం.

*   *   *

నారాయణరావుగారబ్బాయిని చూస్తుంటే పచ్చగా నిమ్మపండు ఛాయతో ముద్దులు మూటగట్టినట్లు వుంటాడు. ఆముఖంలో యెప్పుడూ నవ్వుల పువ్వులు నాట్యం చేస్తుంటాయి. యెవ్వరికీ తెలియని యేదో క్రొత్త భాషలో యెన్నో కబుర్లు చెబుతూవుండేవాడు. ఆకుర్రాణ్ణి విడిచి రాబుద్ధయ్యేదికాదు. కనకానికి. గంటల తరబడి ఆపిల్లవాడితో ఆడుకుంటూనే కాలక్షేపం చేస్తూ వుండేది. నారాయణరావుగారి భార్య శాంతమ్మ కనకం ముచ్చటచూచి "తీసుకెళ్లి పెంచుకోండమ్మా.....వాడిగోల మేం పడలేక చస్తున్నాం." అన్నది. "యేదో పైమాట కన్నావేగాని నువ్వెందు కిస్తావమ్మా!"అన్నది కనకం.

"హాస్యంకాదమ్మా....నిజమే.. తీసుకెళ్లిపో....." నవ్వుతూనే అన్నది శాంత. కనకం ఆమె ముఖంవైపు పరిశీలనగా చూసి పిల్లవాణ్ణి హృదయానికత్తుకుంటూ "యివ్వడం నిజమయితే మాకే యివ్వండి." అన్నది.

"పిల్లలంటే మీకంత సంబర మెందుకండీ.. మాబోటివాళ్లమే బాధలు పడలేక చచ్చిపోతుంటే మీరెలా పెంచగలుగుతారు? మొన్న బాబుకు జ్వరం తగిలితే నూటపాతిక రూపాయలయ్యాయి. యేదో ఉన్నది గనుక సరిపోతుంది. అలాంటి దెబ్బలు మీబోటివాళ్లయితే యెలా యెదుర్కుంటారు చెప్పండి." చేతులు తిప్పుతూ యెంతో జాలిని వ్యక్తం చేస్తూ అన్నది శాంత. ఆ మాటల్లో వ్యంగ్యం లేకపోలేదు.

"పారేసుకుంటామా?.. ..యేదో బాధపడి తగిన వైద్యమే చేయిస్తాం."

"వైద్యమంటే వైద్యమేకాదు. తిండి గుడ్డలు చదువు సంధ్యలు ఒకటేమిటి....పిల్లలంటే ఒక ఖర్చా! అనుకోని ఖర్చులెన్నో వుంటాయి."

"అయితే మాబోటివాళ్లు పిల్లల్ని పెంచలేరంటారా?" కనకం మనస్సు కొంచం బాధపడింది.

"ఆ పెంచుతారు.....నా బొంద! పూటకుంటే పూటకు లేక నానాబాధలు పడుతుంటారు, యిక పిల్లలకేం పెడతారు, వాళ్లనేం బాగుచేస్తారు?"

శాంత మాటల్లో వ్యక్తమవుతున్న గర్వాతిశయం చిరాకు పుట్టించింది. మరి మాట్లాడలేదు, వెంటనే అక్కడినుండి వెళ్లిపోవాలనిపించింది. కానీ, బాబును విడిచివెళ్లడానికి మనసు వప్పక బాబుదగ్గరే దిగాలుగా కూలబడి పోయింది.

'మాబోటి వాళ్లకు పిల్లల్ని కనే అర్హతే లేదా? మాకంటే దరిద్రులు కూడా యెంతమంది పిల్లల్ని కనడంలేదు. పెంచడంలేదు. ఆమాటకొస్తే యీ వాడకట్టులో ఉన్న మిగతా కుటుంబాల వాళ్లంతా మాబోటి వాళ్లేగదా! వాళ్లందరికీ పిల్లలున్నారు. బాగానే పెంచుకుంటున్నారు. యెంత గర్వం. లేని వాళ్లంటే యెంత లోకువ ?..... 'ఆమెకు ఉన్నది గనుక తను ఒక్కతే పిల్లల్ని పెంచగలుగుతూ వున్నాను.' అనుకుంటున్నది కాబోలు.' యిలా సాగి పున్నాయి కనకం ఆలోచనలు.

జరిగిన విషయమంతా ఆరాత్రే కామయ్యకు చెప్పింది కనకం. అంతావిని "ఆవిడన్న మాటల్లో తప్పేముందిలే! .....పిల్లలికి చదువు సంధ్యలు చెప్పించి ప్రయోజకుల్ని చేయగల శక్తి కూడా వుండాలిమరి పూటకుంటే పూటకు లేనివాళ్లం మనమేం చేయగలం ? సరైన తిండి బట్టలు కూడా యివ్వలేం. అన్నాడు నిర్లిప్తంగా నిట్టూరుస్తూ. కనకం ముఖం మాడుచుకు పోయింది.

'ఈయన కూడా పిల్లలు పుట్టకుండా వున్నదే మేలనుకుంటున్నారా? తోటివారంతా పసిపిల్లల్ని అంకాన చేర్చుకొని వాళ్ళ ముద్దు మాటలకు, చిలిపి చేష్టలకు పరవశించిపోతావుంటే తాను చూస్తూ వుంది. మాతృత్వాన్ని పొందాలనే వాంఛ బలీయంగా వేధిస్తావుంది. హృదయంలో అగ్ని పర్వతాన్నే యిముడ్చుకొని కళ్లు ముడుచుకొని పడుకున్నది కనకం.

గోవిందయ్యగారి పిల్లలు ఇంకా పారాలు చదువుతూనేవున్నారు. ఆయన భార్య లక్ష్మీదేవమ్మ దగ్గర కూర్చొని చదివిస్తూ వుంది. పిల్లలతో యెంతో కాలక్షేపం. తనకేమీ లేదు. సోలెడు పొంగిస్తే స్వాతంత్ర్యం వచ్చినట్టే! అంతకంతకూ కళ్లు బండ బారి పోతున్నట్లుంది. పోమరి తనం కూడా కాస్త పెరిగింది. అసంతృప్తి హృదయాన్ని కదలించి వేస్తూంది. దీర్ఘశ్వాసలు వదులుతూ ఆలోచిస్తూవుంది కనకం. ఆరాత్రి కనకానికి కునుకు పట్టనే లేదు.

ప్రతిరోజూ నారాయణరావు గారబ్బాయిని యింటికి తీసుకు వస్తూవుంది కనకం. ఆకుర్రాడు యెంత యేడ్పించినా ఓపిగ్గా ఊరడించిఆడిస్తూ వుంటుంది. కొంత శ్రమ తప్పుతున్నందుకు సంతోషించి అభ్యంతరం చెప్పడంలేదు శాంత. పిల్లవాడు బాగా అలవాటు పడిపోయాడు. కామయ్య కూడా పిల్లవాడితో ఆటలాడుకోవడానికి అలవాటు పడ్డాడు.

పిల్లవాడికి పాకేవయసు, యింట్లో క్రింద పెట్టిన వస్తువులన్నీ దొర్లించడమే వాడిపని. బిందెలలో నీళ్లు బ్రతకనివ్వడు. వాడి అల్లరికి మురిసి పోతుండేది కనకం.

పిల్లవాడికి అయిదారు సంవత్సరాలువచ్చేవరకూ కనకం కాలక్షేపానికి ఏమాత్రం అంతరాయం కలుగలేదు. తరువాత కుర్రాణ్ణి బడిలో చేర్పించాలని

కొప్పి తీసుకొని వెళ్లిపోయారు వాళ్ల తాతగారు. కనకం హృదయం తుఫానులో చిక్కిన పిట్టలా కొట్టుకు లాడింది. సముద్రంలా ఘోషించింది. వారం పదిరోజుల వరకూ భోజనమే సహించలేదు.

ఆతరువాత నారాయణరావుగారింటి కెళ్లడమే మానుకున్నది. యిక తనకేంపని? యెప్పుడైనా కొంత కనబడితే బాబు సంగతులు అడిగి తెలుసు కుంటూ వుండేది. అంటీ ముట్టనట్టుగా జవాబు లిస్తూ వుండేదావిడ.

పిల్లలతో కాలక్షేపం చెయ్యాలంటే పండ కట్టులో పిల్లలకేం లోటులేదు. కానీ, ఆపసివాడే కనకం హృదయాన్నాకర్షించుకున్నాడు. మనసు వాడి మీదికే పీకుతూ వుంటుంది. కానీ యేం లాభం? యెంత ప్రేమున్నా పరాయి పిల్లలు పరాయి పిల్లలే!

* * *

ఈ మధ్య నారాయణరావుగారి బాబు యింటికి వచ్చాడని తెలిసింది. కాని కనకం దగ్గరకురాలేదు. "బాబు యింటికివస్తే తప్పకుండా తనదగ్గరకు వస్తాడని కలలు కన్నది కనకం. కానీ కలలు కల్లలై పోయాయి. బాబును చూడటానికి కనకమే వాళ్లింటి కెళ్లింది. కానీ బాబు యిదివరకటంత చనువుగా దగ్గరకు రాలేదు. యెవరో తెలియని క్రొత్త వ్యక్తి చేతుల్లో చిక్కుకున్న ట్టియిబ్బంది పడినట్టు కనిపించాడు. కనకం హృదయ పూర్వకమైన వాత్స ల్యంతో అతన్ని కౌగలించి ముద్దాడింది. బాబు చిరాకు పడ్డాడు యెలాగో విదిలించుకొని పారి పోయాడు. కనకం మనస్సు వికలమై పోయింద

ఆతరువాత బాబు యెప్పుడైనా యింటికివచ్చినా కనకం దగ్గరకు వచ్చేవాడు కాడు. కనకాన్ని చూచి బయటికి రాకుండా దాక్కుంటూ వుండేవాడు. గాయపడిన హృదయంతోనే తిరిగి పోతూవుం డేది కనకం.

కాంక్షను తీర్చకుండానే కాలం సాగిపోతూ వుంది, అందరి మీద దాని ప్రభావాన్ని చూపిస్తూ అందరిలోను స్పష్టమయిన మార్పులు కన్పిస్తు న్నాయి. నల్లని కేశాలు పండి తెల్లబడుతున్నాయి. పిల్లలంతా పెద్దవాళ్లవుతున్నారు. యవ్వనవు నిగ నిగలు ప్రతిఫలిస్తున్నాయి.

గోవిందయ్యగారి పిల్లలంతా పెద్దచదువులే చదువుతున్నారు. పెద్దపిల్ల పెళ్లి చేయాలని రెండేళ్లనుండి ప్రయత్నం చేస్తూనే వున్నాడు గోవిం దయ్య. కానీ సంబంధం యేదీ కుదరలేదు. 'నాకూతురు పెళ్లి యెలా అవుతుందా' అంటూ ఆవేదన వెళ్లబోస్తూ వుండేది గోవిందయ్యభార్య.

సీతాలు కొడుకు పాలేరు తనం వుండి పది బస్తాలో, పన్నెండు బస్తాలో సంపాదిస్తున్నాడు. వాడికి పెళ్లి ఖాయమయింది మేనరికమే. సీతాలు పెళ్లి హడావిడిలో మునిగి పోయింది.

యీ జీవితానికి మిగిలిందొక్కటే—ఆవేదన! అందరికీ వున్న ఆనందాలు, ఆవేదనలు మాకులేవు. యీ ఆవేదనలోనే క్రమ్గి చావడం తప్ప గత్యంతరమే లేదు. ఒక్కొక్కప్పుడు ఆవేదనతో హృదయం బరువెక్కి పోతుంది ప్రకృతి సహజమయిన వాంఛ మాతృత్వం తీరని కోరికై ఆమెను హేళన చేస్తున్నట్టుంది. అలాంటప్పుడు పిచ్చిదానిలా [illegible]ంమీదపడి ఏడ్చిఏడ్చి నిద్రపోతూవుంటుంది. [illegible]ంటిలో దీపమయినా వెలిగించలేదు మంచం [illegible] పడుకొని నిద్రపోలు వుంది కనకం.

"దీపం వెలిగించకుండా పడుకున్నావేంటికె?" కనకాన్నిలేపి అడిగాడు కామయ్య. అప్పుడే బజారు నుంచి వచ్చాడు.

"ఏమీలేదు" అన్నది ముక్తసరిగా.

కామయ్య మాట్లాడలేదు. యేం మాట్లాడు తాడు? యిల్లు చీకటయితే మాత్రం పోయిందే ముంది. బ్రతుకే చీకటయినప్పుడు? పిల్లలుంటే తప్పకుండా దీపం వుండి తీరాల్సిందే! ...లేకపోతే యీ పాటికి గోలగోలగా వుండదూ? గోవిందయ్య గారింట్లో సందడి వినబడుతూనే వున్నదిగదా? ఆ యింటికీ యీ యింటికీ యెంతతేడా?...స్వర్గా నికీ స్మశానానికీ పోలికా?' ఆలోచిస్తూ గడపలోనే కూర్చున్నాడు కామయ్య

"స్నానం చెయ్యండి." నీరసంగా అన్నది కనకం.

"చేస్తానులే. ...ముందుదీపం వెలిగించు."

కనకం లేచి దీపం వెలిగించింది. కనకంలో కన్పి స్తున్న మార్పును గురించి ఆలోచిస్తున్నాడు కామయ్య. యీ వాడకట్టులో తమ యీడువాళ్లం దరికంటే కనకం చిన్నదే. అయినా పిల్లాజల్లతో నానాబాధలు పడుతున్న గోవిందయ్య భార్య, సీతాలు మొదలయిన వాళ్లందరికంటే నీరసంగా, నిరు త్సాహంగా కన్పిస్తూవుంది. అందరికంటే ఉత్సా హంగా శక్తివంతంగా ఉండవలసింది యెందుకిలా అయిపోతూవుందో......'

"నీళ్లు తోడాను రండి". పిలిచింది కనకం. కామయ్య లేచి పెరటి వైపు నడిచాడు.

* * *

బజారుపని ముగించుకొని యింటికి బయలు దేరాడుకామయ్య ఆలోచనలు ఈగల్లా ముసురు కుంటూనే వున్నాయి. యెండ మంట మండిస్తూ వుంది. భారంగా అడుగులు వేస్తున్నాడు కామయ్య సత్రం దగ్గరికొచ్చేసరికి ఓ దృశ్యం అతని కంట బడింది అడుగు ముందుకు పడలేదు సత్రంనీడ అతనికి స్వాగతం చెప్పింది.

ఓ యువతి తన యిద్దరి కొడుకులకు అన్నం పెడుతూ వుంది. వడిలో పసిపిల్లవాడు పాలు త్రాగుతున్నాడు. ఉన్న అన్నం కూడా కొంచమే! పిల్లలు ఆకలితో వకనక లాడుతున్నారు. తల్లి పెట్టిన అన్నం క్షణంలో కాజేశారు. ఉన్నకొంచము తల్లి తింటూవుంది. పిల్లలు తల్లిముఖం వైపే చూస్తూ కూర్చున్నారు. ఆయువతి పిల్లలవైపు జాలిగా చూస్తూ చిరునవ్వు నవ్వింది. ఆనవ్వులో విషాదఛాయలు లేకపోలేదు కానీ ఆనందం కూడా వున్నది! కామయ్య గుండె కరిగి నీరయింది. అడుగు ముందుకు పడలేదు. ఆస్థితిలో కూడా ఆమె ఆనందాన్ని పొందగలుగుతూవుందా? మాతృత్వం అంతటిశక్తి నివ్వగలుగుతుందా? ఏమో! వాళ వైపు అలాగే నిలబడి చూస్తూ వుండిపోయాడు కామయ్య.

"యెవ్వూరమ్మా!" తేరుకొని అడిగాడుకామయ్య.

"కనిగిరిబాబూ......" ఆ అమ్మాయిమాట యాసగావుంది.

"యేదైనా పనిమీదవచ్చారా?"

"అవును బాబూ! పనేమయినా దొరుకుతుం దేమోనని వచ్చాను. ఈపిల్లోడు కడుపునపడ్డాక చెప్పకుండా యెటో యెల్లి పోయాడు మగోడు. దిక్కులేనిదాన్ని....అక్కడేం పని దొరక్క యిక్కడి కొచ్చానుబాబూ." ఆ అమ్మాయి కనుకొలుకుల్లో నీళ్లు నిలిచాయి.

కామయ్య ఆశ్చర్యానికి అంతులేక పోయింది. భార్యా పిల్లల్ని విడిచిపెట్టి పోవడానికి వాడికి మన సెలా వచ్చిందో?......అతని కెంతోసానుభూతి కలి గింది. పిల్లలు ముగ్గురు ముచ్చటగా వున్నారు.

"ఒక్కదానవు ముగ్గురు పిల్లల్ని పెంచాలంటే కష్టం కదమ్మా! పిల్లల్ని యెవరైనా పెంచు కుంటారేమో చూడకపోయావా? కనీసం పసిపిల్లా గ్నయినా యెవరికైనా యిస్తే హాయిగాపెంచు కుంటారు."అతని మనసులో యేవో కోరికలు వెం రేగుతున్నాయి. వాటి కనుకనుగుణంగానే మాట్లాడు తున్నాడు కామయ్య.

"మాబోటి వాళ్ల పిల్లల్ని యెవరు పెంచు కుంటారండీ......" బాధగానే అన్నదాయువతి.


"యెవరిమాటో యెందుకు. యిస్తే మేమే పెంచుకుంటాం." ఆశగా ఆ యువతి ముఖంవైపు చూస్తూ అన్నాడు కామయ్య కుర్రాడివైపు వాత్సల్యంగా చూస్తూ వుండి పోయిందామె. జవాబు కోసమే యెదురు చూస్తున్నాడు కామయ్య.

"నామాట కాదనకమ్మా! నీకెంతో బాధతప్పి పోయినట్టే!" ప్రోత్సహించాడు.

"అలా అనకండి. నా బంగారు కొండనిచ్చి నేను బ్రతకలేను. మీకు దణ్ణంపెడతాను. అలా అనకండి." వాత్సల్యపూరిత మయిన హృదయంతో పిల్లవాణ్ణి గుండెలకత్తుకున్నది. కామయ్య మారు మాట్లాడ లేక పోయాడు నిరుత్సాహంగా యింటిదారి పట్టాడు.

* * *

యీమధ్య గోవిందయ్య పెద్దకూతురు పెళ్లి చేశాడు. యెంత సందడి.....? యెక్కడెక్కడి బంధు



వులు వచ్చారు. పెళ్లి ఘనంగానే జరిగింది. పెళ్లి కొడుకు అందరికీ నచ్చాడు. ఈడు జోడు కుదిరి చిలకా గోరింకల్లా చక్కగా వున్నారు వధూవరులు. పిల్లవాడికేదో మంచి ఉద్యోగమే.

పిల్లను అత్తవారింటికి తీసుకవెళ్తూవుంటే అంత ఆనందంగా పెళ్లి జరిపించిన గోవిందయ్య దంపతులు కళ్ల నీరు పెట్టుకున్నారు. 'కూతురు కాపురానికి పోవడం ఆనందదాయకమయిన విషయమేగదా? మరెందుకు యేడుస్తారు? అవి ఆనంద భాష్పా

ఆ హ త్ర స్య

లేమో!...... లేక యింతకాలం ప్రేమగా పెంచిన పిల్ల దూరమైపోతున్నదనే ఆవేదనేమో!.... యేది యేమయినా యీ జీవితాల కిలాంటి అనుభూతులు లేవుగదా? యీ జన్మకింతే!' కామయ్య, కనకం ఎవరంతట వాళే తమ తమ హృదయాలలో ఆవేదనను, అసంతృప్తిని వింపుకున్నారు.

మరుసటి సంవత్సరమే పెద్దకొడుకు పెళ్లి, ఆ తదుపరి సంవత్సరమే చిన్నకూతురు పెళ్లి వరుసగా యెలాగో అయిపోయాయనిపించుకున్నాడు గోవిందయ్య. యిక చిన్నకొడుకు పెళ్లే మిగిలింది. వాడొక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయిని తప్ప మరెవర్నీ చేసుకోనని పట్టు బట్టాడు. యెన్నో రకాలుగా నచ్చజెప్పాడు గోవిందయ్య. స్నేహితుల తోను, పెద్దవాళ్లతోను చెప్పించారు. అన్న, అక్క, చెల్లెళ్లు బావలు, బంధువులంతా చెప్పిచూచారు. కానీ వాడు యెవర్నీ లెక్క చేయలేదు. తాను ప్రేమించిన అమ్మాయినే రిజిష్టరు మేరేజి చేసుకున్నాడు. గోవిందయ్య ఆగ్రహం అవధులు దాటింది. 'ఈ గడప తొక్కడానికి వీల్లేద'ని శాసించాడు. కొడుకు కట్టు గుడ్డలతోనే బయటికెళ్లిపోయాడు. గోవిందయ్య కుటుంబములోని వాళ్లంతా యేదో పోయినట్టే బాధపడ్డారు కొన్నాళ్లు. కాలక్రమేణా అంతా ఆ బాధను మరచిపోయి మామూలుస్థితికి రాగలిగారు గానీ గోవిందయ్య, అతని భార్య తేరుకోలేకపోయారు.

ఆడపిల్లలు అత్తవారిళ్లకు వెళ్లిపోయారు. పెద్ద కొడుకు ఉద్యోగరీత్యా యేదో పట్టణంలో కాపురం పెట్టాడు. చిన్నకొడుకు సరేసరి, యీ కుటుంబానికే కాకుండా పోయాడు. గోవిందయ్య యిల్లు నిర్మానుష్యమయినట్లే వుంది. వార్ధక్యంతో పోరాడుతూ దంపతు లిద్దరే మిగిలారు. యేదో అసంతృప్తి, నైరాశ్యం వాళ్లను వేధిస్తున్నట్లే కన్పించేవారు.

కొడుకులు కూతుళ్లు యెవరి సంసారాలు వాళ్లే చూచుకుంటున్నారు. గోవిందయ్య కుటుంబం నాలుగు కుటుంబాలయ్యింది. గోవిందయ్య యెంత అదృష్టవంతుడు! అనుకుంటూవుండే వాళ్లు కామయ్య, కనకం— వాళ్లేకాదు యిరుగు పొరుగు వాళ్లుకూడా 'ఆడ పిల్లలకు మంచి సంబంధాలే వచ్చాయి. కొడుక్కి మంచి ఉద్యోగం దొరికింది. ఆయనకు కావలసిందేముంది'. అంటూ గోవిందయ్య అదృష్టాన్ని పొగుడుతూ వుండేవాళ్లు. అయితే 'చిన్న కొడుకుమాత్రం ఆ కుటుంబంలో చెడ బుట్టాడు' అంటూ ఎత్తిచూపడం మాత్రం మరచి పోయేవాళ్లు కాదు.

అయిదారు రోజుల్నుంచి గోవిందయ్య ఆరోగ్యం బావుండడంలేదు. బయటకు రాకుండా యింటి దగ్గరే వుండి వైద్యం చేయించుకుంటున్నాడు. ఆ రోజు యింటికి రాగానే "గోవిందయ్య ఈ రోజు అసలు లేవలేదు. చాల యిదిగా వుంది" అన్నది కనకం. పలకరించడానికి వెళ్లాడు కామయ్య. గుమ్మములో అడుగు పెట్టగానే "రండన్నయ్యా" అంటూ ఆహ్వానించి మంచం ప్రక్కనే ముక్కాళ్ల పీట వేసింది గోవిందయ్యభార్య.

"ఎలావుందయ్యా!" కూర్చుంటూనే అడిగాడు.

"యేదోవుంది. యేమయినా నువ్వు అదృష్టవంతుడవు కామయ్యా. యీ బాదరబందీ అంతా లేదు నీకు." గోవిందయ్య కనుకొలుకుల్లో కన్నీటి బిందువులు మెరుస్తున్నాయి. కామయ్య మనసులో చేయిపెట్టి దేవినట్లయింది. ఆవేదన పెల్లుబికింది ఒక్కసారిగా. కన్నీళ్లు జలజలా రాలాయి. అతి ప్రయత్నంమీదగానీ కామయ్య నిగ్రహించుకోలేక పోయాడు

"యేమీలేని అదృష్టం దేనికి గోవిందయ్యా! యేం చూచి నా అదృష్టాన్ని కీర్తిస్తున్నావ్?.... తాత్కాలికంగా నీకు కలిగిన బాధ అలా అనిపిస్తూ వుంది అంతే. యిలాంటి అదృష్టం పగవాళ్లకు కూడా వద్దు." అంటూనే పై పంచతో కన్నీళ్లు వత్తుకున్నాడు కామయ్య.

"జీవితంలో అనుభవించాల్సిన సుఖశాంతులన్నిటినీ బలిచేసుకొని అష్టకష్టాలు అనుభవించి పెంచాం. యేంలాభం? రెక్కలు రాగానే యెవరిదారిన వాళ్లు పోయారు. మా బాధలే మమ్మల్ని కనిపెట్టుకుని వున్నాయ్. యెందు కొచ్చిన పిల్లలు కామయ్యా! అంతా ఋణానుబంధమే తప్ప మరో అనుబంధమే లేకపోయిన తరువాత." గోవిందయ్య కళ్ల నుండి కన్నీళ్లు జారుతున్నాయి. కామయ్య మనసు పూర్తిగా వికలమయ్యింది.

"పెద్దవాడికి ఉత్తరం రాస్తే యింతవరకు జవాబు రాయలేదన్నయ్యా! చిన్నవాడు రెండు సార్లొచ్చి పలకరించినా మాట్లాడకనే పోయాడు. అంతా మన మనుకున్నట్టే జరుగుతుందా? యెవడి రాత యెలావుందో.....! మనమాట కాదంటేమాత్రం కడుపున పుట్టిన బిడ్డను కాదనుకుంటే యెలాగన్నయ్యా!..... ఆడపిల్లలు సరేసరి, ఒకయ్య చేతిలో పెట్టిన తరువాత వాళ్లిష్టం సాగుతుందా?." కన్నీళ్లు వత్తుకుంటూ వివరించింది గోవిందయ్య భార్య కామయ్య కొంతసేపు కూర్చొని అన్ని విషయాలు శ్రద్ధగా విన్నాడు.

జీతం చాలక నానా యిబ్బందులు పడుతున్నా, అప్పులవాళ్లు నానాగొడవ చేస్తున్నా అవన్నీ యెప్పటి కప్పుడే మరచిపోయి తన పిల్లల ముచ్చట్లు చెప్పుకొని మురిసిపోతూ వుండేవాడు గోవిందయ్య. ప్రకృతి ఆనంద పరంపరతో పాటు దాని నిజమయిన మాధుర్యం తెలియడానికా అన్నట్లు కొన్ని బాధలను కూడా ప్రసాదించింది. అన్నిటినీ అనుభవించి జీవితాన్ని పరిపుష్టి చేసుకున్న గోవిందయ్య యింకా తనకేదో లేకుండావుంటే బాగుండేదని వాపోవడం కామయ్యకు వింతగా తోచింది. తీరని తీయని కోరికలతో తపించిపోతూ స్వాతి వానకు ముత్యపు చిప్పల్లా, చంద్రునికై చకోరాల్లా యెదురుచూచి చూచి ఆశలు నిరాశలేనని రూఢి చేసుకుని 'నువ్వే అదృష్టవంతుడివి కామయ్యా!' అన్న గోవిందయ్య మాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. మెల్లగా లేచి, సెలవు తీసుకొని యింటికి బయలుదేరాడు కామయ్య.

గోవిందయ్య వ్యాధి తీవ్రమయింది. చిన్న కొడుకు డాక్టర్ని తీసుకవచ్చి చూపిస్తూనే వున్నాడు.

పెద్దకొడుకు ఒకనెల సెలవుపెట్టి భార్యా పిల్లల్ని తీసుకొని వచ్చాడు. ఆ తరువాత వరుసగా ఆడపిల్లలు కూడా పిల్లాజెల్లతో వచ్చి చేరారు. యిల్లు యిదివరకటికంటే యెక్కువ సందడితో కళకళ లాడుతూవుంది.

గోవిందయ్య కొడుకులు కూతుళ్లు యెన్నో పపర్యలు చేస్తున్నారు. యెంతో బాధపడుతున్నారు. తండ్రిని కంటికి రెప్పలా కనిపెట్టి వుంటున్నారు. తనకోసం, తన ఆరోగ్యంకోసం బాధ పడేవాళ్లు, పాటు పడేవాళ్లు ఒక్కడుంటే చాలు, యెంతో సంతృప్తి పొందగలుగుతాడు మానవుడు. గోవిందయ్య నిజంగా ఎంత అదృష్టవంతుడు!? 'నా' అనే వాళ్లు నలుగురున్నారతనికి. నిజంగా అతని జన్మ సార్థకమయినట్లే " అనుకున్నాడు కామయ్య తృప్తిగా.

గోవిందయ్యను పలకరించడానికేవచ్చాడుకామయ్య.

"రా మామయ్యా కూర్చో " మర్యాదగా ఆహ్వానించాడు గోవిందయ్య పెద్దకొడుకు. గోవిందయ్య మంచానికి దగ్గరగానే వున్న కుర్చీలో కూర్చున్నాడు కామయ్య. గోవిందయ్య కళ్లు మూసుకొని పడుకొని వున్నాడు.

"నాన్నా యెవరో నీకోసం వచ్చారు చూడు " అన్నాడు పెద్దబ్బాయి.

గోవిందయ్య కళ్లు విప్పి చూచాడు అతని ముఖంలో యిదివరకటి ఆవేదన లేదు ఆ కళ్లలో యిదివరకటి నిరాశలేదు. ప్రశాంతత, సంతృప్తి స్పష్టంగా కన్పిస్తున్నాయి. కామయ్య చిన్న నిట్టూర్పు విడిచాడు.

గోవిందయ్య చేతి సంజ్ఞతో యేదో చెప్పాడు కానీ, కామయ్యకు అర్థం కాలేదు "నిన్నటినుండి మాటకూడా పోయింది." బాధగా చెప్పాడు పెద్దబ్బాయి- కామయ్య మనసు నీరయింది. ఆవేదనతో బరువెక్కినట్లయింది. చాలసేపు కూర్చున్నాడు. తేరుకొని, అందర్నీ పరామర్శచేసి యింటికి బయలుదేరాడు.

* * *

కనకం రెండు రోజుల నుండి గుండెనొప్పితో బాధపడుతూ వుంది. డాక్టరుకోసం, మందుల కోసం తిరగడంతోనే సరిపోతూవుంది కామయ్యకు. యేమయితేనేం బాధ కొంచెం తగ్గింది. కనకం కాస్త స్థిమితపడడంతో కామయ్య గుండెలు కుదుట పడ్డాయి. అప్పుడే భోజనంచేసి అలా కుర్చీలో నడుం వాల్చాడు. అంతలోనే గోవిందయ్య యింటిలో నుండిశోకాలువిన్పించాయి. లేచి అలా బయలుదేరాడు.

'తన స్నేహితుడు గోవిందయ్య తనకులేడు.' కామయ్య హృదయం ఆవేదనా పూరితమయిపోయింది. దుఃఖం ఆగలేదు. యిరుగు పొరుగు వాళ్లంతా గోవిందయ్య యింటిముందు గుమిగూడారు. దహన సంస్కారాలకు కావలసిన యేర్పాట్లన్నీ త్వరత్వరగా జరిగిపోతున్నాయి.

'గోవిందయ్య భౌతికంగా యీ లోకాన్ని వదిలి పోయినమాట నిజం. కానీ అతని వంశ వృక్షం శాఖోపశాఖలయి దినదినాభివృద్ధి చెందుతూ గోవిందయ్యను శాశ్వతంగా యీ లోకంలో వుంచుతుంది. గోవిందయ్య ముమ్మాటికీ చిరంజీవి!' కామయ్య బాధగా నవ్వుకున్నాడు.


కనకం యేదో చెబుతూవుంది. కామయ్య పరధ్యాన్నంలో వుండి 'ఊ' కొడుతున్నాడు. "యెవరూ లేరని మనం యింత అఘోరిస్తున్నామే గానీ, వున్నవాళ్లుమాత్రం యేం చేయగలిగారు? గోవిందయ్యను ముసలివాడు కాకుండా ఆపగలిగారా? చావకుండా రక్షించగలిగారా?.... యేమీ లేదు సహజత్వాన్ని యెవ్వరూ యెదిరించలేరు. కానీ,.... ప్రతివాళ్లూ యేవో కోరికలతో బాధపడుతూనే వుంటారు. యిది ప్రకృతి సహజమేమో....."

"సంతృప్తి పడుతున్నావా?" అడిగాడు కామయ్య ఆవేదనతో.

"లేదు. అది లేకపోవడమే ఆవేదనకు మూల కారణమేమో ననుకుంటున్నాను." పొడిగా అన్నది కనకం. కామయ్య బాధగా చిరునవ్వు నవ్వాడు.

ఆకాశం మబ్బులుపట్టి వికలంగా వుంది. చలిగాలి దీపాన్ని వెలగనివ్వడం లేదు. యిద్దరూ మౌనంగా చీకట్లోనే కూర్చున్నారు. సీతాలు మనుమడు యింటిమీది తాటాకులు యెగిరిపోయేలా యేడుస్తున్నాడు. సీతాలు కోడల్ని యేదో సాధిస్తూవుంది.

నిట్టూర్చి "దీపంవెలిగించు." అన్నాడు కామయ్య. కనకం యేమీ మాట్లాడలేదు. ●





అంతస్తులు అభిమానాలు

ఉన్నవ విజయలక్ష్మి

జరిగిన కథ

భర్త సారథి ప్రోత్సాహంతో ఇందిర ప్రయివేటుగా చదివి బియ్యే పాసయింది. గిరి, పద్మ ఇద్దరు పిల్లలు కలిగారు. ఒకరోజు సారథి జ్వరంతో హఠాత్తుగా కన్ను మూశాడు. ఇందిర ఉద్యోగం చేయడానికి నిశ్చయించుకుంది. ఇంటిదగ్గర పరిస్థితులు నచ్చక, స్వర్ణ సహాయంతో హైద్రాబాద్‌వచ్చి వ్యక్తిమీద లెక్చరరు కాగల్గింది. గిరి ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. అతను వ్యాపారం చేయడానికి సమ్మతించింది తల్లి. ఇందిరకు టైఫాయిడ్ రావడంతో పిల్లలిద్దరూ ఆందోళన చెందారు.

10

అలాంటి స్థితిలో అందరికీ కాస్త ధైర్యం చెప్పినవి డాక్టరు మాటలు ఒకటే. "జ్వర తీవ్రత, అంతకన్న మరేంలేదు. నేను మళ్లీ సాయంకాలం వచ్చి చూస్తాను." అని వెళ్లిపోయాడు డాక్టరు.

రఘు వాసులు సంప్రదించుకుని, గిరినడిగి అడ్రసు తీసుకుని వైకుంఠంగారికి టెలిగ్రాం ఇచ్చారు, ఎందుకయినా మంచిదని.

ఎలాగో రోజు గడిచి రాత్రయింది. పరిస్థితి కాస్త మెరుగేమోననిపించింది అందరికీ. కళ్లు మూసుకుని అలాగేపడుకున్నాక కలవరింతలు తగ్గాయి. డాక్టరు మళ్లీ వచ్చి చూసి ధైర్యం చెప్పి వెళ్లినా, ఎవరి ముట్టుకివాళ్లే అలాంటి స్థితిలో వెళ్లిపోలేక రఘు, వాసు, స్వర్ణ, అనుపమ అందరూ అక్కడే వుండిపోయారు. కాని వాళ్ళు భయపడినట్లు ఏమీ జరగలేదు. తెల్లవారేసరికి ఆ మగత కూడపూర్తిగా విడిపోయింది. టెంపరేచర్ బాగా దిగజారిపోయింది. అందరూ హాయిగా గుండెలనిండా వూపిరి పీల్చుకున్నారు.

లేస్తూనే అన్ని గొంతులు విన్న ఇందిర, "ఇవాళ అందరూ పొద్దున్నే వచ్చారేమిటి?" అని అనుపమని అడుగుతూ, ఆ అమ్మాయి రేగిన జుట్టూ నలిగిన చీర చూసి, "అసలు రాత్రి మీరెవరూ ఇళ్లకి వెళ్ల లేదా ఏమిటి?" అంది ఆశ్చర్యంగా.

"ఎలా వెడతాం. మీరంత బంగారు పెట్టేస్తిరి." అంది కాఫీ కప్పుతో వచ్చిన స్వర్ణ.

"నిజంగానా! ఏ మయిందేమిటి?"

"ఏం కాలేదు. కాస్త కలవరించారంతే."

"సరే బాగుంది."

స్వర్ణ ఫక్కున నవ్వి, "అందర్నీ హడలగొట్టి, పైగా బాగుంది అంటున్నారా."

కాఫీలు అయ్యాక, "మళ్లీ వస్తాం" అంటూ అందరూ ఇళ్లకి వెళ్లిపోయారు.

సాయంకాలం అనుపమ ఒక్కతే వచ్చింది ముందు. అప్పటికి జ్వరం బాగా తగ్గిపోయింది. నలుగురూ మాట్లాడుకుంటూంటే,

"టెలిగ్రాం." అన్న కేక విని గిరి లేచివెళ్లాడు.

"ఎక్కడ్నించి బాబూ." అంది ఇందిర భయపడుతూ.

"అమ్మమ్మ రేపు వస్తోంది." అన్నాడు గిరి కాగితం మడతపెడుతూ.

"ఇదేమిటి? వద్దు వద్దంటున్నా వ్రాశారా మీరు? అనవసరంగా ఆవిడకి శ్రమ."

"అమ్మమ్మకి ఇబ్బంది అవుతుంది అనుకుంటున్నావే కాని, నిన్న మేం ఎంత బెదిరిపోయామో ఆలోచించవు. భయంతో బిగుసుకుపోయి, ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటూ కూర్చున్నామే కాని నోరు విప్పి మాట్లాడటం కూడ చేతకాలేదు— మధ్యలో అనుపమ ఇంటికి వెళ్లి అన్నం తీసుకువచ్చి అందర్నీ బలవంతంచేసి కాస్త మజ్జిగ అన్నం అయినా తినేలా చేసింది కనక కాని, లేకపోతే మాతో పాటు వాళ్లంతా కూడ అలాగే వుండిపోయేవారు. డాక్టరు ఎంత ధైర్యం చెప్పినా ఆయన మాట ల్లోనే నమ్మకం వుండేదికాదు. అలాంటి స్థితిలో ఇచ్చాం టెలిగ్రాం." అంది పద్మ.

ఇందిర కళ్ళు చెమర్చాయి. వీళ్లంతా ఇంతగా భయపడ్డారంటే, నిజంగా నిన్న ఎంత గడ్డురోజో. ఏ ప్రమ[illegible]నా జరిగివుంటే.... ఆపైన ఆలోచించలేక ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చింది.

"అయినా తనకి శ్రమ ఏముంది. అక్కడ ఎక్కుతుంది. ఇక్కడ దిగుతుంది. స్టేషనునించి కారులో ఇంటికి వస్తుంది." అన్నాడు గిరి.

"సరేలెండి— తగ్గిపోయింది కదా అని అన్నాను— మనం అటువేపు వెళ్లి చాల రోజులయింది— ఆవిడని చూసినట్లయినా వుంటుందిపోనీ." అంది ఇందిర.

"అయితే మీ అమ్మకి బెంగజ్వరం వచ్చినట్లుంది పద్మా." అంది అనుపమ. ఈ పది రోజులనుంచి మరీ సన్నిహితంగా వుండటంతో బాగా చనువూ ధైర్యమూ వచ్చాయి.

ఆ అమ్మాయి మాటలు వింటూ అభిమానంగా నవ్వింది ఇందిర.

"ఐతే రేపటినుంచీ అన్ని పనులూ అమ్మమ్మకే వదిలేస్తాను. ఇద్దరూ కరువుదీరా ఖబుర్లు చెప్పుకోండి." అంది పద్మ.

"నిజంగానే— నువ్వు ఇటువేపురాకు అసలు. ఈ నాలుగు రోజులైనా కాస్త శ్రద్ధగా చదువుకో. నువ్వు కూడ— మీకందరికీ నేను బాగా శ్రమ ఇచ్చాను— అవాళ హాస్యానికి అనుకున్నా, నిజంగానే అన్నం తెచ్చిపెట్టావు పాపం....."

"నయమే. శ్రమ ఏముంది." అంది అనుపమ, ఇందిర చూపులలో వ్యక్తం అవుతున్న అభిమానము కృతజ్ఞతాభావాల్ని మోయలేనట్లు తలవంచుకుని.

"నా వల్ల మీ చదువు పాడయిపోయింది అని నేను బాధపడకుండా బాగా ప్రిపేరయి మీరిద్దరూ క్లాసు తెచ్చుకోవాలి మరి." కాస్సేపటి తరువాత వెడతానని లేచిన అనుపమతో అంది ఇందిర.

* * *

"ఇప్పుడు జ్వరం పూర్తిగా తగ్గిపోయింది." అని స్టేషను దగ్గరే గిరి చెప్పటంవల్ల నిశ్చింతగా ఇంట్లో అడుగుపెట్టిన కామేశ్వరమ్మగారు కాళ్ళు కడుక్కుని కూతురి గదిలోకి వెళ్లి,

"ఎలా వున్నావు తల్లీ— ఆ టెలిగ్రాం చూసి నిన్ను మళ్లీ ఇలా చూస్తాననుకోలేదు." అంది కళ్లంట నీళ్ళు పెట్టుకుంటూ.

ఇందిర కళ్లలో కూడ నీళ్ళు తిరిగాయి. "వాళ్ళు మొదట వ్రాస్తానంటే వద్దన్నాను. మొన్న మరీ భయంవేసి నాకు తెలియకుండా టెలిగ్రాంఇచ్చారు" అంది.

"చెప్పడానికీ, తెలియడానికీ అవాళ నువ్వసలు మనుష్యులలో వున్నావేమిటి?" అంది పద్మ.

"అవునట. బాబు చెప్పాడు. అయినా అంత ప్రాణంమీదికి వచ్చేదాకా వూరుకోకుండా, ముందే వ్రాస్తే ఎవరో ఒకరం వచ్చేవాళ్లంగా."

"ఇంటినిండా పిల్లలు హడావిడి. అదంతా విడిచిపెట్టి రావాలంటే ఇబ్బంది అవుతుందని వద్దన్నాను నేనే— ఒక్క దానివీ రాగలిగావు, నాన్నగారు కూడ వస్తాననలే."

"మీ నాన్నగారు అన్నయ్యా వూళ్లో లేరు. ఏవో అర్జంటు వ్యవహారా లున్నాయి మాట్లాడాలి రమ్మనమని సావిత్రి ఉత్తరం వ్రాసింది. అది చూసి మొన్న సాయంత్రం వాళ్లిద్దరూ అటు వెళ్లారు. రాత్రి మీ టెలిగ్రాం, ఇక కాళ్ళూ

చేతులు ఆడలేదనుకో. చంద్రానికి శెలవు దొరక దన్నాడు అయినా ఎవరు మాత్రం ఎందుకు, ఎలాగో ఇక్కడ ఎక్కించేయండి. అక్కడ బాబు దింపుకుంటాడు అని చెప్పాను నేనే."

"అక్క ఎందుకు రమ్మందో ఏం వ్రాయలేదా?"

"లేదు. ఏమో వ్యవహారాలు చూడాలి, అర్జంటుగా రమ్మని వ్రాసింది. ఏముందీ ఏదో భూమి కొనడం విషయం అయివుంటుంది— బోలెడు ఆస్తి. అదంతా అతనొక్కడూ చూసుకోలేక సతమత మవుతున్నాడు. చేతికందిన కొడుకున్నాడనుకుంటే, వీడేమో చదువు పరీక్షలు అంటూ ఎప్పుడూ ఆ బస్తీలోనే అఘోరిస్తాడు. ఇంకనైనా తండ్రికి కాస్త ఆసరాగా ఇంటిపట్టున వుండమని గట్టిగా చెప్పండి అని చెప్పాను వీళ్లతో."

"కృష్ణుడు బి. ఏ. ప్యాసుకాలేదూ." అంది ఇందిర.

"మొన్నేగా పరీక్ష అయినాయి— అయినా ఏం లేనివాడికీ పరీక్షలన్నీ కాని, ఉన్న ఆస్తి చూసకోడానికి చదువెందుకు. ఎక్కడో వుద్యోగంచేసి రెండువందలు సంపాదించేకంటే, హాయిగా తండ్రి కొడుకు కలిసి ఉన్నది చూసుకుంటే లక్షలు సంపాదించగలరు— ఇదుగో, ఆ మూడు ముళ్లూకూడ వేయించేస్తే కుదురుగా వుంటాడు— ఎలాగూ వెళ్తున్నారు కదూ ముహూర్తం పెట్టించుకు రమ్మన్నాను. ఇప్పుడయితే అందరికీ వీలుగా వుంటుంది"

"ఇంక వెళ్లి స్నానంచేసి మడిగట్టుకో. నిన్న ఎప్పుడనగా భోజనం చేశావో." అని ఇందిర ఆవిడ ధోరణికి అడ్డు తగిలింది.

"ఈవిడ గొడవతో నీకు మళ్లీ తలనొప్పి రాలేదు కదా" అంది పద్మ అమ్మమ్మ అటు వెళ్లగానే

"ఇక్కడ ఆ స్థితిలో కూడ దొడ్డమ్మ గొప్ప చెప్పటంతోనే సరిపోయింది." అన్నాడు గిరి.

"సరేలెండి — వినిపిస్తుందేమో." మెల్లిగా మందలించింది ఇందిర.

*   *   *

"షాపింగ్‌కి వచ్చారా?"—

పరిచితమైన కంఠం విని ప్రక్కకి తిరిగి చూసింది అనుపమ.

"షాపింగ్ అంటూ ఎక్కువేంలేదు— మీ మదర్ ఎలా వున్నారు. పథ్యం పెట్టారా?"

"కులాసాగానే వుంది. రేపు పథ్యం పెట్టవచ్చు నన్నాడు డాక్టర్."

"మీ అమ్మమ్మగారు ఏ మంటున్నారు."

"ఏ మంటుంది— అమ్మతో హాయిగా ఖబుర్లు చెప్తోంది, అందులో చాలాభాగం మా దొడ్డమ్మని గురించే లెండి— ఇంక తరువాత వంట చేస్తున్నంతసేపు 'ఇదిలేదు, అదిలేదు అంటూ, ఇన్నేళ్లు వచ్చినా సంసారం ఇలాగే చేస్తున్నారు, అంటూ మా అమ్మనీ పద్మనీ కలిపి ఏదో గొణుగుతూనే వుంటుంది ...."

"బాగుంది— మీ అమ్మగారేమో జ్వరంతో పడుకున్నారు— వేళ్టికి ఏదో కాస్త వండి పడేయడం తప్ప, ఏం వున్నాయో ఏం లేవో అన్నీ చూసుకునే వోపిక పద్మకి మాత్రం ఏంవుంటుంది ఆస్థితిలో" అంది అనుపమ ముసిలావిడని తలుచుకుని నిస్తుపోతూ.

"అవన్నీ మీరంటున్నారు.— **కాని ఆవిడ అంత దూరం ఆలోచించదు**— సరే ఇవాళ పద్మని కూర్చోపెట్టి అరగజంపాడవు లిస్టురాయించి నా మొహాన్న పడేసింది."

అనుపమ చిన్నగా నవ్వుకుని, ఆగిపోయి, "నాకు ఇక్కడ కొద్దిగా పనివుంది...." అంది ఎదురుగా వున్న షాపుని చూపిస్తూ, ఇంక మీరు వెళ్లవచ్చు అన్న అర్థం అందులో ధ్వనించినా,

"వెళ్లిరండి." అన్నాడు గిరి అక్కడే నిలబడి.

కాస్సేపటిలో ఏవో ప్యాకెట్లతో ఇవతలకివచ్చిన అనుపమ, "వీధిలో కాలు పెట్టేసరికి ఏదో కావాలని చెప్పింది అమ్మ, తను హాయిగా ఆటలకి పోవచ్చు కదా అని, తనకి కావలిసినవేవో కూడ వన్నే తెమ్మ



న్నాడు మా శశి." అంది.

"మరి మీకేం తీసుకున్నారు?"

ఒక్కక్షణం తెల్లబోయిన అనుపమ మరు క్షణంలోనే సర్దుకుని, "నాకా......" అని నాలుగు అడుగులువేసి పదిపైసలు ఇచ్చి వో మల్లెదండ తీసుకుని, "ఇదినాకు." అంది దండ పదిలంగా బ్యాగ్‌లోపెట్టూ.

"పువ్వులంటే ఇష్టంలేని ఆడవాళ్ళు వుండ రేమో." అన్నాడు గిరి ఏదో ఒకటి మాట్లాడాలి అనుకుంటూ.

తనలోతనే చిత్రంగా నవ్వుకుంది అనుపమ— తను అన్నదాంట్లో తప్పు ఏముందో తెలుసుకోలేని గిరి తెల్లబోతూ,

"ఎందుకు నవ్వుతున్నారు." అన్నాడు.

"ఎప్పటి సంగతో గుర్తు వచ్చింది."

ఏమిటన్నట్లు చూశాడు. అదేదో తననిగురించే నేమో నన్న అనుమానం అతనికి పోలేదు.

"నేను పుట్టి పెరిగింది ఈ వూళ్ళోనే. ఎక్కు వగా ఎక్కడికీ వెళ్ళలేదుకూడ. చాలా కాలం క్రిందట, అంటే మా నాన్నగారు వున్న రోజులలో, మా అత్తయ్యలు మా యింటికి రాకపోకలు సాగించే రోజులలో, సమ్మర్ హాలీడేస్‌కి ఒక ఏడు కల్‌కటా మరో ఏడు బాంబే వెళ్ళాను. వచ్చాక అందరూ అడిగారు నన్ను ఏవూరు బాగుందని. నాకు అన్నింటి లోకి హైదరాబాదే బాగుందని చెప్పాను. కారణం ఏమిటనుకున్నారు?" అంది, ఆసక్తిగా వింటూ మధ్య మధ్య తనవంకే చూస్తూ నడుస్తున్న గిరితో.

"ఏముంది, జననీ జన్మభూమి....."

"ఉహు. నేను చెప్పిన కారణం అదికాదు— మల్లె పువ్వులు, మామిడిపళ్ళు, తెలుగు సినీమాలు."

ఫక్కు మన్నాడు గిరి.

"నిజం, నేను అక్కడికి వెళ్ళిన రెండు సంవత్స రాలు ఆ మూడింటికోసం మొహంవాచిపోయి, ఎప్పుడెప్పుడు వచ్చి ఇక్కడ పడతానా అనిపించేది— నాకెంతో ఇష్టం అని మా అత్తయ్య రోజూ మల్లె దండ కొనేది. జానెడు పొడుగు వేణిలో పదో పన్నెండో మల్లె మొగ్గలు ఒక రీలు దారం వుండేవి. అందుకే నాకా పూళ్ళు నచ్చలేదు— — అదిసరే, నేనిలా మాట్లాడేస్తున్నాను, మీరు వింటూ నడు స్తున్నారు. మీ రెక్కడికి వెళ్ళాలి?" అంది అక్కడే ఆగిపోయి.

"అదిగో అ ఎదురుగానే నా కారుంది. నేను ఇంటికే వెళ్ళాలి— మిమ్మల్ని డ్రాప్ చేసి వెళ్ళి పోతాను." అన్నాడు గిరి ఇంకాస్త దూరంలో పార్కుచేసివున్న కారువేపు చూపిస్తూ.

"ఇంట్లో ఏంలేవు తీసుకురమ్మని మీ అమ్మమ్మ గారు పంపించారని చెప్తున్నారు. ఇప్పుడాలిస్టులో సగం పాట్లాలు వూడదీసి వంటకాలు తయారు చేస్తారేమో ఆవిడ— మీరింతసేపు నాతో కూట్లా డుతూ వుండిపోయిందే కాకుండా ఇంకా ఇక్కడే తిరుగుతూంటే ఆలశ్యం అయిపోదూ. నేనురిక్షాలో వెళ్ళిపోగలను. కాని, మీరు త్వరగా వెళ్ళి అవన్నీ ఆవిడకిచ్చి చక్కగా పదిహేను రోజుల భోజనం చేసేయండి."

"అమ్మమ్మ వంటకేంకాని, మీకు అభ్యంతరం లేకపోతే నే......" కొద్దిగా చిన్నబుచ్చుకున్నట్లు అడిగాడు.

అంతస్తులు - అభిమానాలు

"అదేమిటి?"

"బహుశ మా ఎద్మలేకుండా నా కారులో. .."

అనుపమ మనస్సులోనే కొద్దిగా వులిక్కిపడింది.

"అబ్బే అలాంటి భయం ఏంలేదు. నేను మగ వీరుడ్ని." అంది పైకి గంభీరంగా.

"అయితే రండి" అంటూ కారు దగ్గరగా వెళ్ళి, "వెనక సీటంతా అమ్మమ్మ ఇచ్చిన లిస్టులో నిండి పోయింది మీరు ఇక్కడే కూర్చోవాలి." అన్నాడు అటు తిరిగివచ్చి తలుపుతీస్తూ.

నిజంగానే ఏవేవో పొట్లాలు ఆ సీటునిండా చిందరవందరగా వున్నాయి

"వో. కే" అంటూ లోపల కూర్చుని తలుపు వేసింది

సంభాషణ తెగిపోయినట్లు, మాట్లాడ్డానికింకేం లేనట్లు ఇద్దరూ మౌనంగానే వున్నారు కొద్ది క్షణాలు. చివరికి గిరి మెల్లిగా గొంతు సవరించుకుని,

"అయితే అనుపమాదేవి ."

"అదేమిటి, నాకు చివర ఆ దేవి, దేవర ఏం లేవు, అవి నాకసలు ఇష్టంలేదు. ఆ దేవి తీసేసి హాయిగా అనుపమా అని పిలవండి." అంది తల వంచుకుని, మల్లెదండదారం రెండు కొసలూకలిపి ముడివేస్తూ

గిరి కళ్ళల్లోకి అపూర్వమైన కాంతి వచ్చింది "వో. అయితే మరి ఇంకో రిక్వెస్టు— ఆ చివరి రెండక్షరలు కూడ తీసేసి ఇంకా హాయిగా అనూ అని పిలవనా?"

అంతట మొగివీరుడు నీరయిపోయింది శరీ రంలో ప్రతి అణువు అపూర్వమైన అనుభూతితో మొద్దుబారిపోయినట్లయింది. అతను అడిగిన తీరు, ఆ గొంతులో చిందులాడిన మార్దవం మన స్సుని గిలిగింతలు పెడుతూండగా తలవంచుకుని అలాగే, చేతిలో వున్న చెండులో మల్లె మొగ్గలని ఇటూ అటూ కదిలిస్తూ కూర్చుంది

తను చేయదలుచుకున్న ప్రస్తావనకి నాంది వాక్యం ఎలా వుండాలో తేల్చుకోలేకపోతున్న గిరి, అనుకోకుండా అనుపమ అన్నమాటల ఆధారంతో మరి కొంచెం ముందుకి వెళ్ళి చటుక్కున ఆ మాట అన్నాడే కాని, ఆమె దగ్గరనించి వెంటనే సమా ధానం వస్తుందని అతనూ ఆశించలేదు కొద్ది క్షణాల తరువాత తనె మళ్ళీ అన్నాడు.

"మీతో ఈ సంగతి చెప్పాలని కొన్ని రోజుల నుంచి ప్రయత్నిస్తున్నాను. ఎలా చెప్పాలో తెలియు లేదు. అవకాశమూ రాలేదు ఇవాళ అనుకోకుండా మీరు కనిపించేసరికి, ఏమయినా అనుకుంటారేమో ననే మొహమాటం అయినా లేకుండా చొరవచేసి మిమ్మల్ని మాటల్లో పెట్టాను. ఎంత తొందరగా మీ అభిప్రాయం తెలుసుకుందామా అనే ఆత్రుతే, ఇవాళే ఇలాంటి ప్రస్తావన తీసుకు వచ్చేలా చేసింది"

ఇవాళ కనిపించిన దగ్గరనుంచీ అతని మాటలు తనకి కొత్తగా అపిపించి, ఇలాంటి ప్రస్తావన ఏదో తీసుకువస్తాడు అనుకున్నా, నిజంగానే అతను అడిగేసరికి ఏం మాట్లాడాలో తెలియలేదు అను పమకి. ఎంతకీ సమాధానం రాకపోవడంతో కొద్దిగా ఇటు తిరిగి వోరగా ఆమె వైపు చూశాడు గిరి. ప్రక్కకి తిరిగి బయటకి చూస్తున్న ఆమెమొహంలో కోపంకాని, అప్రసన్నతకాని లేదనిపించింది.

"చెప్పాలనిలేదా?" గోముగా వుంది అతనిగొంతు.

ఎలాగో ధైర్యం తెచ్చుకుని "మేం చాల బీద వాళ్ళం." అంది మెల్లిగా.

"ఒకప్పుడు మేము అంతకన్నా బీదస్థితిలో వుండే వాళ్ళం"

"కట్నం ఏమీ ఇవ్వలేము."

"మీరు ఇవ్వగలిగినా నేను తీసుకోను."

తరువాత ఏం చెప్పాలో అనుపమకి తోచలేదు. ఇంతలోనే సందు మలుపు వచ్చింది. "ఇక్కడే ఆపండి" అంది గబుక్కున.

క్షణం చిత్రంగా ఆమె వైపుచూసి బ్రేక్‌వేశాడు. ఆమె దిగి తలుపువేసింది.

"నా ప్రశ్నకి సమాధానం చెప్పలేదు."

మనోహరమైన చిరునవ్వుతో అనుపమ పెద వులు కొద్దిగా విచ్చుకున్నాయి. మనోజ్ఞంగా తల వూపి, "ఆలోచించుకోవాలి." అంది మెల్లిగా.

"వో. కే." అనురాగంతో ఆమె కళ్ళల్లోకి చూసి, హుషారుగా కారు స్టార్టు చేశాడు గిరి.

అనుపమ పాదాలు గాలిలో తేలిపోతున్నాయి. సంతోష సంభ్రమాలతో తనువూ మనసూ పులక రించిపోతున్నాయి— ఈ సంగతి అమ్మకి చెప్పగానే ఎంత సంతోషిస్తుంది ఇదంతా నీ అదృష్టం అని చెంపలు నిమిరి ముద్దు పెట్టుకుంటుంది ఈ రోజుని చూడగలిగే అదృష్టం మీ నాన్నగారికి లేదని కాస్సేపు బాధపడుతుంది. . . . .

మొదట్లో అందరిలోకి నాన్నగారి పనే బాగుం డేది. మంచి ఉద్యోగం మంచి జీతం. హాయిగా రోజులు గడిచిపోయేవి. ఆయన తమ్ముళ్ళూ చెల్లెళ్ళూ అభిమానంగా రాకపోకలు సాగించేవారు అన్నయ్యా వదినా అంటూ గౌరవించేవారు. అలాంటి సమ యంలో హఠాత్తుగా నాన్నగారు పోవటంతో పరి స్థితి మారిపోయింది. విధవరాలైన వదినగారు ఇద్దరు పిల్లలతో ఎవరి పంచన చేరుతుందో అన్నట్లు ఎవరికి వారే తప్పించుకున్నారు. అందర్నీ అర్థం చేసుకోగలిగిన అమ్మ ధైర్యంగా పరిస్థితుల నెదు ర్కోడానికే నిశ్చయించుకున్నది— వచ్చిన జీతం వచ్చినట్లు ఖర్చు చేసేయటంతో చేతిలో డబ్బు ఏమి లేదు. అమ్మ వంటి మీద మాత్రం కొద్దిగా నగ లుండేవి నాన్నగారి ప్రావిడెంటుఫండు లవి వచ్చాయి. అవన్నీ మార్చి తినడం మొదలుపెడితే కొద్ది రోజులు పోయేసరికి ఏమీ మిగలదని అడబ్బుతో చిన్న ఇల్లు కొంది— 'మనం తిన్నా తినకపోయినా తల దాచుకోటానికి ఇల్లు వుంటే, ఒకటో తారీ కున ఇంటి యజమాని వచ్చి,—అద్దె ఇవ్వలేకపోతే సామాను వీధిలో పారేయిస్తాను—అని బెదిరించే అవసరంరాదు' అని అమ్మ అంటుంది. అదీనిజమే— ఆ యింట్లోనే వో చిన్నభాగం యాభై రూపా యలకి అద్దెకి ఇచ్చింది దాంతో ముగ్గురికి గడవా లంటే కష్టమేమరి. అమ్మ ఎక్కువగా చదువుకో లేదు. హిందీ పరీక్షలు మాత్రం అప్పట్లో సరదాకి చదివి ప్యాసయింది. చివరికి అదే వృత్తిగా స్వీక రించవలసి వచ్చింది. రోజులు ప్రశాంతంగానే గడిచిపోతున్నాయి.

(సశేషం)



వారఫలం

3-2-1967 శుక్రవారం మొదలు 9-2-1967 గురువారం వరకు.

మేషం వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. వృత్తిలో కొత్త వారిపోటీని యెదుర్కొవలసి వస్తుంది. ప్రయాణాలు కొంచెం శ్రమమీద ఫలిస్తాయి ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. పుణ్యకార్యాలు చేస్తారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

వృషభం : ఏ వ్యవహారంలోను ఆరంభంలో కనుపించిన అనుకూలత ఆఖరువరకు నిలవదు. ఆర్థిక వ్యవహారాలు వారాంతరంలో బాగా ఉంటాయి. సాహసముతోకూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఉద్యోగంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. విలాసవస్తువులు కొంటారు.

మిధునం : ఫలితం మాటయెలాగఉన్నా, ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో ప్రయోజనంగల వ్యక్తులను కలుసుకొంటారు. పోటివారితో మాటపట్టింపులకు దిగడం మంచిది కాదు. మిత్రుల సహాయం లభిస్తుంది.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూల వార్తలను వింటారు.

కర్కాటకం వృత్తివ్యాపారాల్లో మీకార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా కొంతవరకు లాభిస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగిపోవడం వలన ముమ్ముందు యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

సింహం : కొన్ని వ్యవహారాల్లో మీరు మొగమాటాలకు లొంగిపోవడంవలన అనవసరమైన కార్యభారాన్ని వహించవలసి వస్తుంది. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగాఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఆరోగ్యం బాగా ఉంటుంది.

స్త్రీలకు— పోటివారితో మాటపట్టింపులు తగవు. ప్రయాణాలోచనలు చేస్తారు.

కన్య : వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలుకూడా కొంతవరకు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి. వ్యాపారం భారీ యెత్తున చేయడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

తుల : భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలకంటే మీరుస్వంతంగా చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వృత్తిలో పోటివారి పోటీని యెదుర్కొని అనుకూలతను సాధించగలరు. ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృశ్చికం వృత్తివ్యాపారాల్లో మీకార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా నెరవేరతాయి. కొన్ని వ్యవహారాల్లో మీకంటే పెద్దవారుకూడా మీ సహకారాన్ని కోరవలసి వస్తుంది. నూతన వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు వారాంతంలో లాభిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

ధనస్సు వృత్తివ్యాపారాల్లో మీ కార్యక్రమాలు వారం ప్రారంభంలో మాత్రం బాగా ఉంటాయి. కొన్ని వ్యవహారాల్లో అధికవ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. మీతాలూకు వస్తువులు పోవచ్చును. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉండదు. శుభకార్యాల విషయంలో అనుకూలమైన మార్పులు వస్తాయి.

మకరం : ప్రయత్నించిన పనులకు ఆటంకాలు రావడం అనుకోని వ్యవహారాలు నెరవేరడం వంటి సంఘటనలు జరుగుతాయి. సాహసముతోకూడిన వ్యవహారాలు వారం ప్రారంభంలో లాభిస్తాయి. వారం మధ్యలో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి. ప్రయాణాలు శ్రమమీద ఫలిస్తాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది. అలంకార వస్తువులు కొంటారు.

కుంభం : వృత్తి వ్యాపారాల్లో యిదివరకు ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు పూర్తి చేయగలరు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. సాంఘిక వ్యవహారాల్లో మీప్రాముఖ్యత పెరుగుతుంది స్థిరాస్థి వ్యవహారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో మీకృషి ఫలించగలదు.

మీనం కొన్నివ్యవహారాల్లో శ్రమ కలిగినా, దానికి తగిన ప్రతిఫలం లభించగలదు. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది ప్రయాణాలు ఫలిస్తాయి.

స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

—మహేష్

పరంధామయ్య



పరంధామయ్యగారూ.''

పరంధామయ్య వినేస్థితిలో లేడు. రేపు అత్తవారింటికి వెళ్లిపోయే పెద్దకూతురువిజయకు పెట్టాల్సిన సారెను గురించి ఆలోచిస్తున్నాడు, చక్కగా ఫేను క్రింద కుర్చీలో కూర్చొని, చాలసేపటినుండి ఫైలుచూస్తూ చివరికి సంతృప్తికరంగా నిట్టూర్చిన ఆఫీసరు ఆనందరామంగారు ఫైలు యిచ్చేసే నిమిత్తం పరంధామయ్యను అప్పటికి మూడుసార్లైనా పిలిచి ఉంటారు. ఆలోచనలలో మునిగిపోయిన పరంధామయ్యకా పిలుపులు వినిపించలేదు. అందుకు ఆనందరామంగారు కొంచెం ఆశ్చర్యపడ్డారు. 'పరంధామయ్య యెప్పుడు తనచెంత యింత పరాకుగా వుండలేదు ఫైలు చూస్తున్నంతసేపు తనవేపే చూస్తూ గడిపేవాడు. అలాంటిది యివాళ మూడుసార్లు పిలిచినా పలుకకుండా ఆలోచనల్లో తలమునకలవుతున్నాడు.' ఇలా అనుకొన్న ఆనందరామంగారు గంభీరంగా నవ్వుకొన్నారు తలకాయ కొంచం తాటించి ఆఖరుసారిగా గట్టిగా పిలిచారు.

ఆ ఆఖరు పిలుపుకు త్రుళ్లిపడి, సర్దుకొని లేచి వినమ్రతగా ఫైలందుకొని నమస్కారం పెట్టి యివతల కొచ్చేశాడు పరంధామయ్య

తనసీట్లో కూర్చోకుండా ఫైలు నక్కడ పెట్టేసి, టీ కోసం వెళ్లాడు పరంధామయ్య. కాఫీ క్లబ్బులో అయ్యరు కొంతసేపు మాట్లాడి 'నెల నెలా జేలన్సు ఎక్కువగా వదిలేయడం బాగులేదని, టీ తాగడం కాస్త తగ్గించుకోమని 'సలహా' లాంటి దెప్పిపొడుపు పొడిచాడు. త్రాగిన టీ వంట అదే ఎక్కువ వేడి అనిపించింది కాబోలు పై కండువాతో మొహం తుడుచుకుంటూ వచ్చి తనసీట్లో కూర్చున్నాడు. సీట్లో కూర్చొన్న పరంధామయ్యను మళ్లీ ఆలోచనలు దోమల్లా ముసురుకొన్నాయి.

అయ్యరెంతమాటన్నాడు! ఛ! ఎంత ఎక్కువ జమ కడదామన్న అవకుండా వుంది. అనవసరంగా వాడిచేత మాట ఎడ్డాను. అనవసరంగా ఏం? అవసరంగానే మాటపడ్డాను. ఎవరి డబ్బు వాళ్లడగరూ? అదీగాకుండా తనకీ అడిగించుకోవడాలు అలవాటేగా? ఎంతోమందికి తాను బాకీలివ్వాలి. జీతం రాబోయే సరికి ఎన్నో అప్పులు రెడీగా ఉంటాయి. వాటికి తోడు రేపు విజయ అత్తవారింటికి వెళ్లేందుకు సారె కేమైనా అప్పుచేయాలి. ఎలా? ఎవరినడగడం? ఇలా ఆలోచిస్తున్న పరంధామయ్యకు మళ్లీ ఆఫీసరు దగ్గరనుంచి కబురొచ్చింది. గతుక్కుమన్నాడు పరంధామయ్య. ఇప్పుడే ఒక అరగంట క్రితం లోను ఆఫీసరు దగ్గరికి వెళ్లి వచ్చాడే? ఒకవేళ ఫైలులో తప్పులున్నా వెంటనే అడిగివుండేవాడుగా? ఒకవేళ అక్కడ తానేమైనా తప్పుగా ప్రవర్తించాడా? ఒకవేళ నిద్రవచ్చి నిద్రపోయాడే మోతను? ఒకవేళ అలా జరిగినా, వెంటనే ఆఫీసరు మందలించి ఉండేవాడే? "హా! తినబోయేదానికి రుచి అడగడం ఎందుకు?" అనుకుంటూ ఆఫీసరు దగ్గరికెళ్లాడు. లోనికెళ్లి నమస్కారం పెట్టాడు. ఆఫీసరు కుర్చీ చూపించగా కూర్చున్నాడు పరంధామయ్య. పైన ఫాను చిన్న శబ్దం చేస్తూ తిరుగుతూంటే ప్రశ్నార్థకపు మొహంతో ఆఫీసరువంక చూశాడు.

ఆఫీసరు ఆనందరామంగారు యిలా అన్నారు:

"చూడండి పరంధామయ్యగారూ? మీరు ఆఫీసులో బాగా పనిచేస్తారని పేరు తెచ్చుకున్నారు. మీరు చాల మంచివారని, నన్ను కూడ మీ రలాగే ఎంచుకున్నారని నే ననుకున్నాను."

"చిత్తం! మీరెప్పుడు నన్ను గౌరవంగానే చూస్తున్నారు!" మాటలు తడబడగా అన్నాడు పరంధామయ్య

'అయితే మరి మీరు నన్ను గౌరవిస్తున్నారా?' మళ్లీ ప్రశ్నించారు ఆనందరామంగారు.

పరంధామయ్యకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు? "నన్ను గౌరవిస్తున్నారా??" అని సూటిగా అడుగుతారేమిటి? ఇలా ఎవరైనా అడుగుతారా? ఒకవేళ ఆఫీసరుమీద ఏ గుమస్తాకైనా గౌరవం ఉన్నా లేకున్నా, ఆఫీసరిలా అడిగినప్పుడు 'గౌరవిస్తున్నాననే' చెబుతాడుకదా? ఆ విషయం తెలిసి కూడ ఆఫీసరు ఎనవెందుకు అడిగినట్లు? ఇంకేదైనా కారణముండి యుండవచ్చు ఆ కారణం ఏమై ఉంటుందో?

తాను వేసిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఆలోచనల్లో పడి లేయకోకపోవడం చూసి ఆనందరామంగారు నవ్వుతుని 'ఏమండి...!' అని పిలిచారు. ఆ పిలుపుతో 'చిత్తం' అంటూ తేరుకున్నాడు. దానికి మరీ నవ్వు వచ్చింది ఆనందరామంగారికి.

పరంధామయ్య ఎప్పుడూ యింత పరధ్యానంగా ఉండలేదు. ఈవాళ యిలా ఆలోచనా సముద్రంలో మునిగిపోవడానికి ఏదో బలమైన కారణమే ఉండి ఉండాలనిపించింది. పరంధామయ్య చాల పేదవాడని అతని వాలకమే చెబుతోంది.

చారల చవకబారు కమీజు, ఖద్దరు పంచె, పాత కళ్లద్దాలు, పట్టెబుర్ర, లోతుకుపోయిన కళ్లు దీనంగా కన్పిస్తాడు. పాపం ఆరుగురు పిల్లలు. వెనక ఆస్తి నాస్తి. ఇవన్నీ ఆనందరామంగా రెరుగుదురు, ఇతర గుమస్తాలు చెప్పడం వలన

"చిత్తం! అంటారేమిటి? నా మీద మీకు గౌరవముందా?"

"చిత్తం! మన్నించాలి! మీలాంటి మంచివారిపై దురభిప్రాయం ఎవరికుంటుంది? ఏనాడైనా, ఎవరినైనా ఎత్తిపొడుపుమాట మీరనలేదు."

"మరి నాతో సన్నిహితంగా ఎందుకు మాట్లాడరు? నేను ఆఫీసర్ననా? లేక యిలా కుర్చీలో కూర్చుంటే నాకు గర్వం వచ్చేస్తుందనా? నాకు అలాంటి గర్వాలేవీ లేవు. అలా నేనే అనకూడదనుకోండి. ఒక దగ్గర పనిచేసేవాళ్లు మనసు కలిసి ఉండాలి గాని, ఎవరో ముక్కు మొహం తెలీనివారిలా ఉండడం నాకిష్టంలేదు. మనసు విప్పి మాట్లాడుకోవాలి కష్టసుఖాలందరికీ ఉంటాయి ఈవాళ మీరేదో దాన్ని గురించి ఆలోచిస్తున్నట్లు ఉన్నారు? ఏమైనా డబ్బు కావాలా?" అని పెద్ద ఉపన్యాసం యిచ్చారు ఆనందరామంగారు

పరంధామయ్యకు ఆనందించాలో, ఆశ్చర్యపడాలో అర్థంకాలేదు. నిజంగా తనకో ఏభై రూపాయలు ప్రస్తుతం అవసరం. 'ఏం చెయ్యాలో భగవంతుడా?' అని ఆలోచిస్తున్న తనకు "ఏమైనా డబ్బు కావాలా?" అని ఆఫీసరు గారంటే తీసుకోవాలనే ఉందిగాని, ఆఫీసరుగారేంటి? తనకు అప్పు యివ్వడమేమిటి? అటువంటి వాళ్ల దగ్గర ఋణంచేస్తే ఖచ్చితంగా అప్పు పైసలు తిరిగి

యివ్వాయ్యాలి? తీరా యిచ్చినా, "ఏమిటయ్యోయ్! ఖచ్చితంగా యిచ్చేస్తున్నావ్, జీతంగాక పై కస్టీ ఏమైనా లభించిందా? ఏమిటి??" అని అడుగు తారు ఇన్ని ఆలోచనల్లో నున్న పరంధామయ్య మళ్లి పరధ్యానంలో పడ్డాడు.

ఆనందరామంగారు "పరంధామయ్యగారూ! ఏఐంగా మీకు 'పరధ్యానం రామయ్య' అని పేరు పెట్టబోయి "పరంధామయ్య" అని పేరుబెట్టారు ఏమిటండీ ఆలోచనలు." అని కొంచం గట్టిగానే నవ్వుతూ అన్నారు.

"అబ్బే! ఏమీలేదండీ! మీ దయకు కృత జ్ఞుడ్ని! నా కేమీ అక్కరలేదు! క్షమించండి!" అనేశాడు.

"సరే మీయిష్టం! అవుసరం అయితే మొహ మాట పడకండి! వెళ్లిరండి" అన్నారు ఆనంద రామంగారు.

ఆఫీసరు దగ్గర్నుంచి వచ్చేస్తుంటే అందరూ వింతగా చూస్తున్నారని గ్రహించి మొహం మాడ్చేసు కున్నాడు పరంధామయ్య. పరంధామయ్య ముఖం మాడ్చేసుకోవడం చూచి ఎవరు ఏమీ పలకరించ లేదు తోటి గుమస్తాలు

సీట్లో కూర్చుని, కళ్లద్దాలు తీసేసి ముఖం తుడుచుకున్నాడు. ఏఫైలు ముట్టుకో బుద్దిపుట్టక అలాగే వెనక్కి వాలాడు పరంధామయ్య

కుర్చీకి చేరబడి "ఆనందరామం గారివాళ ఎందు కలా మాట్లాడారు? తాను డబ్బుకోసం బాధపడు తున్నట్టు యితనికెలా తెలిసింది? తానడగకుండా యిస్తానన్న అప్పును తృణీకరించడం జరిగింది కదా? మరెవరైనా అడిగితే లభిస్తుందా? పోసి బట్టల షాపువాడ్ని అరువు, చీర, జాకెట్టుగుడ్డ అడుగుదామంటే, విజయ పెళ్లికి చేసిన అప్పే యింకా తీరలేదు! మళ్లీ ఎలా యిస్తాడు? ఛీ! ఛీ! తనదీ ఒక బ్రతుకేనా? అడుగడుగుకు అప్పులు చేశాడు. ఎవరికోసం చేశాడివన్ని? తన సంతాన రత్నాల కోసం. తానొక్కడు అయితే యింత బాదర బందీ ఉండేదికాదు.

తనకు ఆరుగురు సంతానం అందరికంటె పెద్దది విజయ. విజయ తర్వాత, సరోజ, ఆ తరు వాత జోగారావు, జోగారావు తరువాత సన్యాసిరావు, తరువాత సూర్యారావు, తరువాత మొన్న రెండు సంవత్సరాల క్రితం పుట్టింది సుశీల

విజయ థర్డుఫారం చదివింది. దానికి పెళ్లి చెయ్యబోయేసరికి తాను "ట, ఠ" లు గుణించాడు అడగరానివాడినల్లా అప్పు అడిగాడు. ఎన్నో సంబం ధాలు తప్పిపోగా చివరికీ సంబంధం అయిదువందల నదహార్లకు ఎస్. ఎస్. ఎల్. సి. కుర్రాడితో సెట్ల యింది. అయిదువందలు దక్షిణ లాంటిది. అవి ఒకరి దగ్గర తెచ్చాడు. ఆ అయిదు వందల అప్పు కోసం వెళ్లినపుడే జగన్నాధరావు ఒక మాట అన్నాడు. "ఏమండీ పరంధామయ్యగారూ! మీకు వచ్చే జీతం మీ పొట్టకూటకే చాలనపుడు, మళ్లీ 'జీతం రాగానే యిచ్చేస్తానంటూ' వాళ్లదగ్గర వీళ్లదగ్గర అయిదు, పది చేబదుళ్లు పట్టు కెళ్లతారెందుకు? అప్పారావు దగ్గర వదిరూపాయలు మూడు నెలల క్రిందట తీసుకుని యిప్పటి కొచ్చి యివ్వ లేదని మొన్న నాతో అన్నాడు!"

పరంధామయ్య

ఆ మాటలు చాలవ్వు, తన గుండెల్ని పిండడానికి. ఆనాడు తను తన గుమస్తా ఉద్యోగాన్ని ఎన్నిసార్లు తిట్టుకున్నాడో! తన తండ్రి మెట్రిక్ కంటే తన నెక్కువగా చదివించనందుకు తిట్టుకున్నాడు అయితే తాను తన కొడుకును పైకి చదివించ గలడా? నాపిండాకూడు! తన పెద్ద కొడుకు జోగా రావు వట్టి పోకిరి వెధవ. వాడింకా పైకి చదువు తాడా? థర్డుఫారంలోనే ములం బంకలా అంటుక పోయాడు. వెధవ యీ గుమస్తాగిరికైనా చదువు తాడో లేదో? దద్దమ్మ! మళ్లీ గుమస్తా గిరిమీద కోపం వచ్చింది. వెధవది "గుమస్తా....!" అంటూ చివర్న పొడుగాటి అక్షరంవుంటే మాత్రం లాభం ఏంటి? నీకు బాదరబందీ లావురా? అన్నట్లు చక్కగా "ఆఫీసరు" ఎంత మంచిది. చివర్న పొట్టి అక్షరముంటే ఏం? రాబడి ఎక్కువ. పని తక్కువ తన గిరికే పేరు పొడుగు. రాబడి కురచ. ఏమి చేస్తాం! ఎవరి ఖర్మ వారిది.

శుభ్రంగా అలసిపోయాడు పరంధామయ్య ప్యూను అప్పటికే తలుపులన్నీ మూసేస్తున్నాడు. ఆలోచనలనుంచి తేరుకున్న పరంధామయ్య ఆశ్చ ర్యంలో పడ్డాడు, ఆశ్చర్యంలోనుంచి తేరుకుని ఆఫీసునుండి బయట పడ్డాడు.

* * *

పరంధామయ్య యింటికి చేరుకోబోయేసరికి కొడుకు జోగారావు పెడకను చేతులతో పట్టు కుని ఉన్నాడు ఎక్కడికో బయలుదేరినట్లున్నాడు వాడికి కొద్ది దూరంలో జయ నెత్తుకుని నిల్చుంది భార్య మీనాక్షి.

"ఏమిటి సంగతి?" అన్నట్లు భార్య ముఖంలోకి చూచాడు పరంధామయ్య.

"వాడు సినిమాకు వెళతాడట! డబ్బులియ్య మని అడుగుతున్నాడు. నేనేం చేసేది?" అంది మీనాక్షి

"ఉరి పోసుక చావు" అని కొడుకువైపు తిరిగి "ఏంరా? తిన్నది చాలక మళ్లీ సినిమా ఒకటి చూస్తావా? సిగ్గులేకుండా? థర్డుఫారం డింకీలు మీద డింకీలు కొట్టించి, సినిమాలు, డ్రామాలు తిత్తగిస్తున్నావ్! పొట్ట చింపితే అక్షరం ముక్క లేదు. వెధవా! యివాల్టినుండి సినిమాకు బయలు దేరు వీపు చిట్కేస్తాను. లోపలికిపోయి చదువుకో" గద్దించి అన్నారు.

"అబ్బ! నేనివేళ ఎలాగైనా సినిమాకి వెళ్లాలి. నా ఫ్రండ్స్‌తో వస్తానని చెప్పాను." గుమస్త తండ్రికి కోపం వచ్చిందన్న సంగతి పట్టింపులే దన్నట్లుగా అన్నాడు జోగారావు.

పరంధామయ్యకు కోపం మించింది. అసలే చికాకుతో మున్నాడు. "వెధవఫ్రండ్స్! ఫ్రెండ్సట! ఫ్రండ్స్! ఆ చచ్చువెధవలతోకూడే .... యిలా తయారయ్యావ్! దరిద్రుడా! రేపటి తరువాత బ్రతకడం ఎలారా దేముడా అనే భయంలేదేం నీడికి! దరిద్రగొట్టు వెధవ. లోపలికెళ్లు! లోపలి కెళ్లరా....."

"అబ్బ నే వెళ్లను ..."

"వెళ్లవూ..."ఒకటి రెండు మూడు....! వరుసగా తగిలాయి జోగారావుకు. అడ్డుపడబోయిన మీనాక్షి కూడా ఆ దెబ్బలరుచి రెండింటివల్ల తెలుసుకుంది. ఏడ్చుకుంటూ వీధిలోకి పారిపోయాడు జోగా రావు. "ఛీ! వెధవా!" అని తిట్టుకుని బొక్కి కుర్చీలో కొంతసేపు కూర్చుని మళ్లీ బజార్లోకి బయలుదేరారు.

త్రోవలో రెండవకూతురు సరోజ ఎదురయి, "నాన్నా! ఒకరి దగ్గర పాతిక రూపాయలు అప్పు తెచ్చాను" అని తండ్రిచేతి కియ్యబోయింది. ఆమె ముఖంలోకి జాలిగా చూశాడు పరంధామయ్య. సరోజ యిప్పుడు పి. యు. సి. చదువుతోంది కాలేజీలో. పాత బట్టలు కట్టుకుంది. ట్యూషన్లు చెబుతూ తన పుస్తకాలు, ఫీజులకు సర్దుకుంటుంది. ఎస్. ఎస్. ఎల్. సి. తో మానేసి ఉద్యోగం చేస్తా నంటే పరంధామయ్యే వప్పుకోలేదు.

తండ్రి తదేకంగా తనకేసి చూడటం గమనించి "నాన్నా" అని తలవంచేసింది కళ్ల నీళ్లు తుడుచు కుని "అమ్మా! నీవు కూడ అప్పులు చేస్తున్నావా?" అని పాతిక రూపాయలు తీసుకొని బయలుదేరాడు. మరొక పాతిక రూపాయలకోసం తిరగరానిచోటంతా తిరిగాడు. అప్పారావు, అనంతరావు, శేషయ్య, శ్రీనివాసం, సీతారామయ్య, వీళ్లందరు యింటి వద్ద దొరక లేదు. ఒకవేళ ఉన్నా యిస్తారో మానుదురో? ఏం చెయ్యడం అనుకుంటో పార్కు బెంచీ మీద కూర్చున్నాడు. రాత్రి ఎనిమిదయ్యింది. ఇంతలో ఆనందరామంగా రొచ్చారు. ప్రాణం లేచి వచ్చినట్లయింది గాని మళ్లీ అడగ బుద్ధికాలేదు. ఆనందరామంగారు వచ్చి బెంచీమీద కూర్చున్నారు. ఆమాట యీమాట మాటాడి చివరకు "నాకు తెలుసు పరంధామయ్యగారు! మీరు అనవసరంగా యిబ్బంది పడకండి! అడగడానికి మొహమాట పడతారెందుకు!" అని ఏభై రూపాయ లిచ్చి వెళ్లారు పరంధామయ్య కృతజ్ఞతతో నమస్క రించాడు.

* * *

మరునాడు వెళ్లిపోయేప్పుడు విజయ తనే కాళ్లకు నమస్కరించి "నాన్నా! మిమ్మల్ని చాల బాధ పెట్టాను! ఆయన యిదే ఆఖరు ఉత్తరం అని రాయకపోతే మరొకసారి బయలుదేరినా మీరు యింత కష్టపడకపోదురు" అని కన్నీళ్లు కార్చింది. ఆమె నోదార్చి స్టేషనుకు దిగబెట్టి ఆఫీసుకు రాబోయేసరికి ఆఫీసరుగారు రమ్మన్నారు ఆత్రు తగా వెళ్లిన పరంధామయ్య ఆఫీసరుగారన్న మాట లకు నీరు గారిపోయాడు. "ఆ ఏభై రూపాయలు యివ్వనవుసరంలేదు లెండి! మూడు రోజులక్రితం మీకు వ్రాయమని యిచ్చిన ఫైలు నే చెప్పినట్టు దిద్దేసి వ్రాయండి మీకు మరో ఏభై ముట్టు తాయి" తాను కొత్తగా ఆఫీసులోకి వచ్చినప్పుడు తన తోటి గుమస్తా "ఆఫీసరు చాల మంచివాడోయ్ తన సుఖం, యితరుల సుఖం కూడా చూస్తాడు" అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి పరంధా మయ్యకు.

'ఎ. సు.'

రాణీ రసమణి

రాణి రసమణి శూద్ర కుటుంబంలో జన్మించి నప్పటికీ ఉచితమైన ప్రవర్తనతో చరిత్ర పుటల్ని అలంకరించింది. కలకత్తా చివరిలో వున్న ఒక కుగ్రామంలో 1793 లో జన్మించింది రాణి. ఇంత హీన జాతి స్త్రీ సంఘంలో మహోన్నత స్థానాన్ని ఆక్రమించుకుంటుందని ఎవరూ కలగని వుండరు.

రామప్రియ, హరేకృష్ణదాసులకు లేకలేక ఒక అమ్మాయి కల్గింది. ఆ అమ్మాయికి 'రాణి' అని పేరు పెట్టాలంది రామప్రియ. "మనం చూస్తే శూద్రులం తిండానికి కూడా లేదు. పొలం పని మన జీవనవృత్తి. ఆ పిల్లకు రాణి పేరేమిటి బొత్తిగా" అన్నాడు హరేకృష్ణదాసు. అయినా ఆ పేరు పెట్టక తప్పలేదు.

ఒకరోజు హఠాత్సంఘటన ఒకటి జరిగింది. ప్రీతిరామ్‌దాస్ కలకత్తాలో పేరు మోసిన వ్యాపారి అతని ఎస్టేట్ మేనేజరు హరేకృష్ణదాస్ దగ్గరికి వచ్చాడు. ఆ రావడమే పెద్ద విశేషం. అతను తీసుకొచ్చిన వార్త యింకా ఆశ్చర్యమైనది.

"ప్రీతిరామ్‌దాస్ గారబ్బాయి రాజచంద్రుడు ఆయన పడవ మీద వ్యాపార రీత్యా ఇటు వెళ్తూ మీ అమ్మాయిని చూశాడట. అతనికి మీ అమ్మాయిని ఇచ్చేందుకు ఏమైనా అభ్యంతరమా?" అన్నాడు.

హరేకృష్ణదాస్ చెవికి ఈ వార్త సోకగానే పొంగిపోయాడు ఇది దేవుడిచ్చిన వరం అనుకున్నాడు

సకల సద్గుణ సంపన్నగా పెరిగిన రాణి రాజచంద్రుడి భార్య అయింది. కొంతకాలానికి ప్రీతిరామ్ దివంగతుడయ్యాడు. రాణితో 20 ఏళ్ల దాంపత్య జీవితం గడిపిన తర్వాత ఒకరోజు రాజచంద్రుడూ కన్నుమూశాడు.

కావలసినన్ని భోగభాగ్యాలు, ఉన్నత స్థితి ఆమెకు అప్పటికే సమకూరాయి. రాణి రసమణి నిజంగా రాణియే అయింది. భర్త పోయేనాటికి ఆమెకు ముగ్గురు ఆడపిల్లలున్నారు. మగపిల్లలు మాత్రం ఎవరూ లేరు. మనవడు మథురనాథుడు ఎస్టేటు వ్యవహారాల్లో సాయం చేస్తూ వుండేవాడు

రసమణికి చిన్నప్పటి నుంచి దైవభక్తి మీద మక్కువ ఎక్కువగా వుండేది. పరోపకారం, దీనజనరక్షణ ఆమెకిప్పుడు పరమావధిగా వుంది. భర్త పోయిన తర్వాత దైవచింత అధికమై మతాన్ని మరింత ప్రేమించజొచ్చింది. మతంతోపాటు మనుషులు ఆమెకు సన్నిహితులయ్యారు. అడిగిన వాళ్ళకు లేదనకుండా దానధర్మాలు చేసింది, మానవ సేవ కోసమే తన జీవితమున్నట్లు సేవ చేసింది. ఆమెకు కాళీపూజ అంటే ప్రాణం. ఆ పూజను ఆమె ఎంతో ఘనంగా జరిపించేది.

ఆమె భవంతిలో మొత్తం 300 గదులుండేవి ఇటువంటి పండుగ దినాల్లో చూడాలి ఆ భవనాన్ని, నిజంగా ఒక పెద్ద తీర్థంలా ఎక్కడ చూచినా ఆనందోత్సాహాలతో కళకళలాడుతూ వుండేది.

రాణి హీనజాతిని ఉద్ధరించేందుకు కంకణం కట్టుకుంది. నిరుపేదల్ని కరుణించేందుకు ఎంతో డబ్బును వెచ్చించింది. సంఘంలో చిన్నచూపుకు గురవుతున్న శూద్రుల్ని సంరక్షించాలని దీక్ష వహించింది. ప్రజలు ఆమెనొక ప్రేమమయిగా, సంఘ సంస్కారిణిగా గుర్తించి నమోవాకా లర్పించుకున్నారు.

అనాడు ఈస్టిండియా కంపెనీ వారి దారుణ కృత్యాలను భరించలేని జాలర్లు రాణికి మొర పెట్టుకున్నారు. ఆమె పేదల్ని కరుణించడానికి ముందు కొచ్చింది. 'డొనాల్డ్' అనే ఆయన ఆమె మీద అభియోగం తీసుకొచ్చాడు రాణి ధర్మనిరతి, త్యాగశీలత ఆమెకు వన్నె తీసుకొచ్చాయి. ఆమె మీద అభియోగం ఎందుకూ కొర గాకుండాపోయింది.

ఒకరోజు రాణి రసమణి భవనం కాపలాదారు కొందరు సైనికుల ముక్కాలు విరగబొడిచాడు. దానితో కంపెనీ పటాలమంతా భవనంలోకి చొరబడి కనిపించిన దానినల్లా ధ్వంసం చేయ నారంభించారు రసమణి చేతకత్తి పుచ్చుకొని ప్రాణాన్ని కూడా లెక్కచేయకుండా పోరాటానికి సిద్ధపడింది అదృష్టవశాత్తు సైనికాధికారులు కలగజేసుకొని ఆ అపకారం కలిగింపలేరు

రసమణి అది నుంచీ అటువంటి సాహసమైన జీవితాన్నే నెరపిందనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి.

పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, యాత్రలు చేస్తూ జీవన శేషాన్ని గడపడానికి ఆమె నిశ్చయించుకున్న సమయంలో ఒక అద్భుతమైన సంఘటన జరిగింది కాళీమాత ఆమె కలలో కనిపించి 'చేసిన యాత్రలు చాలు, పుణ్యకార్యాలు చేస్తూ మిగతా కాలం గడుపు, నాకో ఆలయాన్ని కట్టించి ఇవ్వు, నీకు అండదండలుగా నేను సాయపడుతా'నని చెప్పిందిట.

అంతే, కాశీకి వెళ్లి విశ్వనాథుడ్ని దర్శించాలని ఆయత్తమవుతున్న ఆమె, ఆ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకుంది. కాళీమాత దేవాలయాన్ని నిర్మించడానికి ఇరవై ఎకరాల భూమిని కొని, కొన్నిలక్షలు వెచ్చించి గొప్ప ఆలయాన్ని కట్టించింది. ఈ ప్రాంతాన్నే దక్షిణేశ్వరం అంటారు. ఇది కలకత్తాకు నాలుగు మైళ్ల దూరంలో వుంది.

ఆలయమైతే నిర్మించింది గాని దానికి పూజారిని నియమించడమనేది సమస్య అయిపోయింది. ఒక శూద్ర జాతి వనిత నిర్మించిన ఆలయానికి పూజారిగా వుండేందుకు ఎవరూ ముందుకు రాలేదు. విసుగూ విరామం లేకుండా ప్రయత్నించిన తర్వాత పేరు మోసిన సంస్కృత పండితుడు రామ్‌కుమార్ చటోపాధ్యాయ అందుకు సమ్మతించారు.

ఒకరోజు రాణి మనవడైన మథురనాథుడు ఒక వార్త అమ్మమ్మ చెవిన వేశాడు. అది పూజారిగా వుంటున్నరామ్‌కుమార్ తమ్ముడుగంగాధరుని సంగతి. అతను పనిపాటూ లేకుండా అల్లరి చిల్లరిగా తిరుగుతున్నాడని చెప్పాడు రాణి గంగాధరుడికి కబురంపించి అతన్ని ఎలాగైతేనేం కాళీమాతను అలంకరించే పనికి ఒప్పించింది. గంగాధరుడి మీద రాణికి అంత వాత్సల్యం కలగడానికి కారణం లేకపోలేదు. గంగాధరుడు అల్లరివాడైనప్పటికీ అతని ముఖంలో ఒక వెలుగు వుంది. ఆ వెలుగు అద్వితీయమైంది. పెద్ద మహానుభావుడయ్యే లక్షణాలు అతనిలో ఆమెకు కన్పించాయి. అందుకే ఆమె గంగాధరుణ్ని ప్రేమాత్మకంగా బుజ్జగించింది.

గంగాధరుడు కాళీమాతను పూజిస్తున్నట్లుగా పాట మధ్యలో అందుకుని బిగ్గరగా అరుస్తూ పిచ్చివాడిలా గోల చేసేవాడు. రాణి అనునయించబోయే సరికి అతని చేత చెంపదెబ్బ కూడా తిన్నది. అది చూసిన వాళ్లంతా విస్తుపోయారు. కోపోద్రిక్తులైనారు. గంగాధరుడ్ని అక్కడనుంచి తరిమి వేయమన్నారు. రాణి రసమణి గంగాధరుడ్ని చూసింది, కాళీమాత వైపు చూసింది. ఆమెకేదో వింత అనుభూతి కల్గింది. అంతే, కళ్ళు చెమర్చాయి. తను పొరపాటు చేశానంది. అందుకే అతని రూపంలో కాళీమాత శిక్షించింది, అంతేగాని గంగాధరుడి తప్పు ఏమీ లేదని అక్కడున్న వాళ్లకు సర్ది చెప్పి సంతృప్తి చేసింది

గంగాధరుడు చిద్విలాసంగా నవ్వాడు. అతను సామాన్యుడు కాదు మానవ మాత్రుడు కాడు. దైవాంశ సంభూతుడు అనుకున్నది రాణి రాణి అంతటి మనస్థైర్యంతో ఎలా వున్నదీ అంటే అందుకు ఆ తర్వాతి గంగాధరుడి జీవితం ఎవరు చెప్పక చెబుతుంది. గంగాధరుడే ప్రపంచఖ్యాతి గాంచిన శ్రీరామకృష్ణ పరమహంస.

రామకృష్ణ పరమహంసలోని పరమ రహస్యాన్ని రాణి రసమణి ఎప్పుడో గ్రహించింది. ఆమెకా అజ్ఞ శక్తి వుంది.

రోమన్ రోలాండ్ తన పుస్తకంలో "రామకృష్ణ పరమహంస రెండువందల సంవత్సరాల సంస్కృతికి, ముప్ఫయికోట్ల ప్రజలకు ప్రతిబింబం." అన్నారు.

రామకృష్ణ పరమహంస సమకాలీన అవగ్నిన రాణి రసమణి జీవితం ధన్యమయింది అన్నారు. రాణి రసమణి దైవభక్తి తత్పరతయే రామకృష్ణ పరమహంస ఆవిర్భావానికి కారణం అయివుండవచ్చు. జాతి నీచమైనా నీతి ముఖ్యం, ఆచరణ ఆమోదమైనదిగా వుండాలి అనే సత్యం రాణి రసమణి జీవితం నుంచి నేర్వదగింది.

1861 లో రాణి రసమణి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆమె కోర్కె ప్రకారం దేహాన్ని పవిత్ర గంగాజలంలో వదలడం జరిగింది. ఆ మహాత్మ్ని పరమ పదాన్ని అలంకరించకుండా ఎలా వుంటుంది?

"పవిత్రమైన తల్లీ, నువ్వు కలలో నా కిచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నావు. నీ దర్శనం లభించింది. నేను ఆనందంగా కన్ను మూస్తున్నాను. ఈ శుభ సమయంలో నా కుమార్తెలు, నా బంధువులు, ఆప్తులు, సేవకులు సహచరులు ఎవ్వరూ లేర్వరు. నీ చేతుల్లో వున్న నన్ను చూచి పరమానందం చెందుతారు. ఈ దీపాలన్నింటినీ నామటుకు ఎందుకుంచావు. దేదీప్యమానమైన నీ దర్శనంతో ఇవన్నీ చిన్నబోతున్నాయి తల్లీ."—ఇవి కాళీదేవిని స్మరిస్తూ అన్న రాణి రసమణి తుదివాక్యాలు.

ఆ తర్వాత ఆమె చిరునవ్వు నవ్వింది గంగాజలంలో కలసిపోయినా ఆ చిరునవ్వలాగేవుంది. ●



(సీరియల్)

రంగధామ్

జరిగిన కథ

సత్యమూర్తి, ప్రకాశం చిన్ననాటి స్నేహితులు. చాలాకాలానికి అనుకోకుండా కలిశారు. సత్యమూర్తి ప్రకాశం సుగర్ ఫ్యాక్టరీలో అకౌంటెంటుగా చేరాడు. ఆ చుట్టుప్రక్కల ప్రకాశానికి ఎక్కువ పరపతి వున్నట్టు గ్రహించాడు సత్యమూర్తి. ప్రకాశం, రామదాసుకు సంబంధించిన , డ తెలియని ఒక అమ్మాయికోసం వెదుకుతున్నాడు. ఆమెను వశపరచుకుంటే కావలసినంత ఆస్తి దక్కుతుంది ఆ అమ్మాయి భానుమతి. దామోదరం భానుమతిని మంచిచేసుకోడానికి ప్రయత్నిస్తున్నాడు సత్యమూర్తి, భానుమతి పరస్పరం ఆకర్షించుకున్నారు.

14

భానుమతిని చూడగానే మొదట ఆనందం కలిగినా తరువాత అనేక సందేహాలు ఉత్పన్నమయ్యాయి. ఆమె మాత్రం సత్యమూర్తిని చూడగానే, "మీరా! ఎంతసేపయింది వచ్చి?" అని అడిగింది, చిరు నవ్వుతో.

"ఇప్పుడే వచ్చాను." అన్నాడు కొద్దిగా తత్తర పాటుతో.

"నువ్వు వీరిని ఎరుగుదువా, అమ్మా?" అని స్వామిగారు భానుమతిని ప్రశ్నించారు.

"వారిది రామవరం, ప్రస్తుతం. మా మాష్టా రికీ వీరికీ బాగా పరిచయముంది నిన్న మాష్టా రింట్లోనే వీరి పరిచయ భాగ్యం కలిగింది." అంది భానుమతి.

"అలాగా. అయితే చాలా సంతోషం. రామ వరంలో మీరు చెప్పిన వ్యక్తులు నాకు తెలియదు గాని, మీకు రామదాసు అనే ఆయన తెలుసా?" అని స్వామిగారు సత్యమూర్తిని అడిగారు.

"రామవరంలో నాకు తెలిసినంతవరకూ రామ దాసుగారెవరూ లేరు. కాని ఈ వూళ్లోనే నా స్నేహి తులు ఒకరు రామదాసుగారని ఉండేవారు. మూడే ళ్లకు పైగా అయింది ఆయన చనిపోయి." అని సత్యమూర్తి చెబుతూంటే భానుమతి తెల్లబోయింది. స్వామిగారు కొద్దిగా ఆశ్చర్యపడ్డారు.

"బహుశా ఆ రామదాసూ మా రామదాసూ ఒకరై యుండరు. మా రామదాసు ప్రస్తుతం రామవరంలోనైనా వుంటాడు లేకపోతే, అతని స్నేహితు లెవరైనా వుండి వుంటారు" అని స్వామిగా రన్నారు. భానుమతి ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండడం గమనించి, సత్యమూర్తి తను రావడం ఆమెకు అంత యిష్టంగా లేదేమోనని, వెంటనే లేచి నిల్చున్నాడు.

"మా గోపాలన్ మీ అడ్రసిచ్చి వెళ్లి కలుసుకు రమ్మన్నాడు. వాడేదో పొరపడి వుంటాడు. -మరొక అడ్రసై వుంటుంది వాడు అనుకొన్నది నేను వెళ్లి వస్తాను." అని సత్యమూర్తి అనగానే, భానుమతి పరధ్యానంలోంచి మేల్కొంది. స్వామిగారు, "అదే మిటి అప్పుడే వెళ్తున్నారు?" అన్నారు.

"క్షమించండి. మరి కొద్దిసేపట్లో రైలు వుంది. నేను వెళ్లాలి." అంటూ సత్యమూర్తి ముందుకు సాగుతూంటే, స్వామిగారు, "అయ్యో! కొంచెంసేపయినా మాట్లాడుకోలేదే. అప్పుడే వెళ్తున్నారు. మరొకసారి తప్పకరండి. వచ్చి ఒక పూట మా ఆతిథ్యం స్వీకరించాలి." అన్నారు.

"అలాగే. కృతజ్ఞుణ్ణి." అంటూ సత్యమూర్తి బయటికి వచ్చి చకచక నవడవ సాగాడు అతను కొద్ది దూరం వెళ్లాక వెనుకనుండి, "ఏమండీ!" అన్న పిలుపు వినిపించింది. ఆగి చూశాడు. భాను మతి తన వెనకాలే పరిగెత్తుకు వచ్చింది. "సాయం కాలం మాష్టారింటికి వస్తారా? మీతో కొన్ని విషయాలు మాట్లాడాలి" అంది ఆత్రుతతో

"క్షమించాలి. నేనిప్పుడే వెళ్లిపోతున్నాను." అన్నాడు సత్యమూర్తి.

"అయ్యో!" అంది బాధతో. "పోనీ ఒక్క మాట చెప్పండి. మీకు తెలిసిన రామదాసుగారెలా వుంటారు?"

"రామదాసుగారా? ఆయన మనిషి చాలాపుష్టిగా ఎర్రగా వుండేవారు. ఎప్పుడూ ఖద్దరే కట్టేవారు తల వెంట్రుకలు పొట్టివి. కళ్లు చిన్నవి ......"

"ఆయనే! ఆయనే, మా బాబాయి." అంది భానుమతి కన్నీటి నణుచుకుంటూ సత్యమూర్తికి ఒక్కసారి ప్రపంచం గిర్రున తిరిగినట్లయింది. అంతవరకూ, అసలు రామదాసుగారి ప్రస్తావన ఎందుకు వస్తోందో తెలియక ఆశ్చర్యపడ్డ అతనికి ఒక్కసారిగా విషయమంతా బోధపడింది ఒకేసారి అతనిలో సంతోషం విచారం కూడా కలిగాయి. వెంటనే ఆమెతో మాట్లాడవలసిన విషయాలు చాలా వున్నాయనుకున్నాడు. తామిద్దరూ వీధిలో నున్నామనీ, అది సంభాషణ కనుచితమైన ప్రదేశ మనీ గ్రహించి, వెంటనే ఒక నిర్ణయానికి వచ్చి, "నేనూ మీతో చాలా మాట్లాడాలి. ఇవాళ్టికి నా ప్రయాణం మానుకుంటున్నాను. సాయంకాలం మాష్టారింట్లో కలుసుకుందాం" అన్నాడు. భాను మతికి ప్రాణం లేచివచ్చినట్లైంది. "అలాగే, తప్పక రండి" అంటూ అతను వెళ్లిపోతూంటే చూస్తూ కొద్ది సెకనులు అలా నిలబడి తరువాత వెనక్కితిరిగి ఇంటికి వెళ్లిపోయింది.

సాయంకాలంవరకూ ఇద్దరి మనస్సులూ, తహ తహలాడిపోయాయి, మాట్లాడుకుందుకు. భాను మతి కాలేజీనుండి వచ్చేసరికి సత్యమూర్తి ఉమతో మాట్లాడుతున్నాడు. భానుమతి రాగానే ఉమ ఉత్సాహంతో "మనం చాలా అదృష్టవంతులం. మనకు కావలసిన విషయాలన్నీ సత్యమూర్తిగారి ద్వారా తెలుస్తున్నాయి" అంది.

"అదే నేను అనుకుంటున్నాను. ఇన్నాళ్లకు బాబాయి స్నేహితు లొకర్ని కలుసుకున్నాను. నాకిప్ప టికీ అనుమానం పోలేదు, ఆయన నిజంగా చచ్చి పోయారా?" అని అడిగింది భానుమతి ఉమ ప్రక్కన కూచుంటూ.

"అవును. ఆయన చనిపోయినా నా హృదయంలో అలాగే నిల్చిపోయారు. ఆయన నా కష్టకాలంలో నాకెంతో సహాయంచేశారు. ఆయన చనిపోయే రోజుకు ముందురోజే ఆయన జీవిత చరిత్ర అంతా నాతో చెప్పి తనకొక కూతురుందనీ, ఆమె బాధ్య తను నా కప్పగిస్తున్నాననీ చెప్పారు. నేనొక దుర్మా ర్గుణ్ణి, నీచుణ్ణి, కృతఘ్నుణ్ణి, ఇన్నాళ్లూ ఆమె గురించి ప్రయత్నమే చెయ్యలేదు. అలాంటి స్నేహి తుడికి నాలాటి దుర్మార్గుడియందు ప్రేమాభి మానాలు కలగడంవల్ల, అవి వృథా అయ్యాయి. అదే మరొక ఉత్తముడియందు చూపించివుంటే కొంతైనా ఆయన ఆశయం నెరవేరేదేమో.' అని కండ్లవెంట నీరు కారుస్తూ సత్యమూర్తి అంటూంటే, భానుమతికి కూడా దుఃఖం వచ్చి కండ్లవెంట నీళ్లు కారసాగాయి.

ఉమ తన బాధనణచుకుంటూ, "అలా విచా రించొద్దు. భానుమతి నోదార్చవలసిన మీరే ఇలా విచారిస్తే ఎలా." అంది.

"కాదు ఉమా, నాలాంటి చేతకాని వాళ్లయందు భగవంతుడింత దయనెందుకు చూపిస్తాడో నాకు తెలియదు. మీ అందరి స్నేహానికీ నేననర్హుణ్ణి. రామదాసుగారు కూడా నా విషయంలో మోస పోయారు. నా నుండి ఎంతో ఆశించిన ఆయనకు నేనేమీ ప్రత్యుపకారం చెయ్యలేకపోయాను." అన్నాడు సత్యమూర్తి కళ్లు తుడుచుకుంటూ.

"ఎందుకు చెయ్యటంలేదు ఇప్పుడు తెలుస్తోంది. నెలనెలా మనియార్డర్లు వాళ్ళకు పంపిస్తున్నది మీరేనని" అంది ఉమ

"మని యార్డర్లా? ఎవరికి?"

"ఇంకెవరికి భానుమతికి"

"నేనేమీ మనియార్డర్లు పంపించటం లేదు. అసలు ఈమె ఇక్కడుందన్న సంగతే నాకు తెలియదు. ఏమాత్రం ఈమె విషయం తెలిసినా ఈమెను కలుసుకోకుండా వుండేవాడినా." అన్నాడు సత్యమూర్తి.

"నిజంగానా? మనియార్డరు పంపిస్తున్నది మీరుకాదా? ప్రొద్దుటినుంచీ మీరేననే సంతో షంతో ఉప్పొంగిపోతున్నాను." అంది భానుమతి.

"నేను కాకపోయినా రామదాసుగారి స్నేహితు లెవరో, మీకు మేలుకోరేవారే పంపిస్తున్నారు కదా. అదీ మనం సంతోషించవలసిందే."

"అలా అనుకోలేం. దామోదరం లాటి వ్యక్తులు కూడా దురుద్దేశంతో పంపించవచ్చును" అంది ఉమ.

"దామోదరమా? అతను కాదని మీకెలా తెలుసు?" అని సత్యమూర్తి అడిగాక ఉమ జరిగిన విషయమంతా చెప్పింది. అప్పుడు సత్యమూర్తికి గోపాలన్ తనకా ఎడ్రసిచ్చి వెళ్లమనడానికి కారణ మేమిటో అర్థమైంది. పరిస్థితి ప్రమాదకర మైనదని గ్రహించాడు.

"మనియార్డరు దామోదరం పంపించలేదని తెలిసినప్పుడు నేను చాలా సంతోషించాను. కాని ఇప్పుడు చాలా ఆందోళన కలిగిస్తున్నది, ఈ మని యార్డర్ల వెనుకనున్న రహస్య మేమిటా?యని" అంది భానుమతి ఆలోచిస్తూ

"తను మనియార్డరు పంపిస్తున్నానని అబద్ధం ఆడి అంత సులభంగా దొరికిపోడు దామోదరం. అతని ప్లానులు నేను చాలాసార్లు గమనించాను. అవి భగ్నమైనట్లు కన్పిస్తూ హఠాత్తుగా ఫలి

స్తాయి. అందువలన మనియార్డర్ల విషయంలో దామోదరాన్ని శిక్షించడానికి వీల్లేదు కాని అసలు ఇతను ఇందులో కలుగజేసుకోవడానికి గలకారణం ఏమిటో తెలుసుకోవాలి.'' అన్నాడు సత్యమూర్తి ఆలోచిస్తూ.

''ఏమో, నా మనస్సు నాకు చెప్తోంది, ఈ మనియార్డరు పంపిస్తున్నది అతనుకాదని. ఎవరో మూడేళ్లనుండీ క్రమం తప్పకుండా పంపిస్తున్నారు. దామోదరమే అయితే ఇన్నాళ్ళూ వూరుకుని ఇప్పుడు బయట పడడానికి కారణమేమిటో నాకు నమ్మేరీతిగా సమాధానం దొరుకలేదు'' అంది భానుమతి.

''ఆ విషయాలన్నీ నేను కనుక్కుంటాను. కాని ఈవాళ నా మనస్సు ఎంతో ఆనందంతో నిండి వుంది. రామదాసుగారు తన ఆఖరి రోజున నాతో చెప్పిన మాటలు గుర్తుకు వస్తున్నాయి. తన కుమార్తె బి. ఏ. పాసవాలనీ వివేకవంతురాలు కావాలనీ ఆయన ఆశించారు. అదేవిధంగా జరుగుతున్నందుకు చాలా సంతోషంగా వుంది. ఇలాటి విషయాలని చూసినప్పుడు భగవంతునియందు నమ్మకం కలుగుతుంది. ఏదో ఒక శక్తి, ఆ సత్పురుషుని మనో వాంఛను సిద్ధింపజేస్తోంది.'' అని సత్యమూర్తి అంటూంటే అతని కండ్లలో నీళ్లు నిలిచాయి. భానుమతి అతనిని తదేకదీక్షతో చూసింది.

''అసలు బాబాయికీ మీకూ పరిచయం ఎల ఏర్పడింది?''

''ఆయన మా నాన్నగారి స్నేహితులు. మా నాన్నగారు చనిపోయినప్పుడు నాకెంతో సాయం చేశారు. తరువాత నేను తరుచూ ఆయనను కలుసుకుంటూ వుండేవాడిని. నేనంటే ఆయనకు చాల అభిమానం. అందువలన నా కష్టసుఖాలన్నీ ఆయనతో చెప్పుకునే వాడిని. ఒకనాడు నేను ఆయనను కలుసకోవడానికి వెళ్లేసరికి ఆయన కొక పెద్దగాయం తగిలింది, ఆనాడే, డాక్టరు వచ్చికట్టుకట్టి వెళ్లాడు తరువాత నేను వెళ్లాను. నాతో చాలాసేపుమాట్లాడి తన జీవిత చరిత్ర అంతా తెలిపారు. అప్పుడే తన కొక కూతురుందనీ ఆమె బాధ్యతంతా నాకప్పగిస్తున్నానని చెప్పారు. వివరాలన్నీ తెలియజేస్తూ ఒక కవరులో రాసివుంచి, ఆ కవరు నాకిచ్చారు. కాని దురదృష్ట వశాత్తూ, ఆ కవరు విప్పైనా చూడకుండా, ఎక్కడో పోగొట్టుకున్నాను. అందువలన మీగురించిన విషయాలేమీ తెలియవు. మర్నాడు ఆయనను కలుసుకుందామని వెళ్లేసరికి ఎవరో ఆయనను దారుణంగా హత్యచేశారు.'' అని సత్యమూర్తి చెప్పగానే, ఉమా, భానుమతీ, ఒక్కసారిగా, ''హత్యా?''అని అరచారు. సత్యమూర్తి తలూపాడు.

''గుండెపోటువలన మరణించారని దామోదరం చెప్పాడే?'' అని భానుమతి బాధతో ప్రశ్నించింది.

''జరిగిన విషయాన్ని దాచడంలో దామోదరానికి ఏదో ప్రయోజనం వుండవచ్చు. కాని జరిగింది హత్యే ఆ సందర్భంలో దాశినాయుడనే ఒకవ్యక్తిని అనుమానించి అరెస్టుచేసి చాల కాలం విచారించి, వాడి మీద కేసు రుజువుకాక, చివరికి వాడిని వదిలేశారు. వాడిని వదిలెయ్యడంలో, ప్రకాశం, దామోదరాల ప్రమేయంకూడావుంది.''

''ఎంత దారుణం!'' అని భానుమతి తనమొహాన్ని రెండు చేతులలోనూ కప్పుకుని ఏడ్చేసింది. ఉమ ఆమె ననునయించ సాగింది. ఆ దృశ్యం చూడగానే సత్యమూర్తిలో ఏవో లోతులు కదలసాగాయి. అతనిలో అనేక సంవత్సరాలుగా ఎటూ తేలక, సంధిగ్దావస్థలో ఉన్న ఎన్నో భావాలకు ఒక రూపం ఏర్పడసాగింది. తను ఇంతవరకు దేని గురించి, భీతి సంకోచాలవలన, ప్రపంచంలోని చెడుని ఎదుర్కోడానికి సంసిద్ధుడు కాలేక బాధపడేవాడో, ఆ తెర తొలిగిపోసాగింది. తన కెదురుగా కూర్చుని దుఃఖములో మునిగివున్న ఆ అమ్మాయి, తన జీవితానికి ఏదో నూతన అర్థం తెలిపినట్లైంది. ఆమెను చూసిన దగ్గర్నుండీ తానొక విపరీతమైన ఆకర్షణకు లోనయ్యాడు. ఇప్పుడామె తనకు చాలా సన్నిహితురాలైంది. ఇక ఆమె బాధ్యతను స్వీకరించడంతో ఎంతమాత్రం వెనుకంజ వెయ్యనవసరంలేదు. తనలో కూడా కొంత ప్రతిభా, సామర్థ్యాలున్నాయనీ, అవి వినియోగించవలసిన అవసరం వచ్చిందనీ అనిపించింది.

''జరిగి పోయినదానికి విచారించి ప్రయోజనం లేదు. ప్రస్తుతం మన కర్తవ్యం ఏమిటోమనం నెరవేర్చవలసి వుంటుంది ఆయన హత్యకు కారకులెవరో తెలుసుకుని వాళ్లకు తగిన శిక్ష పడేటట్లు చెయ్యడం అవసరం.''



"దానివలన ప్రయోజనం ఏముంది.? పోయిన వాళ్ళు తిరిగిరారుకదా. అందుకోసం మరొకప్రాణిని కూడా దుఃఖ పెట్టడం ఎందుకు" అంది భానుమతి మెల్లగా.

"అలా అనుకునే ఈ మూడేళ్ళూ నేను ఊరుకున్నాను. కాని ఇప్పుడు తెలుస్తోంది. అటువంటి పనినాలా అవసరం అని. దానివలన జరిగిపోయింది మారక పోయినా, జరుగనున్నది మారుతుంది". అన్నాడు కొద్దిగా ఆవేశంతో సత్యమూర్తి.

"అంటే?" అని భానుమతి ప్రశ్నించింది.

"వాళ్ల దుర్మార్గం ఆ హత్యాకాండతో ముగిసిపోలేదు. మిమ్మల్ని కూడా ఏదోవిధంగా నాశనం చెయ్యాలని చూస్తున్నారు. అందుకే దామోదరం మీగురించి ఇంత శ్రద్ధచూపిస్తున్నాడు. తనకొడుకుకి మిమ్మల్నిచ్చి వివాహం చెయ్యాలనుకోవడంలో ఏదో అంతరార్థంవుంది. అందువల్ల ఏదో ఒక గొప్ప ప్రయోజనం వుంటేగాని అటువంటి పనికతను పూనుకోడు. ఇప్పటినుండే మన జాగ్రత్తలో మనం వుండడమే కాక, వాళ్లనుకూడా ఒక కంటకనిపెట్టాలి. ఇందుకు తగిన ఉపాయం నేనాలోచిస్తాను."

అంతవరకూ మౌనంగా వున్న ఉమ, "అలాగయితే ప్రస్తుతంతో వాళ్లతో విరోధం తెచ్చుకుని లాభంలేదు." అంది.

"అవును వైరం వల్ల ఉద్రేకాలు పెరగడం తప్ప వేరే ప్రయోజనం వుండదు మన పనులన్నీ పూర్తయ్యేదాకా మనం అవతలి వారిలో ఉద్రేకాలకు అవకాశం ఇవ్వక పోవడమే ఉత్తమం. దామోదరం మళ్లీ మిమ్మల్ని కలుసుకునేటప్పుడు, మీరు మీ మనో

సుప్రభాతం

భావాల్ని ఎంత మాత్రం తెలియనియ్యకుండా ప్రవర్తించండి. ఈలోగా రామవరంలో వీళ్ల వుద్దేశాల్ని కొంతవరకు కనుక్కుంటాను. మళ్లీ నాలుగైదురోజులలో వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను."

"సరే. మీరు చెప్పినట్లే చేస్తాను" అంది భానుమతి

"ఇకనేనువెళ్ళి, మరొక అరగంటలో వున్న రైలందుకుంటాను" అని సత్యమూర్తి లేచి, వాళ్ల దగ్గర సెలవుతీసుకుని వెళ్లిపోయాడు.

ఉమా, భానుమతులు చాలా సేపు మౌనంగా ఉండి, చివరకు కొంచెంసేపు మాట్లాడుకున్నాక భానుమతి బరువైన హృదయంతో తన యింటికి బయల్దేరింది.

* * *

కుమార స్వామికి రామవరంలో ఉంటున్నకొద్దీ చాలా ఆశ్చర్యం, విచారం, వెగటూ కలుగ సాగాయి. ముఖ్యంగా వ్యక్తులలోని మూర్ఖత్వం అతనికి విచారం, కోపం తెప్పించింది. వీళ్ళకి తమకు తాము స్వయంగా ఆలోచించగల శక్తిగాని, అలా ఆలోచించాలనే అభిప్రాయంగాని వున్నట్లు కనిపించదు. జీవితపు విలువల గురించి వాళ్ళకసలే తెలియదు. పల్లెటూళ్లలో మధ్యతరగతి కుటుంబాలు తక్కువగా వుంటాయి. కొద్ది ధనిక కుటుంబాలూ, ఎక్కువ బీదకుటుంబాలు ఉంటాయి. ఊరికి వర్తక ప్రాధాన్యం హెచ్చిన కొద్దీ వర్తకులయొక్క సంఖ్యా వర్తకం మీద ఆధారపడే వారి సంఖ్యా ఎక్కువవుతుంది. కాని చదువూ, సంస్కారం కలిగిన వ్యక్తులరుదై పోతారు.

తనవద్దకు తరచూ వచ్చే వారిలో సుబ్బయ్యగారూ, సూర్యం, ప్రొఫెసరు గోపాలరావూ ముఖ్యులు. సుబ్బయ్యగారి ధోరణి అంతా వర్తక ప్రధానంగా వుంటుంది. ప్రొఫెసరు గోపాలరావుగారు చాలా విచిత్రవ్యక్తి. ఆయన చెప్పేవి చాలావరకూ డాబులే అయినా, ఆయన చాలావిజ్ఞానం కలవ్యక్తి అనిమాత్రం ఒప్పుకోక తప్పదు. ఒక్కొక్కప్పుడు, సాహిత్యంలోనూ విజ్ఞానశాస్త్రంలోనూ విస్తృతమైన పరిజ్ఞానంతో మాటాడుతారు. ఇంత తెలిసిన వ్యక్తి ఇలా గెందుకు మారాడ? అని ఆశ్చర్యం వేస్తుంది. ఆయనలో మరొకవిశేష మేమంటే, ఎక్కడైనా ఎవరికైనా ఏనిపిసహాయం కావాలంటే వెంటనే అక్కడ హాజరవుతారు. బీదలూ, అనాథలుఅయిన వాళ్లకు కష్టమొస్తే సహాయానికి సిద్ధపడే వ్యక్తులలో ఆయన ఒకరు. ఆయన భార్య మహా సాధ్వి. వాళ్ల జీవితం చాలా వరకు కటిక దరిద్రంలో గడిచినా, ఆమె తనయింటి పరిస్థితి రెండో కంటికి తెలియకుండా గడిపి, ముగ్గురు మగపిల్లల్ని పెంచుకు వచ్చింది. ఇప్పుడు వాళ్ళు పెద్దవాళ్ళయి, ప్రయోజకులయ్యారు. ఈనాటికి తమ కష్టాలు తీరి సుఖపడే రోజొచ్చినా ఆమె అప్పటికీ ఇప్పటికీ ఒకలాగే, గంభీరంగా శాంతంగా వుంటుంది.

ఆరోజు తన జాతకం గురించి కొన్ని విశేషాలు చెపుతున్న గోపాలరావుగార్ని కుమార స్వామి అకస్మాత్తుగా ఒకప్రశ్న వేశాడు.

"జ్యోతిషం నిజమంటారా?"

"నిజమే" అన్నారాయన

"మీరు సైన్టిఫిక్‌గా ఆలోచిస్తారుకదా, జ్యోతిషం అనేది మన భవిష్యత్తును కొన్ని గ్రహాలు నిర్ణయిస్తాయి అంటే ఎలా ఒప్పుకుంటారు?"


"వైజ్ఞానికంగా ఈ గ్రహాలకు మానవులజీవితాల్ని రూపొందించగల శక్తి వుందని నిరూపించవచ్చు. కాని అసలు జ్యోతిషశాస్త్రానికి మూలాధారం విధి యందు నమ్మకం. ప్రతిజీవి కర్మబద్ధమై, అది పుట్టిన సమయాన్నిబట్టి, ఒక నిర్ణీత పథంలో జీవిస్తుంది".


"అయితే మానవుడికి స్వేచ్ఛ లేదని, స్వయంగా తన భవిష్యత్తును రూపొందించుకోలేడని అంటారా?'

"అలాగనను. మానవుడు చెట్టునుంచి రాలిపడే గింజలాటివాడు. ఆగింజ ఏవిధంగా ఎక్కడ పడాలో ముందే విధి నిర్ణయిస్తుంది. కాని కాని అది క్రింద పడే లోపల ఒకపక్షి దానిని తినెయ్యవచ్చు: లేదా వర్షంపడి అది కొట్టుకు పోవచ్చు. జ్యోతిష్యం, ఆగింజకు పక్షికి ప్రాబల్యమధ్యంలో తటస్థపడుతుందని మాత్రం చెప్తుంది. అయితే ఆ పక్షి తినగలదో లేదో చెప్పదు."

"బాగానే వుంది. మనదేశంయొక్క భవిష్యత్తుపై మీ వుద్దేశం ఏమిటి? దేశానికి కూడా జాతకం ఉంటుందనుకుంటా."

"జాతకం సంగతి ఎలావున్నా మనదేశానికి ఉజ్వల భవిష్యత్తువుందని నేను నమ్ముతున్నాను. స్వతంత్రం వచ్చిన దగ్గర్నుంచీ మనదేశం ఎంతో పురోభివృద్ధి చెందింది. ఎన్నో ప్రాజెక్టులూ, పరిశ్రమలూ





అందరితోబాటు ప్రశస్తమైందే మీరూ సేవించండి...

...బ్రూక్ బాండ్ A-1 డస్ట్ టీనే సేవించండి. రుచి, సువాసనలలో సాటిలేనిది. అమూల్యమైంది. ఏమంటే ప్రతి బ్రూక్ బాండ్ A-1 డస్ట్ ప్యాకెట్టూ మీ కెన్నోకప్పుల కమ్మని టీ నిస్తుంది! నేడే మీరూ బ్రూక్ బాండ్ A-1 డస్ట్‌తో ప్రారంభించండి. అసంఖ్యాకులు సేవిస్తున్నారు.

JWTBB-343B

సుప్రభాతం

వచ్చాయి. ప్రజలలో ఎంతో చైతన్యం వచ్చింది"

"మరి అవినీతి, లంచగొండితనంకూడా బాగా విజృంభించాయికదా? ధరలు పెరిగి పోయాయి. పన్నుల భారం ఎక్కువైంది, వ్యాపారంలో 'బ్లాక్ మార్కెట్' మామూలైపోయింది. జనాభా పెరుగుదలకు అంతు లేకుండా వుంది ఇంకా ఇలాటి ఎన్నో లోపాలున్నాయికదా".

"కావచ్చు అవన్నీ సాధారణ సమస్యలే" అని ఒక ముక్కతో కొట్టి పారేశారు గోపాలరావుగారు. ఆయన ప్రభుత్వం యందు ఎంతో విశ్వాసంవుంది ఆయన పదహారణాల కాంగ్రెసువాది. ఇప్పుడు కాంగ్రెసు పార్టీ చేతులో ప్రభుత్వం వుంది కాబట్టి దేశంయొక్క స్థితి సురక్షితంగా వుందని ఆయన నమ్మకం. కాని కాంగ్రెసు పార్టీ ఒక్కటే దేశంలో బలమైనపార్టీ అవడంవల్ల అదొక నిరంకుశ ప్రభుత్వంగా మారగల అవకాశం ఏర్పడుతోందని కుమార స్వామి వాదన. "సాధారణ సమస్యలెలా అవుతాయి దేశంలో ఎంతమంది బీద ప్రజలు ఆకలి మంటలతోనూ, నిరుద్యోగంతోనూ కుమిలి పోతున్నారు! వాళ్లగతేమిటి?" అన్నాడు.

ప్రొఫెసరు గోపాలరావుగారు తన మెల్లకన్నుతో కుమార స్వామి వైపు తీక్షణంగా చూశారు. తరువాత 'సీరియస్' గా మొహంపెట్టి, "మీరొకవిషయం మర్చిపోతున్నారు" అన్నారు. "ఏమిటది?" అన్నట్లు కుమారస్వామి ఆయనవైపు చూశాడు నల్లని ఆయన మొహం కొంచెం వికృత రూపం దాల్చింది

"అసలు మనదేశం ప్రపంచానికి ఎన్ని గొప్ప సందేశాలిచ్చిందో మీకు తెలుసా? గీత, అద్వైత వేదాంతం, మోక్షం, కర్మ, హఠయోగం, సనాతన ధర్మం, సాంఖ్యం, తాంత్రికం, అహింస, కరుణ మొదలైన అద్భుత విషయాల్ని ప్రపంచానికి తెలిపింది మన భారతదేశం మనదేశంయొక్క నిజ స్వరూపం, 'భిక్షాందేహి' అని యాచించే పవిత్ర భిక్షువులోనే చూడగలుగుతారు. ఈ దేశంలో ఏకొద్దిమందో ధనికులుంటే ఉండుగాక కానీ వాళ్లకు ఎంతమాత్రం మనశ్శాంతి లేదు. ఆసేతుహిమాచల పర్యంతం, సాధుసన్యాసులకూ, బీదరికంలోనే శాంతి, తృప్తినీ అనుభవించే అసంఖ్యాక ప్రజలకూ ఆలవాలమైన ఈదేశంలో బీదరికం ఒకసమస్యకాదు అసలుమనం ఇటువంటి జీవితంద్వారానే ఆధ్యాత్మిక విలువల్ని ప్రపంచానికి చాటగలం. మహాత్మాగాంధి గారు మన సనాతన ధర్మాన్ని పునరుద్ధాటిస్తూ, అహింసా మార్గం ద్వారానే రాజకీయ, ఆర్థిక సమస్యల్ని ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఆయన మార్గం ఒక్క ఈ దేశంలోనే కాక అన్ని దేశాలలోను అధిష్ఠింప దగ్గది. నిజానికి మనల్ని ఎదుర్కొంటున్న సమస్యల్లా, మన రాయబారులు విదేశాల్లో ఆధ్యాత్మిక తత్వాన్ని చాటడం మానేసి, పాశ్చాత్య పద్ధతులలో జీవించటం. తద్వారా మనదేశ గౌరవానికి ఎంత హానికలుగుతోందో తెలుసుకోలేకుండ వున్నారు."

"అయితే కొంతమంది సన్యాసుల్నీ, సాధువుల్నీ, మన విదేశరాయబారులుగా నియమిస్తే ఎలావుంటుందంటారు?" అనిఅడిగాడు కుమారస్వామి, మనసులోని వెటకారాన్ని పైకి కన్పించనీయకుండా.

"అద్భుతంగా వుంటుంది. వివేకానందుడు అమెరికాలో ఎంత సంచలనం లేవదీశాడో చూడండి. వేదాంతి కాబట్టే మనరాధాకృష్ణ పండితుడుమాస్కోలో మనరాయబారిగా మనదేశానికి అపూర్వమైన గౌరవ ప్రతిష్ఠలు తెచ్చాడు. మన సనాతన ధర్మాన్ని కాపాడుకోవడంలోనే మనకు గౌరవముంది. గాంధిగారు బోధించినదదే?" అన్నారు. గోపాలరావుగారు, తనబావాన్ని కుమారస్వామి ఒప్పుకున్నాడను కుంటూ.

ఆవేదాంతానికి ఒప్పుకోని కుమారస్వామి, మహాత్మాగాంధి పేరు వినగానే, ఆయనపేరుతో జరుగుతున్న ఘోరకృత్యాన్ని విమర్శించదలచాడు. "మననాయకులు గాంధిమార్గంగురించి చెప్పినంతగా, దాన్ని ఆచరణలో పెడ్తున్నారా?"

"ఎందుకు చెయ్యటంలేదు. మన తటస్థ రాజ్యాంగ విధానంగాని, మద్యపాన నిషేధం గాని చూసినట్లైతే గాంధీమార్గమే గోచరిస్తుంది. వినోబాభావే భూదాన ఉద్యమమెంత జయప్రదమైందో చూడండి. కొందరు వ్యక్తులు అనుసరించలేక పోయినా, క్రమంగా గాంధీ మార్గంలోని విశిష్టత అందరూ గ్రహించగల్గుతారు. మనం పిల్లల్ని ముఖ్యంగా ఆ ఆదర్శాలతో పెంచితే భావి పౌరులుగా వాళ్లు గాంధీ మార్గంలోనే జీవితం గడుపుతారు. నేను మన విద్యావిధానం అంతా 'బేసిక్ ట్రైనింగు' తో జరుగాలనీ, కళాశాలలో గాంధీతత్వం విధిగా బోధించాలనీ అన్ని యూనివర్సిటీలకూ రాశాను. ఢిల్లీవెళ్ళి ఈవిషయం రాధాకృష్ణన్‌తో మాట్లాడ దల్చుకున్నాను."

"ఒక్క మనదేశంలోనేనా, ఇతర దేశాలలోకూడా వ్యాపింపచెయ్య దల్చుకున్నారా?" అన్నాడు కుమార స్వామి ముఖం గంభీరంగా పెట్టి.

"నాకావుద్దేశంకూడా వుంది. దీనికోసం ఒక ప్రత్యేకమైన 'డెలిగేషన్'ను నియమించి, నన్ను నాయకుణ్ని చేసి పంపవలసిందని మన గవర్నమెంటుకు రాసాను. వాళ్లు దాన్ని గురించి ఆలోచిస్తున్నట్లుంది. అంతేకాక కొన్ని దేశాలు ముఖ్యంగా అమెరికా, ఫ్రాన్సు మొదలైన దేశాలకు వెళ్లి గాంధీ మార్గం గురించి లెక్చర్లివ్వడానికి సిద్ధంగావున్నానని ఆయా దేశ రాయబారులకూ, మన ప్రభుత్వానికి కూడా తెలియ బర్చాను"

"వాళ్లకి మీగొప్పతనం తెలుసుండదు లేకపోతే ఈపాటికి మీకెన్నో ఆహ్వానాలు వచ్చివుండేవి.!"


"అదేనేనూ అనుకుంటున్నాను"

"పోనీ ఈవిషయం మన ప్రకాశంగారితో చెప్ప లేక పోయారా? ఆయనకు ప్రభుత్వంలో బోలెడంత పలుకుబడివుందిగా"

"అవును. ఇంతకుముందొకసారి అతనితో చెప్పాను. ఏమవుతుందో కనుక్కోవాలి.వెళ్తాను. జయ్‌హింద్" అంటూలేచి, చేతి కర్ర టకటకలాడించుకుంటూ బయటికి వెళ్లిపోయారు. కుమారస్వామి, చిరునవ్వుతో, ఆఫీసుపని చూసుకోసాగాడు.

(సశేషం)

వైజ్ఞానిక గాథావళి-90



అదృష్టము వెంట ఆరిసితే_

-డా॥ ఆటోలోయెవీ-

-డాక్టర్...

అది 1920వ సంవత్సరము, ఏప్రియల్ నెల ఆస్ట్రియాదేశపు డాక్టరు ఆటోలోయెవీ గభిమని నిద్రలేచి పెన్సలుతో కాగితమువీాద ఏదోరాసు కున్నాడూ మళ్లీ పడుకున్నాడు. తెల్లవారేక అది జ్ఞాపకానికి వచ్చి చూచాడు. ఏమీా అర్థమూ కాలేదూ, జ్ఞాపకమూ కాలేదు మర్నాడు రాత్రి మూడు గంటలకి మళ్లీ మెలకువ వచ్చింది. లేచి ఆలోచిస్తే అది ఒక వైజ్ఞానిక ప్రయోగానికి చక్కని పథకము. 1903లో— అనగా అప్పటికి 17 సంవత్సరాల క్రితము ఆయన ఆలోచిస్తూండిన సమస్యను తీర్చడానికి అది ప్రయోగము! క్రితపు రాత్రి అనుభవాన్నిబట్టి ఆయన దానిని ఎలాగో ఒకలాగు మెళకువతో రాసేనుకునిపడుకోక, తిన్నగా పరిశోధనశాలకివెళ్లి ఆ ప్రయోగానికి ఉపక్రమించాడు. ఫలితము వచ్చిందీ, దానికి తర్వాత తర్వాత 1936 లో నోబెలు బహుమానమూ వచ్చింది!


నరములు అంటే అందరికీ తెలుసు. వాస్తవానికి ఇవి యాగ్జోనులనే సన్నని దారాల కట్టలు. యాగ్జోను అనేది 'క' అనే కేంద్ర కణమూ 'దా' అనే దారమూ 'కొ' అన్న కొసలుతో వుంటుంది 'క'నుంచి నరమునకు సహజమైన ఘాత బయలుదేరి 'కొ' అనే కొసలకు చేరుతుంది. ఈ 'కొ'స ఏదో కండరానికి చేరివుంటుంది ఘాత కండరాన్ని చేరగానే ఆ కండరము ముడుచుకుంటుంది. అంటే ఘాత వచ్చిన పనిని నెరవేరుస్తుంది. క్లుప్తంగా చెప్తే ఇదీ నరము పని చేసే విధానము.

అయితే యాగ్జోను కొసలను సూక్ష్మదర్శినితో చూస్తే ఈకొసలకూ కండరానికి నడుమ చిన్న ఖాళీ కనిపిస్తుంది. యాగ్జోను ఘాత ఈ ఖాళీని ఏ రీతిగా దాటుతుందీ? అన్నది సమస్య అయిపోయింది. నరాల కొసలలో ఏవైనా ద్రవాలు వూరి ఆ ద్రవాల స్పర్శాప్రభావము వల్ల కండరాలు కదుల్తాయా?, లేక, గాల్వనీ చూచినట్లుగా నరాల కొసలనుంచి విద్యుత్తు ఏమేనా ఆఖాళీని దాటి కండరాన్ని కదుపుతుందా?

ఈ సమస్యను తీర్చడానికి పరాసు జీవక్రియా విజ్ఞాని బెర్నార్డ్ కనుక్కున్న విజ్ఞానము పాటుపడింది. ఆయనగారు కప్పకు విషమెక్కించి ... స్తబ్దమైపోయిన కండరము అసలు చచ్చిపోలేదనీ, విద్యుత్ సాధనాలతో వాటిని ప్రేరేపిస్తే అవి పనిచేస్తూనే వున్నాయనీ కనుకున్నాడు. యాగ్జోనుల నుండి కండరాలకు ప్రేరేపణ అందకుండా చేసింది విషము. అంటే నరాల కొసలకూ కండరాలకూ నడుమనుండే ద్రవాలను విరిచేస్తోందన్నమాట. మామూలు పరిస్థితులలో ఈ ద్రవము నరము నుంచి కండరానికి ఘాత అందినవెంటనే విరిగిపోవాలి. లేకపోతే ప్రేరేపణ ఒకసారి కలిగి ఆగిపోక కండరాన్ని పొడుస్తూనే వుంటుంది. ఈ ఆగిపోడానికి కూడా నరాల కొసలలో నిరోధక రసాయనాలు— ఎంజైములేవో ఉండాలను కున్నారు వైజ్ఞానికులు.

ఈదశలో వేశాడు డాక్టర్ లోయెవీ తనకు 'నిద్రమెలకువ'లో తట్టిన ప్రయోగము. అది ఇది: కప్పల గుండెకాయలు శరీరములోంచి తీసేసినా ఆశరీరపు ద్రవాలతో తడుపుతూంటే కొంత కాలము కొట్టుకుంటూనే వుంటాయి. రెండు కప్పల గుండెకాయలు తీశాడూ, ఒకదానికి అందే నరాలు కత్తిరించేశాడు. రెండో దానిలో నిరోధక నరాల్ని విద్యుత్సూత్రకంగా రేపెట్టేడు. నిరోధక నరాలు ఏదో చేశాయీా ఆ గుండె క్రమంగా ఆగిపోయింది. కప్ప శరీరద్రవాలు ఆగుండెలో వున్నాయి. ఇప్పుడు ఈ ద్రవాన్ని కొంత రెండో గుండెలోకి పంపేడు. అదీ నెమ్మదిగా కొట్టుకొంటూ ఆగిపోయింది. దీనికి అందే నరాలు కత్తిరించేశాడు కదూ? దీన్ని ఆపడానికి, నరాలులేవు! ఏది ఆపినదన్నమాటా? "మొదటిగుండె నరాలు దాన్ని ఆపడానికని స్రవించిన ద్రవాలు, కప్పయొక్క శరీర ద్రవాలతో కలిశాయీా, ఆమిశ్రమమును రెండో గుండెలోనికి పంపినప్పుడు ఆ నిరోధిద్రవము రెండో గుండెమీాద పనిచేసి ఆపింది." అన్నాడు లోయెవీ. అయితే ప్రయోగము పూర్తి అయిపోలేదు.! ఇప్పుడు ఆగిన మొదటి గుండెకున్నక్రియా ప్రేరక నరాల్ని విద్యుత్సూత్రకంగానే రేపెట్టాడు. అవి పనిచేశాయీా, ఆగుండె కొట్టుకుంది. పని చేయించే నరాలుక్రియాకారక ద్రవ్యాన్ని స్రవించాలిగదా? ఇప్పుడు ఈ గుండెలోని ద్రవాన్ని రెండో గుండెలోకి పంపేడు ! క్రియాకారక ద్రవమే స్రవించియుండినట్లైతే ఈరెండో గుండె నిరోధక ద్రవముచేత ఆపబడినట్టిది— కొట్టుకోవాలి. కొట్టుకుంది. నరాలు అందని గుండె, కొట్టుకుంటూన్నదేమో నిరోధక ద్రవాల ప్రభావంవల్ల ఆగిందీ, ఆగినది క్రియాకారక ద్రవాలవల్ల కొట్టుకుంది.

ఈద్రవాలు ఏవో చెపితేగాని పరిశోధన పరిపూర్తి కాదు. లోయెవీ స్నేహితుడు హెన్రీడేల్ నిరోధక ద్రవము యాసిటైల్‌కోలీన్ అని చూపించాడూ, యూలర్ అనే విజ్ఞాని, రెండోది నోర్ాడినలీను అన్నాడు ఇక ఈద్రవాన్ని వాడి శరీరంలోని కండరాల్ని కావలసినప్పుడు ఆపి ఆపరేషనులు చేసుకో వచ్చునూ, కండరాలను పని చేయించనూ వచ్చును. ఈ ద్రవాల్ని విరిచే ఎంజైములూ తెలుసుకున్నారు. ఈరసాయనాలు ప్రయోగించి ఒక వూపిరి తిత్తిని తీసేశే ఆపరేషనులు చేశారు. మరి లోయెవీకీ అతని స్నేహితుడు సర్ హెన్రీకీ నోబెలు బహుమానము ఇవ్వడంలో వింతయేమిటి? అదృష్టము లోయెవీ వెంటబడటమే వింత! ●



సీరియల్

రామశాస్త్రి

వి.ఎస్.సుక్తాంకర్

5

[జరిగిన కథ : నిరుపేద కుటుంబంలో జన్మించిన రామ్‌ప్రభూణే తన పద్దెనిమిదవ ఏటదాకా నవుకరు పనిచేసుకుని, తర్వాత కాశీకివెళ్లి 'శాస్త్రి' బిరుదు సంపాదించుకుని స్వగ్రామమయిన మాహూలీకి తిరిగివస్తాడు. తల్లిని మరణశయ్యమీద చూస్తాడు. కాని కొడుకు ఘనతని గురించి తెలుసుకున్న రాధాబాయి సంతృప్తితో ప్రాణాలు వదులుతుంది. ఆతర్వాత రామ్‌శాస్త్రి పాండిత్య ప్రసిద్ధిని గురించి విన్న పీష్వా అతన్ని తన కొడుకు గురువుగా నియమిస్తాడు. పీష్వా అయినతర్వాత శిష్యుడు మాధవరావు అతన్ని మరాఠా సామ్రాజ్యానికి ప్రధాన న్యాయాధిపతిగా నియమిస్తాడు రామ్‌శాస్త్రి ఉన్నత పదవిని ఆక్రమించినప్పటికీ చాలా నిరాడంబరంగా ఉంటాడు. ఒకనాడు పార్వతి గుడిలో పీష్వా మాధవరావు జరుపుతున్న యజ్ఞానికి వెడుతూ దారిలో ఎన్నో దారుణమయిన దృశ్యాలు చూస్తాడు వాటిలో 'వేఠ్—బిగార్' ఒకటి. పీష్వాతో చెప్పి దానిని రద్దు చేయిస్తాడు.]

అది మధ్యాహ్న సమయం. చించ్‌వాడ్ గ్రామంలో చంఫాజీ అనే యువకుడు బుర్రకథలు చెప్తున్నాడు. అతను యోధుడుగానే కాక కవిగా (భట్టాజుగా) కూడా పేరుపొందినవాడు. అయితే చంఫాజీ ఎప్పుడూ మరాఠా వీరుల శౌర్యాన్ని వర్ణించే పాటలు తప్ప కట్టేవాడుకాదు. పాడేవాడుకాదు. తనే పానిపట్‌లో అతి సాహసంగా పోట్లాడి ఎన్నోగాయాలు పొందినవాడు.

—పానిపట్టులో అశువులు బాసిన
మరాఠవీరులు స్వర్గం చేరిరి
సోదరులారా స్వర్గం చేరిరి!
—వారికోసమయి దేవతలంతా
విమానాలనీ పంపారూ
విమానాలనీ పంపారూ!
—విమానాలలో వీరులపయినా
అప్సరలందరు పూలవాననీ
కురిపించారూ, కురిపించారూ!
—ధన్యులహా! ఆ మరాఠవీరులు!
పానిపట్టులో అశువులు బాసిరి
సోదరులారా అశువులు బాసిరి!

అసలు చంఫాజీ గాయకుడు కావటానికి కారణం ఉంది. సేద్యం చేసుకొనటానికి అతనికి స్వంత భూమిలేదు. ఇలా పాటలుపాడి, బుర్రకథలు చెప్పి దేశద్రిమ్మరి అయి పొట్ట పోషించుకుంటున్నాడు. ఆనాడు చించ్‌వాడ్ గ్రామస్థులు అతని పాట వింటామన్నారు కాబట్టి అక్కడే ఆగిపోయాడు.

మర్రిచెట్టు నీడకింద కూర్చుని శ్రావ్యంగా పాడుతున్న అతనిచుట్టూ మూగే జనం సంఖ్య క్రమంగా అధికం కాజొచ్చింది. చివరిదిగా 'పానిపట్ వీరుల' పాట వినిపిస్తున్నాడు.

చంఫాజీ చుట్టూ కూర్చుని ముగ్ధులయిపోయి వింటున్నట్లే అక్కడికి అతి సమీపంలో ఉన్న ఒక ఇంట్లో శ్యామా అనే పదిహేడేళ్ల బానిస యువతి కూడా అతని పాటలు విని వళ్లు మయిమరచిపోతున్నది. 'పానిపట్ వీరుల' వద్దకి వచ్చేసరికి ఆమెలో ఒక విపరీతమయిన ఆవేశం ప్రవేశించింది. తనూ ఆ గుంపులోచేరి ఆ పాడే వ్యక్తిని కళ్లారాచూసి ఆనందించాలనిపించింది. యజమానురాలు భోజనం ముగించి నిద్రపోతోంది. యజమాని గుళ్లో ఏదో పని ఉండటంచేత ఇంట్లో లేడు. చడీ చప్పుడు లేకుండా ఒక బిందె చేతబుచ్చుకుని పిల్లినడకతో ఇల్లువదిలి బయటికి వచ్చింది పక్కనేవున్న నదివైపుకి వెళ్లి, బిందె నింపుకుని ఇంటికి తిరిగి వచ్చేప్పుడు ఆక్షణంలోనే తనకి పాట వినాలనే ఉద్దేశం కలిగినట్లు మర్రిచెట్టు దగ్గరే ఆగిపోయింది. చంఫాజీ గానంలో మునిగిపోయివున్న ఆ గుంపులో కంట తడిపెట్టనివారు లేరు. కాని గాయకుడు శ్యామా హృదయాన్ని దొంగిలించినట్లుగా మాత్రం మరెవరి హృదయాన్నీ వశపరుచుకొనలేదేమో! అందుకనే పాట ముగిసి శ్రోతలందరూ తమ తమ ఇళ్లకి తిరిగి వెళ్ళిపోతూ ఉంటే ఆ బానిసపిల్లమాత్రం ఒక మర్రి ఊడకి ఆనుకుని శిలా ప్రతిమలాగ అలాగే నుంచుని ఉండిపోయింది. తన కళ్లవెంబడి నీరు ధారలుగా చెక్కిళ్లమీద జారిపోతున్న సంగతి శ్యామాకి తెలియనే తెలియదు!

పాడి, పాడి అలిసిపోయి సేద తీర్చుకుంటున్న చంఫాజీ దృష్టి ఆమెమీద పడింది. లేచినుంచుని, ఆమెవైపు జరిగి, "ఎవరమ్మాయి నువ్వు? ఎందుకిలా ఏడుస్తున్నావు?" అని అడిగాడు.

శ్యామా ఈ ప్రశ్నకి ఉలిక్కిపడింది. తను ఒక పెళ్లికాని పిల్ల. అలా బహిరంగ ప్రదేశంలో ఒంటరిగా ఒక అపరిచిత యువకుడితో మాట్లాడుతున్నదనే ఆలోచన రాగానే సిగ్గుతో కుంచించుకుపోయింది. గాబరాగా కళ్లు తుడుచుకుని, పమిటని నిండుగా కప్పుకుంటూ నేలమీద దించిన బిందెని ఎత్తుకుని అక్కడనుంచి వెళ్ళిపోబోయింది. కాని చంఫాజీ మళ్లీ తన మొదటి ప్రశ్ననే వేశాడు. అతని స్వరం దృఢంగా ఉన్నప్పటికీ దాని వెనుక ఉన్న సౌమ్యత్వమూ శ్యామా కాళ్లకి బంధంవేసింది. ఎలాగో తెప్పరిల్లి, వణుకుతున్న పెదిమలతో "నే నొక దిక్కులేని బానిసపిల్లని....అదే మా యజమాని ఇల్లు ...." అని, ఇక చెప్పలేక ఆగిపోయింది.

"నువ్వా! బానిసవా?" చంఫాజీ కంఠస్వరంలో అపనమ్మకమూ, బాధా ప్రతిధ్వనించాయి. "నువ్వసలు బానిస వెలా అయ్యావు?"

శ్యామా సమాధానం చెప్పలేకపోయింది కాని చంఫాజీ ఆమెని వదలలేదు. "నువ్వు బానిస కావటానికి కారణమేమిటి? ఎలా అమ్ముడు పోయావ్" వని గుచ్చి గుచ్చి అడిగాడు.

అతని ఆప్యాయత శ్యామా సంకోచాలని పటాపంచలు చేసింది. ఏడుస్తూ తన కథనంతాచెప్పింది.

శ్యామా తండ్రి ఒక కర్షకుడు. పానిపట్ యుద్ధం వచ్చినప్పుడు సైనికుడుగా చేరాడు. వీర మరణం చెందాడు. భర్త మరణానంతరం శ్యామాతల్లి తమకి ఉన్న పొలం సాగుబడి చెయ్యటం ప్రారంభించింది కాని అనావృష్టివల్ల నేల ఎండిపోయి, వారు తీవ్రమయిన బాధలకి లోనయ్యారు. ఒక ఏడు అనావృష్టికితోడు కరువుకూడా రావటంతో శ్యామా తన కుటుంబంపడే బాధలు చూడలేక తల్లితో తనని బానిసగా అమ్మివేసి అయినా కొంత ధనం సంపాదించుకొనమన్నది. గత్యంతరంలేక శ్యామాతల్లి కూతురుని బజారులో బానిసగా విక్రయించింది. ప్రస్తుతం ఆమె 'మోరభట్' అనే అతని ఇంటి పనిమనిషిగా ఉంటున్నది.

"అయ్యా, కవిగారూ! ఇవాళ మీ పాట వింటున్నప్పుడు యుద్ధంలో పోయిన మా నాన్న గుర్తుకి వచ్చాడు. ఇలా బానిస బతుకు బతుకుతున్న నాకు అమృతం ప్రసాదించినట్లయింది! పెద్దకూతుర్నని మా నాన్న నన్నెంత ప్రేమగా చూసుకునేవాడు.... అదంతా జ్ఞాపకం వచ్చేప్పటికి నాకు ఏడుపు ఆగలేదు......" అని ముగించింది శ్యామా.

చంఫాజీకి మాట పెగల్లేదు శ్యామాని చూడగా చూడగా అతనిలోని ఆవేదనా, ప్రేమా అధికం అయిపోసాగాయి. ఆ సమయంలో మర్రిచెట్టు మీదనుంచి ఒక పావురం ఎగిరివచ్చి చంఫాజీ భుజం మీదవాలి అతని మెడని తన ముక్కుతో పొడవటం ప్రారంభించింది. ఆపక్షి అల్లరి పని చూడగానే శ్యామా విచారం మాయమయింది. కన్నీళ్లలో నుంచి ఆమె చిరునవ్వు వెలిసింది.

"ఇది నా పెంపుడు పావురం— ఈ లోకంలో నాకు మిగిలిన ఏకైకమిత్రుడు!" అని చెప్పాడు చంఫాజీ. "నే నెక్కడికెళ్లినా నావెంటేవస్తుంది. ఎన్నో పావురం పందేలలో గెలిచి నాకు మంచిపేరు తెచ్చిపెట్టింది. అయితే, ఈ పిట్టకి దర్జాజాస్తి! వేరుశనగ, పెసలు, నువ్వులు నాన్చి చేసిన 'చట్నీ' మాత్రమే తింటుంది! ఏనాడయినా ఈ వేళకి తిండిపెట్టకపోయానా, నన్నిలా పొడిచి కోప్పడుతుంది!" (మహారాష్ట్రదేశంలో పావురాల పందేలు చాలారోజులనుంచీ వాడుకలో ఉంటున్నాయి. ఈ పందేలలో పావురాలు ఎంత బాగా ఎగురుతాయన్నదే చూస్తారు— రచయిత.)

ఎన్ని కష్టాలు పడ్డా శ్యామాలో అమాయకత నశించిపోలేదు. "నేనూ చిన్నప్పుడు పావురాలతో ఆడుకునేదాన్ని. వాటికి తినిపించటం అంటే నాకెంతో ఇష్టం! ఏమండీ — ఈ వూళ్లో మీరు ఉన్నన్ని రోజులూ మీ పావురానికి నేను తిండి పెడ్తాను. సరేనా?" అని ప్రాధేయపడుతూ అడిగింది.

"పాపం ఈ అమ్మాయిది ఎంత జాలి గుండె!" అనుకున్నాడు చంఫాజీ. "అమ్మాయి, నువ్వు తిండి పెడ్తానంటున్నావు బాగానే ఉంది కాని నా నేస్తం వట్టి పెంకె! నీ చేత్తో పెడితే తింటుందో

తినదో ఈ పావురం! అయినా ప్రయత్నించి చూడు మూగజీవులకి దేవుడు సూక్ష్మ దృష్టిని ప్రసాదించాడు. అవి తమ స్నేహితులెవరో ఇట్టే కనిపెట్టేస్తాయి. ..." అన్నాడు బయటికి. అంటూ కపోతాన్ని భుజంమీదనుంచి తీసి ఆమె చేతికి ఇచ్చాడు.

శ్యామా విస్ఫారితమోహంతో దాన్ని గుండెలకి హత్తుకుని సంతోషంగా ఇంటివైపు నడిచి వెళ్ళిపోయింది ఒకచేత్తో పావురం, మరొక చేత్తో నడుంమీద బిందెని పెట్టుకుని వయ్యారంగా నడిచి వెళ్ళిపోతున్న శ్యామానిచూస్తూ అలాగే నుంచుని పోయాడు చంపాజీ. "నేనేమీ కలగనటం లేదు కదా!" అనుకున్నాడు.

* * *

పావురానికి శ్యామాతో మంచి స్నేహం ఏర్పడింది. ప్రతి మధ్యాహ్నం భోజనం చెయ్యటానికి శ్యామాదగ్గరికి వెళ్ళిపోయేది. అమ్మాయి, పక్షుల మధ్య స్నేహం కవి, అమ్మాయిలమధ్య స్నేహానికి తోడ్పడింది.

కొన్నిరోజులు గడిచాయి. ఒకనాడు శ్యామా పావురం కాలికి ఒక చిన్న పూమాలకట్టి పంపింది. చంపాజీ సంతోషానికి అంతులేదు. పిట్ట కాలికి చిన్న హారం కట్టిపంపాడు. ఈవిధంగా కపోతం వారి దూత అయిపోయింది! ఈ దౌత్యంకాక వారు శ్యామా నీటికోసం వచ్చే నది గట్టున కూడా కలుసుకునే వారు. ఒకరి కొకరు తమ ప్రేమ వ్యక్తం చేసుకున్నారు చంపాజీ, 'నిన్నెలాగయినా బానిసత్వం నుండి విడిపించి పెళ్లి చేసుకుంటా'నని శ్యామాతో చెప్పేవాడు.

* * *

"శ్యామా నిన్ను విడిపించి పెళ్ళి చేసుకునే రోజు ఇంకెంత దూరంలోనో లేదు చూస్కో!" అన్నాడు చంపాజీ ఒకనాడు ఆమెని నది వద్దన కలిసినప్పుడు "ఇక్కడ సంతలు మొదలవుతున్నాయి. ఈ చుట్టుపక్కల గ్రామాలలో బుర్రకథలు చెప్పమని కబుర్లు వస్తున్నాయి. వీటన్నిటికీ కొంత డబ్బులిస్తారు రెన్నెల్లలో మీ యజమానికి ఇవ్వవలసినంత సంపాదించేస్తాను! రేపు తెల్లవారిజామునే ఈ వూరు వదిలి వెళ్ళిపోతున్నాను"

ఈ మాట విని శ్యామా ఎంతో సంతోషిస్తుం దనుకున్నాడు చంపాజీ కాని, ఆమె కళ్లలో నీరు తిరగటం చూసి ఆశ్చర్యపోయాడు.

"చంపాజీ నన్ను విడిపిస్తానంటున్నావు నిజంగా చాలా మంచిమాటే చెప్పావు! అయినా ఎందుకో నేను కీడు శంకిస్తున్నాను. నువ్వు వెళ్లిపోతున్నావంటే ఇదే పెద్ద కీడనిపిస్తోంది—" శ్యామా గొంతుక గద్గదమయిపోయింది

చంపాజీకి ఏమనాలో తోచలేదు ఇద్దరు మువ్వంగా విడిపోయారు.

శ్యామా, చంపాజీల ప్రణయం వారనుకున్నంత రహస్యంగా ఉండిపోలేదు. దానిని గురించి విన్న మోర్‌భట్, ఆయన భార్య శ్యామాభట్టుతో పారిపోతుందేమోనని అనుమానించారు. మోర్‌భట్ భార్య శ్యామాని హింసించటం ప్రారంభించింది. అంతటితో ఆపక శ్యామాని పూనా నగరానికి తీసుకువెళ్ళి అమ్మివెయ్యమని వేధించటం మొదలుపెట్టింది. ఈ విషయం కాస్తా చంపాజీకి తెలిసింది. మొదట కాస్త తల్లడిల్లిపోయినా, తర్వాత శ్యామాని విడిపించాలనే సంకల్పం మరింత దృఢమయి వీలయినంత ధనం సేకరించటానికి పూనుకున్నాడు. "నువ్వేమీ భయపడకు శ్యామా, నేనున్నానుగా" అని ఆమెని వూరడించేవాడు. "వెలుగుముందు చీకటి సామాన్యమేగా!"


ఇంతలో పావురం ఎగిరివచ్చి శ్యామా భుజం మీదవాలింది "అదిగో మన దూత వచ్చేసింది! నేనే వూళ్ళోవున్నా మనిద్దరికబుర్లా ఒకరికొకరికి తెలియచేస్తుంది! నిన్ను గనక పూనా బజారికి తీసుకువెళ్ళే ధోరణి కనిపిస్తే ఈ పక్షి కాలిచుట్టూ ముళ్ల హారం కట్టిపంపించు! నేనూ పూనాకివచ్చి నీ కొత్త యజమాని కూడా ఎవరో తెలుసుకుంటాను!"

చంపాజీ మాటలు శ్యామాని వూరడిల్ల చేశాయి కన్నీరు తుడుచుకుని చిరునవ్వుతో అతనిని సాగనంపింది.

(సశేషం)



పల్లెటూళ్ళో ఉపాధ్యాయుడు



పరమేశాన్కి పల్లెటూరి పంచాయితీ సమితి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ పదవి లభించటంతో ఎక్కడలేని సంతోషమైంది.

అతడు పుట్టిందీ, పెరిగిందీ, టవున్‌లో. పల్లె పట్టులలో, ప్రశాంత వాతావరణంలో పైరుగాలి పీల్చుకుంటూ అమాయక రైతుల మధ్య వారి పిల్లలకి చదువు నేర్పుతూ గడపాలని మహా వుబలాటంగా వుండే దతడికి.

కాలం గడిచే కొద్దీ టవున్ మీద విసుగెత్తి పల్లెటూరి వైపు మనసు పోసాగింది. దాంతో ఎప్పుడెప్పుడు పల్లెటూర్లో ఉద్యోగం చేసేనా! అంటూ ఆత్రపడ సాగేడు పరమేశం.

ఆ రోజు రానే వచ్చింది. ఆర్డరు తీసుకున్నాడు. పెట్టె, బెడ్డుతో సాయంత్రం బస్సుకే ఎక్కాడు. వూరూపాడూలేని ఓనిర్జన ప్రదేశంలో బస్సు నాపి "దిగండి" అన్నాడు కండక్టరు పరమేశంతో.

పల్లెటూరి గురించి తీయటి వూహల్లో వున్న పరమేశం ఉలిక్కిపడి యీ లోకంలోకి వచ్చిపడ్డాడు బస్సు దిగాడు సామానుతో. అది వెళ్లిపోయింది. తారు రోడ్డుకు ఎడం వేపులో బళ్ల రస్తా వుంది. ఆ దారంట 6 మైళ్ళు నడిస్తే ఆ వూరొస్తుంది అని కండక్టరు చెప్పాడు.

పరమేశం కాస్సేపు తనతీయటి వూహాలకి ఫుల్ స్టాప్ పెట్టి వాటి స్థానంలో దిగులును ప్రవేశ పెట్టాడు. ఇక్కణ్ణుంచి ఆ పల్లెకు యీ మోతతో చేరట మెలారా భగవంతుడా అని!

అలా ఓ అరగంట బిక్కుబిక్కు మనుకుంటూ గడిచాక ఓ నలభై ఏళ్ళ మనిషి ఇద్దరు 16 ఏళ్ళ కుర్రాళ్ళతో ఆవేపుగా వచ్చాడు. ఆ మనిషి అడిగాడు "ఎక్కడికి పోవాలయ్యా?" అని.

చెప్పాడు పరమేశం.

"ఎందుకూ ఆ వూర్కి?"

"నన్ను టీచరుగా వేశారక్కడ."

"ఏం ఇప్పుడున్నాయన బాగా లేకనా నిన్నేసింది?"

పల్లెటూరి జనం అంటే వినయం, విధేయతా కలవారనీ, చదువుకున్న వాళ్ళంటే చాలా గౌరవిస్తారనీ, ఓ అభిప్రాయ ముండేది పరమేశానికి. కానీ యీ మనిషి మాటల్లో అలాటిదేమీ కనపట్టం లేదు. అయినా మనకిప్పుడు టైం బాగాలేనట్టుంది అనుకున్న పరమేశం మరేం మాట్లాడలేదు.

వాళ్ళు వెళ్ళిపోసాగేరు.

"ఈ పెట్టె పరుపూ కాస్త మనూర్కి చేర్చండి" అంటూ రిక్వెస్టు చేసుకున్నాడు పరమేశం.

దీనికా కుర్రాళ్ళిద్దరూ నవ్వసాగేరు. వాళ్ళ నవ్వుకి అర్థం బోధపళ్లేదు పరమేశానికి.

"మూడు రూపాయలిస్తే మోసుకొస్తాం" అన్నారు కాస్సేపటికి నవ్వాపుకుని.

"ఈ కాస్తకు మూడు రూపాయలేంటి?" పల్లెటూరి వాళ్ళు కాయకష్టానికి ఎన్నడూ వెనుకాడరు. రెక్కల కష్టం చేయటానికి వాళ్ళు డబ్బు పుచ్చుకోరు అన్నది పల్లెవాసుల గురించి అతడు ఏర్పరచుకున్న అభిప్రాయాల్లో ఒకటి.

"మీటవున్న బస్సు మీది నుంచి కింద బెడితే నెత్తిన గొట్టి అర్థరూపాయ తీస్కుంటారు. మా పల్లెటూరోండ్లను చూస్తేనే మీరీ రకంగా మాట్లాడేది" పెద్దమనిషి అసహ్యంగా అన్నాడు.

గత్యంతరంలేదు. సరే అన్నాడు పరమేశం.

ఊళ్లో ప్రవేశించి నేరుగా ప్రెసిడెంటు ఇంటికి వెళ్ళాడు. ఆయన ఊళ్లో లేడు తమ్ముడున్నాడు. పరమేశం పలానా అని తెల్పుకుని "ఈ బి. డి. ఓ. కేం పనిలేకపోతే సరి. బాగా సదువుజెప్పే వాండ్లని ఒక్కచోట వుంచరు. ఎవర్నో దెచ్చి మా మీద దొబ్బుతారు" అంటూ విపరీతమైన చీకాకు కనబరచి మళ్ళా కాస్సేపటికి "టీచరింటి కాడికే పోండి. మాయన్న పొద్దునొస్తాడు" అంటూ తను చదువుతోన్న అపరాధపరిశోధక నవల "మెత్తని కత్తి"తో లీనమైపోయాడు.

పల్లెటూరి గురించి తనూహించుకున్న దానికి బొత్తిగా విరుద్ధంగా వుంది. గాభరాపడ్డాడు పరమేశం. కనీసం కూచోమని కూడా చెప్పటానికి తెలియని మూర్ఖులుంటారని అతడనుకోలేదు. ఎంత ధనముంటే మాత్రం ఇంటి కొచ్చిన ఉద్యోగికి ఆమాత్రం మర్యాద యివ్వక్కర్లా? స్కూలు మాస్టారంటే ఎంతో గౌరవిస్తారనుకొన్న ఆశ అడియాశైపోయింది.

ఉసూరుమంటూ టీచరు బస కొచ్చాడు పరమేశం. దాన్ని చూచేసరికి జ్వర మొచ్చినంత పనైందతనికి. అది ఓ పాడుబడ్డ సత్రం. మూడు సగం పడిపోయిన గదులు. ఒకటి మాత్రం కాస్త నిలబడి వుంది. దానికి కిటికీలకు తలుపులుకానీ, కడ్డీలు కానీ లేవు. అదీ వూరి బయట వుంది.

తడబడుతూ లోని కడుగు పెట్టాడు పరమేశం. వెంట వచ్చినవాడు వెళ్ళిపొయ్యాడు. అప్పుడు టైం ఎనిమిదయ్యుంటుంది. టీచరుగారు వంట ప్రయత్నంలో ఉన్నట్టుంది.

పరమేశం ఆయనకు తన్ను పరిచయం చేసుకున్నాడు. "అరెరె! రండి, రండి! అలా చాప వేసుక్కూచోండి" అంటూ సంతోషంగా ఆహ్వానించాడు టీచరు.

"ఈ పొడు కొంప నుంచి తనకు విముక్తి కల్గించ వచ్చిన వాణ్ణైనా యీ సంతోషం" అనుకున్నాడు పరమేశం. ఏది ఏమైనా ఇంత సేపటికి అతడి ప్రాణం కాస్త కుదుట పడిందనాలి. ఇంత ఆప్యాయత అతడి వూళ్ళో ఇంతవరకూ చూళ్ళేదు.

"భోజనమైందా?"

"ఎక్కడిదండీ, లేదు."

"అయితే ప్రెసిడెంటుగారి తమ్ముడు భోజనాని కుండమన్లేదన్నమాట" ఆశ్చర్యం వెలిబుచ్చాడు టీచరు.

"లేదనుకోండి. అయినా నాకేం ఆకలిగాలేదు. కాఫీ ఏమైనా దొరికే మార్గముంటే చెప్పండి. తల వాచిపోతోంది"

"అప్పుడే అలాగంటే ఎలాగండీ, పల్లెటూళ్ళో యీవాళపుడు కాఫీ ఎక్కణ్ణుంచొస్తుందిగానీ, భోజనమే చేద్దురులెండి ఇంకో చేరెడు బియ్యం వేస్తేసరి" అంటూ అన్నాడాయన

పరమేశం మరేం అనలేదు.

కాస్సేపుండి "ఏమండీ ఇక్కడ ఇళ్ళుదొరకవా" అని అడిగాడు.

"ఎందు కడుగుతావు నాయనా ఇళ్ళ సంగతి! వచ్చిన టీచరు కంతా యీ సత్రమే గతి"

"అంటే యీవూరి పేరిట ఇళ్ళే లేవన్నమాట."

"ఉన్నాయనుకో. వాటిల్లో మనముండలేం."

"ఏం ఎందుకని?"

"ఆ విషయాలు ఇప్పుడు మాట్లాడకూడదు. రాత్రి పడుకునే టప్పుడు నిదానంగా చెబుతాను. ఆ రాజకీయాల గురించి" అన్నాడాయన.

పరమేశానికి ఆయన మాట్లాడే పద్ధతీ, ఆయనా చాలా నచ్చాడు ఆయన మాటలు దెబ్బతిన్న పరమేశానికి తేనెల వూటల్లాగా వున్నాయ్. ఎంతైనా తనూ ఓ ఉద్యోగి కదా అనుకున్నాడు పరమేశం.

ఆవూళ్ళో రెండు పార్టీలున్నాయి. ఒకటి ప్రెసిడెంటు పార్టీ, రెండోది మున్సబు పార్టీ. పంచాయతీ బోర్డు ఎలక్షన్లప్పుడు ప్రెసిడెంటుకు పోటీ చేశాడు మునసబు కొడుకు. అప్పట్నుంచీ ముఠాలు ప్రారంభమయ్యాయి.

ఊరంతా రెండు వర్గాలయ్యాయి. వీళ్ళకంతా అంతంత ద్వేషాలు లేకపోయినా బ్రతకడాని కోసం పైకి అలా వున్నట్లు నటించేవారు. నాయకుల మధ్య మాత్రం పచ్చగడ్డి భగ్గుమంటుంది.

అందుచేత ఉద్యోగులు ఇటు ప్రెసిడెంటుగారి వనుషుల ఇళ్ళల్లో కానీ, అటు మునసబు వర్గీయుల ఇళ్ళల్లో కానీ, ఉండకూడదు. దీని కింకో కారణమూ వుంది. ఇటు వీళ్ళ పిల్లలూ, అటు వాళ్ళ పిల్లలూ ట్యూషనుకొస్తారు సత్రానికైతే. మరెక్కడో వుంటే తామే ఇళ్ళకు వెళ్ళి చెప్పి రావాలి.

ఇన్ని తిరకాసులూ, ఇంత గందరగోళం ఉందనే సరికి పరమేశానికి ఆ పూటసలు నిద్రే రాలేదు. ఉదయాని కంతా పదిరోజుల నుంచీ జ్వరం వస్తున్న వాడిలా మొహం పాలిపోయి వుంది.

ఆరోజు పాత టీచరు వద్ద చార్జి తీసుకుంటున్నాడు. ఒక్కోరిదిప్పుడే చూస్తున్నాడు గోడలకున్న చార్టులు మొదలుకొని కుర్చీలు, బెంచీలు దగ్గర్నుంచీ ఎంచుకుని సంతకాలు పెడుతున్నాడు.

ఓ కుర్చీ ప్రెసిడెంటుగారి ఇంటిలో వుందిట. అందు గురించి తాను సంతకం పెట్టటానికి ఆలోచిస్తుండగా ప్రెసిడెంటుగారే దయచేశారు బళ్ళోకి.

వ్యక్తిని చూస్తూనే కేవలం తన అంగబలం, అర్థబలాలతో ప్రెసిడెంటు అయ్యుంటాడని స్పష్టమవుతుంది. ఐదో తరగతి వరకూ చదువుకున్నాడు.

టీచరు టేబులు మీదే పద్మాసనం వేసు క్కూచుని బీడీ వెలిగించాడు. "ఎందయ్యోయ్! శార్జి ఇస్తుండావా?" అంటూ అడిగాడు.

"అవునండీ యీ రోజే వెళ్ళిపోవాలి నేను."

"మరింత గద్దె ఎందుకు బెట్టుకున్నావ్? ఉండేయన్నీ బళ్ళనే వుంటాయ్. నీవేమన్నా తిన్నావా లేక? ఊరికే సంతకాలు పెట్టించుకోవయ్యా, పైపై పొద్ది బస్సుకి" అన్నాడా మహాత్ముడు.

ఆయనగారి తెలివికి నవ్వాలో, ఏడవాలో అర్థం కాలేదు పరమేశానికి. కాని పాత టీచరు అంతటి సంస్కారహీనుడు కాకపోవటం చేత "అన్నీ సరిగ్గానే వున్నాయ్! మనింట్లో కుర్చీ విషయం చెబుతున్నా" అన్నాడు.

"అవును, వుందిలే కొత్త పంతులూ! నమ్మకం లేకుంటే మా యింటికిరా చూపిస్తా. దాన్ని నేనేసుకోడానికేం పెట్టుకోలేదయ్యోయ్! మీ బి.డి.వో, మీ డి. అయ్యా ఎవరాయనా? ఇట్లాటోళ్ళొస్తారనే తీసుకెళ్ళాను. యీ ఆపీసరొచ్చిన మనింటికే గదా వచ్చేది" అన్నాడు ప్రెసిడెంటు.

ఆయన విగ్రహాన్నీ, ఆయన మాట్లాడే తీరునూ చూచి పరమేశం లాంటి అనుభవంలేని వాడు ఏం మాట్లాడగిలడు?

"సరే ఉండన్లెండి" లన్నాడు జీవంలేని నవ్వు పెదవుల మీదికి రప్పించి.

కాస్సేపటికి చార్జి తీసుకోవటం అయిపోయింది. ప్రెసిడెంటుగారు పిల్లల్నంతా "ఇళ్లకు పొండిరా, యీ పొద్దుకు మీకు "సెలువు" అంటూ ప్రకటించడంతోటే బిల బిల్లాడుతూ వెళ్ళిపొయ్యారు వాళ్ళు.

"రాండయ్యా!" అంటూ పిల్చాడాయన ఇద్దర్నీ.

స్కూలు తాళం వేసి ఆయనింటిక్కదిలారు యిద్దరూ. ఒక రూంలోకి తీసుకెళ్ళి కూచోబెట్టాడు. బండపై విలువైన తివాసీ పరచబడి వుంది. కుర్చీలు వరసగా వేసి వున్నాయి. ఇన్ని కుర్చీలుండగా స్కూలు కుర్చీతో ఏం పనో అర్థం కాలేదు పరమేశానికి. గోడలకు దేశనాయకు లందరి ఫోటోలూ వున్నాయ్. ప్రెసిడెంటుగారు రేడియో పెట్టి ఫేన్ వేశాడు. పేపర్లు ముందు పడేశాడు.

ఇదంతా తన దర్జా ప్రదర్శించుకో గానికి.

కేవలం ఇద్దరు ఎలిమెంటరీ స్కూలు టీచర్లవద్దనా ఆయనలాంటి ధనవంతుడు తన గొప్పను ప్రదర్శించుకోవటం! చాలా ఎబ్బెట్టుగా అనిపించింది పరమేశానికి.

తమకు చేస్తున్నదంతా మర్యాదేనా, లేక మీ హోదాకు మించిన గౌరవం ఇస్తున్నాను. ఇది గుర్తుంచుకోండి అన్న సవాలో అర్థం కాలేదు పరమేశానికి. ముళ్ళ మీద కూచున్నట్టుందతడికి ఎప్పుడెప్పుడు ఇక్కణ్ణుంచి బయటపడి సత్రం చేరి ఇన్ని కాఫీ నీళ్ళు గొంతులో పోసుకుంటానా భగవంతుడా అనుకుంటూండగానే ప్రెసిడెంటుగారి అమ్మాయి లిద్దరూ చెరో టిఫిన్ ప్లేటు పట్టుకుని వచ్చారు. అవి అక్కడుంచి మళ్ళా వెళ్ళి నీళ్ళు తెచ్చి పెట్టి తండ్రి కుర్చీకి అవైపొకరూ, ఈవైపొకరూ నించున్నారు.

"చూడవయ్యా పిల్లల మొహం చూడు! నీ దార్ని నీవు పోతుండావు రాత్రంతా ఒకటే ఏడ్పులు. మాస్టార్ని పోకుండా చెయ్యి నాన్నా అంటూ. నేనేం జేతును. పాపం! నీవూ ఇన్నాళ్ళకి మావూర్కి దగ్గరగా పోతున్నావు. అట్లాంటపుడు అది క్యాంచల్ చేయిస్తే నీ కెంత కొప్పి కలుగుతుందో నాకు తెలుసు. నీ మాదిరి పాఠాలు చెప్పే టీచర్ని మావూళ్ళో ఇంతవరకూ ఎయ్యనేలేదు. ఇప్పుడొచ్చినాయన ఎట్లా చెబుతాడో మరి" అంటూ నవ్వుతూ చూచాడు పరమేశం వైపు.

ఆ మాటలలో సమితిలో తన పలుకుబడి గురించి హెచ్చరికా, పాత టీచర్ని మెచ్చుకోటంలో తను కూడా ఆయన పిల్లల యెడ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనే సూచనా మిళితమై ధ్వనించాయి పరమేశానికి.

"పొట్టకూటికై వూరుకాని వూరు వచ్చి సరైన యిల్లూ వాకిలీ లేక టయాన్కి తిండిలేక చాలీ చాలని జీతాలు తీస్కుంటూ తమ పిల్లలకు చదువు నేర్ప వచ్చిన ఓ ఉపాధ్యాయుడి మీదనా ఈ రాజకీయపు పెత్తనాలు" అనుకున్నాడు పరమేశం.

అంతలోకే కాఫీ తెచ్చారు. అది గొంతుక దిగేసరికి వేడెక్కిన బుర్ర కాస్త చల్లబడినట్లైంది.

టీచరు పిల్లలిద్దర్నీ దగ్గరికి తీసుకొని బుజ్జగించాడు. పరమేశంతో "స్కూలు పైకీ వుషారు వీళ్ళిద్దరూను. కాస్త జాగ్రత్తగా చూచుకో. చెప్పింది చెప్పినట్టు ఆకళించుకోగలరు" అంటూ అన్నాడు.

"ఈ కాలం కుర్రాడులెండి. నాకన్నా బాగానే చెబుతాడు. అందులోనూ కొత్త సర్వీసు కనుక ఎంతైనా భయంతోనే చెబుతాడు." అంటూ ప్రెసిడెంటుకు చెప్పి ఆయన తననిన్నాళ్ళు ఆదరించినందుకు కృతజ్ఞతలు తెల్పుకున్నాడు టీచరు.

అక్కణ్ణుంచి బయల్దేరి సత్రం చేరుకున్నారు. వాకిట్లోనే చుట్ట కాల్చుకుంటూ నుంచుని వున్నాడు మునసబు.

"శానాపలారాలు చేయించినట్టున్నాడే సార్లకోసం పసిడెంటు" అంటూ ఓ విచిత్రమైన నవ్వు నవ్వి "మా ఓదోళ్ళింట్లో ఏదో కల్గింది కొంచెం పెట్టా లనుకున్నాం. లేవండి మరి" అన్నాడాయన.

"తప్పకుండా వస్తాం పదండి" అంటూ ఆయన వెంట కదిలాడు పాత టీచరు. పరమేశం అక్కడే నిల్చుండిపొయ్యాడు. "ఏం కొత్తసారూ! నీవు కూడా రావయ్యా, మా పిల్లలు కొత్త సారుకు బాగా చెప్పు నాయనా మాకు ప్రవేటు చెప్పమని అంటూ నిన్నట్నుంచీ ఒకటే పోరు పెట్టారు" అంటూ మునసబు పరమేశాన్ని కూడా ఆహ్వానించాడు.

అక్కడా ఏదో పెట్టారు వాళ్ళు. అక్కడ ఆడవాండ్లే వచ్చి పాతటీచరుతో ఆయన పోతున్నందుకు తమ గాఢసంతాపాన్ని వెలిబుచ్చారు. 'మాపిల్లలు మీరంటే ప్రాణం పెట్టేవాండ్లు. మీనుంచే వాళ్ళకు రెండుముక్కలొచ్చాయి మీరు పోతున్నారు. ఇక ఏమవుతారో' అన్నారు. ఆడవాళ్ళు అబలలు కనుక వాళ్ళకు వాక్కు గట్టిగా ఇచ్చాడు భగవంతుడు. ఇలా వాగ్బాణాలతో వారు ఎంతైనా చెయ్యగలరు. వాళ్ళు అనే ప్రతిమాటా పరమేశానికి సూటిగా తగులుతూనే వుంది.

"ఏమైతుందిలేవే. కొత్తసారు మన పిల్లలకీ

ప్రశ్నవేటు చెప్పడా? నీందిట్లా మాట్లాడ్తావ్?" అన్నాడు మునసబు.

"అయ్యో దానికేముందండీ! ఎందుకు చెప్పనూ? బడి విడుస్తూనే నాకంత కన్నా పనేముంది గనకా" అన్నాడు పరమేశం.

ఆ ఒక్క మాటతోటే ఆడవాళ్ళ మొహాలు చేటెడయ్యాయి. మళ్ళా ఓసారి వడ్డించారు వద్దంటున్నా వినకుండా.

ఎన్నివిధాల లొంగ తీస్తున్నారురా భగవంతుడా! వీళ్ళ ఎత్తుల్నుంచి తప్పించుకోటం ఎలా? అనుకోపోగాడు పరమేశం.


ఆరోజు సాయంత్రానికి తన సామానుతోసహా వెళ్ళిపొయ్యాడు పాత టీచరు.

ఆయన వెళ్ళిపోతోంటే ఎన్నో ఏళ్ళ ప్రాణ స్నేహితుడు వెళ్ళిపోతున్నంత దుఃఖం కల్గింది పరమేశానికి. ఇంత కుళ్ళు, కుతంత్రంగల కొంపలో ఆ మహానుభావుడు ఏకబిగిని మూడేళ్ళు ఎలా నెట్టుకొచ్చాడో! ఎంత మెత్తని మనసు కలవాడు పాపం! ఈ వూరును చూచినప్పట్నుంచీ లావాలా కుతకుత

పల్లెటూళ్ళో బడిపంతులు

వుడికిపోతున్న తన మనసుపై ఆయన మాటలూ, ఉపదేశాలూ వన్నీటి జల్లులై ఎంతటి రిలీఫ్ నిచ్చాయి!

అధైర్యంతో అడుగంటిపోయిన ఆశతో తను ఇక్కడ ఉద్యోగం చెయ్యగలనా అని భయపడిపోయి బాధపడుతోంటే ఆయనన్నాడు "నీవింకా చిన్నవాడివి. నల్లనివి నీళ్ళనీ, తెల్లనివి పాలనీ మాత్రమే అనుకొంటూావు. నల్లనివి నీళ్ళు కాదనీ, తెల్లనివి పాలు కాక సున్నపు తేట అని గ్రహించిన రోజున క్రుంగిపోతావు అది పురుష లక్షణం కాదు. అందుకే మనస్సును అధీనంలో వుంచుకోవాలి. మనిషిని చూచి మనిషి భయపడాల్సింది లేదు ధనం అధికారం చూచి అంతకంటె భీతి చెందకూడదు. ఎవరి కెంత మర్యాద ఇవ్వాలో అంత తప్పకుండా యివ్వాలి. మన హితం కోరేవాండ్లకు తప్పక భయపడాలి. నీలో తప్పుల్లేకుంటే ఎవరి మాటా పడవల్సిన పనిలేదు ధైర్యంగా నిల్చి పోట్లాడే శక్తి వుంటే పోట్లాడు. లేనిపక్షంలో



ఎదుటివాణ్ణి వుబ్బించు. కాకాపట్టు. ఎవడినైతే నీవు పలుకరిస్తావో వాడికే నీవు అంత ప్రత్యేక మర్యాద చేస్తున్నట్టు నటించు. దాంతో వాడు నీకు చేసే సహాయాలు ఎన్నో వుంటాయ్. రోజూ వాడింటి నుంచి కాఫీ మొదలుకొని కూరా నారా వరకూ నీ ఇంటి కొచ్చి పడతాయి. నీతో మాట్లాడందే వాడికి గడవదు. నన్ను నీ యెదుట మెచ్చుకున్నా రందరూ. పొయ్యేవాణ్ణి మెచ్చుకోటం మామూలే. నాలో లేని గొప్పలు చెప్పారు వాళ్ళు. నీవు ఇంకా శ్రద్ధగా పని చేయాలని వాళ్ళ మాటల సారాంశం." అంటూ హితోక్తులూ, ధైర్యోక్తులూ చెప్పేటప్పటికి పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. పోయిన ఆశల్ని కూడదీసుకున్నాడు. హాయిగా గాలి పీల్చుకున్నాడు.

ఆ క్షణంలో గీతామృతాన్ని బోధించిన కృష్ణ పరమాత్మలా కనిపించా డాయన పరమేశానికి. సజల నయనాలతో ఆయన్ను బస్సెక్కించాడు.

"పిచ్చివాడా ఏం భయపడకు. ఇంకా పెళ్ళీ, పిల్లలూఏంలేని వాడివి. నీకేం దిగులయ్యా మాలాంటి వాళ్ళమే ధైర్యంతో వుండగా. మరేం ఫర్వాలేదు. కర్తవ్యపాలనలో ఏమాత్రం అశ్రద్ధ చూపొద్దు. పిల్లల్ని బాగా చూచుకో." మని భుజం తట్టి మరో సారి ధైర్యం చెప్పాడాయన.

ఒంటరిగా బండిలో వూరికి తిరిగి వచ్చేశాడు పరమేశం.

సత్రం ఖాళీగా పాడుబడ్డ స్మశానంలా అవుపించింది.


"దీపం కూడా లేదు. రాత్రికి, ఎలాగో" అనుకుంటూ వుండగా ప్రెసిడెంటుగారి అమ్మాయిలిద్దరూ వచ్చారు పాలేర్ను తీసుకొని. బహుశా ట్యూషనుకు కాబోలు. పాలేరు చేతిలో లాంతరుంది.

పరమేశం సంతోషంగా పిల్చాడు పిల్లలిద్దర్నీ. ఈ ఒంటరి సత్రంలో శూన్యమైన మనస్సుతో, పరిపరి విధాల పోతున్న తన ఆలోచనల్ని అరికట్టాలంటే యీ ముగ్ధ బాలికలకు ఏదో చెప్పటం చాలా మంచిది. వాళ్ళు ఇప్పుడు కేవలం తన ఒంటరితనాన్ని పోగొట్టటానికి వచ్చిన స్నేహితుల్లా కనిపించారతడికి. వాళ్ళ రాక అతడి కత్యంత ఆనందకరమైంది. ఆ చిన్న లాంతరే అప్పుడతడికి కాంతివంతమైన అరుణ కిరణంలా కనిపించింది.

"కూర్చోండి" అంటూ వాళ్ళ పుస్తకాలు తీసుకొని అన్నీ పరిశీలించి ఓ గంటసేపు పాఠం చెప్పాడు. ఆ గంటా వేరే ధ్యాస లేదతడికి. అతడు పాఠం చెప్పే విధానానికి పసిపిల్లలిద్దరూ నాగస్వరం విన్న నాగులే అయ్యారు. ఆ ఒక్కరోజులోనే వాళ్ళ చిన్నారి హృదయాల్లో కొత్త టీచరుకో గౌరవస్థానం ఏర్పడిపోయింది.

ప్రెసిడెంటుగారి ఇంటి నుంచే క్యారియర్ వచ్చింది. పిల్లలిద్దరూ నమస్తే చెప్పి వెళ్ళిపోయారు.

భోజనం క్యారియర్‌ను చూసిన పరమేశం "ఫరవాలేదు తనోరకంగా ఉపాయంగా వుంటే యీ వూళ్ళో బాగానే గడుస్తుంది" అనుకున్నాడు. దానికితోడు పాతటీచరు చెప్పిన హితోక్తులు "ఎదుటి వాణ్ణి నీ మాటలతో వుబ్బించు. దాంతో వాడు నీకు చేసే సహాయాలు అనంతం" అన్న మాటలు జ్ఞప్తి కొచ్చి ఫక్కున నవ్వుకున్నాడు. ఒకవిధమైన హుషారు కలిగింది. చింతా, గింతా వదిలేసి సుష్టుగా భోంచేశాడు.




చదువుల్లో మొనగాడు
ఆటల్లో మొనగాడు
పెరిగి పెద్దవాడౌతున్నాడు

అతడి సైకిలు ఫిలిప్స

ఫిలిప్స దిట్టంగా ఉంటుంది ఎంత వేగం తొక్కినా తట్టుకొనేటట్టు మంచి ట్రూ టెంపరు స్టీలుతో తయారైంది. దాని అంద చందాలు గంభీరత కూడా మీ సంస్కృతిని బాగా తెలియజేస్తాయి. మీవంటి యువకులకు తయారుచేయబడిన విశిష్టమైన బైసికిలు.

(ఫిలిప్స మీరు వాడదగిన సైకిల్)



®

జె ఎ ఫిలిప్స కంపెనీ లిమిటెడ్ యు.కె. వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కులు. ఇండియాలో తయారుచేయువారు: టిఐ సైకిల్స ఆఫ్ ఇండియా, అంబత్తూరు, మద్రాసు-53 ప్రొప్రైటర్లు ట్యూబ్ ఇన్‌వెస్ట్‌మెంట్స ఆఫ్ ఇండియా లిమిటెడ్, మద్రాసు-1 ఉపయోగించుటకు రిజిష్టరు కావింపబడినవి.

tic-p-3819a

® ఫిలిప్స

పల్లెటూళ్ళో బడిపంతులు

మర్నాడు ఆదివారం బడి లేదు. ఆరోజు ఉదయాన్నే పూరికి వెళ్ళి వంటపాత్రలు, స్టౌ, మొదలైనవి పట్టుకొచ్చాడు సాయంత్రం బస్సుకే.

అతడు పూరికి పోతాడు అని తెల్సి ప్రెసిడెంటుగారు వచ్చేటప్పుడు బ్యాటరీ సెల్సు తెమ్మనీ, మున్సబుగారు కాఫీపొడి తెమ్మనీ, ఆయన భార్యగారు ఏవో ప్లాస్టిక్ దారాలు తెమ్మనీ ఫర్మానాలు పంపేరు.

ఇవి తను డబ్బు పెట్టి తెస్తే తిరిగి వస్తుందా రాదా? అని ఆలోచించాడు పరమేశం.

"ఏది ఏమైనా కానీ, ముందు తేవడమే మంచిది ఎలాగో మంచిగా వసూలు చేసుకోవాలి తర్వాత. అంతగా ఇవ్వకపోయినా ఫరవాలేదు వాళ్ళు రోజూ రెండు పూటలా ఎవరో ఒకరు కాఫీ ఇస్తున్నారు. పప్పు, చారు, పచ్చడి లాంటివి తను అసలు వండటమే లేదు. ఇవన్నీ పూరికే వస్తాయా? ఈ విధంగానైనా ఆ ఋణం తీర్చుకున్నట్టు వుతుంది" అనుకుని తెచ్చాడు పరమేశం.

తను సత్రం వాకిలి తెరుస్తోండగానే వచ్చాడు ప్రెసిడెంటుగారి మనిషి బ్యాటరీ సెల్సు కోసం. వాడక్కడ వుండగానే మునసబుగారు వచ్చారు కాఫీపొడి కోసం. మునసబుగారికి కాఫీపొడి చేతిలో పెట్టి "కాఫీపొడి ధర చాలా పెరిగిపోయిందండీ, యీమధ్య, మూడు రూపాయలకు పౌనుండేది మూడున్నరైంది" అన్నాడు.

ప్రెసిడెంటుగారి పాలేరు అక్కడే వున్నందున వెంటనే మూడున్నరా, రంగు దారాల డబ్బా యిచ్చి వేశాడు మున్సబు.

మళ్ళా వాడు వినాలి అనేట్లుగా "అవేమిటయ్యోయ్, సెల్సులు గూడా తెచ్చినట్లున్నావే. ఎంత ఇవి? డబ్బిచ్చారా? ఇంతకూ ఎవరికి?" అంటూ అడిగాడు.

"ప్రెసిడెంటుగారి కండీ, రెండు రూపాయలు. డబ్బులు ముట్టాయిలెండి" అంటూ ఓ చిన్న అబద్ధం ఆడాడు.

మునసబు వెళ్ళిపొయ్యాడు. ప్రెసిడెంటుగారి, పాలేరు వెళ్ళిపోయి ఐదు నిముషాల్లో తిరిగొచ్చి రెండురూపాయలు చేతిలోపెట్టి "అయ్యగారు నిన్ను శానా మెచ్చుకున్నారు సారో" అన్నాడు.

పరమేశం చిన్నగా నవ్వుతున్నాడు.

కొద్దిరోజుల్లో ఇట్లా వుపాయంగా నెట్టుకుంటూ రావటంలో కాస్త అనుభవం సంపాదించాడు పరమేశం. మొత్తానికి రోజులు సుఖంగానే వెళ్ళిపోతూన్నాయి.

ఓ రోజు స్కూల్లో హాజరు వెయ్యటం పూర్తి చేసి పాఠం మొదలెట్టాడు ఇంతలోనే ఎవరో వచ్చి "మావోడు కాపి తాగొస్తాడు పంపియ్యి సారూ" అన్నాడు.

"స్కూలు టైంలో ఏమిటయ్యా కాఫీ వెళ్ళు. టైమయిందిలే వస్తాడు"

"యాఁ పంపియ్యి సారూ! మావుంత తాగి అణ్ణిడిస్తే ఎట్లా సారూ పిల్లోడు. దారా, కాపి తాగొత్తుదా!" అంటూ విడవకుండా పట్టుపట్టాడామనిషి.

"ఈ పల్లెల్లో కూడా కాఫీ ఎంతగా అలవాటైపోయిందిరా!" అంటూ నిట్టూర్చి "వెళ్ళిరా ఎవుడూ వెళ్ళు. పాపం నీవు కాఫీ తాగలేదనివీరోనాన్న బెంగెట్టుకున్నాడు" అంటూ వాణ్ణి పంపేశాడు పరమేశం.

మళ్ళా పాఠం మొదలెట్టి చెబుతోండగా నలుగురు పిల్లలు ఓ పిల్లవాణ్ణి చేతులూ, కాళ్ళూ పట్టుకుని ఎత్తుకొచ్చారు బడిలోకి. వాడికి 16 ఏళ్ళుంటాయి. ముతక అంగీ, నిక్కరూ చెమట గబ్బు కొడుతున్నాయి. బోడిగుండు. భుజానికి చద్దిమూటా, చేలు కోలు వున్నాయి.

పరమేశం అడిగాడు "ఏమిట్రా తిమ్మన్నా! ఏమిటీ వేషం? బడికి రాకుండా ఎక్కడికి పోతున్నావ్?"

"పసుల్ని తోల్కపోతుంటే మావుంత పోయి కాళ్ళు సేతులు పట్టుకొని మోసుకొచ్చిందాం సార్. మమ్మల్ని గిచ్చిండు సార్ కాట్లు బడేటట్లు" అంటూ నలుగురూ ఫిర్యాదు చేశారు.

"లేదు సార్! బడి కొస్తుంటి సార్ బుక్కులు దీస్కని. దావలో రొడ్డిగారింటి కాడ రొడ్డి పెళ్ళి 'యిలే తిమ్మిగా! నవారిగాడు యీయాల పసుల గాయనికి రాలా. నువ్వు తోలుకపోదుదా' అంటే తోలుకపోండా సార్."

"నేను బడికి వెళ్ళాలి అని చెప్పలేకపొయ్యావ్?"

"చెప్పితి సార్! 'నయ్యాల బడికి పోతాడంట బడికి. ఎందు కశా నీకు సదువు. ఆ బుక్కులాడ బెట్టి సద్ది దీస్కనిపో పసులెంట. రేపట్నుంచీ పోదువు బడికి' అంటని తిట్టిండు సార్."

"అలాగా అయితే వెళ్ళు పశువులు చాలా దూరం వెళ్ళి వుంటాయ్" అంటూ వాడిని పంపేసి గాఢంగా నిట్టూర్చాడు పరమేశం. దీనికి విరుగుడు చెయ్యాలి. విద్య యొక్క ప్రయోజనాలు అందరికీ తెలుపటం టీచరునైన నా విధి. ముందు విద్య అంటే ఏమిటో తల్లిదండ్రులు తెల్సుకున్నపుడే తమ పిల్లలకి అది వచ్చేట్లు శ్రద్ధ చూపగలరు. ముందు వాళ్ళని పట్టి చూడాలి." అని నిర్ణయించుకున్నాడు పరమేశం.

ఆరోజు సత్రంలో ఒంటరిగా వున్నాడు. రామయ్యనే ఓ రైతు వచ్చాడు. అతడు అప్పుడప్పుడు అలా వచ్చి పోతూంటాడు. పరమేశం దగ్గరికి.

"ఏం రామయ్యా బాగున్నావా?"

"ఆ బాగుండాలే సారూ! కాస్త అగ్గిపెట్టెల్లా, పారెయ్యి" అని యిప్పించుకుని బీడీ వెలిగించుకున్నాడు.

"మీ అబ్బాయిని మధ్య సరిగా బడికి పంపవు ఏంచేత?"

"అదొక్కటే తక్కువైంది నాకు. యాలకింత కూటి గావాల్సిన గింజలు తెచ్చుకోడానికే కష్టపడుతోంటే ఇంగ సదువెక్కడ సెప్పిస్తుం?"

"ఇక్కడ చదువు కేమీ ఖర్చులేదే?"

"ఈ వూరి సదువుకే నౌక రొస్తదా? మళ్ళా ఎస్సెల్సి వరకూ సదవాల. అప్పుడు గదా!"

"అయితే ఇక్కడ చదివిన చదువు వల్ల లాభమే లేదంటావ్?"

"గుడ్డి గవ్వ లాభం లేదంటాను."

"జాబులు చదువుకో వచ్చు, రాయచ్చు గదా?"

"మా యట్లాంటి యదవలకి యాజాబూ రాదు"

"నిన్ను నీవే వెధవ అనుకుంటున్నావ్. అది నా తప్పు నీ తండ్రి నీవు ఏం బ్రతుకుతున్నావు కదా!"

"అయినా మామూలే లోకువ అందర్కీ."

"ఎందుకంటావ్?"

"మేం మోటు ముండాకొడుకులమని."

"మీరు మోటువాళ్లెట్లా అయ్యారు?"

ఈ సంభాషణ జరుగుతోండగా ఇంకో నలుగురు రైతులు అప్పుడే వచ్చి నిశ్శబ్దంగా పరమేశం చెప్పేది ఆలకించసాగేరు.

"ఆ రెండచ్చరాలు రానందుకు మామూ మోటోళ్లమైనాం."

"అలా చెప్పు బాగుంది. నీకెలాగూ చదువు రాలేదు. నీ కొడుకునైనా ఎందుకు చదువుకో నియ్యవు. రేప్పొద్దున అదృష్టం బాగుండి వాడు బాగా చదివి ఓ పెద్ద వుద్యోగం చేయొచ్చు. ఎవరు చూడొచ్చారు? మన కేంద్రమంత్రి సంజీవయ్యగారు, మీ వూరి లాంటి అతిసామాన్య గ్రామంలో పేదల ఇంట్లో పుట్టి కష్టపడి బాగా చదువుకోవడంవల్ల దేశానికే ఏలిక అయ్యాడా లేదా చెప్పు?"

"అవును సారూ, అయ్యాడు. ఎవర్కీ అసుంటి అదృష్టం పట్టేది."

"ధూ వూరోక్కేశా, సారు చెప్పేది వూర్తిగా యును. చెప్పు సాధూ నువ్వు' అన్నారు మిగిలిన నలుగురూ.

"మీకేవైనా జాబులొస్తే పని వదులుకొని చదువు వచ్చిన వాడిని వెతుక్కుంటూ పోవాలి. అలాగే జాబు రాయించుకొనేటపుడూ వెతుక్కోవాలి. ఇందువల్ల ఆ రాసిన వాడికి నీ రహస్యాలన్నీ తెలుస్తాయి. తర్వాత మీరంతా పన్ను కడ్తుంటారు కదా?"

"ఏంది ఒక్క పన్నుగాదు. భూంపన్ను, నీళ్ల పన్ను, బెటర్‌మెంటు పన్ను ఇట్లా ఏందేందో పెద్దన్ని పన్నులుతీసి మమ్మల్ను సంపేస్తుండారు." అని ఒక రనగానే ఇంకొక రందుకుని "అవునశా ఏందీంటయిదీ? మొన్న మొన్న మూన్నెల్లు కాలేదే పన్ను కోసరమని నా బర్రెను యాలం మేసి కట్టుకున్నాడు కాదూ్కన. (రెవిన్యూ ఇన్‌స్పెక్టరు) మళ్ళా యీ పొద్దొచ్చిండు. ఏందిది?" అంటూ వాపోయాడు.

"అలా ఎప్పటికీ వసూలు చెయ్యరు. మీరు టైముకి సరిగ్గా చెల్లించక ఆలస్యంచేసి వుంటారు. మళ్ళా వెంటనే కట్టాలొచ్చేసరికి మీకు కోపమొచ్చింది. అందుకే చదువొచ్చి వుంటే ఆయనిచ్చిన రశీదుల్లో ఫలానా ఏటికింతా అని వుంటుంది చదువుకోవచ్చు గదా!"

'అది రానందుకే గీ తిప్పలు. అసువంటపుడు మోసం జేసినా మాకు దిక్కేముంది?"

"అట్లా నెక్కడైనా జరిగితే జరగవచ్చునను కోండి. అందుకేనయ్యా మీ పిల్లలనైనా చదువుకో నివ్వండి. విద్య ఒకరు దోచుకుపోలేని ధనం. ఒకరికిస్తే తరగకపోగా ఇంకా పెరుగుతుంది. పదిమందిలో గౌరవాన్ని పెంచి పేరును తెచ్చే పెన్నిధి విద్య. విద్య వుంటే నలుగురిలో తలెత్తుకుని ధైర్యంగా మాట్లాడగలం విద్య లేనివాడు వింత పశువు. విద్యలేని మొద్దు కదలలేని యెద్దు ఒకటేనని మీరు వినలేదా? అంచేత కనీసం ఇక్కడ ఉచితంగా లభించే చదువైనా మీ పిల్లలకి చెప్పించండి. పెద్దయ్యాక వాళ్ళూ మీలాగే అవస్థలు పడకుండా కాస్త అక్షర జ్ఞానం కల్గించండి. మీ పిల్లలకు చదువు నేర్పడానికోసమే ప్రభుత్వం మాకు జీతాలిచ్చి పెట్టింది. మేం వూరికే జీతాలు తీసుకొంటూ వుంటే చూస్తూ వూరుకుంటారా మీరు? మీరు వూరికే వున్నా నేను అలా వుండలేను. చెప్పండి మీ పిల్లల్ను పంపుతారా లేదా?" పరమేశం ఆవేశంగా మాట్లాడ సాగేడు.

అతడి మాటలకు విస్తుపొయ్యారు అక్కడున్న ఐదుగురూ. ఏమిటింత చిన్నవయసులో పని మీదయితడి కింత శ్రద్ధ అనిపించింది వాళ్ళకి. ఆయన చెప్పిందానికైనా తమ పిల్లల్ను తప్పక పంపాలి బడికి. లేకపోతే ఆయన మనస్సు నొచ్చుకుంటాడు అనే అభిప్రాయాని కొచ్చారు. 'చదువు వల్ల లాభం కూడా వుందని చెప్పాడాయె అందుతోనూ. సరే నష్టమేముంది. పంపుదాం' అనుకున్నారు. ఆమాటే చెప్పారు.

ఇప్పుడు బడి పిల్లల్తో కిటకిటలాడిపోతూ వుంది. గ్రామస్థుల కంతా పరమేశం కావల్సిన వాడయ్యాడు. అతడి మంచితనం మల్లెపూల సౌరభంలా అనతికాలంలోనే బహుదూరం వ్యాపించింది

ప్రెసిడెంటుగార్కి, అతడి సలహా తీసుకోంది పంచాయతీ పనులేవీ తోచవు. మునసబుకు అతడితో రోజుకో సారైనా మాట్లాడందే ఏమీ చెయ్య బుద్ధికాదు.

దీనికంతా పరమేశం చాలా కృషి చేశాడు. ఎవరికి తగినట్లు వాళ్ళను పాలిష్ చేశాడు. ఉబ్బించాడు. పొగడ్తలతో ఆకాశానికెత్తెయ్యటం నేర్చుకున్నాడు. వాళ్లొస్తారని 2 మంచి పేకు కుర్చీలు తెచ్చి స్వతంతో వేశాడు ఆ నెల ప్రైవేట్ల జీతాలు అందుటంతోటే.


వాటిని చూచారు గ్రామపెద్దలు. "మీలాంటి పెద్దలొస్తారని" అంటూ వినయంగా చెప్పాడు. ముగ్ధులయ్యారు పెద్దలు. "పాతయ్యవార్కి యీ మాత్రం మర్యాదే తెల్సేదికాదు. నిలబడే మాట్లాడి పోతుంటిమి" అన్నారు.

ప్రెసిడెంటువచ్చి మాట్లాడుతోంటే మునసబు వచ్చేవాడు. "సారూ!" అంటూ బయట్నుంచే కేకేసేవాడు. పరమేశం "వస్తున్నానండీ" అంటూ ఓ కుర్చీ తీసుకెళ్ళి వరండాలో వేసి అక్కడే అతడితో మాట్లాడేవాడు లోనికి పిలవకుండా.

మునసబును బయటనే కూచో బెట్టినందుకు ప్రెసిడెంటుకు సంతోషం. తను వచ్చేపాటికి లోనుంచి కుర్చీ మోసుకొచ్చి వేసినందుకు మునసబుకు ఆనందం

ఇట్లా ఉపాయంగా వాళ్ళ ఎత్తుల్ని చిత్తు చేసి తన విధి నిర్వహణలో ఏమాత్రం ఏమరకుండా నెట్టుకొస్తున్నాడు పరమేశం.

"పరిస్థితుల్ని ధైర్యంగా ఎదుర్కోవడంలోనే నిజమైన ఆనందముంది ఉపాయమనేది వుంటే నెగ్గుకు వూర్లేలొచ్చు" స్వానుభవంతో గ్రహించిన సత్యాన్ని తల్చుకుంటూ చిన్నగా నవ్వుకున్నాడు పల్లెటూరు బడిపంతులు పరమేశం! ●




25 సంవత్సరాలుగా పేరు మోసింది
Asha
FACE POWDER
SNOW
సోలు డిస్ట్రిబ్యూటర్లు :
జె. ఎల్. మోరిసన్
సన్ & జోన్స్
(ఇండియా) ప్రైవేట్ లి.
బొంబాయి, ఢిల్లీ,
మద్రాసు, కాన్పూరు,
కలకత్తా.
Unique-A-1
ఆశా స్నో, ఫేస్ పౌడర్, కుంకుం, కాజల్ తదితర సౌందర్య సాధనాలు

▣ (క) కెమేరాలు, బైనాక్యులర్లు మెడకు తగిలించుకుని, ముగ్గురు వ్యక్తులు ఒక పట్టణంలో పెద్ద హోటలుకి వెళ్లేరు. వాళ్లని చూడగానే విహారార్థం వచ్చిన పరదేశులని తెలిసిపోతోంది. తమ ముగ్గురికీ మూడు మంచాలున్న పెద్ద గది ఒకటి కావాలన్నారు. హోటలు యజమాని గదుల "లిస్టు" చూచి, "నాలుగో అంతస్థులో 16 వ గది ఖాళీగా ఉంది. రోజుకి 30 రూపాయలు అవుతుంది." అన్నాడు.

నౌకరు కుర్రవాడు వాళ్లని నాలుగో అంతస్థుకి "లిఫ్టు" మీద తీసుకు వెళ్లి, 16 వ నెంబరు గది చూపించాడు. శుభ్రమైన గాలి, వెలుతురు, మంచాలు, పరుపులు, గదిని ఆనుకునే స్నానాలగది— దివ్యంగా ఉంది. వాళ్లకి బాగా నచ్చింది. ముగ్గురూ పర్సులు తీసి, తలొక పదిరూపాయలనోటు ఆ నౌకరు కుర్రవాడికి అందించారు. ఎవరి ఖర్చు వారిదే అని వాళ్లు ముందరే నిర్ణయించుకున్నారు.

నౌకరు హోటలు యజమాని దగ్గరకు వెళ్లి 30 రూపాయలూ అందించాడు. అంతలో యజమాని నాలుక కరుచుకున్నాడు. తాను చిన్న పొరబాటు చేశానని గ్రహించాడు. ఆ గదికి అద్దె రోజుకి 25 రూ. లు మాత్రమే. పొరబాటున 30 రూ. లు అనేశాడు. అతడు సత్యకాలపు



మనిషికనుక ఐదు విడి రూపాయినోట్లు తీసి, నౌకరుకి ఇచ్చి, ఆ పరదేశులకు తిరిగి ఇచ్చివేయమన్నాడు.

ఆ డబ్బు తిరిగి ఇవ్వడానికి పైకి ఎక్కి వస్తూవుండగా ఆ నౌకరుకి మెరుపులా అద్భుతమైన ఆలోచన వచ్చింది. "పాపం! ఐదు రూపాయలను ముగ్గురు సమంగా ఎల్లా పంచుకుంటారూ?" అనుకున్నాడు. అది సాధ్యంకాని పని అని వెంటనే గ్రహించేశాడు. ఒక నయాపైస నీకు ఎక్కువ వచ్చిందంటే నీకు ఎక్కువ వచ్చిందని తన్నుకుంటారో ఏమో. పట్టి పుణ్యానికి ఆ పాపం తనకి చుట్టుకుంటుంది. పోనీ, వాళ్లు ముగ్గురికీ తలో రూపాయీ ఇచ్చేసి, మిగిలిన రెండూ తనజేబులో వేసుకుంటే ఏమవుతుంది? అసలు వాళ్లకి గది అసలు కిరాయి ఎల్లాగూ తెలియదు. ఒక్కరూపాయి తిరిగి వచ్చినా రావడమేనని సంతోషిస్తారు. చూడగా చూడగా అదే ఉత్తమమైన పద్ధతి అనితోచింది. వెంటనే గప్‌చుప్‌గా రెండు రూపాయినోట్లు తన జేబులో దాచేశాడు. ఆ ముగ్గురు పరదేశులకీ ఒక్కొక్క రూపాయి తిరిగి ఇచ్చేశాడు.

ఇంతవరకూ బాగానే వుంది. ఆ పరదేశులకి ఏ అనుమానమూ రాలేదు కాని, నాకే పెద్ద సందేహము పట్టుకుంది. అదేమిటో వేస్తా ఉండండి.

ఆ పరదేశులు ముందర మూడు పదులు ముప్పై



రూపాయలు ఇచ్చారు. 3 రూపాయలు తిరిగి వచ్చాయి. అంటే 27 రూపాయలు ఇచ్చినట్లు అయింది. 2 రూపాయలు నౌకరు కుర్రాడు కాజేశాడు. $27+2=29$ రూ. లు లెక్క తేలింది మరి ఆ ముప్ఫయ్యో రూపాయి ఏమైపోయినట్లు?

మీ కెవరికైనా చేతనైతే— ఆఖరికి అంజనం వేసి అయినాసరే— ఆ ముప్ఫయ్యోరూపాయి ఎక్కడ ఉందో వెతికి పెడతారుకదూ?

(చ) మాయమైన మరో రూపాయి

ఇద్దరు ముసలమ్మలు రోడ్డువార పక్కపక్కన కూర్చుని అనాసపళ్లు అమ్ముతున్నారు. ఇద్దరి బుట్టల్లోను చెరో 30 పళ్లూ వున్నాయి ఒక ముసలమ్మ రూపాయికి 2 అనాసపళ్లు అమ్ముతోంది రెండవ అమ్మి దగ్గర పళ్లు కాస్త చిన్నవి కనుక రూపాయికి 3 చొప్పున అమ్ముతోంది. అమ్మకం బాగానేసాగింది. సాయంకాలం అయేసరికి ఇద్దరి గంపలూ ఖాళీ అయాయి. మొదటి ముసలమ్మకి 15 రూ. లు, రెండవ అమ్మికి 10 రూ లు వచ్చాయి.

మరునాడు ఇద్దరూ మళ్లీ అటువంటివే అనాస పళ్లు చెరో ముప్ఫయ్యీ తీసుకువచ్చారు అమ్మడానికి. ఇద్దరూ ఒకేచోట కూర్చుని అమ్మడం వల్ల అనవసరమైన పోటీయే కాని ఉపయోగం లేదని ఇద్దరూ గ్రహించారు కాని, ఆ చోటు విడిచి మరోచోట అమ్ముకోవడం వారిలో ఎవ్వరికీ ఇష్టంలేదు. ఆఖరికి వారిద్దరూ ఒకవిధమైన సంధికి ఒప్పుకున్నారు. అవి ముప్ఫై ఇవి ముప్ఫై మొత్తం అరవైపళ్లు కలిపెయ్యడం. ఒకరకం రూపాయికి రెండు, రెండవరకం రూపాయికి మూడు కనుక, ఇప్పుడు 2 రూపాయలకు 5 పళ్లు చొప్పున అమ్మడం. చిట్టచివరికి ఎవరికి రావలసిన వాటా వారు తీసుకుపోవడం. ఈ ఒప్పందం బేషుగ్గా ఉందనుకున్నారు. వెంటనే అమలు జరిపేశారు.

ఆ రోజునకూడా అమ్మకం బాగానే జరిగింది. సాయంకాలం అయేసరికి పళ్లు అన్నీ అమ్ముడైపోయాయి. ఎవరికి రావలసిన డబ్బు వారు తీసుకుని ఇళ్లకు పోదామనుకున్నారు వచ్చిన డబ్బు అంతా లెక్కపెడితే 24 రూపాయలు మాత్రమే ఉన్నాయి!



నిన్నను ఒకరికి 15 రూ, మరొకరికి 10 రూ. మొత్తం 25 రూపాయలు వచ్చాయి కదా, ఈ రోజున 24 మాత్రమే కనబడుతున్నాయే! ఆ ఇరవై ఐదో రూపాయి ఏమైపోయినట్లు? ఎక్కడైనా జారిపడిపోయిందేమోనని ఇద్దరూ తెగ వెతికేరు. ఒకళ్ల నొకళ్లు అనుమానించుకున్నారు ఒకళ్లనొకళ్లు శపించుకుంటూ ఇళ్లకు వెళ్లిపోయారు.

2 రూపాయలకి 5 పళ్లచొప్పున, 60 పళ్లు అమ్మితే 24 రూపాయలు వస్తాయి మరి, నిన్నను వేరువేరుగా అమ్మితే 25 ఎల్లా వచ్చాయి? వేరువేరుగా అమ్మడానికీ, కలిపి అదే ధరకు అమ్మడానికీ భేదం ఏముంది!

(జవాబులు 64 వ పేజీలో)



మబ్బు వీడని ఆకాశం

తిరుపతయ్య



అబ్బబ్బ! ముసురు వెధవ ముసురు. విసుగంతా బజార్లో కుప్పబోసినట్లు ముసురు. చిల్లులు పడ్డ ఆకాశంనుండి చెదరిపడుతున్న ముసురు. ఎడతెగని ముసురు. ఛీ!ఛీ! బురద పాడుబురద. కసువంతా తడిపి రోడ్డుమీద వెదజల్లినట్లు బురద. చినిగిపోయిన భూమి చెదలుపడుతున్నట్లు బురద అంతటా బురద. ముసురు—వెధవ ముసురు. బురద—పాడుబురద.

సందడిగా ఉండే రోడ్డు చప్పబడి పోయింది. కొత్త సినిమా విడుదలై వారం కాలేదు. పదిమంది కన్నా ఎక్కువ లేరు బుకింగ్‌వద్ద. విసుక్కుంటూ, చుట్టలు కాలుస్తూ కూర్చున్నారో చోట— చుడువా వాలా, బరానీవాలాలు హోటల్ ముందు బీడీలు కాలుస్తూ కూర్చున్నారు సప్లైయర్లు. క్యాష్ బాక్స్ వద్ద దిగాలుపడి కూర్చున్నాడు ప్రొప్రయిటర్. గిరాకీలేదని కాలాబజార్ మెంబర్లు, మఫ్లర్‌లు చుట్టుకుని కిళ్లీవాలా దగ్గర బాతాఖానీ చేస్తున్నారు. అందరి చుట్టూ ముసురు.

జనంలేరని, ఖాళీ పోయినా కూనిరాగాలతో విసుక్కుంటోంది సినిమాహాలు. జనం లేరని బొంగురు గొంతుకతో విసుక్కుంటోంది హోటల్ రేడియో. కాలాబజార్ బ్రతుకులూ, కారాఖిళ్లీ బ్రతుకులూ విసుక్కున్నాయి. జనం లేరని ఆనందరావుతోపాటు అతని జేబులోని బ్లేడుముక్కా విసుక్కుంది. ముసురు ముసురు—వెదవ ముసురు విసుగు విసుగు—ముసురు లాంటి విసుగు. ఎడతెగని ముసురులా ఎన్నడూలేని విసుగు.

అటూ ఇటూ పచార్లు చేశాడానందరావు. అణా హోటల్—సింగిల్‌చాయ్ త్రాగేలోగా ఆగుతుందా ముసురు ఆగిపోగానే విరగబడి వస్తారా జనం? వచ్చినవారి జేబుల్లో నిండిన జేబులుంటాయా? పట్టుబడకుండా బ్లేడుముక్క పని చేసుకుంటుందా? రేపు ప్రొద్దున తాను వంద రూపాయలివ్వగలడా? ఛ!ఛ! ప్రశ్నలు. ముసురులాంటి ప్రశ్నలు. తగ్గనే లేదు ముసురు తల ఒగ్గనేలేదు విసుగు. చీదరించుకున్నాడానందరావు మనసులో.

'ఎవరీ ఆనందరావు? ఎందుకింత చీదర?' తనకు తనే ప్రశ్నించుకున్నాడు. తగిన సమాధానం దొరుకలేదు. తీరిగ్గా ఆలోచించుకు విప్పాల్సిన ముడి తొందరపడితే బిగుసుకుపోతుంది. జేబుల్లో చేతులేసుకుని వూగులాడుతూ అద్దెకొంపకు చేరాడు. ఆలోచనల్లో మునిగిపోయిన ఆనందరావు అద్దంలో చూచుకున్నాడు.

*　　*　　*

అతడు.. అక్కడక్కడ చినిగిన తెల్లని ఇస్త్రీ బట్టలు, పాతవైనా పాలిష్ చేసిన బూట్లు, ఆరోగ్యం లేని అందమైన ముఖం, సంస్కారంలేని వంకు వంకుల జుత్తు, పైసా లేనివాడు బాధ పట్టించుకోని రూపం. అతడే ఆనందరావు. తల్లిదండ్రుల కానందం. స్నేహితుల కానందరావు. మేనమామకు తోక లేని నంది. పోలీసుల కానందరావు కే. డి.

"తండ్రిపోయినాసరే మేనమామ ఉండాలట." తల్లీ తండ్రీ పోయినా ఆనందరావుకు మేనమామ ఉన్నాడు. ఉన్నాడు కాబట్టే అతని పంచన చేరాడు. పంచన చేరాడే కాని బాగుపడలేకపోయాడు. బాగుపడలేకపోయినా బాధపడిపోయాడు. బాగుపడ

లేదనికాదు— భాగ్యలక్ష్మి దక్కనందుకు. తను దూరమయ్యాడా? భాగ్యలక్ష్మి దూరమైందా? మేనమామ దూరంచేశాడా? ఇద్దర్నీ దగ్గరకు తేచ్చేవారు లేక దూరమయ్యారా? అబ్బబ్బ! ముసురు లాంటి ఆలోచనలు. ఆలోచిస్తే బాగుపడతానా అనుకున్నాడానందరావు. ఎలా బాగుపడతాడు? ఎందుకు బాగుపడాలి?

ఆనాడు.. తల్లిదండ్రులు మమకారాన్ని జ్ఞాపకముంచకుండా పోయిననాడు— వేలెడులేని తనను, బోలెడులేని తనను, "తండ్రిపోయినా బ్రతికున్న మేనమామ" ఇంటికి తెచ్చాడు. వేలెడు వెధవకింత ఆస్తెందుకని అమ్మేసి— వీడి భాగ్యానికి చదువుకోగలడా? అని ఏడో తరగతితో మాన్పించి, వెట్టి చాకిరీ చేయించుకుంటూ భాగ్యలక్ష్మిని చదివించాడు. పోకిరి మూకల స్నేహం చేసేదాకాచూచి, పోకిరి వెధవకా భాగ్యలక్ష్మినివ్వడమని, కాకి ముక్కుకా దొండపండు తగిలించడమని, కాకి బలగాన్ని ఒప్పించాడు— 'తండ్రిపోయినా బ్రతికున్న మేనమామ.'

ఆనాడే లేని బాగు ఈనాడెలా ఉంటుంది? ఎందుకుండాలి? చెరువు నీళ్ళు వెళ్ళిపోయాక అడ్డుకట్ట ఎందుకో? చేతులే బొబ్బలెక్కాక గుడ్డపేలికలెందుకో? ఎందుకో అనుకున్నాడు కాబట్టే అందుకో లేక పోయాడు. అందుకోలేకపోయాడు కాబట్టే కిందకు దిగి పోయాడు. కిందికేపోయాడు కాని మీదికి రాలేకపోయాడు మీదికి రాలేదు కాని మీదకు తెచ్చుకున్నాడు— బయలు జీవితాన్ని— జైలు జీవితాన్ని

*　　　*　　　*

ముసురు— ముసురు— గాలివిసురు. తగ్గనే లేదింకా. ముసురు విసుగు ముసురు. ఇంట్లోకి వచ్చేస్తోంది ఈదురుగాలి. ముసురు చలి— విసుగు పులి. పక్కమీద వాలాడు పచ్చడం కప్పుకుని. చలిగాలి వెచ్చదనాన్ని కావాలంది. ఏకాంతాన్ని 'ఏకాకీ' అంది ఏకాకి— చీకాకు— చింత. ముసురు లాంటి ఏకాకితనం చీకాకులాంటి ఏకాకితనం. ముసురు— ముసురు— విసుగు ముసురు. ఏం చేశాడని? తనేం చేశాడని!

*　　　*　　　*

ఆరాత్రి......... "ముప్పూటలా మేపలేను నిన్ను. కూర్చుండి తింటే గుట్టలే కరుగుతాయి. ఎద్దులా ఉన్నావు— మొద్దులా ఉన్నావు ఇంతవాడి నింత చేశాను. ఎంత చేయాలింకా? జానెడు పొట్ట పోషించుకోలేనివాడివి, బాన కడుపెందుకు పెంచావు? ఆడపిల్ల గల వాడిని. పరువు ప్రతిష్ఠ గలవాడిని. రెక్కలొచ్చినా ఎగిరిపోని పిట్ట యెందుకురా? ఎగిరిపో. పారిపో. లేకుంటే విలుకాదని", "తండ్రి పోయినా బ్రతికున్న మేనమామ"— ఆవేశంగా ఇంటినుండి గెంటేసిన రాత్రి— మొరిగేవి కరవవులే అనుకుని, తిరిగి తిరిగి అర్ధరాత్రి ఇల్లు చేరితే— అత్తయ్య అన్నంపెట్టిందే కాని కంచాన్ని కాలినుండి తప్పించలేక పోయింది. తిట్లుతింటూ వెక్కివెక్కి ఏడ్చిందే కాని ధైర్యంగా ఎదుర్కోలేకపోయింది.

ఆ రాత్రి... అర్ధరాత్రి.. అసహ్యమూ, అవమానమూ, కోపంతో ఇల్లు విడిచి, పబ్లిక్ పార్కులో పచ్చిక మీద పడుకుంటే బీటు కానిస్టేబిల్ వెళ్ళగొట్టిన చీకటి రాత్రి—రైల్వేస్టేషన్ బెంచీ మీద తలవంచుకు కూర్చున్నాడు. బండి వస్తోందని గంట తమాషాగా చెప్పింది. మండుతున్న కడుపు గరగరలాడింది. మూడు భాషల్లో మాటాడింది స్పీకర్. మనసులో సురసురలాడింది కోపం. గుప్పుగుప్పున వచ్చింది మద్రాస్ మెయిల్. రెపరెపలాడింది నిద్రాణమైన అభిమానం. ఆవేశం అడుగులు వేయించింది. పౌరుషం పరుగులు తీయించింది. పట్టాల మధ్య నుంచున్నాడో లేదో పట్టుకు లాక్కుపోయారు. ఫలితంగా పోలీసు వాని కాపలాలో కటకటాల మధ్య ఉన్నాడు. "తండ్రి పోయినా బ్రతికున్న మేనమామ" విడిపిస్తే.. వద్దు.. వద్దే వద్దనుకున్నాడు. తనకు తానే అనుభవించి విడిపించుకున్నాడు. తెగిపోయింది దారం. పటం గాలిలో పరుగెత్తింది.

*　　　*　　　*

ఎవరూ? తలుపు తట్టిందెవరూ? ఇంత రాత్రి తన దగ్గరికెవరూ? ఒక్క గోపాలం తప్ప కుక్క కూడా రాదే! ఆశ్చర్యంతో చూచాడానందరావు. ఓహో! గాలిగాడు. ముసురు విసురు గాలిగాడు. తలుపు వేయని ఇంట్లోకి తనలాగే వస్తోంది. అబ్బబ్బ! ఈ ముసురింకా తగ్గనేలేదు. ఈ విసురింకా పోలేదు. తలుపు వేసి గొళ్ళెమేసి పడుకున్నాడు— నిద్రలేని ఆనందరావు.

*　　　*　　　*

గోపాలం... ఆపదలో ఆదుకున్న మిత్రుడు కొత్తను పాత చేసిన మిత్రుడు. 'కీప్‌లెఫ్ట్' కాదు రైటే— పేవ్‌మెంటు హడావిడీ పిక్ పాకెటింగ్ లేకుంటే కడుపు మాడి పికెటింగ్. తినగా తినగా వేపాకు తియ్యన అని నేర్పించి తన కోపరేటివ్ సెంటర్లో చేర్చుకున్న మిత్రుడు— రాము డొక్కసారే కట్టలేదు వంతెన. రామునికి కోతులు వంతెననే కట్టాయి. తనకు గోపాలం గంతలు కట్ట నేర్పాడు. కంతలు తవ్వనేర్పాడు. గొంతులు కొయ్యనేర్పాడు. ఫలితంగా 'అత్తవారింటికి' రాకపోకలు పెరిగాయి. సిటీ పోలీస్ కన్నుంచింది. స్టేషన్‌లూ, ఎగ్జిబిషన్లూ ఫోటోలు పెట్టుకున్నాయి. ఎక్కడో ఏదో పోయిందంటే ఇక్కడికో ఎర్రటోపీ. ఎక్కడో ఓ హత్య జరిగితే అక్కడలేనన్న ఋజువు కావాలి. దినదిన గండం నూరేళ్ళాయుష్షు. కష్టాల నెదుర్కొంటే తెలుస్తుంది జీవితంలోని పస. హి.. హి. హి.. నవ్వుకున్నాడానందరావు. నిజంగా తండ్రిపోయినా మేనమామ ఉండాలనుకున్నాడు.

*　　　*　　　*

అదేమిటీ! రోడ్డు మీద విజిల్ చప్పుడా? ఎక్కడేనా మంచి పని జరిగిందాయేమి? కాదుకాదు. కీచురాయి, ముసుర్లో తడిసిపోయిన కీచురాయి. అబ్బా! ఇంకా తగ్గనేలేదు ముసురు. ముసురు— ముసురు వెధవ ముసురు. ఈ ముసుర్లో లోకమెంత మారిపోయిందీ? లోకం తనలాంటిది కాదా? మారుతుందా జీవితం? జీవితముందా మార్పుకు? ప్రస్తుతమే భవిష్యత్తా? ఛ! ఛ! తనింకా బాగుపడడమేమిటి? బాగుపడడమెందుకు? విషాదంగా నవ్వుకున్నాడానందరావు.

పనిని బట్టి వేషం. వేషాన్ని బట్టి మోసం. లాభాన్నిబట్టి బలం. బలాన్ని బట్టి లాభం. జేబులో బ్లేడు ముక్క చిన్న ప్రయోజనం. ఎప్పుడో ప్రమాదం. గళ్ళ లుంగీ, గళ్ళ బనీనూ, రుమాలూ, మసి పూసిన ముఖమూ, నూనె పూసిన శరీరమూ, చేతిలో గునపం, చేతలో సున్నితం, తను పట్టే కన్నం, ఇనప్పెట్టె మారు తాళం. ఇశ్.. నిశ్శబ్దం! నిశ్శబ్దం!

అజాగ్రత్త ముందు జాగ్రత్త. నిద్రసుఖం కెదురు మెలకువ. నిద్రా— మెలకువా. నిద్రను మెలకువ చంపుతుంది మెలకువను నిద్ర చంపుతుంది. ఒకదానిదే పైచేయి. అవసరమొస్తే నిద్రను శాశ్వత నిద్ర చేయాలి. పసిపాపైనా కనుపాపలో నలుసైతే ఖతం చేయాలి. పేదతనమైనా బయటపడే ప్రమాదం వస్తే పీకనూపాలి. దీనత్వమైనా దొరికిపోయే పరిస్థితి వస్తే ఖూనీ చేయాలి. అనుభవంలో సంపాదించుకున్న విజ్ఞాన సారమిది. అలవడిపోయింది ధైర్యం. అయిపోయాయెన్నో. దొరికితే దొంగ. దొరికిందాంట్లో సగం పంచితే దొరికింది దొరికిందిగా, దొరకంది దొరకందిగా ఉంటుంది. ఆనందరావు కన్నుల్లో నీళ్ళు తిరిగాయి. అవి ఆనందభాష్పాలో, దుఃఖాశ్రువులో!

*　　　*　　　*

అయ్యయ్యో! ఈ ముసురింకా తగ్గదా? ఈ విసుగింకా తీరదా? రేపు... వందరూపాయలు కావాలి. ఏభై ఉన్నాయి. ఇంత రాత్రి ఎక్కడ సంపాదించాలి? ఈ ముసుర్లో ఎలా సంపాదించాలి. ఆమె కోసం వంద కావాలి. తనెందుకూ బాధపడడం? పాపం ఆమె కెంత అవసరమున్నాయని! అయితే ఎలా? అబ్బ! చలి. శరీరాన్ని తింటున్న చలి. ముసురు ముసురు— విసుగు— చలిపులి. విలవిలలాడిపోయాడానందరావు.

*　　　*　　　*

మసాలా పట్టించిన మాంసం ముక్కల్ని మునెమ్మ నిప్పుల మీద కాల్చి ఇస్తుంటే, బలరాం పెళ్ళాం మాణిక్యం సారా గ్లాసందిస్తుంటే, గొంతును మండించే సారాయి. గుండెలు పండించే సారాయి. పావు మీద పావు. పెగ్ ఆఫ్టర్ పెగ్. ఏక్... మంచినీ చెడునీ కలుపుకు త్రాగవచ్చు. కుంకుమనూ రక్తాన్నీ మరువవచ్చు. అలాంటి చోటున ఇలాంటి సమయాన్ని గడిపే తాను—ఏదీ—ఎన్నాళ్లయింది వెళ్ళక! ఆమె కలిసినప్పటి నుండి— ఇంత ముసుర్లో ఎలా పోవడం! వద్దులే వేడెక్కిన మెదడు. కళ్ళు మంటలు పుట్టాయి ఆనందరావుకు.

*　　　*　　　*

ఛీ! ఛీ! పాడు ముసురు. ముసురు పోదు, నిద్ర రాదు. విసుగుపోదు, శాంతిలేదు. బలవంతంగా మూసుకున్నాడు కన్నుల్ని. తల నిండా కప్పుకున్నాడు పచ్చడాన్ని. ఒక్క కునుకు—క్షణం కునుకు—మరు క్షణం పైనుండి చినుకు. ఒకటిరెండు మూడు నాలుగు వానచినుకులు. ముసురు తునకలు. లేచి కూర్చున్నా డానందరావు. మంచాన్ని దూరంగా లాక్కున్నాడు. నిండా పచ్చడాన్ని కప్పుకుని కూర్చుని తనను తనే కౌగిలించుకున్నాడు. ఈ రాత్రి ఇంత

ఈ రాత్రే—ఆరాత్రి కాదు—ఆరాత్రి లేదు.

*   *   *

ఆరాత్రి భాగ్యలక్ష్మి దక్కకుండాపోయిందని, ఆమె కన్నుల్లో నీడ చూచుకోలేవని, ఆమె నవ్వుల్లో వెలుగు నోచుకోలేవని, ఆమె హృదయంలో నిద్ర పోలేవని, ఆమె సమక్షంలో మరణించలేవని—"తండ్రి పోయినా బ్రతికున్న మేనమామ" ఇంజనీరుతో భాగ్యలక్ష్మి పెళ్లి చేసి మరీ తెలిపాడు.' బాగుపడని వాడికా భాగ్యలక్ష్మి! ఎలా బాగుపడాలి? ఎందుకు బాగుపడాలింకా?

చికాకుల చీకట్లో చిక్కుకున్న జీవితమని, ఏకాంతపు రాపిడిలో పొగచూరిన జీవితమని, చినిగి పోయి చీకిపోయి చెదలంటిన విస్తరాకు—చెత్తకుండి, ఎంగిలాకు, మురుగు కాల్వ, రొంపిరోడ్డు—ప్రవాహాల మడుగుండం పాలైపోయిన బ్రతుకని, తనకన్నా మునిసిపాలిటీ లైసెన్సులేని కుక్కనయమని, తనకు తాను పిచ్చివాడు, తనకు తాను చచ్చినాడు.

కనకలక్ష్మి కౌగిలిలో చచ్చిపోయి బ్రతికినాడు. స్వర్గంలాంటి నరకంలో, వెన్నెల లాంటి చీకటిలో, ఆనందం లాంటి విషాదంలో, సుఖం లాంటి దుఃఖంలో చావుబ్రతుకు బ్రతికినాడు. చితికిపోయి బ్రతికినాడు.

పెళ్లికాని కనకలక్ష్మి పరువులేని పడుపువృత్తి కనకలక్ష్మి వయసులేని వెల కట్టిన కనకలక్ష్మి ఇష్టం లేని తననే ఆ పడగ నీడ ఆకర్షిస్తే, ఇష్టమున్న వాడింక తప్పించుకుంటాడా! అందరికీ కనకలక్ష్మి ఎందరికో కనకలక్ష్మి. ఇష్టముండే తాను బ్రతుకు తున్నాడా? ఇష్టం—అయిష్టం. కష్టం నష్టం మబ్బా—ముసురూ. ముసురూ—విసురు. విసురూ —విసుగు. పాడుముసురు. విసుగు ముసురు.

*   *   *

అబ్బబ్బ! ముసురు—రాక్షసి ముసురు—ఎందుకి ముసురు? ఎందుకీ విసుగు? ఈ విసుగుకు కారణం ఆమేనా? ఆశతో నిండిన కన్నుల్లో రేపెలా చూడడం — చూడకుండా ఉంటే — చూడాలి. తప్పకుండా పోవాలి. ఆమె ఎవరామె? ఆమె తనకెవరు? తానామె కెవరు?

*   *   *

బిజినెస్ వక్సెస్‌కాక ప్లాట్‌ఫారం సర్వే చేస్తు న్నాడా రోజు. పాసెంజర్ వచ్చింది పోయింది.

మబ్బువీడని ఆకాశం

చెదరిన ముంగురులూ వాడిపోయిన ముఖమూ' దయనీయమైన రూపూ, జాలిగొలుపు చూపూ, చేతిలో సూటుకేసూ, మెడలో గొలుసూ, కాటుక లేకున్నా కన్నుల్లో కాంతి దీపాలు. ఆమె కనిపించింది.

ప్లాటుఫారం పలుచబడినా ఎటూ పోలేదామె. ఎగిరొచ్చిన పిట్టనుకున్నాడు. రోమియో చూపులో రెండు రౌండ్లు కొట్టాడు ఈలపాట పాడాడు. భుజం నిండా కొంగు కప్పుకుని 'రండ'ని పిలిచింది. తనను కాదని వెనుదిరిగి చూచాడు. కాదు తననే. మెల్లగా పోయాడు. ఏమిటన్నట్లు చూచాడు.

"నేనీ వూరికి కొత్త. నాకీ వూర్లో ఎవరూ తెలి యదు నాకు మీ సహాయం కావాలి. ఈ వూర్లో బస కావాలి. ఇంకెవర్నీ ఆశ్రయించలేను. మీ మేలు మరచిపోలేను" ఆశ్చర్యంతో శిలే అయిపోయి 'అంత కన్నానా' అనుకున్నాడు ఆదుకొని అనుభవించాలను కున్నాడు. సూటుకేసు— గొలుసు —అందమైన వయసు— ఎగిరొచ్చిన పిట్ట. ఆడబోయిన తీర్థం ఎదురే వచ్చింది.

తనకు తెలిసిన ఓ ముసిల్దానింట్లో బస కుది ర్చాడు. వూరడిగాడు పేరడిగాడు. పార్వతి పామర్రులో ఉంది. మనసుకు నచ్చని పెళ్ళట, ముసలివాడితో పెళ్ళట, బ్రతికి చెడిన తండ్రట, బలవంతపు పెళ్ళట, పారిపోయి వచ్చిందట. దారి వెదుక వచ్చిందట, ఎస్సెల్సీ పాసయిందట, ఉద్యోగం చూచుకొంటుం దట ప్రతివాక్యమూ హృదయాన్ని కరగింప చేసింది. ప్రతిముక్కా ఆలోచనన్ని అదరగొట్టింది

తన గురించడిగినపుడు 'మూర్తి'ని చెప్పాడు వూరూ ఉద్యోగమూ కల్పించే చెప్పాడు. పెళ్ళి కాలేదని నిజమే చెప్పాడు నిజం మీద ప్రేమతో కాదు, పార్వతి మీద కన్నుంచి. ఎన్నో మాటలు. ఎన్నో మార్పులు. జేబులోని పాతికా ఇచ్చాడు. కళ్ళతో నవ్వి గొలుసు తీసింది తాకట్టు పెట్టమంది. ఆలోచన మెరుపులా కదిలింది. చేతిలో పడుతోంది సులభంగా. కాని అదేమిటీ! అంతరాత్మ! తనకూ ఉందా! కాటుకలేని కన్నుల్లో తళుక్కున మెరసిన కన్నీరు—చాటుగా పోయి వినిపించే వెక్కివెక్కి ఏడ్పు అమ్మమ్మ పెట్టిన ఆస్తి అదొక్కటేనట. కరి పోయి మసిపై పోయే క్షణంలో.

ఆలోచన అడవుల్లో కాలు తిరగడంలేదు. తానెవరో తెలిస్తే తనతో అలా వస్తుందా? తానెవరో తెలిస్తే తనకలా ఇస్తుందా? నేనెవరు? నేనెవరు? కోటి సమ్మెటలు కణతల్లో మ్రోగాయి. శతకోటి బాణాలు మనసులో నాటాయి. అనంతకోటి పర్వతాలు హృదయంలో పగిలాయి "వద్దు..వద్దు.. వద్దే వద్దు" అన్నాడు అన్నింటినీ సమకూర్చి అర్థరాత్రి దాటాక వచ్చాడు. ఏదో తృప్తి ఆరాత్రి. స్వప్నంకాని ప్రశాంతి. ఏదో అలజడి ముసుగులో కనిపించని ఆలోచనల జడి.

*   *   *

అబ్బబ్బ! ఈ ముసురు ముసుగులోకం మీద ఎంతసేపు! తనకీ విసుగు ముసుగు ఎంతసేపు. ఎందుకీ విసుగు? నిన్న రాత్రి ప్రారంభమైన ముసురు ఇవ్వాళ రాత్రి దాటిపోయినా ఆగదేం—తెల్లవారాక పోతుందేమో! పోతుంది పోతుంది.

*   *   *

రేపు పోవాలి. ఆమె అడిగిందీయాలి. రోజూ పదో పాతికో ఇచ్చాడు ఒకరి కంచంలో దింకొకరికి. పొగొట్టుకున్నవాడు తిడతాడు. పొందిన నోట పొగడ్త రెండూ కొట్టుడుబోతే తనకేం మిగిలింది? ఇంతకుముందు లేనిదేదో ఉంది. ఇంతకుముందున్న దేదోలేదు. అదే మిగిలింది తనకు.


నిన్నరాత్రి ప్రారంభమైంది ముసురు. ఆమె తనూ లోపల. బయట ముసురు లోన విసురు. వందరూపాయలుంటే ఉద్యోగం వస్తుందంది. రేపు సాయంత్రం తానిస్తానన్నాడు. ఉద్యోగం దొరికాక ఏం చేస్తావన్నాడు. ఎన్నో మాటలు. మాటల్లో పెళ్లి విషయం వచ్చింది పెళ్ళి చేసికోవాల నుందంది. నీడలో పెంచే దయ ఉంటే తననే చేసుకొమ్మంది. ఆశ్చర్యమూ ఆనందమూ కలిసి నోటమాటే రాలేదు.

"మీరు గొప్పవారు మర్యాదస్తులు మిమ్మల్ని కోరే హక్కు లేకపోయినా మీ నీడన బ్రతకాలనే కోర్కె అలా అడిగించింది" మాటలు తనను దహిం చాయి. తానింకా బ్రతికే ఉన్నందు కాశ్చర్యం కలి గింది. తడబడుతూ కౌగిలించుకున్నాడు. శరీరంలో నాగుపాముల బుసబుస. హృదయంలో హాలాహలపు కల్లోలం. కరువు దీరా ఏడ్వాలన్న కాంక్ష. కట్టలు తెగివస్తున్న కన్నీళ్లను ఆనందభాష్పాలుగా చూపా డామెకు, డగ్గుత్తికతో 'నాకంత అదృష్టమా' అని ఉండలేకపోయాడు రేపు సాయంత్రం డబ్బుతో వస్తానని ముసుర్లో తడుస్తూనే వచ్చాడు.

*   *   *

సాయంత్రం పోలేదు. రేపు పోవాలి. డబ్బివ్వాలి. ఎలాగైనా చేసి ఇవ్వాలి. తర్వాత . తర్వాత..అదేమిటీ మరుగుతున్న ఆలోచనల్లో మాడిపోతోంది మనసు. పెళ్లి.. నీడ . వందరూపాయల అద్దెగదే నీడా? మర్యా దస్తుడినట, గొప్పవాడినట, ఆస్తట, హక్కట, ఆదుకున్నానట. మోసపోయింది. పూర్తిగా మోస పోయింది. నమ్మింది. అమాయకంగా నమ్మింది. ఎవరూ ప్రేమించని తనను ప్రేమించింది. ఎవరూ నమ్మని తనను నమ్మింది. ఇంకా మోసం చేయలేదు. ఇంకా వేషం వేయలేదు. నిజం తెలుసుకొని పగిలి పోయే ఆమె హృదయం—విలవిలలాడిపోయా డానంద రావు. ఇంకా నా మోసం? ఇంకా నా వేషం పోవాలి. పారిపోవాలి పారిపో! పారిపో! పారిపో!

అమ్మయ్య! ముసురు కొస్త తగ్గింది. తగ్గుతున్న ముసురు. ముసురు విసుగు. **కోడి కూస్తోంది.**



చీకటి బ్రతుకూ, చీదర బ్రతుకూ తెల్లవారబోతోంది. మంచం నుండి లేచా డానందరావు. కాగితం కలం వెదుక్కొని ల్యాంపు వెగదోశాడు. వణుకుతున్న చేతితో వంకరపోతున్న అక్షరాలు.

"పార్వతీ! నేను నేనుకాదు. నాకు చదువురాని విషయాన్ని నా అక్షరాలే చెపుతాయి. దొంగతనం, దోపిడీ, హత్యలూ నా వృత్తి. ఎన్నోసార్లు జైలుకి పోయి వచ్చాను. నా పేరు మూర్తికాదు. ఆనంద రావు కే. డి నన్నెవ్వరూ నమ్మరు, నువ్వు తప్ప నువ్వు మోసపోయావు. ఇంకా మోసగించలేను నేను నీకు తగను. నన్ను మరచిపో ఏభై మాత్రమే ఇవ్వగలిగాను. నన్ను మన్నించు నాకంతే చాలు"

కవర్లో ఉత్తరమూ, రూపాయిలూ పెట్టాడు చీకటి తెరను తొలగించి ఉషస్సు విచ్చుకోబోతోంది. తలుపు వేసి సందు దాటి మలుపు తిరిగాడు. ముసురు తగ్గిన ఆకాశం మీద నల్లని తేలిక మబ్బులు కదులుతూ పోతున్నాయి గబగబా నడిచాడు. తొందరగా నడచాడు. తలుపు చూసి ఆశ్చర్యపోయా డానంద రావు. తాళం వేసిన తలుపు తలుపుకు వేసిన తాళం. ఇంటి ముసిలిని పిలిచి ఆరా తీశాడు. నిన్న సాయంత్రం మెయిల్లో వెళ్లిందట. తనకో చీటీని ఇవ్వమందట. గబగబా విప్పాడు కాగితాన్ని.

"మూర్తిగారూ! నేను నేనుకాదు నే చెప్పిందంతా అబద్ధం. నా గొలుసు గిల్టుగొలుసు. మీరు మంచివారు కాబట్టి మొదటిరోజు పట్టుబడలేదు. నేనన్నివిధాలా చెడిపోయాను. "ఎవరూ నమ్మని నన్ను నమ్మారు. మిమ్మల్నింకా మోసగించలేను. మీరు మంచివారు అమాయకులు. నేను మీకు తగను నన్ను మన్నించండి. నాకంతే చాలు."

ఆనందరావు కన్నుల్లో నీళ్లు నిండాయి. ఎవరైతే నేం! తనకో హృదయంలో స్థానం దొరికింది. ఒక్క హృదయం తన హృదయాన్ని చూచింది. ఉత్తరం మడచి జేబులో పెట్టుకుంటున్నా డానందరావు. ఎదురుగా ఎర్రటోపి సైకిలాపి దిగింది.

"ఓహో! పాత కేడీ. ఆనందరావా? ఏరా! ఎవర్నో తెచ్చావటగా ఎగిరొచ్చిన పిట్టని! ఇక్కడే పెట్టి బిజినెస్సు నడిపిస్తున్నావటగా! ఎక్కడికి పోయిందిరా పిట్ట? ఎంత సంపాదించావురా! మీ మామ చెప్పాడులే. నడు స్టేషన్‌కి."

బిగుసుకుపోయా డానందరావు. కోపంతో ఉడికి పోయాడు. అవమానంతో కుంగిపోయాడు. దుఃఖం తోను కుమిలిపోయాడు. కాసేపాగిందో లేదో, మళ్లీ ముసురు—మళ్లీ ముసుగు. ముసురు—వెధవముసురు గాలివిసురు. విసుగు—విసుగు. కసిలాంటి విసుగు, నవ్వుకున్నా డానందరావు. అందులో జీవంలేదు. ఆనందంలేదు. కవర్లోంచి యాభై రూపాయలు తీసి కానిస్టేబిల్ చేతిలో ఉంచాడు. ఈసారి విడుస్తున్నానని చెప్పి, ఇంకో క్షణంలో లేడువాడు.

హృదయంలో బాధ. మనసులో దుఃఖం—తడుస్తున్న శరీరం—కండ్లకు అడ్డువచ్చిన నీరు— విషాదంగా నవ్వా డానందరావు. కసిగా నవ్వాడు. "నేను బాధ పడడందేనికి? నా తల్లితండ్రి పోయినా మేన మామ ఉన్నాడు. నేను బాధపడడం దేనికి" మనసులో అనుకున్నా డానందరావు. అబ్బబ్బ! ముసురు—ముసురు. విసుగు— విసుగు. ముసురు—విసురు. ముసుగు వేసుకున్న ఆకాశం. చీదరించుకున్నా డానంద రావు. జేబులోని బ్లేడుముక్కను పట్టుకుని బీటు బజారు హడావిడిలోకి పోతూ. ●

కృష్ణాజిల్లా తెలుగు రచయితల మహాసభ

నవ్యసాహితీసమితి విజయవాడశాఖవారు కృష్ణాజిల్లా తెలుగు రచయితల మహాసభ నిర్వహించారు.

మహాసభ-ముఖ్యోద్దేశము

ఈ మహాసభ నిర్వహించటానికి ఉద్దేశాలు చాల వున్నాయి. అయితే ఆ ఉద్దేశాల వెనుక చాల చరిత్రవుంది. చాలమంది సాహిత్యాభిమానులు, రచయితలు కళా హృదయులు కలసి ఒకే చోట కూర్చుని ఒకేవైపు చూశారు. ఆ చూపులన్నీ ఒకే చోట కలుసుకున్నాయి. ఆ కలుసుకున్నచోటే యీ మహాసభ ఏర్పడింది. అందుకు ముందుగా మనం వాళ్లందరినీ అభినందించవలసిందే.

ఈ సభ నిర్వహణోద్దేశాలు పైకి వెల్లడించక పోయినా తెలిసే దేమిటంటే రచయితలంతా ఒకే చోట చేరి తమ సమస్యలను చర్చించుకోటం. తమ కలాలలోనుంచి వస్తున్న రచనలు ఎలా వుండాలో, సాంఘిక పరిస్థితులను రచయిత ఏవిధంగా చక్కబరచుకోగల్గుతాడో, ప్రచురణ విషయంలో రచయిత ఏఏ సమస్యలను ఎదుర్కొంటున్నాడో పరస్పరం తెలియజేసుకోటం, చర్చించుకోటం యీ మహాసభ ముఖ్యోద్దేశం. కార్యక్రమాలన్నీ ఒకే రోజున ఏర్పాటు చేశారు. అందులో ఆదివారం నాడు సభ నిర్వహించటంవలన ఉద్యోగాలలో వున్న రచయితలు పాల్గొనటానికి అవకాశం కల్గింది.

కార్యక్రమ వివరాలు

శ్రీ శివకోటి దశరథరావ్ సభను ప్రారంభించారు. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు 'సావనీర్'ను ఆవిష్కరించారు. తరువాత ఆయన తన ప్రసంగంలో సాహిత్యంలో నవ్యత్వం తీసుకురావాలని, యిప్పుడు వస్తున్న రచనలలో నవ్యత్వం అగుపించటంలేదని అన్నారు. ప్రస్తుతం అనేకమంది రచయితలు వస్తున్నారని, అయితే, నూతన రచయితతోపాటు నూతన పద్ధతి, శైలి కూడ నూతనంగానే వుండా అని అన్నారు. పాఠ్య గ్రంథాలలో వ్యావహారికభాషను ప్రవేశపెట్టటానికి శ్రీ పింగళి కమిటీ సిఫార్సు చేసినందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

తరువాత కవిత్వము— సదస్సు అన్న కార్యక్రమంతో నలుగురు వక్తలు ప్రసంగించారు. వారు శ్రీయుతులు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, నాగళ్ళ గురుప్రసాదరావు, తుమ్మల వెంకటరామయ్య, రెంటాల గోపాలకృష్ణ.

శ్రీ జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి కృష్ణా మండలంలో ప్రాచీన కవిత్వపు పుట్టుపూర్వోత్తరాలు, వాటి విమర్శలు సంక్షిప్తంగా వివరించారు. ప్రాచీన కవిత్వాన్ని గురించి ప్రసంగించిన వారిలో వీరే మొదటివారు.

శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు 'ప్రాచీన కవిత్వము— విమర్శ' అన్న అంశము మీద తమ ప్రసంగాన్ని చదివారు విమర్శ నిర్వచనాలను వివిధ రకాలుగా తెలియజేశారు. కవిత్వానికి మొదట విమర్శకుడు కవిమాత్రమే అని అంటారాయన. మొదట కవి తను వ్రాసుకునే రచనల గురించి మనసులోనే విమర్శించుకుంటాడని, అలా జరగక పోతే రకరకాల పరిస్థితులు, రకరకాల పాత్రలు, వివిధ దృక్పథాలు ఒకే రచనలో వుండవని ఆయన అన్నారు. మూల రచయితకు కవికి గల సంబంధాన్ని విశదీకరించారు. విమర్శకుడు రాగద్వేషాలకు అతీతంగా వుండాలని, కవి పట్లగాక అతని రచన పట్ల దృష్టిసారించి సహృదయంతో అవగాహన చేసుకొని విమర్శించాలని ఆయన చెప్పారు. విమర్శలో ముఖ్యమైన లోపాన్ని ఒకదానిని గురించి శ్రీ గురుప్రసాదరావు చెప్పారు. ఆధునిక ప్రామాణ్యాన్ని ఆధారంగా చేసుకుని ఎప్పుడో రాయబడిన మహాభారతంలో ఛందస్సు పొరపాట్లు దొర్లాయని విమర్శించటం మంచిది కాదు, అని ఆయన తెలియజేశారు.


శ్రీ తుమ్మల వెంకట్రామయ్య సభకు హాజరు కాలేదు. వారు వ్రాసిన వ్యాసాన్ని శ్రీ సంజీవరావు చదివారు. ఆధునిక అభ్యుదయ కవిత్వాలను గురించి వ్రాసిన వ్యాసాన్ని సభికులముందు వుంచటం జరిగింది. శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వంలో చూపిన మార్గాన్ని కొనియాడారు.

శ్రీ రెంటాల గోపాలకృష్ణ ఆధునిక గేయ కవిత్వాన్ని గురించి చక్కగా వివరించారు. శ్రీశ్రీ వేసిన బాట, ఆ బాటలో పయనించిన వారి పేర్లు, వారి కవితారీతులను తెలియ జేశారు. సోమసుందర్, శశాంక, అప్పలస్వామి, బాలగంగాధరతిలక్, దిగంబర కవుల కవితా రీతులను వివరించారు. గేయకవిత్వములో శబ్దాడంబరం అగుపడుతోందని, శబ్దాల పరివర్తన విచిత్రంగా జరుగుతోందని, విచిత్రంగా మారిన శబ్దాల అసలు రూపమేమిటో తెలుసుకోటం కష్టంగా వుందని చెప్పారు. 'అవిగో గుడి గంటలు, యివిగో మంటలు' అంటూ కేవలం ప్రాసకోసం ఉపయోగించేది కవిత్వం కాబోదని అన్నారు.

శ్రీ రెంటాల ప్రసంగంతో కవిత్వము— సదస్సు అన్న కార్యక్రమం సమాప్తమైంది.

తరువాత ఒంటి గంటకు ప్రతినిధుల సమావేశం జరిగింది. యీ సమావేశానికి శ్రీ 'చంద్రమౌళి' అధ్యక్షత వహించారు. యీ సమావేశం అనుకున్నంత ఎక్కువ ఫలితాలను యివ్వలేదు. అనుకున్నంత సవ్యంగాను జరుగలేదు. మొదట శ్రీ 'చంద్రమౌళి' ప్రతినిధులను వేదిక మీదకు వచ్చి ఎవరికివారే సభికులకు పరిచయం చేసుకోవాలని చెప్పారు. అయితే అందరూ పరిచయం చేసుకోలేదు. ఎవరికివారు 'నేను ఫలానా' అని చెప్పుకోటానికి సందేహించారు. అందువలన చాల కొద్ది మంది మాత్రమే పరిచయం చేసుకున్నారు.

తరువాత ఒక తీర్మానం ప్రవేశ పెట్టబడింది. దీనితోనే గందరగోళమంతా ప్రారంభమయింది. 'రచయితల సహకార ప్రచురణ సంస్థ' నెలకొల్పటానికి తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తీర్మానం మీద వోటింగ్ జరుపుతామన్నారు. అయితే అధ్యక్షుడు సహకార ప్రచురణ సంస్థ ఏరీతులలో ప్రారంభం కాబోతుందో, ఎటువంటి నియమాలను షేర్‌హోల్డర్స్ పాటించాలో, ఎటువంటి రచనలను ఆ సంస్థ ప్రచురణకు స్వీకరించుతుందో తెలియ జేయలేదు. యీ వివరాలు కనీసం తీర్మానం పెట్టిన తరువాత అయినా తెలియజేసినట్లయితే వాదోపవాదాలు జరిగేవి కాదు. తీర్మానం విన్న తరువాత ప్రతి ప్రతినిధికి అనేక సందేహాలు కలిగాయి. కొంతమంది సభాముఖంగా ఆ సందేహాలను



వెల్లడించారు. కేరళలో స్థాపించిన సహకార ప్రచురణసంస్థ, యిటీవల హైదరాబాద్‌లో నిర్వహించబడుతున్న సంస్థల నిబంధనావళిని సమితివార అవగాహన జేసుకొని అలాగే యిప్పుడు పెట్టబోయే సహకార ప్రచురణ సంస్థ నిబంధనావళిని యిచ్చినట్లయితే ఎంతో బాగుండేది. కాని అలా జరుగలేదు. అందువలననే ప్రతినిధులలో అనేకమందికి సందేహాలు కల్గాయి. అధ్యక్షుడు పెట్టిన తీర్మానాన్ని కొంతమంది వ్యతిరేకంగాను, కొంతమంది అనుకూలంగాను అవగాహన చేసుకున్నారు.

తరువాత మరొక తీర్మానం ప్రవేశ పెట్టబడింది పాఠ్య పుస్తకాలలో వ్యావహారిక భాష వుంచాలని శ్రీ పింగళి కమిటీ చేసిన సిఫార్సును సమర్థించటానికి సంబంధించినది యీ తీర్మానం. యీ తీర్మానంతోనే సభ సహకార ప్రచురణ విషయం వదలి మరో మార్గం పట్టింది వ్యావహారిక భాష పాఠ్యపుస్తకాలలో అక్కరలేదని కొందరు, వుండాలని కొందరు విమర్శించారు అసలు పాఠ్యగ్రంథాలలో వ్యావహారిక భాషకు— యీ రచయిత ప్రతినిధులకు ఏమీ సంబంధం లేదని ఒకరు వాదించితే మరొకరు రచయిత ప్రతినిధులకు సంబంధించినదే అని వాదించారు. ఏదైనా చివరకు యీ తీర్మానం కూడ ఆమోదించటం జరిగింది తరువాత శ్రీ 'ఛాయేశ్వర్' (ప్రేమచంద్ పబ్లికేషన్స్) క్రొత్త రకమైన తీర్మానం ప్రవేశపెట్టారు రచయితలు తాము వ్రాసుకున్న రచనలకు అంతకుముందు ప్రచురించబడిన రచనలు పేర్లు పెడుతున్నారని, అలా చేయటం వలన యిద్దరి ప్రచురణకర్తల మధ్య వ్యాపార సంబంధమైన పోటీ ఏర్పడుతోందని అలా చేయవద్దని విజ్ఞప్తి చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు.

అయితే యీ తీర్మానం రచయితలకు సంబంధించినది మాత్రం కాదు. ప్రచురణకర్తలకు సంబంధించినది. నాకు తెలిసినంతవరకు ఏ రచయితా తనకు తెలిసి తన రచనకు అంతకు ముందే వున్న పేరు నిర్ణయించడు తన రచననుబట్టి పేరు నిర్ణయిస్తాడు గాని అది అంతకు ముందు వున్నాయో లేదో, ఏ పేరుపెడితే ఎక్కువ అమ్ముడుపోతుందో అను విషయాన్ని ఏ రచయితా ఆలోచించడు ఒకవేళ పేరు నిర్ణయం పొరపాటుగ జరిగితే దానిని రెండవ ప్రచురణలో సరిదిద్దుకోవాలని శ్రీ ఛాయేశ్వర్ సూచించారు. అసలు రెండవ ప్రచురణకు వెళ్లే రచనలు చాల తక్కువ. ఒకవేళ రెండవ ప్రచురణలో పేరు మారిస్తే యిటు రచయితకు— అటు రచనకు ఆఘాతం కలిగే అవకాశం వుంది. ఈ తీర్మానం గురించి వాదోపవాదాలు ఏమీ జరుగలేదు. తీర్మానం ఆమోదించబడింది. తరువాత యిటువంటిదే పుస్తకాల రేట్లకు సంబంధించిన తీర్మానం కూడా ఆమోదించబడింది.

అంతటితో ప్రతినిధుల సమావేశం పూర్తయింది. అయితే యీ సమావేశంలో రచయితల సమస్యలు ఏమీ సంపూర్ణంగా చర్చించబడలేదు. ముఖ్యంగా రచయితలు ప్రస్తుత ప్రచురణకర్తల ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించబడలేదు. మరో సమావేశంలోనైనా ఆ సమస్యలను చర్చించి, సహకార ప్రచురణ విషయంలో మరి కొంత కృషిచేసి ఆ సంస్థను స్థాపించటం కృష్ణా జిల్లా రచయితల కర్తవ్యం. యీ విషయంలో రచయితలు ముందడుగు వేయకపోతే మామూలుగా వున్న పరిస్థితులను ఎప్పుడూ ఎదుర్కోటమే జరుగుతుంది.

తరువాత షుమారు మూడున్నర గంటలకు ప్రారంభమయిన 'కాల్పనిక సాహిత్యము— పరిశీలన' అన్న కార్యక్రమంలో శ్రీయుతులు మహీధర రామమోహనరావు, నండూరి రామమోహనరావు, వీరాజీ, జమదగ్ని, కంచి వాసుదేవరావు, వి. వి. నరసింహారావు మొదలైనవారు ప్రసంగించారు.

శ్రీ మహీధర రామమోహనరావు తెలుగులో నవలలని గురించి వివరించుతూ పందొమ్మిదివందల యాభై వరకు వచ్చిన నవలలు— వాటి ధోరణిని గురించి సంక్షిప్తంగా తెలియజేశారు.

శ్రీ నండూరి రామమోహనరావు 'తెలుగునవల— అనువాద సాహిత్యాన్ని' గురించి ప్రస్తావించి అనువాద సాహిత్యం చాల బలహీనంగా వుందని, తెలుగులో వచ్చిన అనువాదాలు చూస్తూ వుంటే మూల రచయితల రచనా ధోరణిని 'ఖూనీ' చేయటం జరిగిందని తెలియజేశారు.

శ్రీ వీరాజీ తెలుగు నవలను గురించి తమ ప్రసంగాన్ని చదివారు.

తరువాత శ్రీ 'జమదగ్ని' ''తెలుగులో కథానిక'' గురించి ప్రసంగించారు. కథ ఆత్మకథను హాస్య ధోరణిలో చదివి ఆ ధోరణిలోనే కథ ఎదుర్కొంటున్న పరిస్థితులను వివరించారు వీరి ప్రసంగమూ చలా ఉల్లాసంగా కూడవుంది


శ్రీ కంచి వాసుదేవరావు నేటి కథలు— కథకులను గురించి ప్రస్తావించారు. శ్రీ వి. వి. నరసింహారావు 'తెలుగులో జర్నలిజం' గురించి చక్కగా వివరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమూలాగ్రంగా వివరించారు. జర్నలిజంలో భాషను గురించి ఆయన ఆందోళన వ్యక్తపరిచారు. భాష చాల తక్కువస్థాయిలోకి దిగజారిపోయిందని, దానిని యథాస్థానంలో పునరుద్ధరించటానికి జర్నలిస్టుల చేయి దాటి పోయిందని తెలియజేశారు.

తరువాత ప్రారంభమయిన సాంస్కృతిక కార్యక్రమానికి శ్రీ పి. సుబ్బారావు అధ్యక్షత వహించారు. శ్రీ కొత్తగడ్డ నరసయ్య, శ్రీ జి. యస్. ఆర్. మూర్తి ప్రసంగించారు. శ్రీ బందా కనకలింగేశ్వరరావు వ్రాసిన వ్యాసాన్ని శ్రీ సుబ్బరామయ్య చదవటం జరిగింది శ్రీ కొత్తగడ్డ నరసయ్య ప్రసంగించుతూ తెలుగు సినిమాల నిర్మాణంలో ఖర్చు తగ్గించటానికి రచయితలు అనుకూలమైన కథలు వ్రాయాలని అన్నారు శ్రీ బందా వ్యాసంలోను, శ్రీ జి. యస్. ఆర్. మూర్తి 'ప్రాచీన ఆధునిక రంగస్థలము— సమస్యలు' అన్న విషయము మీద ప్రసంగించటం జరిగింది.

తరువాత విజయవాడ ఫైన్ ఆర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ వారిచే 'మంగళసూత్రం' నాటక ప్రదర్శన జరిగింది

యిన్ని కార్యక్రమాలను ఒకే రోజులో ఏర్పరచి దిగ్విజయంగా పూర్తిచేయటానికి ప్రయత్నించిన నవ్య సాహితీ సమితివారు అభినందనీయులు.

—సుమన్



తొలిచావు

సురమౌళి



ఇల్లు దగ్గరికి చేరినకొద్దీ రాముకు ఎగపోత ఎక్కువ కాసాగింది. ఉరకడం లేదుగాని వేగంగా నడుస్తున్నాడు తాను. సందంతా కలియజూశాడు.. నిశ్శబ్దంగా వుంది. మెట్లు మీదికెక్కి తలుపుకు చెవిపెట్టి విని చూశాడు. లోపల కూడా నిశ్శబ్దంగానే వుంది. అంటే ముందు వాకిట్లోగాని, దాని వెనకాలే వున్న వరండాలోగానీ ఎవరూ లేరన్నమాట. వాకిలికి ఆనుకుని వున్న దొడ్లో మాత్రం ఎవరో వున్నట్లే వుంది. దొడ్డిలో నుంచి బయటికి వున్న మోరీ గుండా నీళ్ళు సందులో పడుతూ వున్నాయి.

మెల్లిగా తలుపు తీసికొని లోపలికి చేరాడు. ద్వారం ముందు వీధిలో వున్న వేపచెట్టు మీది నుంచి ఏదో పక్షి రెక్కలు చప్పుడు చేసుకుంటూ ఎగిరిపోయింది. దొడ్డి తలుపు తెరచిన అలికిడైంది. తెరచిన తలుపు చాటుకు దాక్కున్నాడు రాము. మెల్లిగా వంగి చూశాడు. పెద్దన్నయ్య ఓ చేత్తో చెంబు, మరో చేత్తో నడుము దగ్గర లుంగి సర్దుకుంటూ వరండా వైపుకు వెళ్తున్నాడు. వెళ్ళేవాడల్లా చటుక్కున ఆగి ద్వారంవేపు చూశాడు. చూస్తూనే "నమస్కార ముండోయ్!" అన్నాడు పెద్దగా. సందు గుండా వెళ్తున్న ఒకాయన "నమస్కారం—నమస్కారం" అంటూ సాగిపోయాడు పక్కింటి శాస్త్రిమామయ్య కామాల్సు. "తలుపుల వెనుక ఎందుకురా ఎప్పుడూ అలా నక్కుతావు?" అంటూ వుంటాడు ఎప్పుడూను. ఇంతలో అన్నయ్య పిలుపు విని ఉలిక్కిపడ్డాడు. "అరె..తాను తలుపు చాటుకు దాక్కున్నాడు గదా! అన్నయ్య కెలా తెలిసిందబ్బా!" అని రాముకు బోలెడు ఆశ్చర్యం వేసింది. తలుపును బాగా పరికించి చూశాడు. చెక్కలు నేలదాకా లేవన్నమాట! అడుగు నుంచి తాను వేసుకున్న కొత్త చెప్పులు కనపడుతున్నాయన్నమాట!

"దాగుడుమూతా దండాకోర్ ." అంటూ తలుపు చాటునుంచి బయటికి వెళ్ళాడు

"దాగుడు మూత లాడుతున్నా వనుకోవాలి కాబోలు!" పెద్దన్నయ్య తన్ను పరిశీలనగా చూస్తూ ప్రశ్నించాడు.

"మరి...?"

"వెళ్ళి ఓసారి అద్దంలో ముఖం చూసుకురా! ఎలా పాలిపోయిందో! భయంతో కంపించిపోతున్నట్లు!"

"నాదా!"

"లేక నాదా?"

"నా కెందుకూ భయం? నేనేమన్నా దొంగతనం చేశానేమిటి? ఆడుకుంటున్నాగా!" ధైర్యంగా అనేశాడు రాము. దానితో రాము ముఖం మీద అంత వరకూ ఏమన్నా భయకంపితమైన రేఖలు ఉండుంటే అని మటుమాయమై ఒక్కసారి ఆత్మవిశ్వాసపు ఛాయ మెరిసింది.

"ఏదో చిలిపితనం చేసే వుంటావు! పద అమ్మ దగ్గరకు!" పెద్దన్నయ్య గద్దించాడు. గద్దిస్తూ రాము తొడుక్కున్న చొక్కా ఎడమచేతిని పుచ్చుకున్నాడు.

"ఆ! నే రానుపో!" అంటూ చేతిని విదిలించుకున్నాడు రాము.

"అల్లాగేం! ఉండు చెపుతా!..ఇప్పుడే వెళ్ళి అమ్మతో చెపుతానుండు!"

"చెప్పుకో పో" రాము ఆత్మవిశ్వాసంతో అనేశాడు. పెద్దన్నయ్య చెంబులో మిగిలిన నీటిని నేల మీద గీతపడేలా ధారగా పోసుకుంటూ వరండా దాటేసి ఇంట్లోకి ప్రవేశించాడు.

"చూడమ్మా!" అంటూ ప్రారంభించాడు.

"ఎందుకురా అలా గొంతు చించుకుంటావు? చెప్పేదేమిటో దగ్గరదాకా వచ్చి చెప్పరాదూ!" అని అమ్మ గద్దించింది. "అమ్మ గద్దించినప్పుడు చూడాలి పెద్దన్నయ్య ముఖం. పెద్ద...అమ్మతో చెపుతానుండు అని బెదిరించాడు. చెప్పుకోనీ తనకేమన్నా భయమా! తానెవరికీ భయపడడు. నాన్నక్కూడా భయపడడు!"

సందు చివరి మలుపు నుంచి మనుషుల కేకలు వినిపించసాగాయి. తానిందాకా ఆడుకున్న శ్మశానం అటు వేపే ఉన్నది. రాము గబుక్కున వెళ్ళి తలుపులు మూసేశాడు. అక్కడ వేపచెట్టు నీడన వాకిట్లో వాల్చి ఉన్న మంచం పట్టె మీద కూచుని ఆలోచనలో పడ్డాడు. కేకలు క్రమంగా సమీపిస్తున్నాయి. తాను శ్మశానంలో వదిలేసి వచ్చిన జనమంతా తన మీద విరుచుకుపడటానికి వస్తున్నారన్నమాట. రానీ, తనకేమన్నా భయమా! తాను చేసింది తప్పయితేగా! లేకపోతే ఆ వెధవ....

"అయ్యగారూ!" అరిచాడు చాడీకోరు కుంక.

"అయ్యగారండీ!" మరో గొంతు.

"అయ్యగారు లేరు!" రాము గట్టిగా సమాధానం చెప్పాడు.

"అయ్యగారూ!" మళ్ళీ అదే పిలుపు.

"అయ్యగారూ, అయ్యగారూ! అయ్యగారూ!... పెద్ద... అప్పుడు గుర్తుకు రాలేదేం అయ్యగారు? ఇప్పుడొచ్చారూ! అయ్యగారితో చాడీలు చెప్పడానికి.' తనలో తానే విసుక్కుని "అయ్యగారు లేరంటున్నాగా!" బాగా వినపడేట్టు పెద్దగా అన్నాడు రాము.

"తలుపు తియ్యండి బాబూ!" అని మళ్ళీ పిలుపు. ఇది రాజుగాడి గొంతు గోతులు తవ్వడం, బిచ్చమెత్తుకోవడం, డబ్బు కొట్టడం వాడి వంతు. పైగా పేరుకు మాత్రం 'రాజు'

"వెళ్ళండ్రా తలుపు తియ్యను!"

"గొళ్ళెం చప్పుడు చెయ్యండోయ్!" ఎవడిదో బోడి సలహా, వెంటనే దానిపైన అమలు కూడాను. గొళ్ళెన్ని తలుపు కేసి ఆగకుండా కొడుతున్నారు గుళ్ళో గంటలు కొట్టినట్టు. మంచం మీదినుంచి లేచి రాము తలుపు దగ్గరగా వెళ్ళి "వెళ్తారా లేదా!" అని గట్టిగా గద్దించాడు రాము.

"మేం నీ కోస మొచ్చామేంటి?... అయ్యగారి కోసం వచ్చాం! నీకేం!"

గొళ్ళెం చప్పుడెక్కువైంది. కేకలు కూడా ఎక్కు

వైనయి. ఇందాకా తనతో ఆడుకున్న కుర్రాళ్లంతా ఉరేగింపుగా బయలుదేరి వచ్చినట్లున్నారు. కొందరు పెద్దగా అరుస్తూ మాట్లాడుకుంటున్నారు. మరొకడు నవ్వుతున్నాడు. అల్లరంతా ఒక్కసారి స్తంభించిపోయింది. "నమస్కారం! శెట్టిగారూ!" అన్నారందరూ ఒక్కుమ్మడిగా. "నమస్కారం..నమస్కారం.. ఏమిటి ఇక్కడ చేరారు?" శెట్టిగారి ప్రశ్నకు సమాధానం రాకముందే లోపల్నుంచి అమ్మ మాట వినిపించింది "ఏమిట్రా ఆ గోల?" అంటూ.

"ఏం లేదమ్మా!" అంటూనే తలుపు ప్రక్కకు జరిగాడు రాము.

"ఏమిట్రా అని అడుగుతూ వుంటే నీగ్గాదూ? బైట ఏమిటా గోలంతా?" అంటూ అమ్మ వరండా దాటి వచ్చేస్తూనే వుంది.

"నేనంటూనే వున్నా వీడేదో చేసే వుంటాడని.." పెద్దన్నయ్య వాకిట్లోకి వస్తూ అన్నాడు.

"పలకవేరా!" అమ్మ గద్దించింది.

అయినా రాము మాత్రం ఉలుకనూ లేదు. పలుకనూ లేదు. అయితే అమ్మ మాట బయటికి వినిపించిందేమో గొల్లెం చప్పుడు ఆగిపోయి, "అమ్మగారూ! అమ్మగారూ!" అనే కేకలు ప్రారంభమైనాయి.

"సంగతేమిటసలు?" అమ్మ ప్రశ్నించింది.

"చిన బాబుగారు తల పగులగొట్టేశారండీ!"

"అమ్మయ్యో!... ఎవరిది నాయనా!"

"అయిలు గాడిదండీ! ఇదిగో..."

అమ్మ రాము ముఖంలోకి తీక్ష్ణంగా చూసింది. రాము తల వంచేసుకున్నాడు.

పెద్దన్నయ్య మెల్లగా తలుపు తీసి బయటికి చూశాడు. చూసి, "నిజమే! వాడి తల చూడు పాపం. నెత్తుట్లో ఎలా తడిసిపోయి వుందో!"

"అసలేం జరిగిందో అడగరా వాళ్లని!" అని అమ్మ పెద్దన్నయ్యను ఆదేశించింది. తలుపు రెక్కనొకదాన్ని వోరగా తెరచి గడప మీదెక్కాడు పెద్దన్నయ్య. అయిగాడు ఎదుటే నుంచున్నాడు. వాడి తలకాయ కుడివేపు నుంచి రక్తం కారుతూ వుంది. మాసిన వాడి గుడ్డల మీద కూడా నెత్తురు మరకలు కానవస్తున్నా వాడి వెనకాల, చుట్టూతా యూనాది కుర్రాళ్ల గుంపు కిటకిటలాడుతూ వుంది. కొందరి ముఖాల మీద భయం, మరికొందరి ముఖాల మీద విచారం కనపడుతూ వుంటే కొంతమంది కుర్ర కుంకలేమో నవ్వుతూ వున్నారు.

"అందరినీ కూచోమను!" మళ్లీ పెద్దన్నయ్యనే ఆదేశించింది అమ్మ. అయిలుగాడు మెట్లమీద కూచున్నాక పెద్దన్నయ్య అడిగాడు 'అసలేం జరిగింది' అని.

"నే చెప్పనా?" అన్నాడందులో వో కుర్రాడు.

"నోర్మూయ్యి రా!" మరొకడు వాణ్ణి గద్దించాడు. 'వీడే ఆ బిచ్చపు వెధవ రాజుగాడు' అని తనలో తాను అనుకుంటూ కాలి గోటితో నేలమీద గీతలు గీయసాగాడు రాము.

"చిన బాబుగారూ, మేమూ అంతా కలిసి ఆ శ్మశానంలో ఆడుకుంటున్నాం బాబుగారూ! చినబాబుగారేమో ఇంత పెద్దరాయి తీసి అయిలుగాడి తల పగులగొట్టేశారండి...."

'పచ్చి అబద్ధం! అసలు మొదటేమైందో చెప్పడేం? అసలీ రాజుగా డక్కడ లేనేలేడు ..పైగా..' తనలో తానే ఆక్రోశపడుతున్నాడు రాము.

"కాదమ్మగారూ! అయిలుగాడే మొదట కొట్టాడండి!" పెద్దన్నయ్య, అమ్మ మొఖాల్లో నెత్తురు ఇంకిపోయింది.

"వీడు! ఈ బిచ్చపు వెధవ! వీడు కొట్టాడా నా బాబుని!" అమ్మ కంటిలో నీరు పైకి వచ్చినట్టే వచ్చి మళ్లీ ఇంకిపోయింది.

"అబద్ధాలకోరు వెధవండీ వాడు! అన్నీ అబద్ధాలే!" అయిలుగాడందుకున్నాడు. "నేను చినబాబుగారిని ముట్టుకుంటే ఒట్టండీ!" అంటూ,

"మరి నువ్వు మద్దిగాణ్ణి కొట్టిందో?" మరో కుర్రాడందుకున్నాడు

"ఆ.. అవును మరి " అంటూ రాము ముందడుగు వేశాడు

"అమ్మా! వీడేమో మరి .. మద్దిగాణ్ణి చెప్పుల్తో కొడుతున్నాడమ్మా! మద్దిగాడేమో పాపం ఏడుస్తూ మొత్తుకుంటున్నాడమ్మా! వీడు వాణ్ణి ఇంతింతేసి రాళ్ల మీదేసి లాగుతున్నాడమ్మా! వాడి గుడ్డలన్నీ చిరిగిపోయాయి. అయినా వీడు వాణ్ణి కొడుతూనే వున్నాడమ్మా! అందరి ఎదుటే . నడిరోడ్డు మీద" అని గబగబా రాము చెప్పేసుకు పోతున్నాడు.

"నిన్నయితే కొట్టలేదుగా?" అమ్మ సూటి ప్రశ్న.

"ఊహు! . కాని..ఆ మద్దిగాణ్ణి చెప్పుల్తో కొట్టాడమ్మా! వాణ్ణి ఇంతింత పెద్దపెద్ద రాళ్ల మీద పడేసి లాగాడమ్మా పాపం వాడి గుడ్డలన్నీ చిరిగిపోయాయమ్మా . వాడికి ఒళ్లంతా నెత్తురు కూడా కారిందమ్మా" రాము చెప్పుకుపోతున్నాడు.

"చినబాబుగారు చెప్పిందంతా నిజమేనమ్మగారూ!' కుర్రాళ్లంతా ఒక్కసారి అనేశారు.

"మరి! అమ్మగారండీ! ఆ లంజా. .."

"ఇక్కడ బూతులు మాట్లాడొద్దను" పెద్దన్నయ్యను సంబోధిస్తూ అమ్మ గద్దించింది.

"తప్పయిందమ్మగారూ! మద్దిగాడు నాకు పది రూపాయలు ఇవ్వాలండీ! అప్పుచ్చుకున్నాడు. ఎన్నిసార్లడిగినా ఇవ్వలేదండమ్మగారూ! అందుకని ఈయేల పట్టేసుకున్నానండీ! తప్పించుకు పోదామనుకున్నాడు యదవ "

"లేదమ్మా! నేను చెవులారా విన్నాగా! దసరా పండక్కి నయాపైసాతో తీరుస్తానన్నాడమ్మా వాడు " రాము సంజాయిషి.

"మధ్యలో నీ కెందుకురా వాళ్ల గొడవ?"

అమ్మ చివరికిలా అంటుందని రాము వూహించలేకపోయాడు పరోపకారానికి వెళ్లినందుకు సంతోషిస్తుందనుకున్నాడు. అసలు పరిస్థితిని ఎందుకు గ్రహించడం లేదీ అమ్మ. ఈ అయిలుగాడు ఎంత నిర్దయగా కొట్టాడా మద్దిగాణ్ణి? అదీ ముష్టి పదిరూపాయల కోసం! పదిరూపాయ లేమంత గొప్ప అని. తన పుట్టినరోజు పండక్కి ఇరవైరూపాయల రంగు కాగితాలే కొన్నారుగా ఇంటినిండా అలికించడానికి. తానే పెద్దవాడైతేనా, రాయితో ఎందుకొట్టేవాడు అయిలుగాణ్ణి? వాడి ముఖాన పది రూపాయలు విసిరేసి మద్దిగాణ్ణి విడిపించేవాడు కాదూ? అంతమందీ పెద్దపెద్ద వాళ్లు కూడా వుండి చూస్తూ నుంచున్నారు కాని ఒక్కరన్నా విడిపించారా మద్దిగాణ్ణి?

"అవునండమ్మగారూ! చినబాబుగారికి ఆ యూనాది వెధవతో ఏంటీ అంట! నా పదిరూపాయలూ పోయె—పైగా తలా పగిలె" వాదాని కుపక్రమించాడు అయిలుగాడు.

"పాపం ఎన్నిసేర్ల రక్తం కారిపోయిందో?" మరో కుర్రాడి సానుభూతి.

"మరేటనుకున్నావ్?" రెట్టించాడు రాజుగాడు.

"అంతగా రక్తం కారిపోతే ఇందాకా వచ్చేవారా ఏం?" అని అసహ్యించుకుంటూ అనేశాడు పెద్దన్నయ్య

"అన్నీ బొంకులేనండి రక్తం పోలేదేం పోలేదు!" అన్నాడు కుర్రాడు.

"మనవాణ్ణి మనం చక్కబెట్టుకోవాలిగాని వాళ్లతో వాదులాడి ఏం ప్రయోజనంరా?" అమ్మ పెద్దన్నయ్యను సంబోధిస్తూ విసుక్కుంది.

"వీడి తల పగిలిన మాట నిజం."

"మందూ, మాకూ కొనాలన్నా, కట్టు కట్టించుకోవాలన్నా వీడి దగ్గర డబ్బులేవీ?"

అసలు విషయాని కొచ్చాడు రాజుగాడు. అమ్మ కళ్లు గిర్రున తిరిగాయి. ఏం చేస్తుంది? పర్సులో నుంచి ఓ రూపాయి తీసి పెద్దన్నయ్య కిస్తూ "ఇచ్చెయి వాడికి" అని పురమాయించింది. పెద్దన్నయ్య ఆ రూపాయిని అయిలుగాడి చేతిలో పెట్టాడు.

"దీని కేమొస్తుందమ్మగారూ!" అయిగాడు దీనంగా ముఖం పెట్టాడు.

"కట్టు కట్టించుకుంటానికే చాలదమ్మగారూ!" రాజుగాడు రెట్టించాడు. "మరి డాక్టరు గారేమో, పాలు తాగమని తప్పకుండా ఆదేశిస్తారా?" అంటూ.

పొద్దున్నే మంచినెయ్యి తెప్పించడానికని రాము నాన్నగారు తనకిస్తే, తాను వక్కపొడి డబ్బాలో దాచిపెట్టిన ఐదు రూపాయల నోటు సంగతి గుర్తుకొచ్చింది అమ్మకు. మరి ఆ అయిదూ వీడి కిచ్చేస్తే నెయ్యి ఎక్కడి నుంచి వస్తుంది? మంచినెయ్యి లేకపోతే రేపు పండక్కి గారెలెలా చేస్తుంది? ఈ విషయాన్ని ఆయనకు తెలియకుండా దాయడం సాధ్యపడుతుందా?

అమ్మ అశక్తతను పెద్దన్నయ్య గమనించినట్టున్నాడు.

"అంతే! వెళ్లండిక! రూపాయంటే తక్కువేం కాదు!"

"అన్యాయం బాబుగారూ! బొత్తిగా అన్యాయమండీ!"

పాపం వాడి తల పగులగొట్టి ఒక్కరూపాయిస్తారా?" రాజుగాడు వకాల్తా ప్రారంభించాడు.

అయిలుగాడు "అబ్బో..." అంటూ నొప్పి నటించాడు. అమ్మ పెద్దన్నయ్యను ప్రక్కకు తప్పుకొమ్మని సైగ చేసి, "ఇప్పుడింతకన్నా లేవు...మళ్లీ ఎప్పుడన్నా తీసుకుందురుగాని.. వెళ్లండి" అని, చెప్పింది.

"అసలు ఇప్పుడే గిదండమ్మగారూ! డబ్బులు అవసరమయ్యేది?"

అమ్మ ఆలోచనల్లో పడిపోయింది. ఇంక వీళ్లు ఒక్కరూపాయితో వదిలేట్టు లేరని నిర్ణయానికొచ్చేసింది. రాము తండ్రి వచ్చేసే వేళ కూడా కావస్తోంది. ఆయన వచ్చేలోగానే ఈ పీడను ఎలాగైనా వదిలించేసుకోవాలి. పెద్దన్నయ్యను దగ్గరగా పిలుచుకుని "లోపల వక్కపొడి డబ్బాలో అయిదు రూపాయలున్నాయి! తీసుకొచ్చి వీళ్ల మొఖాన తగిలెయ్యి"

అని చెప్పింది. పెద్దన్నయ్య ఐదు రూపాయల నోటు తీసుకొని వచ్చి అయిలుగాడి చేతిలో పెట్టాడు బిచ్చపు కుర్రాళ్లు వంగి నమస్కారం చేస్తూ "చాలా తక్కువండి అమ్మగారూ! ఈ రోజుల్లో ఐదు రూపాయల కేమొస్తుందండీ! పదిరూపాయలన్నా అయితే ఎలాగో సర్దుకోవచ్చు!" అని ప్రాధేయ పడసాగారు కాని వాళ్లదేమీ సాగలేదు. చివరకి ఆరు రూపాయలు తీసుకొని యానాది కుర్రాళ్లంతా వెళ్లిపోయారు.

"నువ్వెక్కడికిరా! ఆగు!" అని అమ్మ గద్దించే సరికి రాము వెనక్కితిరిగి చూశాడు. ఎక్కడికో పారిపోవడంలేదు తాను. పెద్దన్నయ్య తలుపులు మూసేసి గొళ్లెం పెట్టేసిం తర్వాత, వరండాలో పెద్దమంచం మీద కూచుని మూలుగుతూ వున్న నాయనమ్మ గుర్తు కొచ్చింది రాముకు. నాయనమ్మ దగ్గర కెళ్లి కూచోవడమంటే రాముకు చాలా సరదా. ఇంట్లో అందరూ తన్ను కోప్పడ్డప్పుడు రాము వెళ్లి నాయనమ్మదగ్గరే కూచుని ఊరట చెందేవాడు. కన్నీళ్లు తుడవడం కన్నా నాయనమ్మ ఇలాంటి సమయాల్లో తనకే విధంగానూ సాయపడజాలదని రాముకు కూడా తెలుసు. నాయనమ్మ కూడా నాన్నకు భయపడుతుంది. నాయనమ్మ గుర్తుకు రాగానే రాము కాళ్లు వాటంతట అవే వరండా వేపుకు దారి తీశాయి.

అమ్మ వచ్చి రాము చెవి పట్టుకుని మెలేస్తూ అడిగింది.

"ఎందుకురా నువ్వువాడి తల పగులగొట్టింది?" అని.

"చెప్పాగా!"

"ఏం చెప్పావురా?" పెద్దన్నయ్య కూడా గద్దిస్తున్నాడు.

"చెప్పవేంరా! ఏం చెప్పావో చెప్పూ!" అమ్మ చెవిని మరింత మెలిపెడుతూ అడిగింది.

చెప్పినా వీళ్లకు అర్థం కాదనుకున్నాడు రాము. 'వాడు మద్దిగాణ్ని నిర్దాక్షిణ్యంగా కొట్టాడనీ, ఇంతంత పలుగురాళ్ల మీద పడేసి వాణ్ని ఈడ్చాడని'

తొలిచావు

చెప్పాడుగా ఇంతకుముందే.

అమ్మ చెవి వదిలేసి లెంపకాయ కొడుతూ అడిగింది.

"మద్దిగాడు నీకేమౌతాడ్రా?" అని.

"ఈ వెధవల్తో ఆడీ ఆడీ అన్నీ పాడల వాట్లు చేసుకుంటున్నాడు..." పెద్దన్నయ్య పురి వేస్తున్నాడు మధ్యలో.

"ఎన్నిసార్లు చెప్పానురా నీకు? ఆ బిచ్చపు వెధవల్తో ఆడుకోవద్దని. వాళ్ల పంచన చేరందే నిద్ర పడితేనా! మొండివెధవ.." మరో చెంపను చెళ్లుమనిపించింది అమ్మ. రాము కళ్ల నుంచి నిప్పులు కురిసినట్లయింది. శరీరంలో ఉన్న రక్తమంతా ముఖంలోకి చేరిపోయి, ముఖం ఎర్రగా కందగడ్డ అయిపోయింది. చెంపల్లో మంచి మంట లెగుస్తున్నాయనిపించింది రాముకు. కళ్లు తడి అయినాయిగాని ఏడవలేదు.

"ఎప్పుడు చూసినా ఆ శ్మశానంలోనేనయ్యె ఇప్పుడే ఇలాగైతే ఇంక పెద్దయ్యాక ఎవన చేతిలో ఉంటాడా అని!" మరోసారి చెంప చెళ్లుమన్నది అయితే ఈసారి రాముకు కళ్లు తిరుగలేదు. ఇందాకా ముఖంలోకి చేరి గడ్డ కట్టుకున్న రక్తమంతా క్రమంగా తిరిగి శరీరమంతటా వ్యాపిస్తున్నట్లనిపించింది శరీరంలో శక్తి పెరుగుతున్నట్లనిపించింది. మరో దెబ్బను ఎదుర్కోడానికని తల విదుల్చుకుని చెయ్యెత్తి పైకి చూసేసరికి తన్ను కొట్టడానికని ఎత్తిన అమ్మ చెయ్యి ప్రత్యక్షమైంది. మనసులో మరో బొమ్మ మెరసింది. తెల్లతెల్ల కంకర రాళ్ళ మీది నుంచి ఈడ్వబడుతూ, గుడ్డలు చిరిగిపోయి, రక్తం కారుతూ ఏడుస్తూ వున్న కుర్రాడి బొమ్మ అది చెప్పుదెబ్బలు తప్పించుకోవడానికి పాపం వాడు పదేపదే చేతు లెత్తుతూనే వున్నాడు.

రాము ఒక్కడుగు వెనక్కి వేశాడు. అమ్మ వాడి కుడి చెయ్యి దొరక పుచ్చుకుంది.

"ఎక్కడికిరా పారిపోతావు? చెప్పు! మళ్లీ ఇలాంటి పని చేస్తావా?"

రాము గట్టిగా చేతిని విదిలించుకుని "ఛీ" అంటూ వరండా వైపుకు తుర్రుమన్నాడు.

"ఆ ఏమన్నావు? ఎదిరిస్తున్నావా వెధవ" రామును పట్టుకోవడానికి అమ్మ ఒక్కడుగు ముందుకు వేసింది. వాడు దొరకలేదు. ఇక వాడి వెంట పరుగు పెట్టడం తన కెల్లాగూ సాధ్యం కాదనుకుని కాలికున్న చెప్పును వాడి వైపుకు బలంగా విసిరేసింది. వరండా దాటాడో లేదో చెప్పు వెళ్లి రాము తలమీద తగిలి క్రింద పడ్డది వాడక్కడే ఆగిపోయాడు. రెండు లెంపకాయలు చెయ్యలేని పని ఒక్క చెప్పుదెబ్బ" చేసి చూపెట్టింది రాము కళ్లనుంచి కన్నీళ్లు కట్టలు తెగి ప్రవహించసాగినయి.

కాసేపటికి రాము నాన్నగారు ఇంట్లో ప్రవేశించారు. నెక్ టై వదులు చేసుకుంటూ, కోటు గుండీలు విప్పుకుంటూ రోజులాగే సరాసరి లోపలికి వెళ్లిపోయారాయన. నాయనమ్మ మంచం మీద కూచుని తడక సందుల్లోంచి నాన్నను చూశాడు రాము. ఆయన కనుచూపు మేర దాటిపొయ్యాక చెవుల రిక్కరించి లోపల అవుతున్న శబ్దాలు విన సాగాడు. బూట్లు విప్పిన ధ్వని, పుక్కిలించి ఉమ్మేసిన ధ్వని, కాళ్లు కడుక్కున్న ధ్వని, అమ్మతో మాట్లాడు తున్న ధ్వని, ప్లేట్లు పరచిన ధ్వని, గిన్నెలోంచి ఫలహారం తీసి అమ్మ ప్లేట్లో పెట్టిన ధ్వని, ప్లేటు తీసుకొని నాన్నగారు కూచుని ఫలహారం చేసే చోటికి అమ్మ వెళ్లిన ధ్వని—

మళ్లీ చేతులు కడుక్కుని, పుక్కిలించి ఉమ్మేసిన ధ్వని కూడా విన్నాక ఇక రాము అక్కడ ఉండలేక పొయ్యాడు. మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలి వేపుకు దారి తీశాడు. నాయనమ్మ "హు" అంటూ చేసిన హెచ్చరికకు ఒక్కనిమిషం ఆగాడు కాని, దాని అర్థం బోధపడక మళ్లీ నడక సాగించాడు. లోపరికి చేరాడు. మెల్లగా పిల్లికూన లాగ వంటింట్లోకి చేరాడు.

"ఎందుకొచ్చా విక్కడికి?" అమ్మ కోపంగా ప్రశ్నించింది.

"ఆకలమ్మా!"

"ఆకలా? అసలు నీకి పూట పస్తు! చెప్పాగా!"

"బాగా ఆకలేస్తున్నదమ్మా!" దీనంగా ప్రార్థించాడు.

"ఏమైనాసరే, ఇవాళ నువ్వు అలా ఆకలితో ఏడాల్సిందే నీకిదే శిక్ష."


"సంగతేమిటసలు" పెరట్లో పచార్లు చేస్తున్న నాన్న అడిగారు. ఆయన గొంతులో మామూలుగా ఉండే గర్జన అయితే వుందిగాని, కోపం కత్తుల ఝుళిపింపులులేవు. నాన్న అంత చెడ్డవాడు కాదు .. అమ్మ అనవసరంగానే నాన్న పేరు చెప్పి తన్ను బెదిరిస్తుందికాని." అనుకున్నాడు రాము.

"చూడు నాన్నా! అమ్మ అన్నం పెట్టనంటూ వుంది!" అన్నాడు గోముగా.

"నా మీద చాడీలు చెప్పడానికి బయల్దేరాడన్న మాట. తాను చేసిన ఘనకార్యాన్ని కూడా చెప్పమనండ మరి!"

"అసలేం జరిగింది?"

"చూడు నాన్నా ." అంటూ పచార్లు చేస్తున్న నాన్న అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తూ చెప్పసాగాడు రాము.



"ఆ అయిలుగాడులేడు నాన్నా!...ఆ అయిలు గాడేమో ."

"ఊ"

"ఆ అయిలుగాడు మద్దిగాణ్ణి కొట్టాడు నాన్నా!"

"ఎందుకని?"

"మరేమో వాడికి మద్దిగాడు పదిరూపాయలు బాకీ అంట నాన్నా!"

"ఈ యానాది వెధవలకు ఎప్పుడూ తగువులే!"

"అవును నాన్నా.. పాపం ఆ మద్దిగాణ్ణి వీడు కంకరరాళ్ల మీద పడేసి చెప్పుతో కొడుతూ లాగాడు నాన్నా!"

"ఆ!"

"రామాయణమంతా చెపుతాడే కాని తాను చేసింది చెప్పడేం?"

"ఏం చేశాడేం మా చిట్టినాన్న!"

"ఏం చేశాడేమిటి? ఆ అయిలుగాడి తల పగుల గొట్టాడు." అమ్మ ఈ మాట అనగానే రాము ఎక్కడ నుంచున్నాడో అక్కడే ఆగిపోయాడు. పచార్లు చేస్తున్న నాన్న రెండడుగులు వేసి వెనక్కి తిరిగాడు.

"అయితే నువ్వు అయిలుగాడి తల పగులగొట్టా వన్నమాట."

రాము సమాధానం చెప్పలేదు. నాన్న గొంతులో కోపపు కత్తుల రుళిపింపు గోచరించింది.

"చెప్పవేం!" గర్జించాడు నాన్న.

ఈసారి కూడా రాము ఏమీ పలుకలేదు.

"పైగా వాడి మీదే చెప్పడానికి బయల్దేరావన్న మాట. వాడే కనుక ఎదురు తిరిగి నాలుగు పుచ్చుకుని వుంటే ఏమయ్యేది? నలుగురిలో మన పరువూ ప్రతిష్ఠా బూడిద పాలయ్యేదేనా? అగో.. వాడు మద్దిగాణ్ణి కొడితే నీకేం? చీలిస్తే నీకేం? వాళ్లూ వాళ్లూ తన్నుకుని చస్తే మధ్య నీకెందుకూ అంట! వేలెడంత లేవుగాని ఇన్ని విపరీతపు బుద్ధులా?"

"నేననేది అదేనండి. ఇప్పటినుంచే బుద్ధి చెప్పక పోతే వీడిక మన చేతికొస్తాడా అని! అందుకే ఈపూట పస్తు పడుకో బెట్టాలనుకున్నాను."

"ఒక్కపూట తిండి లేనంతలో వీడి కావరం వంగుతుందా? గోడ కుర్చీ వేయించాలి! పదరా పద! గోడ కుర్చీ వెయ్యి!"

రాము తాను నుంచున్న స్థానం నుంచి కదలక పోయేసరికి నాన్న కంఠం వేల మేఘాలు ఒక్కసారి గర్జించినట్లు గర్జించింది. "కదుల్తావా లేదా?" అంటూ. రాము కంపించిపోయాడు. బిక్కుబిక్కు మంటూ వెళ్లి వరండా గోడకు గోడకుర్చీ వేశాడు.

దీపాలు వెలిగాయి. నాయనమ్మ తప్ప అంతా భోజనాలు చేశారు. సాయంకాలం పూట నాయనమ్మ భోజనం చెయ్యదు. అమ్మానాన్నా వాళ్ళ గదుల్లోకి వెళ్లిపోయారు. రాము మాత్రం అలాగే గోడకుర్చీలో ఉండిపోయాడు. చేతులు కాళ్లు లాగుతున్నాయి. నడుం నొప్పి పుడుతూ వుంది. ముఖం కందగడ్డ యింది. చెవుల్లో మంటలు మండిపోతున్నాయి. రాము అంతస్సులో ఉన్న ఏదో వస్తువు దాన్ని ఆత్మాభిమానం అంటారో వ్యక్తిత్వం అంటారో రాముకు తెలియదుగాని ధనుస్సు లాగా వంగి బిర్ర బిగుసుకుని పోయినట్లయింది. తాను తప్పు చెయ్యలేదన్న ఆత్మ విశ్వాసం రాయిలా గడ్డ కట్టుకునిపోయి ఈ వంగిన ధనుస్సుకు ఆధారం అయింది మెల్లగా వంటింట్లోకి దూరి దొంగతనంగా ఏదేనా తినేద్దామని ఒకటి రెండు సార్లు అనిపించింది గాని, చెవుల్లో ఎవరో తన్ను హెచ్చరించినట్లయి ఆ ఆలోచనను విరమించుకున్నాడు. ఆ చెవుల్లో చెప్పిన మాటలు ఇంకా గింగురుమంటూనే వున్నాయి. "ఔను—నీపట్ల అన్యాయం జరుగుతోంది, అక్రమం జరుగుతుంది, ఈ అక్రమాన్ని ఎలాగైనా ఎదుర్కో... కాని దొంగతనంగా మాత్రం వద్దు." అని. అవును దొంగతనంగా వెళితే నాయనమ్మ ఏమనుకుంటుంది. ఇదంతా చూస్తూ నాయనమ్మ ఎందుకలా నోరు మూసుకొని కూచున్నది? ఏమి తలపోస్తూ వున్నదో!

కాని మరోవైపు కడుపులో ఎలుకలు పరుగు తీస్తున్నాయి. ఏదో శక్తి తన్ను తన అంతస్సును పళ్లతో కొరుకుతున్నట్లనిపించింది. ఈ శక్తి అంతకు ముందు వరకూ గడ్డ కట్టుకునిపోయి ఉన్న దాన్ని కరిగించి వేసింది. ఆ కరగడం కరగడం అదంతా కన్నీరై కళ్ల గుండా ప్రవహించసాగింది.

నాయనమ్మ మెల్లగా తన మంచం మీదినుంచి లేచి, గోడకు కుర్చీ వేసుకుని వున్న తన వద్దకి వచ్చింది. మొదట తన తలను నిమిరింది అరచేత్తో. గోడకుర్చీలో నుంచి లేపి చక్కగా నుంచోబెట్టింది. కాళ్ళు తడబడితే తన చేతిని ఆసరా ఇచ్చి సాయపడ్డది. హృదయానికి హత్తుకుని ఓదార్చింది.

"బాగా ఆకలేస్తుంది నాయనమ్మా!"

"నాకు తెలుసునాన్నా. పో.. మా నాయనగదూ! వెళ్లి నాన్న దగ్గరి కెళ్లి క్షమాపణ వేడుకో. పోనాన్నా, వాడు తప్పక క్షమిస్తాడు."

"క్షమాపణా?.. ఎందుకు?.. నాయనమ్మా!.."

"కాదు నాన్నా! నాకంతా తెలుసు గదా! మరి అన్నం దొరకదుగా! ఓ వైపు ఆకలి, మరో వైపు ఈ గోడకుర్చీ..."

రాము తల తిరిగిపోయింది. తన అంతస్సులో గడ్డ కట్టుకుని వున్న ఆ వస్తువు ఎప్పుడు కరిగిపోయి జాడ లేకుండా మాయమైపోయింది. మెల్లగా, కాళ్లీడ్చుకుంటూ నాన్న గది తలుపుల దాకా వెళ్లాడు. లోపల నాన్నగారు మెళకువతో ఉన్న అలికిడి విన పడుతూనే వున్నది. మెల్లగా తలుపు ప్రక్కనచేరి "నాన్నా! నన్ను క్షమించండి నాన్నా! ఇకనుంచి తప్పుడు పనులేమీ చెయ్యను నాన్నా!" చివరి మాట అంటూ ఉండగా రాము అంతస్సులో ధనుస్సు ఆకారంతో వంగి బిగుసుకుపోయిన ఆ వస్తువేదో ఫడేల్న విరిగిపోయి కళ్లలో నుంచి దుఃఖం కట్టలు తెంచుకుని ప్రవహించింది. ●

ఎప్పుడూ అందంగా కనిపించాలి!

శ్రీమతి విద్యాకనకతంగం



శ్రీమతి విద్యా

శిరోజాల్ని నిగనిగలాడుతూ ఆరోగ్యవంతంగా వుంచుకోవాలంటే ఏం చేయాలో ఈ వారం తెలుసుకుందాం.

శిరోజాలు రాలిపోవడం, నెరయడం, నెత్తి మీద చర్మానికి పుండ్లుపట్టడం, దురద—ఇటువంటివన్నీ సాధారణంగా కనిపించే సమస్యలు. నెత్తి మీద చర్మాన్ని, శిరోజాల్ని ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచుకున్నా ఏదో ఒక లోపం తరచు ఎదురవుతూనే వుంటుంది. శుభ్రంగా ఆహార నియమాల్ని పాటిస్తూ సమీకృతాహారాన్ని తీసుకునేవారికి ఇలాంటి బెడదలేవీ వుండవు. అందరికీ అది సాధ్యం కాదుగా మరి. మంచి యుక్త వయస్సులో వున్న వాళ్ళకే యిలాంటి పరిస్థితి తటస్థించినప్పుడు చాలా దుర్భరంగా వుంటుంది. ఆడవారికి కూడా బట్టతల రావడం, లేదా అలాంటి ఛాయలు కనిపించడం అక్కడక్కడా మనం చూస్తూనే వుంటాం.

అశ్రద్ధ చేసి ఏ యాభయ్యోపడి వచ్చిన తర్వాతనో ఆ నూనె యీనూనె రాసి ఇటువంటి వాటిని దూరం చేసుకోడానికి ప్రయత్నిస్తూ వుంటారు. ముందుగానే జాగ్రత్త తీసుకుంటే యాభై యేళ్ళొచ్చినా జుట్టు నిగనిగలాడుతూనే వుంటుంది. ఏ సుగుణానికయినా ఆహార నియమాలు ముఖ్యం.

ఆహారం

ఎక్కువగా పాలు తాగాలి. కనీసం రోజూ ఒక కప్పు అయినా తీసుకోవాలి. తాజా పళ్ళు, కూరగాయలు వాడాలి. మాంసాహారులయితే సముద్ర జలచరాలు మేలు చేస్తాయి. చేపలు, రొయ్యలు, పీతలు—ఇవి చక్కని ఆహారం. ఇక్కడ మళ్ళీ ఎక్కువ నూనె వస్తువులు వాడకూడదు. తీపి సరకు తినకూడదు. కావలసిన పాళ్ళలో విటమినులు, ప్రొటీనులు మీ తినే ఆహారంలో లభించడం లేదనుకుంటే— ఆహారం తీసుకున్న తర్వాత ఒక 'మల్టివిటమిన్ టేబ్లెట్' అవసరం.

శిరోజాల పరిశుభ్రత

పైన చెప్పిన విధంగా అనుసరించడమే కాకుండా శిరోజాల్ని, చర్మాన్ని శుభ్రంగా వుంచుకోవడం మరింత ముఖ్యం. 'షాంపూ' నుపయోగించి తల కడుగుకుంటే మంచిది. కనీసం వారానికొక సారన్నా ఇలా చేయాలి. మామూలుగా వారంవారం 'ఆయిల్ బాత్' చేయొచ్చు. షాంపూ నుపయోగించి వెంట్రుకల్ని శుభ్రపరచినందు వల్ల జిడ్డు వదిలిపోతుంది, జుట్టును బాగా ఆరబెట్టాలి. సూర్యరశ్మి వెంట్రుకలకు ఒక ఆహారం లాంటిదే. తర్వాత ఒకేరకం నూనె పట్టించడం మంచిది. పలురకాల నూనెలు మార్చడంవల్ల నష్టం వుంది. నూనె పట్టించేప్పుడు కూడా కొన్ని జాగ్రత్తల్ని పాటించాలి. నెత్తినిండా నూనె రాసి వెంట్రుకల్ని నూనెలో ముంచడం వల్ల మొక్కకు బోదినిండా నీళ్ళు పోస్తే ఏమవుతుందో అదే ఫలితం దక్కుతుంది. తగుమాత్రం నూనెను మునివేళ్ళతో మాడునెత్తిన పట్టించి తర్వాత వెంట్రుకల చివరి వరకు రాయాలి. అలా రెండుమూడు నిమిషాలు మర్దనా చేయాలి. అప్పుడు వెంట్రుకలకూ వూపిరి సల్పుతుంది, మొహం మీదికి నూనె కారకుండా మీకూ హాయిగా వుంటుంది. మామూలుగా వెంట్రుకలు ఎదిగేందుకు తగిన నూనె ఆహారాన్ని వాటి కుదుళ్ళలో నుంచి సంపాయించుకుంటూనే వుంటాయి గనక, మీరు స్వల్పంగానే సహాయం చేయాల్సి వుంటుంది.

వెంట్రుకలు నెరయడం, రాలిపోవడం

మీ వెంట్రుకలు గనక వూడిపోతూ వుంటే ఒక పని చేయొచ్చు. 'బ్రూవర్స్ యీస్ట్ టేబ్లెట్' అనే అవుషధం ఒకటుంది. అవి రెండుమూడు బిళ్ళల్ని తీసుకుని సుమారుగా అయిదు చుక్కలు 'పంతోతెనిక్ ఏసిడి ఆయిల్'ను కలిపి మునివ్రేళ్ళతో నెత్తి మీద మర్దనా చేసినట్టయితే, ఇది వెంట్రుకలు నెరిసిపోతున్న వాళ్ళకు కూడా బాగా పని చేస్తుంది. దువ్వడం వల్ల కూడా వెంట్రుకలన్నిటికీ నూనె అంటి మంచి పని చేస్తుంది. ఇలా రోజూ చేయడం వల్ల జుట్టు సహజమైన రంగులో చూడ్డానికి అందంగా కనిపిస్తుంది. కాని సరయిన ఫలితం కనిపించడానికి ఆరుమాసాల నుంచి ఒక సంవత్సరం దాకా పడుతుంది.

చుండు

చుండు సాధారణంగా తలను, వెండ్రుకల్ని శుభ్రంగా వుంచుకోవడం ద్వారా పోతుంది. పోని పక్షంలో 'విటమిన్ డాండ్రఫ్ షాంపూ'తో వెంట్రుకల్ని కడుగుకుంటే పూర్తిగా నయమవుతుంది. వారానికి రెండుసార్లయినా ఈ ఆయిల్‌తో తలమీద మర్దనా చేసుకుంటే సుగుణం కనిపిస్తుంది. తల దువ్వుకోడానికి ఉపయోగించే దువ్వెనలు, బ్రష్‌లు చాల శుభ్రంగా వుంచుకోవాలి. వారంవారం వాటినీ 'డెట్టాల్'తో శుభ్రపరిస్తే మంచిది. తలగడ గలీబుల్ని వారానికి రెండుసార్లయినా మార్చాలి. క్రీముల వల్ల, లోషన్ల వల్ల బ్యూటీ క్లినిక్‌ల్లో చేసే చికిత్సకు వెంటనే గుణం కనిపిస్తుంది.

రంగులు (డయ్స్, టింట్స్)

ఇటువంటి జుట్టుకు రంగులు వేయడం కేవలం తాత్కాలికంగానే పనిచేస్తాయి. మహా అయితే నెల్లాళ్ల కంటే ఎక్కువ నిలవ్వు. ఇది కూడా ఎంతో మెలుకువగా వేయాలి. కొన్ని నవకబారు రంగులు చర్మానికి ఎంతో హాని చేస్తాయి. జుట్టుకి రంగు వేయబోయే ముందు ఆ రంగు తమ చర్మానికేమైనా చెరుపు చేస్తుందేమో అని అందు గురించిన జాగ్రత్త ముందుగానే తీసుకోవడం అవసరం.

మీ సమస్యలకు సమాధానాలు

కుమారి డి. పి., బెజవాడ, శ్రీమతి టి. టి. యల్., అనంతపురం, శ్రీమతి యల్. సి., కడప, కుమారి సి. టి. పి., హైదరాబాదు.

నా పై పెదవి మీద వెంట్రుకలు లేచాయి. ఇవి పోవాలంటే ఏంచేయాలి?

* పై పెదవి మీదగాని, ముఖం మీదగాని మరెక్కడైనా వెంట్రుకలు లేచినట్టయితే 'ఎలక్ట్రాలిసిస్ ట్రీట్‌మెంట్' అనే ఒక చికిత్స వుంది. దానివల్ల పోతాయి. కాని ఇది చాల ఖరీదైన చికిత్స. బాధాకరం కూడాను. పూర్తిగా పోయేందుకు ఒక సంవత్సరం పట్టొచ్చు. మరో సులభమైన మార్గం ఒకటుంది. అది 'అడెర్సిడ్రగే' పద్ధతి. పదివన్నెండు చికిత్స అయితే చాలు ఒక్కొక్కటి ఒక్కొనెలకు చేయాలి. ఇవి ప్రతి బ్యూటీ క్లినిక్‌లోనూ చేస్తారు. ఇంటి దగ్గరయితే 'హెయిర్ రిటార్డింగ్ క్రీమ్'ను వుపయోగిస్తే సత్ఫలితాలు కనిపిస్తాయి.

శ్రీమతి టి., గూడూరు, యస్. డి., హైద్రాబాదు, సి. బి, చీరాల, కుమారి పి. సి., గుంతకల్లు, యమ్. యమ్, గుంటూరు.

రెండుమూడు శిరోజాలంకరణ ప్రక్రియల గురించి నేర్చుకుందామని వుంది. పార్టీలకు, సాయంత్రాలకు వెళ్లేముందు 'మేకప్' గురించి మీ కేంద్రంలో ఏమైనా నేర్పుతారా?

* శిరోజాలంకరణలు, మేకప్, మీమీ శరీరఛాయకు తగిన విధంగా ఎలా చేసుకోవాలో నేర్పుతూ, అందాన్ని ఇనుమడించుకోవడం గురించి మరిన్ని సలహాలిస్తూ వుంటాము.

శ్రీమతి డి. డి. హెచ్., నెల్లూరు, పి. ఆర్., (విజయవాడ)— సన్నబడడానికి మీరిచ్చిన సలహాలు

(64 వ పేజీ చూడండి)


స్వల్ప ఖర్చుతో హెచ్చు ఉత్పత్తి

టాటా స్టీల్ కర్మాగారములోని ఆరు అధిధమన భ్రాష్ట్రములు (Blast Furnaces) ప్రతి కొద్ది సంవత్సరములకు బాగుచేయవలయును. ఈ పనిని ఉక్కు పనివాండ్రు అంతర పటలములను మార్చుట (Relining) అందురు. ఇది చాల కష్టమైన పని. ఈ పనికి వేలకొలది టన్నుల ఉష్ణ నిరోధక యిటుకలు, ఉక్కు, ఇనుప పోతలు అనేక మైళ్ళ పొడవైన ఎలక్ట్రిక్ తీగెలు మరియు గొట్టములు అవసరము. నిపుణులైన ఇంజనీర్లు, పనివాండ్రు కూడా అవసరము. అడుగడుగునకు ఈ పని యొక్క ప్రతి వివరము ముందుగా ఆలోచించి తరువాత చర్యతీసుకొనబడును. ఇంజనీర్లు, పనివాండ్రు కలసి రాత్రింబవళ్ళు గడియారమువలె శ్రమపడి ఈ పనిని అతి తక్కువ కాలములో స్వల్ప ఖర్చుతో పూర్తి చేయుదురు.

అనేక సంవత్సరములనుండి ఈ పనిలో టాటా స్టీల్ వారి అనుభవము అభివృద్ధి చెందినది. 1957 లో అధిధమన భ్రాష్ట్రము యొక్క అంతర పటలముల మార్చుటకు 99 దినములు పట్టెను. 1963 ఆరంభములో ఈ పనిని 74 దినములలో పూర్తిచేసి అమోఘమైన రికార్డును నెలకొల్పిరి. కాని 6 నెలలలోనే అదే పనిని 64 దినములలో ముగించిరి.

కాని, ఇంతటితో ఈ అభివృద్ధి అంతము కాలేదు. ఏ అంతర పటలములను మార్చుటకు 1957 లో 99 దినములు పట్టెనో ఇప్పుడు ఆ పనిని 57 దినములలో చేసిరి. ఈ విధముగా మిగిల్చిన కాలమును అత్యావశ్యకమైన ఉక్కును ఉత్పత్తి చేయుటకు వినియోగించుదురు.

వీలగునంత తక్కువ కాలపరిమితిలో పనులను మనస్ఫూర్తిగా, ఎడతెగని యత్నముతో చేయుట మరియు నదితరమైన రికార్డును నెలకొల్పుటలో కంపెనీవారి లక్ష్యము ఖర్చులను తగ్గించుట, ఉత్పత్తిని హెచ్చించుట.



The Tata Iron and Steel Company Limited

TN 2034

ఎన్. టి. రామారావుతో ఆరుగంటలు



అది వీనస్ స్టూడియో. అక్కడున్న వాళ్ళంతా యాత్రికుల్లా తీర్థ ప్రజల్లా చెట్ల క్రింద సేద దీర్చుకుంటున్నారు. అంత కోలాహలమూ, హడావుడీ అక్కడుంది. నేనూ చోటు చేసుకుని కూర్చున్నాను.

నవ్వుతూ పేలుతూ ఖులాసాగా కబుర్లాడు కొంటున్న పలుగురైదుగురు అక్కలు, వాళ్ళ తాలూకు అమ్మలు అక్కడే వున్నారు. జిడ్డోడు తున్న మొహాలు, షూటింగు పూర్తి చేసుకున్నవని తెలుస్తూనే వుంది.

"నాకో వేషమిప్పించరూ...?"

ఓ కలకంఠి కంఠం ఘల్లుమంది.

ఉలిక్కిపడి అటుచూశాను. నన్నుకాదు.ఆ ప్రక్కనే కూర్చున్న ఒక ప్రొడక్షన్ మేనేజర్ని అభ్యర్థిస్తున్న కంఠం అది.

గొంతు సవరించుకున్నాడు ప్రొడక్షన్‌మేనేజర్. 'చూద్దాం...' అన్నాడు.

వేషమిప్పించడంలో అతని కెంత చొరవ వుందో తెలియదుగాని, కొంచెం ధీమాగానే సమాధానం ఇచ్చాడు.

"అందరూ చూద్దాం చూద్దామనే వారేగాని... ఇస్తామనే వాళ్ళొక్కరూ లేరేమిటండీ..." అందామె అనుభవైక వేద్యంగా.

సంభాషణ అలా పొడుగవుతూ వుండగా, తోట సుబ్బారావు గార్ని కలుసుకొని రామారావు వస్తారని నిర్ధారణ చేసుకుని మళ్ళీ యథాస్థానంలో కూర్చున్నాను.

అక్కడున్న వాళ్ళంతా అదో రకం మనుషులు. కొందరు తాడూ బొంగరం లేనివాళ్ళు. స్టూడియోలో వుండడమంటేనే సురలోకంగా భావించి, వచ్చిన దానితో సంతృప్తిపడి జీవితాలు వెళ్ళబుచ్చే వాళ్ళు మరికొందరు. వారి భావిని తెలుసుకోవాలనే ఉత్సాహం కల్గింది. ప్రక్కనే వున్న ఒకరిని అడిగాను, 'జీవితం నిరుత్సాహంగా లేదా' అని. "హీరో వేషం వేయాలని వచ్చాను. చూశారుగా, ఇదీ పరిస్థితి. రానురాను అలవాటు పడిపోయామనుకొండి" అన్నాడతను.

సద్దుమణిగిన జాడ తెలిసింది. ఎక్కడ వాళ్ళక్కడ లేచిపోతూ నమస్కార బాణాలు విసిరేస్తున్నారు. 'గురి' వైపు చూశాను. ఈ బాణాలకు తట్టుకొంటున్న వారు రామారావు. శ్రీ యన్. టి. రామారావు. షూటింగ్‌కు రెడీగా సర్వాలంకార భూషితుల్లు...

• తంగుతంగులు రెండు నిగ్రహం దగ్గరికి వెళ్ళి నా 'ఫలానా' చెప్పి, నేనూ ఓ బాణం విసిరేశాను. ఈ బాణం ఆయన్ను కొంచెం కదిలించింది.

"..అబ్బ.. క్షణం తీరిక లేదండి, కాల్‌షీట్లు చాలా బిజీగా వున్నాయి. వూపిరి తీసుకోవడానికి కూడా అవకాశం లేదనుకోండి.. రండి..." అంటూ లోపలి కాహ్వానించారు.

ఆ రమ్మన్నది సెట్‌లోకి. శ్రీదేవి ప్రొడక్షన్స్ 'భువనసుందరి కథ' కోసం వేసింది. చూసీచూడగానే అదొక చాకలోడి యిల్లని తెలిసిపోతూ వుంది.

"వీరికి కుర్చీ వేయండి.." అన్నారు తనూ కూర్చుంటూ రామారావు.

"అంతా రెడీసార్..." అన్నారొక అసిస్టెంట్ డైరెక్టర్ చాలసేపటి నుంచి రామారావుగారి కోసమే ఎదురు చూస్తున్నట్టు.

వెంటనే ఆయన సెట్‌లో చొరబడ్డారు.

రిహార్సలయిపోగానే 'టేక్' అన్నారు.

ముగ్గుబుట్ట లాంటి తల విగ్గును తీసేసేసరికి అక్కడొక చూడచక్కని రాకుమారుడు ప్రత్యక్షమయ్యాడు. (రాకుమారుడు రామారావుగారే). అప్పుడే ప్రవేశించిన ఎల్లి (వాణిశ్రీ) ముసలివాడి స్థానే రాకుమారుణ్ణి చూసి విస్తుపోయింది.

"ఆ.. నువ్వు వయసోడివేనా సామే.." అంది తన సంభ్రమాశ్చర్యాలన్నీ ఆ మాటల్లోనే వంపి.

రాకుమారుడు మందహాసంగా నవ్వాడు.

ఎల్లి అన్నం గిన్నె మూత తీసి చూసింది. రాకుమారుడు అన్నం తిన్నట్టు ఎక్కడా కన్పించలేదు. ఆమెకేమీ బోధపడలేదు.

"అదేటి సామే.. పెట్టింది పెట్టినట్టే వుండాది.., ముట్టుకున్నట్టు లేదే.? మనసులో ఏదో కట్టం వున్నట్టుందాగి. సెప్పు సామే.. సగం కట్టం తీరుద్ది.." కష్టంలో పాలుపంచుకునే దానిలా అంది ఎల్లి.

రాకుమారుడు వుస్సురని, అన్నాడు—

"ఎల్లమ్మా, నా కష్టాలు చెప్పుకుంటే తీరవు .."

"అంతేనా సామీ..?" అన్నారెవరో? నలువైపులా పరిశీలించాను. డైరెక్టరు సి. పుల్లయ్యగారు గుబురు మీసాల్లోంచి తెల్లగా నవ్వుతున్నారు. ఆయన కాదు. మరింకెవరై వుంటారు? కెమెరా అడ్డుంది. అడ్డు తొలగి వచ్చిన గూని చాకలి మాటలవి. ఆమాటల్లో సానుభూతి వుంది. చాపల్యం వుంది. అవడానికి గూని చాకలే అయినా అనుభవం ఉట్టి పడుతోంది. నివురు గప్పిన నిప్పు అనుకున్నాను. తర్వాత తెలిసింది. ఆ గూని చాకలి ఎవరో కాదు ప్రఖ్యాత కన్నడ నటుడు ఉదయ్‌కుమార్.

రాకుమారుడు మారువేషంలో చాకలి తిప్పన్న యింట్లో చేరతాడు. తిప్పన్న భార్య ఎల్లి. అతను ముసలివాడు కాదని రాకుమారుడని ఎల్లి ముందే కనిపెట్టేసిందిగా! తిప్పన్న కూడా గ్రహించేశాడు. రాకుమారుడు ఏదో కష్టంలో వుండి ఈ నాటకమంతా ఆడుతున్నాడని తెలుస్తూనే వుంది. కష్టం వేరుగా చెప్పాలా? రాకుమార్తెను కలుసుకోవడమే!

మరో 'టేక్'లో పరుగెత్తుకొచ్చిన తిప్పన్న చెమట్లు కక్కుతున్నాడు. అతన్ని 'బట్టలమూటేది?' అని గద్దించింది ఎల్లి. 'ప్రాణాలు దక్కించుకొని బయటపడ్డాను' అన్నాడు తన భయాన్ని వ్యక్తం చేసి బట్టల మూటను మరపించ వేయాలని...

సి. కనకాంబరరాజు

పూహా. ఎల్లికి అతని మీద జాలి వేయలేదు. ఖేద పడింది. "రాకుమారికి పిచ్చి పట్టిందట, ఇంకా దెయ్యం పట్టి అందర్నీ బెదరగొడుతోంది..". ఆయాసపడుతో తన భయానికి కారణం చెప్పాడు తిప్పన్న. రాకుమారుడి మనసు బేజారయిపోయింది. "రాకుమారికి దెయ్యం పట్టిందా?" అన్నాడు. తిప్పన్న బట్టలమూట వదిలి వచ్చేసినందుకు తెస్తావా చస్తావా అని కూర్చుంది ఎల్లి. నేను తెస్తానన్నాడు రాకుమారుడు. నువ్వెళ్తే మక్కెలిరగ తంతారన్నాడు తిప్పన్న. రాకుమారుడికో మంచి ఉపాయం తట్టింది. పరకాయ ప్రవేశ మంత్రం తనకు కరతలామలకం. ఆ మంత్ర ప్రభావంతో తాను చాకలోడి రూపంలో వెళ్తే రాకుమారిని చూడొచ్చు ననుకున్నాడోయేమో! మంత్రాన్ని తిప్పన్న కుపదేశించాడు. మంత్ర ప్రభావంతో తాను చేపలో ప్రవేశించి, అందులో నుంచి తిప్పన్నలోకి పరకాయ ప్రవేశం చేశాడు. ఇంకేముంది, శరీరాలు మారిపోయినయ్. ఇది రసవత్తరమైన ఘట్టమే కాకుండా నటనకు గీటురాయి కూడాను. శరీరాలు మారిపోయిన తర్వాత తిప్పన్న రాకుమారుడుగా లేచాడు, రాకుమారుడు తిప్పన్నగా లేచాడు. తిప్పన్న కాయంలో వున్న రాకుమారుడు లేచి తన యథాపూర్వంగా ఎగగట్టిన పంచె సరిచేసుకుందామని యత్నిస్తాడుగాని, గూని ఒక చరుపు చరిచి చాకలోడివోయ్, అంటుంది. ఇప్పుడు రాకుమారుడి వేషంలో వున్న తిప్పన్న లేచి 'అద్దిరబన్నా.' అంటూ పాదం మీద తట్టి అంటిపెట్టుకున్న పంచె అంచును ఎగ్గట్టాడు. అంతా ఒక్కక్షణంలో జరిగిపోయింది. పుల్లయ్యగారు మీసాలు సవరించుకుని కుర్చీ మీతకు వచ్చారు "అందుకే మిమ్మల్ని యుంటి రామారావన్నారు" అన్నారు సమయస్ఫూర్తికి మెచ్చుకుంటూ ఒకరు. రామారావు చేసినట్టే తనూ చేయడానికి సమకట్టారు ఉదయ్‌కుమార్. ఇది నటనలో నటన. ఒకచేత్తో పాదాన్ని తట్టి రెండో చేత్తో పంచె నెగ్గట్టారు. ఆయనకది రాకకాదు. చోద్యం చూడాలని, తమాషా చేయాలనీను. 'అలకాదోయ్' అంటూ మళ్లీ చేసి చూపించారు రామారావు!

సరే, రాకుమారుడు పరకాయ ప్రవేశం చేసి బట్టలు తీసుకొస్తాడు. (క్రిందటిరోజు షూటింగ్‌లో ఇక్కడతని కోరిక సిద్ధించిందిట!) అతను తెచ్చిన బట్టలమూటను తీసుకుని తిప్పన్న రేవు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. శరీరాలు మార్చుకున్నా! వెళ్లమన్నాడు రాకుమారుడు. తిప్పన్నకు దుర్బుద్ధి పుట్టింది. ససేమిరా వప్పుకోలేదు. తిప్పన్న అందంగా లేడని పెళ్లయినప్పటి నుంచి ఎల్లి పోరు పెడుతోంది. అంచేత ఈ అవకాశాన్ని అతను వదలదల్చుకోలేదు. దౌర్జన్యం చేయబోయిన గూని రాకుమారుడ్ని విదిలించి వేశాడు. రాకుమారుని అశక్తత మనల్ని చలింపజేస్తుంది. భంగపాటుకు కుమిలిపోతున్న రాకుమారుడి భుజం మీద బట్టలమూట పడేసి, అతన్ని బలవంతాన రేవుకి పంపాడు తిప్పన్న. పైగా 'తొందరగా ఎల్లిని పంపమ'ని పురమాయించాడు. తన అందాన్ని అద్దంలో చూసుకుని మురిసిపోసాగాడు. ఇంతవరకు జరిగిన ఈ వ్యవహారం తర్వాత రసాభాస అయిపోతుందన్నారు నిర్మాత.

ఎడతెరపి లేకుండా ఒకదాని తర్వాత మరొక 'టేక్'కు రెడీ అవుతూ, ఉదయకుమార్ అడపాదడపా ముఖానికి 'స్ప్రే' కొట్టించుకొంటున్నారు. అది కాస్త చల్లదనాన్ని ప్రసాదిస్తుంది మరి!

"మాటలు తడబడుతున్నాయ్.., నిద్రపోయి సుమారు పదిహేను రోజులైందనుకోండి. రోజుకు రెండుగంటలు నిద్రపోతే రోజంతా నిద్రపోయినంత ఆనందంగా వుంటుంది. బొత్తిగా రెస్టు లేదు." అన్నారు ఉదయకుమార్.

"మాయింట్లో తెలుగే మాట్లాడుకుంటాం. మీ తెలుగులాంటిది కాదు. కొంచెం యాసగా వుంటుంది." అన్నారాయన.

"సుబ్బారావుగారి కసలు శ్రమే వుండదు .. చూడండి ఆయన పర్సనాలిటీ.." అన్నారు ప్రక్కనే వున్న శ్రీదేవి ప్రొడక్షన్స్ ప్రొడ్యూసర్ తోట సుబ్బారావు గార్ని చూపించి.

"అవునండి.., నేను చిన్నప్పుడు వ్యవసాయం చేసేవాడ్ని. నాగలి దున్నడం దగ్గర్నుంచి బస్తాలు మొయ్యడం దాకా చేశాను. ఇప్పుడు నాకు నలభై అయిదేళ్లున్నాయి. అయినా ఏరీత పనైనా చేయగల్గుతాను. కష్టం లేకుండా ఎన్ని మైళ్లైనా నడిచేస్తాను" అన్నారాయన ఉదయ్‌కుమార్ మాటల్ని సమర్థిస్తూ.

ఈ సంభాషణ జరిగింది పరకాయ ప్రవేశ సన్నివేశంలో. సి. నాగేశ్వరరావు కెమెరాను రెడీ చేసేవరకు నటనను ఆసరా చేసుకుని బల్ల మీద పడుకున్న రామారావు కాస్త విశ్రాంతి తీసుకున్నారు!

రామారావుగారి డైలాగులు పారబడ్డాయా అంటే కాల్‌షీట్ నిర్ణీత కాలం అయిపోయిందన్న మాట! ఆయన తల మీద భారంతోపాటు పంటి మీద పోరాన్ని కూడా ఒక్కటొకటిగా వదిలేశారు. హో నిట్టూర్పు విడిచింది వాడిక్రీ?

శ్రీ రామారావు తన నోటి నుంచి చెప్పిన 'బిజీ'కి ఉదాహరణగా నన్నే గ్రహించేట్టు చేసిన ఆయన 'ప్రజ్ఞ'ను మనసులోనే అభినందించి సెలవు తీసుకున్నాను. ●



"గోపాలుడు—భూపాలుడు"లో జయలలిత, యన్. టి. రామారావు

కొత్తనటి హేమమాలిని



'అఖిలభారతంలో ఉత్తమ నటిగా రూపొందాలని ఆశయంతో'

స్క్రీన్ జెమ్స్ (మద్రాసు)వారి "సప్నోం కా సౌదాగర్", ఆర్. కె. ఫిలింస్ "మేరా నామ్ జోకర్" చిత్రాలలో రాజ్ కపూర్ పక్కన నాయికగా హేమమాలిని అనే అమ్మాయి నటిస్తున్నదన్న ప్రకటనలు ఒక్కసారిగా వెలువడగానే 'ఎవరీ అమ్మాయి?' అనే ప్రశ్న అందరిలోనూ ఉదయించింది. పాండవ వనవాసం చిత్రంలో ఒక నృత్యంచేసిన కుమారి హేమమాలిని ప్రసిద్ధ నర్తకి. రెండువందలకు పైగా యింతవరకూ నృత్య ప్రదర్శనలు యిచ్చింది. గత నెలలో బొంబాయిలో నాలుగు ప్రదర్శనలు యిచ్చింది. కళారాధనే ధ్యేయంగా భావించుకున్న హేమమాలినికి పందొమ్మిదోఏడు వెళ్ళి యిపుడు ఇరవయ్యోఏడు నడుస్తోందంటే కొందరికి ఆశ్చర్యం కలిగించవచ్చును. కాని, నిజమంతే!



'తెలుగుచిత్రాల్లో నటిస్తాను!'

కుమారి హేమమాలిని 1948 అక్టోబరు 16న జన్మించింది. ఆమె తండ్రి శ్రీ వి. యస్. ఆర్. చక్రవర్తి, ఇ. యస్. ఐ. కార్పరేషన్‌లో అసిస్టెంట్ రీజనల్ డైరెక్టరు. మొదట్లో వీరు ఢిల్లీలో ఉండేవారు. యిపుడు మద్రాసులోనే స్థిరపడ్డారని చెప్పవచ్చు. హేమమాలిని అయిదోయేటనుంచే నృత్యంలో ప్రవేశించింది. భరతనాట్యంలో సిక్కిల్ రామస్వామిపిళ్లె గారివద్దా, కథక్‌లో కృష్ణకుమార్ గారిదగ్గరా శిక్షణ తీసుకున్నది.

"మీరు తెలుగుచిత్రాల్లో నటించరని విన్నవార్త నిజమేనా?" అని అడిగాను. అందుకు హేమమాలిని నవ్వి, "నిజంకాదు! సప్నోం కా సౌదాగర్ చిత్ర నిర్మాణం పూర్తి అయ్యేంతదాకా యితర చిత్రాలలో నటించే వీలులేదు నాకు. అది బహుశా మరో ఆరుమాసాల్లో విడుదల అవుతుంది. ఆతర్వాత తప్పకుండా నటిస్తాను!" అన్నది. బొంబాయి చిత్రసీమ గురించి మాట్లాడుతూ, "అక్కడి మనుష్యులు నా కెంతగానో నచ్చారు. విశాల దృక్పథంతో వ్యవహరించేవారు. ఎక్కడవున్నా అభినందించటం సహజమేకదా!" చెప్పింది!

హేమమాలినికి చిత్రకళలో చక్కని నైపుణ్యం ఉన్నది. ఆమె తన పన్నెండోఏట శంకర్స్ వీక్లీ వారు నిర్వహించిన పోటీలో పాల్గొని విజయాన్ని సాధించింది. స్వర్గీయ నెహ్రూజీ హేమమాలినిని ఎంతో అభిమానించేవారు. ఈ అమ్మాయిలోని నాట్యకళకు ముగ్ధులై ఎన్నోసార్లు ప్రశంసించారు. "హేమూ" అని ముద్దుగా పిలిచేవారుట!

"మీకు మరపురాని సంఘటన ఏదయినా ఉన్నదా?"

"నా జీవితంలో మరచిపోలేని రోజు ఒకటున్నది. ఆరు సంవత్సరాలకుపూర్వం, నా పదమూడోఏట నెహ్రూజీ పుట్టిన రోజు—ఆరోజు భరతనాట్యం, మణిపురి, భాంగ్రా, ఓరియంటల్, కూచిపూడి

యుండాలియని నృత్యాలు అనాళ కార్యక్రమంతా ఏర్పాటు చేశారు. నన్ను భరతనాట్యానికని తీసుకు వచ్చారు. తెర లేవగానే మొదట నన్నే నృత్యం చెయ్యమన్నారు. నేను చేస్తున్నాను. ఒక గంటసేపు చేసింతర్వాత "నెహ్రూగారు వస్తున్నారు. ఆయన వచ్చేముందు ఆడకూడద"ని చెప్పి నన్ను లోపలికి వెళ్లమన్నారు నెహ్రూజీ వచ్చి కూచున్నాక మణిపురి నాట్యం మరొక అమ్మాయితో ఆరంభించారు. నెహ్రూగారిముందు నృత్యం చెయ్యలేదే అనే బాధ నన్ను వేధిస్తున్నది. మణిపురి ముగియగానే భాంగ్రా ఏర్పాటు చేశారు. నెహ్రూజీకి కోపం వచ్చేసింది. "భరతనాట్యం ఎందుకు ఆపు చేశారు? ఆ బాలికచేత మళ్లీ చేయించండి!" అన్నారు. అపుడు నేను మేకప్‌రూమ్‌లో అలంకరణ సామగ్రి మార్చుకొంటున్నాను. ఎవరో పరుగెత్తుకుంటూ వచ్చి "త్వరగా రావాలి! నువ్వు మళ్లీ భరతనాట్యం చెయ్యాలమ్మా. నెహ్రూజీ చూడాలంటున్నారు!" అన్నారు. ఈ మాట విని కాళ్లతోపాటు, చేతులూ ఆడలేదు నాకు. అంతటి ఆనందవాహినిలో ముంచెత్తే మాట అది. ఓహో.... నా ఆశ నెరవేరబోతున్నది. నెహ్రూజీముందు ఆడబోతున్నాను. గుండె వేగంగా కొట్టుకుంటుండగా మేడమీదికివెళ్ళి భరతనాట్యం మళ్లీ చేశాను. కార్యక్రమం ముగిసిన తర్వాత నర్తకీమణులందరికీ నెహ్రూజీ బహుమతులు యిచ్చారు. అనాళ చేసిన వాళ్ళందరిలోకీ నేనే చిన్నపిల్లని అందుకని నాకు చిన్న బహుమతి, మిగిలినవాళ్లకు పెద్ద బహుమతులూ యిచ్చారు. "ఈ అమ్మాయికి మాత్రమే చిన్న బహుమతి ఎందుకు ఏర్పాటు చేశారు? ఏమిటీ పక్షపాతం?" అంటూ పక్కనేవున్న కార్యదర్శిని అడిగారు నెహ్రూజీ. వెంటనే కార్యదర్శి పరుగున వెళ్లి మరొక పెద్ద బహుమతి "నటరాజ విగ్రహం" తీసుకొచ్చి యిచ్చారు నాకు. మొదట తీసుకొన్న బహుమతిని నేను నెహ్రూజీకి తిరిగి యివ్వబోగా, ఆయన చిరునవ్వునవ్వి, నా భుజం తట్టుతూ, "నువ్వు రెండుసార్లు నాట్యం చేశావుకదూ. అంచేత యిదీ నీకే!" అంటూ తిరిగి అదీ నాకే యిచ్చారు. ఆరోజు నిజంగా నా జీవితంలో మరచిపోలేనట్టిది.... ఆ రెండు బహుమతులూ నాకు కనిపించినప్పుడల్లా, నెహ్రూజీ, ఆరోజు, దొరలిపోయిన ఘటన గుర్తుకొచ్చి— నెహ్రూజీ నేడు లేకపోయారే అనే బాధ కలుగుతూ ఉంటుంది" అన్నది హేమమాలిని.

ఆమె వయసు, నాట్యాలతోపాటు అందంకూడ అభివృద్ధి చెందుతూవచ్చింది. నర్తకి అంటేయిలానే ఉండాలేమో అనిపించేంతటి భావం యీ అమ్మాయిని చూడగానే కలుగుతుంది.

హేమమాలినికి చక్కని అభిరుచులున్నవి. తీరికవేళల్లో పెయింటింగ్స్ చేయటం, సంగీతం వినడం, పాడుకోవడం, డ్రైవింగ్ చేస్తుంది. వాటిపట్ల ఆమెకు మక్కువ కూడాను.

రెండు హిందీ చిత్రాలలోను రాజకపూర్‌పక్కన నాయికగా నటిస్తున్న కుమారి హేమమాలినికి చలన చిత్ర పరిశ్రమలో నర్తకిగానేకాక, నటిగా కూడ ఉజ్జ్వల భవిష్యత్తు ఉన్నది. అఖిల భారతంలో ఉత్తమ నటిగా రూపొందాలన్నదే యీమె ఆశయం. ●



తీరిక వేళల్లో అభిమానులతో



చక్కని నర్తకి

వ్యాసం: మోహన్‌కుమార్
ఫొటోలు: ప్రభాకర్



నా విదేశయాత్ర

జమునారమణరావు

3

మమ్మల్నిందర్ని కార్లలో కూచోబెట్టి నగరం అంతా ఒక్కసారి తిప్పి చూపించి, అతి ప్రసిద్ధి చెందిన 'రెడ్‌స్క్వేర్'కు తీసుకువెళ్లారు. అది చాలా విశాలమయిన మైదానం. నలువైపుల ప్రఖ్యాతి గాంచినవి, ముఖ్యమైనవి భవనాలుఉన్నాయి. అంటే లెనిన్స్ మ్యూజియం, చరిత్రాత్మక వస్తు ప్రదర్శనశాల, సెయింట్ బాసిల్ కెథెడ్రల్— ఇది కాక యింకా ఆరు కెథెడ్రల్స్ కూడా అక్కడ ఉన్నాయి.

అతి ముఖ్యమైనదీ, ఆ దేశం ఎవరు వెళ్ళినా చూడకుండా తిరిగిరానిదీ ఒకటి ఉన్నది. అది రష్యన్ ప్రజల ఆరాధ్యదైవం 'లెనిన్' యొక్క మృత శరీరం. ఆ కళేబరం 42 సం. రాలుగా సైంటిఫిక్ పద్ధతులతో కాపాడ బడుతూ ఉంది. అండర్‌గ్రౌండ్‌లోవున్న కట్టడంలో అతి భద్రంగా వుంది ఆ శరీరం. ఆ ప్రదేశాన్ని ఇరవయినాలుగ్గంటలూ గార్డ్సు కాపలా కాస్తూ ఉంటారు. ప్రతి గంటకు వాళ్ళ షిఫ్ట్ మారుతారు. మేము వెళ్లే సమయానికి గార్డ్సు మార్పు జరుగుతున్నది.

ఒక పది నిముషాలు ఆ చలిగాలిలో అలాగే నించున్నాం. కోటలోపల్నుంచి యిద్దరు సిపాయిలు రిథమిక్‌గా బూట్లు టక టకలాడిస్తూ, మర బొమ్మల్లా నడుస్తూ—లెనిన్ శరీరాన్ని భద్ర పరచిన స్థలానికి పోసాగారు. అప్పటికే అక్కడ రెండు వందలమందిదాకా జనం పోగయ్యారు యిది చూసేందుకు......వాళ్ల మార్చింగ్ చూడటం బాగానే ఉంది కాని, యింతమంది జనం వెర్రివాళ్లలా పిచ్చిగా వాళ్ల వెంబడి పరుగెత్తడం, వాళ్లందర్నీ పోలీసులు దూరంగా ఉండమని అదలించడం—నాకు నవ్వు తెప్పించింది.



'సెయింట్ పీటర్స్ చర్చి' రోమ్‌లో గుమ్మడి, జమున.

నా విదేశయాత్ర

ఈ గార్డ్స్ మార్పు మూడు నిముషాలు కూడా పట్టలేదు. కొత్తగా వచ్చిన గార్డ్స్ ముందు నిలబడిన పాత గార్డ్స్ దగ్గరకువెళ్లి, వాళ్లను తిరిగి పంపి—వీళ్లు ఆ ప్రదేశంలో నిలబడతారు.

ఆ తమాషా చూసి, అక్కణ్నించి 'చిల్డ్రన్స్ పయనీర్'కి వెళ్లాం. ఇది 5 నుంచి 17 సం. రాల పిల్లలకోసం ప్రత్యేకంగా కట్టబడిన విజ్ఞానంతో కూడిన ఆటస్థలం. ఇందులో పిల్లలకు గ్రంథాలయం, ఆట వస్తువులు, పెయింటింగ్ యిష్టమయిన వారికి—అందుకు సంబంధించిన సామగ్రి ఉన్నాయి. పిల్లలకు ఎవరికి దేనిపై అభిరుచి ఉందో, దానికి తగిన ఆటలు అక్కడ ఏర్పరచబడ్డాయి.

మేము లోపల అడుగు పెట్టగానే తెల్లటి యూనిఫామ్‌తో, బొద్దుగా రబ్బరు బొమ్మల్లా ఉన్న చిన్నపిల్లలు చాలామంది ఎదురయ్యారు. వాళ్లనిచూసి మేం పలుకరించగానే సిగ్గుపడి తల వంచుకునేవారు. సిగ్గుతో ఎర్రగా కందిన ఆ లేత బుగ్గల్నిచూస్తే ముద్దు పెట్టుకోవాలనిపించేది. పిల్లలందర్నీ పిలిచి వాళ్లతో ఫోటోలు తీసుకున్నాం. హోటల్‌కు వస్తూ వస్తూ దారిలో మాస్కో యూనివర్శిటీ దగ్గర ఆగాం.

మాస్కో యూనివర్శిటీ చాలా పెద్దది. దాని చుట్టూ ఒక ప్రదక్షిణంచేసి హోటల్‌కి వెళ్లేసరికి మూడున్నర అయింది. మా భోజనాలు పూర్తి కావడానికి మామూలు టైము అయిదయింది. తిరిగి ఏడున్నరకి రైలులో 'కీవ్' వెళుతున్నాం. నో గంటలో సామాన్లు సర్దుకొని సిద్ధం అయ్యాం. ఆరింటికి రామానందసాగర్‌గారి "ఆర్జూ" చిత్రం చూపబడింది. మేం మాత్రం హోటల్లో ఉండిపోయాం. సాగర్‌గారి యూనిట్ థియేటర్‌కి వెళ్లారు. వాళ్లు తిరిగి వచ్చేలోగా అరగంటలో మేం ముగ్గురం మన తెలుగు సోదరులతో కలిసి 'మెట్రో స్టేషన్స్' చూసేందుకు వెళ్లాం.

ఆ దేశానికి ఎవరు వెళ్ళినా ఆ అండర్‌గ్రౌండ్ స్టేషన్స్ చూడకుండా తిరిగి రావడం దురదృష్టమనే చెప్పాలి. ఒక్కొక్క స్టేషనూ ఒక్కో కళా సృష్టి. దాదాపు 45 అండర్‌గ్రౌండ్ స్టేషన్స్ ఉన్నాయి. ఒక స్టేషన్ లెనిన్ పెయింటింగ్స్‌తో అలంకరించివుంటే, మరొకదాన్లో లెనిన్‌ని పాలరాతి శిల్పాలతో చూడవచ్చు. ఇంకొకచోట వారి సంస్కృతిని, సాంప్రదాయాల్ని మనం గుర్తించవచ్చు. ప్రతి స్టేషన్—ఫ్లోరింగ్, వాల్స్, రూఫింగ్, పిల్లర్స్—ప్రతి అంగుళం, వివిధ రకాలయిన పాలరాతి నిర్మాణంతో ని: ఉంటుంది. నిలువెత్తు గోడలు, పెద్దవైన స్తంభాలు అన్నీ కూడ తెల్ల పాలరాయి, నలుపు, ఎరుపు, ఆకుపచ్చ—ఎన్నో రంగులతో అందాలు చిందుతూ ఉంటాయి.

మాస్కో నగరం ఎంత గంభీరంగా నిశ్శబ్ద వాతావరణంతో, పలుచటి జనంతో ఉంటుందో, యీ మెట్రో స్టేషన్లు అంత భిన్నంగా ఉంటాయి. అలవికానంత రద్దీగా ఉంటాయి. గుంపులు గుంపులుగా హడావిడిగా మనుషులు తిరుగుతూంటారు. ప్రతి నిముషానికి ఒక రైలువుంది. ఇంత రద్దీగా వున్నా, ఆ స్టేషన్లు ఎంతో పరిశుభ్రంగా నేలతో సహా తళతళ మెరుస్తూంటాయి. ఎక్కడ వెదికినా ఒక కాగితం ముక్క కూడా మనకు కనిపించదు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటం అక్కడి ప్రజల విశిష్టత. ప్రతిచోటా డస్ట్ బిన్‌లు (అంటే రేకు డబ్బాలుకావు) ఇవీ పాలరాతితో గంధపు గిన్నెల ఆకారంలో ఉంటాయి. ఏ చెత్త అయినా ప్రతి మనిషి ఎంతో ఓపికగా వెళ్లి ఆ డస్ట్‌బిన్‌లో వేస్తాడు. ఆ శుభ్రతచూస్తే మన చేతిలో ఏమయినా పారేసే వస్తువుంటే మనకు తెలీకుండానే వాళ్లలా ఓపికగా మనం కూడా చెత్తబుట్టలో వేసివస్తాము.

30 కోపెక్స్ (మన నయాపైసల్లా వాళ్లు కోపెక్స్‌ని వాడతారు.) యిచ్చి టిక్కెట్టుకొంటే ఎన్ని స్టేషన్లు అయినా తిరిగిచూసి, రోడ్‌పైకి రావచ్చును. స్టేషనుకు ప్రతిచోట పై భాగాన చేరవచ్చు. కొన్నిచోట్ల చాలా లోతుగా మెట్లు దిగవలసొస్తే ఎస్కలేటర్స్ (కదిలే మెట్లు) ఉన్నాయి. టిక్కెట్టు కొనకుండా వెళ్లామా, ఎంట్రన్స్‌లో ఒక మనిషిమట్టుకు వెళ్ళగలిగే దారి ఉంది. అందులో అడుగుపెట్టగానే, రెండు యినుపహస్తాలువచ్చి అడ్డుకుంటాయి. టిక్కెట్టు అక్కడేవున్న ఆడ కలెక్టర్‌కి యిచ్చివెళ్తే దారి తీసే ఉంటుంది. మేము టిక్కెట్లు చేతుల్లో ఉంచుకుని, లేకుండా పరుగెత్తి— యిలాంటి ఎక్స్‌పెరిమెంట్స్ చేశాం. ఉన్న టైమ్‌లోనే నాలుగయిదు స్టేషన్స్ దిగి గబ గబ అన్నీ చూసి హోటల్‌కు చేరుకున్నాం.

ఏడున్నర అయేసరికి అందరం కలిసి స్టేషన్ చేరి 'కీవ్' కి రైల్లో బయలుదేరాం. ఈ స్టేషన్ చాలా విశాలంగాఉన్నా, రద్దీగాలేదు. రైల్లో రెండు బెర్త్స్ వున్న కూపే అందరికీ దొరికింది. ఇది మన దేశంలోలాగ ఏ. సి. కంపార్ట్‌మెంటులా ఉంటుంది. అటాచ్‌డ్ బాత్ రూమ్స్, మెత్తటి పరుపులు, వెచ్చటి రగ్గులు, రేడియో, టేబుల్ లైట్, రెండు చిన్న సైజు సోఫాలు—యింట్లోని గదిలాగ ఎంతో సౌకర్యంగా ఉంది. కిటికీ తెరలు తొలగించి బయటికి చూశాను. ఆకాశ వీధిలో చందమామ వింత సోయగాలతో వెలుగొందుతున్నాడు. వన్నెలు చిలుకుతున్న వెన్నెల. ఆ వెన్నెల వెలుగులో ఆవరించుకొని తెల్లటి మంచు మెరుస్తున్నది. మన సెంతో ఆహ్లాదకరంగా ఉన్నది. నేనూ, మా యింటర్‌ప్రెటర్ కబుర్లు చెప్పుకుంటున్నాం.

మాకు రాత్రి భోజనం బ్రెడ్ స్లైస్ వచ్చాయి. ఆకలిగా ఉందేమో, ఆత్రంగా అందుకున్నాయి నా చేతులు. ఎందుకయినా మంచిదని నేను బ్రెడ్ విడదీసి చూశాను. ఇంకేముందీ—దానితో "బీఫ్" పెట్టబడి ఉంది. తేలో, పామో చేతిలోకి వచ్చినట్టు విసిరేశాను. మా యింటర్‌ప్రెటర్‌ని వెజిటబుల్ స్లైస్ కావాలని అడిగా. ఆరోజు అసలు వెజిటబుల్ బ్రెడ్ తేలేదుట! మా వాళ్లు చాలా మంది ఆ బీఫ్ బ్రెడ్ తినలేదు.

ఆకలి దహించుకుపోతోంది. ఈలోగా మిసెస్ బి. పి. రాల్హాన్ నాకు తినడానికి గోధుమపిండితో తయారు చేసిన రొట్టె పంపించింది. ఆ సగం రొట్టెను ఆవురావురని తిని మంచినీళ్లు తాగి, కొన్ని ఫ్రూట్స్ తిని పడుకున్నా. ఉదయం ఎనిమిదిన్నరకు 'కీవ్' చేరుకున్నాం.

(ఇంకా ఉంది)

భక్త ప్రహ్లాద

శ్రీ విష్ణు సందర్శనార్థం వైకుంఠానికి వెళ్ళిన సనకసనందనాదులను ద్వారపాలకులైన జయ విజయులు అడ్డగించి అవహాస్యం చేయగా వారు కోపావేశులై భూలోకంలో రాక్షసులుగా జన్మించమని జయ విజయులను శపించటం మొదలుకొని శ్రీ హరి ఉగ్రనరసింహావతార మెత్తి లోక కంటకుడైన హిరణ్యకశిపుని వధించటం వరకూ గల కథను ఏ. వి. ఎం. వారి ఈస్ట్మన్ కలర్ చిత్రం 'భక్త ప్రహ్లాద'లో అత్యంత ఆహ్లాదకరంగా చిత్రించారు. కథా సంవిధానం, చక్కని సంభాషణలు డి. వి. నరసరాజు కూర్చారు.

ఎస్. వి. రంగారావు, బాలమురళీకృష్ణ, రేలంగి, పద్మనాభం, హరనాథ్, ధూళిపాళ, బేబీ రోజారమణి, అంజలీదేవి, జయంతి, కనకం, ఎల్. విజయలక్ష్మి, గీతాంజలి, వాణిశ్రీ, విజయలలిత మొదలగువారు ఈ చిత్రంలో నటించారు. గౌరవనటులులుగా నాగయ్య, రమణారెడ్డి ఉన్నారు.

చిత్రంలో ముఖ్యంగా ప్రేక్షకులను ఆకట్టుకొనేది బాలనటి బేబీ రోజారమణి ప్రదర్శించిన అద్భుతమైన నటన. ఈ చిన్నారి కిదే మొదటి చిత్రమైనా, ప్రేక్షకులకు సైతం భయోత్పాతాలు కల్గించే సన్నివేశాలలోకూడా ఎంతోధైర్యంగా హుందాగా, కన్నులపండువుగా నటించి చిత్రానికి జీవం పోసింది. హిరణ్యకశిపుడుగా ఎస్. వి. రంగారావు, లీలావతిగా అంజలీదేవి గణనీయమైన నటనను ప్రదర్శించారు. నారదుడుగా బాలమురళీకృష్ణ నటన సామ్రోచితంగా ఉంది. గురుపుత్రులుగా, హితులుగా, పురోహితులుగా రేలంగి, పద్మనాభంల నటన ప్రేక్షకుల్ని గిలిగింతలు పెడుతుంది.

భారీ ఎత్తున నిర్మించిన సెట్టింగ్స్, ఛాయాగ్రహణం కనువిందు చేశాయి. పాటలన్నీ వినసొంపుగా ఉన్నాయి. ముఖ్యంగా "జీవము నీవేకదా....." అన్న పాట ప్రేక్షకుల గుండెల్లో ప్రతిధ్వనిస్తూంటుం దనటంలో సందేహంలేదు. చిత్రమంతటా సంగీతం కర్ణపేయంగా ఉంది.

చిత్రానికి దర్శకత్వం చిత్రపు నారాయణమూర్తి, సంగీతం: ఎస్. రాజేశ్వరరావు నిర్వహించారు. భారీ ఎత్తున అందరికీ హ్లాదాన్ని కలిగించేవిధంగా ఈ చిత్రాన్ని నిర్మించినది ఏ. వి. మెయ్యప్పన్.

—మాధవ్



"భక్త ప్రహ్లాద"లో బేబీ రోజారమణి.



"శభాష్ రంగా"లో ఎం. జి. ఆర్, జయలలిత.



"సతీసుమతి "లో రేలంగి, గిరిజ.

చిత్రలహరి

"మామగారూ, ఇపుడు మీ ఒంట్లో ఎలా ఉంది?" అని అడిగాడు కృష్ణ.

"బాగుందిబాబూ!" అన్నారు గుమ్మడి. "రేవు దశమి ఆదివారం. అన్నివిధాలా బాగుందట. మీ సెల వయితే మేము వెళదామనుకొంటున్నాం!" అన్నాడు, పక్కనేవున్న సుకన్యనుచూస్తూ. "ఎక్కడికి కృష్ణా?" "మా యింటికి! నేనుమాత్రం యిక్కడ యిలా ఎంతకాలం ఉండగలను చెప్పండి" అన్నాడు కృష్ణ, ఆయన మొహంలోకి గౌరవపూర్వకంగా చూస్తూ. "కలకాలం యిక్కడే వుండాలని నా కోరిక బాబూ!" బదులు చెప్పారు గుమ్మడి. ఆయన మాటల్లో అభిమానం, అనునయం, ఆదరణ వ్యక్తమవుతున్నవి.



"నిశరాత్రి 12 గంటలకు"లో కాంతారావు, సుకన్య.

—'కట్' అన్నారు దర్శకుడు కె. విశ్వనాథ్. డి. బి. యస్. ఫిలిమ్స్‌వారు నిర్మిస్తున్న "ప్రయివేటు మాస్టారు" చిత్రానికి సంబంధించిన యీ సన్నివేశాన్ని గతనెల 20 న శారదా స్టూడియోలో చిత్రీకరించారు. కాంచన, రామ్మోహన్ నాయకీ నాయకులుగా నటిస్తున్న యీ చిత్రంలో పై వారితోపాటు పుష్పకుమారి, రేలంగి, అల్లురామలింగయ్య, జయశ్రీ కూడ నటిస్తున్నారు. ఇంతవరకూ తొమ్మిది రీళ్ళు పూర్తి అయిన యీ చిత్రానికి సంగీతం కె. వి. మహదేవన్, ఛాయాగ్రహణం: కె. యస్. రామకృష్ణరావు నిర్వహిస్తున్నారు. రచన: ముళ్ళపూడి వెంకటరమణ.

* * *

విశ్వశాంతి పిక్చర్స్‌వారు భారీ యెత్తున్న నిర్మిస్తున్న జానపదం "కంచుకోట" ఇన్‌డోర్ షూటింగు ముగిసింది. యన్. టి. రామారావు, సావిత్రి, దేవిక, కాంతారావు, ఎల్. విజయలక్ష్మి, పద్మ

వాసం. వాణిశ్రీ, జయశ్రీ, శాంతకుమారి, టి. జి. కమలాదేవి, రాజనాల, ఉదయకుమార్, సత్యనారాయణ, రమణారెడ్డి, ప్రభాకరరెడ్డి, ఆనందమోహన్ ధూళిపాళ, వీరయ్య, బాలకృష్ణ, నెల్లూరి కాంతా రావు సహీల్యాన్, కె. జగ్గారావు నటిస్తున్నారు. ఒకపాటలు చిత్రీకరణ జరిపారు. టి. వి. మహారథి సంభాషణలూ, కె. వి. మహాదేవన్ సంగీతమూ సమకూర్చిన యీ చిత్రానికి దర్శకుడు: పి. ఎస్. రావు. ఫిబ్రవరి 20 ప్రాంతాలకు చిత్రం పూర్తి కాగలదని నిర్మాత శ్రీ యం. విశ్వేశ్వరరావు చెప్పారు. కాంచన యిందులో అతిథిగా నటిస్తున్నది.

* * *

మధ్యాహ్నం రెండు గంటలవేళ. వి. వి. యం. స్టూడియోలో సపచెట్టు నీడన నిలుచుని ఆ స్టూడియోకు సంబంధించిన ఒక ముఖ్య వ్యక్తితో మాట్లాడుతూ ఉన్నప్పుడు నటి కాంచన అటు కేసి వస్తూ, "ఎంతసేపయింది వచ్చి?" అంటూ పలుకరించింది. "ఇప్పుడే!" అంటూ విష్ చేశాను. "ఉంటారుగా, డ్రెస్ ఛేంజ్ చేసుకువస్తాను!" అని ఆమె మేకప్ రూమ్‌కేసి వెళ్ళింది. ఇంతలో ఒక లేడీ బహుశా జపాన్ లేడీ అనుకుంటాను, ఆ కట్టూ తీరూ అలాగే ఉంది. తలమీద జుట్టు—నారద మహర్షి ముడిలా చుట్టబడి, చూసేందుకు తమాషాగా కనిపిస్తున్నది. ఈ గెటప్ ఏదో గమ్మత్తుగా ఉన్నదే అనుకుంటూండగా ఆ అమ్మాయి దగ్గరికంటూ వచ్చి, చెయ్యి పుచ్చుకుని "హల్లో!" అన్నది. తెల్లబోయాను. ఈ అమ్మాయిని ఎక్కడా చూసిన గుర్తు లేదు. "గుర్తు పట్టలేదా?" అంటూ మామూలు గొంతుతో అడిగారు. ఆమె అమ్మాయి కాదు. ఆడవేషంలో ఉన్న అబ్బాయి. మిమ్మల్ని కడుపుబ్బ నవ్వించే అబ్బాయి— పద్మనాభం. అద్భుతం అనిపించింది. మేకప్‌లోని గొప్పదనం కనిపించింది. ఎదుటి మనిషిని గుర్తించలేకుండా చెయ్యగలిగే గొప్పదనం ఆ కళలో ఉంది.



"సతీసుమతి"లో ఋతపల్లి రమ.

* * *

సెట్లోకి వెళ్ళాం. దర్శకుడు త్రిలోక్‌చందర్, సహాయ దర్శకుడు పి. వి. సత్యనారాయణ తియ్యబోయే సన్నివేశం గురించి చర్చించుకుంటున్నారు. కాంచన, గీతాంజలి—వాళ్ళ వెనకాల మరో వలు



"మావదిన"లో కృష్ణకుమారి, మాస్టర్ బాబు.



ఉదయశ్రీ పిక్చర్స్‌వారి "అమాయకుడు" చిత్రానికి పాటల రికార్డింగ్ జరిగినప్పుడు తీసిన చిత్రం. నేపథ్యగాయని సుశీల, సంగీతదర్శకుడు శంకర్‌లను యిందులో చూడవచ్చును.

చిత్రలహరి

గురు అమ్మాయిలు కూచుని కబుర్లు చెప్పుకుంటున్నారు. గీతాంజలి పాదాలకేసి చూస్తూ "ఈమధ్య ఎక్కడ కొన్నావ్, బాగున్నయ్!" అడిగింది కాంచన. "బొంబాయిలో" అంది నవ్వుతూ. "మరి నాకోటి తెచ్చిపెట్టకూడదూ, యిలాంటిది?" "సరిగ్గా యిలాంటివంటే యిలాంటివేలేవుకాని, వేరేరంగుల్లో ఉన్నాయి. ఈమాటు వెళ్ళినప్పుడు తెస్తాను!" చెప్పింది. "చాలా బాగుందికాని, హీల్ యింత ఎత్తు



'అర్ధరాత్రి'లో రాధిక.

ఉండకూడదు. ఫ్లాట్‌గా ఉండాలి. ఎత్తుగా ఉంటే ఒక్కోసారి కాలు మడతపడి చాలా అవస్థ పడవలసి వుంటుంది. రాజశ్రీ పోమాటు యిలాగే 'కాదలిక్క నేరమిల్లై' సెట్లో చాలా యిబ్బందిపడింది, పాపం!" అన్నది కాంచన.

* * *

ఈ సెట్ ఎ. వి. యం. ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న ఈస్ట్‌మన్ కలర్ సాంఘికం "అవే కళ్ళు" చిత్రానికి సంబంధించినది. పైన పేర్కొన్న



"ప్రేమలో ప్రమాదం'లో కృష్ణకుమారి.



'పిన్ని'లో రేలంగి, అల్లు రామలింగయ్యలు.

వారితో పాటు రాజనాల, నాగభూషణం, కృష్ణ కుమారి కూడా యిందులో ఉన్నారు. ఎనిమిది రీళ్లు తయారయిన యీ చిత్రానికి సంగీతం: వేదా, రచన: డి. వి. నరసరాజు. కథానాయకుడు కృష్ణ.

*   *   *

శ్రీ రామా పిక్చర్స్ వారి "పార్వతీ పరమేశ్వరులు" చిత్రం జనవరి 20 వ తేదీ మధ్యాహ్నం మూడున్నర, నాలుగు గంటల మధ్య ప్రకాష్ స్టూడియోలో ప్రారంభించారు, తొలి షాట్ కథానాయకి రాజశ్రీ మీద తీశారు. నాయకుడు శోభన్‌బాబు. జెబీ శ్యామల యీ చిత్రంలో ఒక ముఖ్య భూమిక నిర్వహిస్తున్నది. సంగీతం: యల్. మల్లేశ్వరరావు, కెమెరా, దర్శకత్వం, నిర్మాణం: బోళ్ల సుబ్బారావు బి. ఏ.

*   *   *

జనవరి 14, 15 తేదీలలో కూచిపూడి నర్తకి కుమారి యడవిల్లి రమ, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రెండు నృత్య ప్రదర్శనలు యిచ్చింది. కృష్ణశబ్దం, బాలగోపాల తరంగం, తిల్లానా, రామాయణశబ్దం మొదలయిన నృత్యాలను రసవత్తరంగా ప్రదర్శించింది. ముఖ్యంగా యిత్తడి పళ్లెరం అంచులపై నిలబడి చేసిన నృత్యాన్ని ప్రేక్షకులు ఎక్కువగా అభినందించారు. రమ సోదరి కుమారి యడవిల్లి స్వర్ణకుమారి గానం చేసింది. కుమారి రమ ప్రస్తుతం ఉదయభాస్కర్ పిక్చర్స్‌వారి "నవ్వులు—పువ్వులు" లోను, చిన్ని బ్రదర్స్‌వారి "సతీసుమతి" లోను నటిస్తున్నది.

*   *   *

ఈ వారంలో చివరిరోజున దర్శకుడు శ్రీ కె. ప్రత్యగాత్మను నాను మూవీస్‌వారి కార్యాలయంలో కలుసుకోవడం జరిగింది. "మా వదిన" ఇన్‌డోర్ షూటింగ్ ముగిసిందనీ, యీ 19వ 'తమన్నా' హిందీ చిత్రం షూటింగ్‌కి బొంబాయి వెళ్లి తిరిగి ఫిబ్రవరి 3వ తేదీన మద్రాసుకు వస్తాననీ చెప్పారు. మా వదిన చిత్రనిర్మాతలు శారదా స్టూడియోలో ఒక ఫ్లోరు కాంట్రాక్టు తీసుకొని 32 రోజుల్లో ఒక మేజర్ సెట్లో, ఇన్‌డోర్ షూటింగ్ పూర్తి చేశారు. శ్రీ ప్రత్యగాత్మ బొంబాయి నుంచి రాగానే అవుట్‌డోర్ షూటింగ్ కూడా పూర్తిచేసి, ఫిబ్రవరి నెలాఖరుకు చిత్రాన్ని సిద్ధం చేస్తారు. కృష్ణకుమారి, కాంతారావు, మాస్టర్ బాబు ముఖ్యభూమికలు పోషిస్తున్న "మా వదిన" చిత్రంలో యస్. వి. రంగారావు, పద్మశ్రీ నాగయ్య, ప్రభాకరరెడ్డి అతిధి నటులుగా పాల్గొంటున్నారు. ఇందులో గల మొత్తం ఆరుపాటలనూ శ్రీమతి పి. సుశీల పాడింది. ప్రత్యగాత్మ దర్శకత్వం వహించిన యీ చిత్రం పూర్ణా పిక్చర్స్ వారి ద్వారా విడుదల కావటం ఒక విశేషం. ప్రత్యగాత్మ చిత్రానికి పూర్ణావారు పంపిణీదారులుగా వ్యవహరించటం యిది మొదటిసారి.

—మోహన్ కుమార్



"ఇద్దరు మొనగాళ్లు"లో సుకన్య.



'గోపాలుడు-భూపాలుడు'లో జయలలిత, రామారావు.

పుస్తకాలు

"మార్క్స్ మళ్ళీ వస్తే..."

మూలం: యె. యె. బెర్లే, అనుకృతి వాదెళ్ళ భాస్కరరావు, తెలుగువెలుగుబుక్స్, విజయవాడ—2, వెల రు. 1.

కొంతకాలం క్రితం శ్రీ టి. టి. కృష్ణమాచారి అమెరికా సోషలిస్ట్ దేశం అన్నప్పుడు ఇక్కడ కొందరికి కోపం వచ్చింది. 'సోషలిజం' అనే మాటకి నిఘంటువు ప్రకారం అర్థం చూస్తే శ్రీ టి. టి. కె. పొరపడ్డారనవచ్చుగాని, పై పుస్తకం 'అనుకృతి' చేసిన శ్రీ భాస్కరరావుగారి మాటలలో చెప్పాలంటే, ఉత్పత్తి దాని పంపిణీ పద్ధతులని పరిశీలిస్తే అమెరికాలో చాలావరకూ మితిమీరిన సంపద పక్కనే భయంకరమయిన పేదరికం లేదనే అంగీకరించాలి. సంయుక్త అమెరికా రాష్ట్రాల దక్షిణ ప్రాంతాలలో కొన్నిచోట్ల, నీగ్రోవర్గాలలో కొన్నిటి లోనూ నిజమయిన దారిద్ర్యం ఉంది కాబట్టి 'చాలావరకూ' అనేమాట వాడవలసి వస్తుంది. అయినప్పటికీ ఈఅమెరికన్ బీదల పరిస్థితి కొన్ని ఇతర దేశాల బీదల పరిస్థితికన్నా ఎన్నో రెట్లు నయం.....

రచయిత చెప్పినట్లు, అమెరికాలో ఉత్పత్తి విలువ మనిషికి సుమారు 2500 డాలర్లు (నేటి 'మారకం' ప్రకారం సుమారు 18,750 రూపాయల) అంతేకాక నేటి అమెరికన్ కార్మిక వర్గంలో అధికులు ఆకలి బాధని పూర్తిగా తప్పించుకొనగలగటమే గాక 'ఒక చక్కటి మోటారు కారు వేసుకొని ఫ్లారిడాలో సెలవులను గడపటానికి వెళ్ళాలా?' లేక 'మంచి గృహోగ్రంథాలయముండున్న చక్కని గృహంఏర్పరచుకునాలా?', 'తమకు మరొక టెలివిజన్ సెట్టు కావాలా?' వంటి ప్రశ్నలని తమకి తామే వేసుకొన గలుగుతున్నారు.

'స్వేచ్ఛా విపణి' పద్ధతుల సహాయంతో ఉత్పత్తిపెంచు కొనటమే గాక ''సంక్షేమరాజ్యం''కోసం అమెరికా ప్రభుత్వం 'కొంత కాలంగా' ఆర్థికవ్యవస్థను నిర్వహించే బాధ్యతను సేకరించింది. 'ఎప్పటికప్పుడు కొత్త చట్టాల సహాయంతో సంఘంలోని అన్యాయాలను తగ్గించాలనికూడ చూస్తూ వచ్చింది.

అన్నిటికన్నా ముఖ్యం 'సాంకేతిక పరిజ్ఞానం' బాగా పెరిగి పోయింది. 'పెట్టుబడియొక్క మూలం ఏవిధమైన స్వామ్యంపైన కాని కాకుండా నిర్దిష్టమైన మేధస్సంపత్తి కలిగిన కొందరు వ్యక్తులపై ఆధారపడి వుండగలదని ఈనాటికి స్పష్టమయింది.

రచయిత అమెరికా సంయుక్త రాష్ట్రాల స్వరూపాన్ని క్లుప్తంగా సమీక్షించి 'ముందున్న సమస్య'ని కూడా క్లుప్తంగానే పరిశీలించారు. సాంఘిక సంక్షేమ కార్యక్రమాల పెరుగుదలవల్లా, యాంత్రికీకరణంవల్లా ఏర్పడేకొన్ని సమస్యలని పేర్కొన్నారు. కాని 'అమెరికా ప్రజల అభిమతానుసారం వారి అభిమతాలను ఆశయాలను ఆకాంక్షలను తీర్చడానికి, సఫలం చేయటానికి మహత్తర కృషినైనా చేసే శక్తి అమెరికా ఆర్థికవ్యవస్థకు ఉన్నది' అని (శ్రీ భాస్కరరావు గారి మాటల్లో) రచయిత స్పష్టంగా చెప్పారు. 'సాంకేతికంగా'నే కాక ఆహార ఉత్పత్తి విషయంలోనూ అన్ని దేశాలకన్నా ముందుగా ఉన్న అ. సం. రా. శ్రీ బెర్లే విశ్వాసానికి తగినవే అని అనుకున్న ఫరవాలేదు. ఆయన క్లుప్తంగా మార్క్స్ ఎటువంటి పరిస్థితులలో తన సిద్ధాంతాలని ప్రతిపాదించాడో, ఆసిద్ధాంతాలు ఈనాటి ప్రపంచానికి ఎందుచేత అంతగా వర్తించవో చెప్పారు. పుస్తకానికి 'మార్క్స్ మళ్ళీ తిరిగి అమెరికాకివస్తే' అని అంటే బాగా ఉండేదేమో! అనువాదంకోసం వాడిన భాష మరీ కుదించి రాసినట్లనిపిస్తుంది. అధ్యాయం మొదట 'స్వేచ్ఛా విపణి' అని రాసి లోపల స్వేచ్ఛా మార్కెట్ అన్నారు. అబ్బెట్టుగా కనిపించే ఇటువంటి వాడకలు మరికొన్ని ఉన్నాయి. కొందరు విదేశీవ్యక్తుల పేర్లని తెలుగు లిపిలో రాయటం కష్టం కాని యీ విషయంలోనూ కొన్ని విచిత్రమైన రాతలు జరిగాయని అనుమానం కలుగుతుంది.

కె. ఆర్. ఎస్.

వేడుకి వేత

జవాబులు

(క) జమాఖర్చులు వ్రాసుకోవడంసరిగ్గా చేత కాకపోవడం వల్ల వచ్చింది ఈ ఇబ్బంది. వాళ్ళు ఇచ్చినవి 27 రూ. లు. అందులో 25 హోటలు యజమాని, 2 రూ. లు నౌకరు కుర్రవాడు తీసుకున్నారు. సరిపోలేదూ?

(చ) సరాసరి ఖరీదు కట్టడంతో ముసలమ్మలు పొరబడ్డారు. నిన్నటి ధరే పలకాలంటే సరాసరి ధర కట్టడం ఆ విధంగాకాదు. మొత్తం రావలసిన డబ్బును మొత్తం పళ్ళ పెట్టి భాగించాలి. మొత్తం 25 రూ. లు రావాలంటే ఒక్కొక్కటి 25/60 రూ. కి. అమ్మాలి కాని, వాళ్ళు ఒక్కొక్కటి 24/60 రూ. కి. అమ్మేరు. ఆవిధంగా ఒకరూపాయి నష్టపోయారు.

ఎప్పుడూ అందంగా...

(60 వ పేజీ తరువాయి)

బాగున్నాయి. నేను చాల లావు. సుమారు ఇరవై పౌన్ల వరకు తగ్గాలి. రెడ్యూసింగ్ మాసేజెస్ తీసుకోమని డాక్టరన్నారు.

* అవును. ఇటువంటి 'స్వీడిష్ మాసేజ' వల్ల సన్నబడేందుకెంతైనా అవకాశం వుంది. మీ ఇరవై పౌన్లు తగ్గేందుకు ఆరువారాలు చాలు. ఆహార నియమాలు పాటించాలి.

శ్రీమతి టి. యల్., గుంటూరు.

నేను చాలా నలుపు. వయస్సు 38 సంవత్సరాలు. నేనెటువంటి బట్టలు ధరించాలి? నా నలుపు మారడానికి అవకాశం వుందా?

* లేతరంగుల్లో వున్న నీలం, ఊదా, నారింజ, పసుపు మొదలైనవన్నీ ధరించవచ్చు. రాత్రుళ్ళు నీలం, ఊదా, నారింజ, ఆకుపచ్చని ముదురు రంగు ఉపయోగించినా సరిపోతుంది. ''మెడికేటెడ్, బ్లీచింగ్ ట్రీట్‌మెంట్'తో మీ రంగు మారుతుంది. కాని పూర్తిగా ఎర్రబడేందుకు లేదు. కొద్ది ఛాయ మారుతుంది. అంతే. ఈ చికిత్స ఇంటి దగ్గర చేసుకోడానికి రెండుమూడు మాసాలు పడుతుంది. 'క్లినిక్స్'లో అయితే ఒకనెల చాలు. ఈ సమస్యకు ఇదివరలో ఇదే చికిత్సను సూచించాను.

శ్రీమతి ఎ. యల్. ఎ., అనంతపురం, టి. కె., ధర్మవరం, ఎ. యమ్. యమ్., మధుర.

నేను చాల సన్నం. అవయవాల్లో సరైన నిర్మాణం లేదు. లావెక్కాలంటే ఏంచేయాలి?

* డాక్టరు సలహా తీసుకోండి. మీ మామూలు ఆరోగ్యం బాగున్నట్టయితే కావలసిన విటమిన్లు తక్కువైనవని అర్థం. వెన్న, పాలు, నేయి, అరటి పళ్ళు మొదలైనవి ఎక్కువగా తీసుకోండి. లావెక్కేందుకు కొన్ని 'మసాజ'లున్నాయి. ఈ చికిత్స ద్వారా లావెక్కడానికి అవకాశం వుంది. మా కేంద్రంలో చేస్తారు. సుమారు ఒకనెల పడుతుంది.

వ్యక్తిగతమైన సమాధానాలు కావలసిన వాళ్ళు అడ్రసు తెలియపరుస్తూ 15 పైసల తపాలాబిళ్ళ పంపించాలి. సమస్యలు శ్రీమతి విద్య, బాక్స్ నెం. 1000, కేరాఫ్ ఆంధ్రపత్రిక, మద్రాసు—1. కి పంపాలి.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor: S.Sambhu Prasad.